కామ్రేడ్ బొజ్జా తారకంకు
అరుణారుణ జోహార్లు

అరుణతార

సాహిత్య, సాంస్కృతిక మాసపత్రిక

ARUNATARA

సంపుటి: 44 సంచిక: 8 హైదరాబాద్ 328 సెప్టెంబర్, 2016 పేజీలు: 68 వెల: రు. 20

ఉండ నీడలేని
ఎండు బ్రతుకులను
తిన తిండిలేని
మండు బ్రతుకులను
మంద కడుతున్న జీవాలను
మందగిస్తున్న శవాలను
చూశాను నేను.

వారి గాధలను, బాధలను
నా మాటల్లో పేర్చాను.
నా ఊపిరితో ఊదాను.
చీకటిని తొలగించాలని
వెలుగు తేవాలని
ఉవ్విళ్ళూరాను.

25 ఆగస్టు 2016న హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ & సైన్స్ కాలేజీలో, ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక, చెలిమి సాహిత్య సాంస్కృతిక వేదిక, విరసం, గోదావరి సాహితీ మిత్రుల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన మహాశ్వేత దేవి సంస్మరణ సభ దృశ్యాలు

29 ఆగస్టు 2016న నాంపల్లి గాంధీభవన్ వెనుక ప్రకాశం హాలులో రోహిత్ వేముల న్యాయపోరాట సంఘీభావ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన సభ దృశ్యాలు

2 సెప్టెంబరు 2016న నాంపల్లి తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో హిందూ మతోన్మాద వ్యతిరేక వేదిక ఆధ్వర్యంలో జరిగిన సభ దృశ్యాలు

KLVA101M191

అరుణతార
సాహిత్య సాంస్కృతిక మాసపత్రిక

(328)

సంపుటి : 44 ◈ సంచిక : 8 ◈ సెప్టెంబరు, 2016 వెల : రు. 20/-

సంపాదక లేఖ..

మోదీ ప్రభుత్వాన్ని అటు ఉనా, ఇటు కశ్మీర్ కుదిపివేస్తున్నాయి. ఈ మాట సంఘపరివార్ వర్గీయులే కాదు, టీవీల్లో గంట గంటకు, పత్రికల్లో వారం వారం విశ్లేషణలు చేసే వారు సహితం ఒప్పుకోకపోవచ్చు. కానీ ఇప్పుడు ఈ మాట అనాల్సిందే. దేశమంతా మోదిత్వలో ముసుగుతన్ని నిద్రపోతోంటే ఉనా, కశ్మీర్ కల్లోలాలు మోదీ అభివృద్ధి మేలి ముసుగును ప్రశ్నిస్తున్నాయి. కశ్మీర్ ఉద్యమకారుడు బుర్హాన్‌వనీ హత్య తరువాత అక్కడ జరుగుతున్న పరిణామాలు భారత పాలక వర్గాలు వల్లించే జాతీయతకు, అఖండ భారత్‌కు తీవ్ర స్థాయిలో సవాల్ విసురుతున్నాయి. దశాబ్దాల కశ్మీరీల పోరాటంలోని కశ్మీరియత్ స్థానంలోకి ఇస్లాంను తేవడంలో భారత పాలకవర్గాలు సఫలమై ఉండవచ్చు. అక్కడి ఉద్యమకారులు అజాదీ కశ్మీర్ కంటే పాకిస్థాన్ అనుకూల స్వరాన్నే ఎక్కువగా వినిపిస్తూ ఉండవచ్చు. అంత మాత్రాన కశ్మీరీల స్వేచ్ఛాకాంక్షను కాలరాయడంలో, అక్కడ నెత్తురు పారించడంలో భారత పాలకవర్గాలు చేసిన, చేస్తున్న దుర్మార్గం తక్కువైపోదు. అందరూ ప్రశ్నించాల్సింది దీన్నే. కశ్మీర్ కల్లోలంలో బోను ఎక్కాల్సిన మొదటి ముద్దాయి భారత ప్రభుత్వమే.

గత రెండు, మూడు నెలలుగా అక్కడ భారత ప్రభుత్వం శత్రు దేశంపైన చేసినట్లు యుద్ధం చేస్తోంది. అందులో కశ్మీర్ సంకీర్ణ ప్రభుత్వం భాగం. ఇంతకూ కశ్మీర్ ప్రజలు ఏం కోరుకుంటున్నారో తెలుసుకోవాలని గత యాభై ఏళ్లుగా ఏ ప్రభుత్వమూ అనుకోలేదు. అక్కడ ప్రజలు ఉన్నారని అనుకోవడం లేదు. వాళ్లను ఎట్ల అణిచివేయాలని మాత్రమే చూస్తోంది. కశ్మీర్ ప్రజాకాంక్షను ఉగ్రవాదమనే విష ప్రచారం చేసి అన్ని ప్రజాస్వామిక ప్రక్రియలను అక్కడ విధ్వంసం చేస్తోంది. ఇందులో మోదీ ప్రభుత్వం ఈ నడమ చేసిన దుర్మార్గాలు అన్నీ ఇన్ని కాదు.

భారత జాతి పేరుతో కశ్మీర్‌లో ఇంత అమానుషానికి బి.జె.పి. ప్రభుత్వం తెగబడింది. ఇంకో పక్కన ఆ పార్టీ మాతృ కూటమి సంఘపరివార్ గుజరాత్‌తో సహా దేశవ్యాప్తంగానే మతం పేరుతో దళితులు, ముస్లింల మీద దాడులు చేస్తోంది. ఆవు రాజకీయాలు నడుపుతోంది. అక్కడ జాతి, ఇక్కడ మతం. సంఘపరివార్ మత వర్గ రాజకీయాల్లో ఇవి విడదీయలేని భాగం. హిందూ జాతీయవాదం, సాంస్కృతిక జాతీయవాదం అనే సంఘపరివార్ రెండంచుల దేశభక్తి విషపు కత్తికి కశ్మీరీలు, భారత దేశంలోని దళితులు, ముస్లింలు నెత్తురోడుతున్నారు. అయితే వాళ్లు నిస్సహాయ ఆక్రందనలు చేయడం లేదు.

కశ్మీరీ ప్రజలకైతే దశాబ్దాల పోరాట చరిత్ర ఉన్నది. భారత పాలకవర్గాలపై వాళ్ల పోరాటం ఎంత పదునుగా ఉంటుందో, ఇటీవలి దారుణ నిర్బంధం మధ్యనే మనం చూడవచ్చు. ఉనా దళితుల పోరాటం ఒక రకంగా మోదీని తీవ్ర సంక్షోభంలో పడేసింది. గుజరాత్‌లో ముఖ్యమంత్రి దిగిపోక తప్పని స్థితి కల్పించింది. మోదిత్వ ప్రమాదానికి తక్షణంగా గురవుతున్న దళిత, ముస్లిం ఐక్యత ప్రాతిపదికను కూడా ముందుకు తీసుకొని వచ్చింది. గో ఫాసిజానికి వ్యతిరేకంగా ప్రజాస్వామ్య శక్తులు ఎక్కడికక్కడ వెల్లివిరియడానికి ఆస్కారం కలిగింది. ఇప్పటికిప్పుడు ఈ శక్తుల మధ్య పూర్తి స్థాయి ఐక్యత సాధ్యం కాకపోయినా సూత్ర బద్ధమైన ఐక్యత సాధ్యమే అని ఉనా ఘటన తదనంతర ఆందోళనలు నిరూపిస్తున్నాయి. మోదీ తరహా అభివృద్ధి నమూనాకు ప్రత్యామ్నాయంగా దండకారణ్య ఆదివాసుల వర్గపోరాటం సంస్కృతీ సాంఘిక విషయాల్లో సహితం కొత్త వెలుగు అందిస్తోంది. ప్రగతి, స్వావలంబన, స్వేచ్ఛా స్వాంతంత్ర్యాలు, సమానత్వం అనే విలువల కోసం సాగవలసిన దీర్ఘకాల పోరాటానికి ఇవన్నీ గొప్ప ఉత్తేజాన్ని అందిస్తున్నాయి.

తాజాకలం: కామ్రేడ్ బొజ్జా తారకం (77) అనారోగ్యంతో 16 సెప్టెంబరు 2016న హైదరాబాదులో మరణించారు. తొలితరం విరసం కార్యవర్గ సభ్యుడిగా, పౌరహక్కుల సంఘం నేతగా, దళిత ఉద్యమాల సారథిగా, న్యాయవాదిగా, పత్రికా సంపాదకుడిగా, రచయితగా, మేధావిగా, నాయకుడిగా, కార్యకర్తగా మొత్తంగా పీడిత ప్రజల గొంతుగా ఆయన చేసిన కృషిని స్మరించుకుంటూ ఆయన స్మృతికి విరసం అరుణారుణ జోహార్లు అర్పిస్తోంది. ఆయనపై రచనలను, జ్ఞాపకాలను రాబోయే సంచికలో అందిస్తాం. - సం.

విరసం

ఎడిటర్
దుప్పూరి వెంకట రామక్రిష్ణారావు

రచనలు, విరాళాలు
పంపించాల్సిన చిరునామా:
ఎం.ఐ.జి. - 14, ఎ.పి.ఐ.ఐ.సి. కాలనీ,
కార్బైడ్ కంపెనీ ఎదురుగా, మౌలాలి,
హైదరాబాద్ - 500 040.

* కేవలం పోస్ట్, బుక్‌పోస్ట్ ల ద్వారా
రచనలు పై చిరునామాకూ,
ఇ-మెయిల్ ద్వారా
arunatara1977@gmail.com కూ
పంపవచ్చు

కార్యాలయం:
12-15-963, మాణికేశ్వరినగర్,
ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్, తార్నాకా,
హైదరాబాద్-500007.

సంపాదకవర్గం :
ఉజ్వల్, బాసిత్, కూర్మనాథ్

విరసం కార్యదర్శి చిరునామా
పి. వరలక్ష్మి
5-1820, గీతాశ్రమం వీధి,
ప్రొద్దుటూరు, కడప జిల్లా - 516 360.

డి. టి. పి. అండ్ లే అవుట్
ఆర్. భాగ్యలక్ష్మి, డి. వైజయంతి
కవర్ డిజైన్ : పి. వరలక్ష్మి,
ఆర్. భాగ్యలక్ష్మి
ఫొటోలు : విరసం మిత్రులు,
మొదటి కవర్ పై బొమ్మ : పాలస్తీనీయన్
కళాకారుడు జుహాది అల్ అదవి
ఇజ్రాయిల్‌లో జైలు నిర్బంధంలో ఉండగా వేసినది

Like Page://viplava rachayitala sangham arunatara

facebook ://viplava rachayitala sangham virasam

Virasam website :
www.virasam.org,
www.virasam.in
www.arunatara.in

అరుణతార నిర్వహణ, శాశ్వత నిధుల కోసం చేసిన విజ్ఞప్తికి స్పందనగా **లోచన్**-హనుమకొండ, రూ.10,000/-, **వందిగం కృష్ణారావు**-హైదరాబాదు, రూ.10,000/-, **ఒక సాహిత్యాభిమాని**, రూ.25,000/-, **ఆర్. శశికళ**-అనంతపురం, రూ.25,000/-, **డా. పి. అంకయ్య**-కలిగిరి, రూ.25,000/-, **డా. శంభారెడ్డి**-కరేడు, రూ.2,000/-, **నెల్లూరు విరసం యూనిట్**, రూ.5,000/-, **డా.ఎం.హరికిషన్**-కర్నూలు, రూ.10,000/-, **పలమనేరు బాలాజీ**-పలమనేరు, రూ.5,000/-, **నారాయణస్వామి వెంకటయోగి, సాజీగోపాల్** (ఉమ్మడిగా) -అమెరికా, రూ.33,500/-, **వి. ప్రతిమ**-నాయుడుపేట, రూ.5,000/-, **సింగమనేని నారాయణ**-అనంతపురం, రూ.2,000/-, **ఎ. సాంబశివరావు**-గుంటూరు, రూ.2,000/-, **వెనిగళ్ళ వెంకటరత్నం**-హైదరాబాదు, రూ.1,000/-, **చెన్నూరి సీతారాంబాబు**-హైదరాబాద్, రూ.3,000/-, **అప్పివి సంపత్‌నాయుడు**-తిరుపతి, రూ.1,000/-, **డా. ఎ.ఎస్.రావు**-హైదరాబాదు, రూ.1,000/-, **ఎ. సాంవేద్**-పూనే, రూ.1,500/-, **ఐ. శ్రీలక్ష్మి**-హైదరాబాదు, రూ.5,000/-, **టి. రమేశ్**-కరీంనగర్, రూ.500/- **ఏలూరి రఘుబాబు**-హైదరాబాదు, రూ.5,000/-, **డా. లక్ష్మినర్సయ్య**-గుంటూరు, రూ.10,000/-, విరాళంగా ఇచ్చారు. వీరందరికి ఉద్యమాభినందనలు. - సం.

సంపాదకీయం (5-5)
ఉనా - **పాణి**

కవిత్వం (6-11)
నీతో చెప్పనే లేదు - **బొజ్జా తారకం**
ఉదయమిత్ర కవితలు నాలుగు - రాసుకోండి; స్వేచ్ఛ కావాలి; గంగా జమున తెహజీబ్; అయినా సరే బయల్దేరాలె
ఔను సారు - **కెక్యూబ్ వర్మ**
వడ్డెబోయిన శ్రీనివాస్ కవితలు మూడు
మోపు; దళిత సూర్యులం; ఒబ్రాన్
వెన్నెల పంట - **పచ్చల కిరణ్ కుమార్**

సంస్మరణ వ్యాసాలు (12-17)
వాగ్గాటి కాశీపతి - **వరవరరావు**
ఆవంత్స సోమసుందర్ జ్ఞాపకాలు
చిరకాల కవిత్వ స్నేహం - దృక్పథాల సంఘర్షణ - **వివి**

నివాళి (18-19)
అజరామర వజ్రాయుధ బలం !
ఆవంత్స సోమసుందర్ కలం !! - **గౌరవ్**

లేఖలు (19, 55)
పాణి, వివి

కథలు (20-34)
జాతి వ్యతిరేక ఆవు - **షహీదా**
మీ పేరేమిటి? - **ఆర్. శశికళ**
డేవీ దీపం - **వి. వెంకట్రావు**

సోషలిజమే ప్రత్యామ్నాయం (35-42)
మహత్తర శ్రామిక వర్గ సాంస్కృతిక విప్లవం - **వరవరరావు**
మహత్తర శ్రామిక వర్గ సాంస్కృతిక విప్లవం - ఒక అంచనా - **హర్ష్ ఠాకూర్**, అనువాదం: పి.ఎస్.ఆర్. ప్రసాద్

వ్యాసం (43-46)
విశాఖ మత్స్యకార మహిళల జీవనచిత్రం - **జి. సత్యవతి**

ట్రెండ్స్ అండ్ మూడ్స్ (47-50)
బర్నింగ్ ఇష్యూస్ వల్లే బతికి ఉన్న తెలుగు కథ - **పాణి**

సాహిత్య వ్యాసం (51-55)
వివేకాన్ని మేల్కొలిపే మహాశ్వేతాదేవి కథలు - **బాసిత్**

సీరియల్ (56-59)
కార్ల్ మార్క్స్ పెట్టుబడి - సరుకులు-డబ్బు - 1 -
లూయిస్ కాస్ ఫ్రై, అనువాదం : **ముక్తవరం పార్థసారథి**

విరసం వెబ్‌సైట్ www.virasam.org

సంచికల విషయసూచిక! (60-62)

నివేదిక (63-64)
మహాశ్వేతాదేవి రచనల్లో శ్రామికవర్గ దృక్పథం - **సంస్మరణ సభ నివేదిక**

విరసం వద్ద అందుబాటులో ఉన్న విరసం, ఇతర ప్రచురణల సూచి (64-66)

అరుణతార చదవండి!
చదివించండి!
చందాదారులు కండి!

విడి సంచిక వెల - రు. 20; సంవత్సర చందా - రు. 240 ముక్తవరం పార్థసారథి అందించారు
రెండు సంవత్సరాల చందా - రు. 450; మూడు సంవత్సరాల చందా - రు. 680;
ఐదు సంవత్సరాల చందా - రు. 1100; దశాబ్ది చందా - రు. 2200/-

అరుణతార చందాదారులకు విజ్ఞప్తి!

ఏ కారణం చేతనైనా మీకు అరుణతార అందకపోతే పిన్‌కోడ్‌తో సహా మీ చిరునామాను మరోసారి 8500809250 మొబైల్ నంబర్‌కు మెసేజ్ పెట్టగలరు. గమనిక : ఈ నెంబర్ కేవలం మెసేజ్‌ల కొరకు మాత్రమే! - సం.

ఉనా

పాణి

ఉనా ఆందోళన కొత్త ఆశ కల్పిస్తోంది. గో సంరక్షణ అసలు స్వరూపాన్ని గుజరాత్‌లోని ఉనా బయటపెట్టింది. సంఘపరివార్‌కు మనుషుల మీది కంటే ఆవుల మీద దొంగ భక్తి. ఆ పేరుతో దళితుల మీద దాడి చేయడమే గో సంరక్షణ ఉద్దేశమని ఉనా దళితులు తమ మహత్తర ఆందోళనతో బట్టబయలు చేశారు. తర తరాల 'కులవృత్తి' రహస్యం ఇదే. ఉనాలో దళితులు గోవులను చంపుతున్నారని పోలీసుల ముందే వాళ్లను చిత్రహింసలు పెట్టి, ఆ దృశ్యాలను వీడియో తీసి దేశవ్యాప్తంగా సోషల్ మీడియాలో ప్రచారంలో పెట్టారు. అంతే కాదు. ఈ వీడియోలను సంఘపరివార్ తన శిక్షణా శిబిరాల్లో యువతకు చూపించింది. ఆవుల కోసం ప్రతి ఒక్కరూ ఇలాంటి 'ధర్మ పరిరక్షణ'కు సిద్ధం కావాలని రెచ్చగొట్టారు. ఆ తర్వాత ఉత్తర ప్రదేశ్‌లో, రాజస్థాన్‌లో, హర్యానాలో, ఆంధ్రప్రదేశ్‌లో ఉనా తరహా దాడులు జరగడం యాదృచ్ఛికం కాదు.

అఖ్లాక్ ఉదంతం తర్వాత ఉనా ఘటనతో గో ఫాసిజాన్ని సంఘపరివార్ తీవ్రంగా అమలు చేయడం మొదలు పెట్టింది. ఆవు రాజకీయ ఎజెండాతో ఇక వెనక్కి తిరిగి చూడకుండా ముందుకు పోవచ్చని అనుకుంది. కానీ ఉనా దళితులు దానికి అడ్డుకట్ట వేశారు. వాళ్ల ప్రతిఘటన మోదిత్వ గుజరాత్‌నేగాక, యావద్దేశాన్నీ కుదిపివేసింది. ఉనా దళిత్ అత్యాచార్ లడత్ సమితి అనే సంస్థ ఏర్పడింది. దాని ఆధ్వర్యంలో అనేక నిరసన కార్యక్రమాలు చేపట్టారు.

ఇవి కేవలం ఉనాలో దళిత యువకులపై దాడికి నిరసన మాత్రమే కాదు. ఈ పోరాటం తరతరాల కులవ్యవస్థలోని బ్రాహ్మణీయ హిందుత్వ కుట్రను బైటపెట్టింది. దేశవ్యాప్తంగా అనేక చోట్ల ఆవు నెపంతో దళితుల మీద, ముస్లింల మీద సంఘపరివార్ దాడులు పెరిగిపోతున్నట్లే ఉనా దళితులు అంటించిన పోరాట జ్వాల కూడా విస్తరించింది. ఇవాళ ఉనా బ్రాహ్మణీయ హిందుత్వ వ్యతిరేక జెండాగా రెపరెపలాడుతోంది. ఈ దేశంలోని బ్రాహ్మణీయ శక్తులకు అధికారం దఖలు పడిన ఆగస్టు 15న దళిత, ముస్లిం సమాజాలు ఉనాలో తమ ఐక్యతను ప్రకటించుకున్నాయి. హిందుత్వ బ్రాహ్మణీయానికి వ్యతిరేకంగా నేల మీది నుంచి తమ లౌకిక ప్రజాస్వామిక చైతన్యాన్ని చాటుకున్నాయి.

హిందుత్వ వ్యతిరేక విశాల ప్రాతిపదికను ముందుకు తెచ్చిన ఉనా మనకు అనేక సామాజిక ఆలోచనలను పంచిపెట్టింది. సామాజిక అంతరాలన్నిట్లో గడ్డకట్టి ఉన్న హిందుత్వ గురించి లోతైన అవగాహనను అందించింది. రాజకీయ వ్యవస్థ ఇంత కాలం దళితులను తన బూర్జువా విధానాలతో చేస్తున్న మోసాలను ఇక తాత్సారం చేయకుండా అత్యవసరంగా చర్చించక తప్పని స్థితిని ఉనా కల్పించింది.

ఆవుతోకను మీరే ఉంచుకొని భూమిని మాకు వదిలేయండనే నినాదంలో భూమి ఇవ్వాలనే కోరిక మాత్రమే కాదు, భూమిని లాక్కుంటామనే పోరాట ప్రకటన కూడా ఉన్నది. ఇది అత్యంత ప్రతీకాత్మక నినాదం. రాజకీయార్థిక, సాంస్కృతిక అర్థాలెన్నో ఇందులో ఉన్నాయి.

ఆవు చుట్టూ పవిత్ర భావనలను పేర్చి సమాజం మీద ప్రయోగించాలనే సంఘపరివార్ కుట్రకు విరుగుడుగా దళితులు, ముస్లింలు ఆ పవిత్రతను పటాపంచలు చేయడానికి ఈ నినాదాన్ని అందుకున్నారు. నికార్సయిన భౌతిక దృష్టితో ఆత్మగౌరవం, హిందూ బ్రాహ్మణీయ వ్యతిరేకత నుంచి భూమి మీద అధికారం దాకా విస్తరించిన నినాదం ఇది. చచ్చిన గొడ్ల చర్మం ఒలవడమనే వర్ణవ్యవస్థ ఆదేశిత వృత్తిని దళితులు అత్యంత విమర్శనాత్మకంగా ఇప్పుడు చూస్తున్నారు. ఇంకో వైపు నుంచి మానవ వికాసంలోని తొలి నాళ్ల ప్రతిభకు తార్కాణమైన పని అది. దాన్నే సాకు చేసి దళితుల మీద సంఘపరివార్ దాడులు చేస్తోంది. అందుకే దళితులు ఇక నుంచి చచ్చిన గొడ్లను ఎత్తేయమని, చర్మాలు ఒలవమని, సఫాయి పని చేయమని ప్రకటించారు. గుజరాత్‌లోని కలెక్టర్ కార్యాలయాల ముందు, మున్సిపల్ ఆఫీసుల ముందు చచ్చిన ఆవుల కళేబరాలు పడేశారు. ఆవు మీద మీకు అంత ప్రేమ ఉంటే వీటిని ఎత్తేసే పని మీరే చేసుకోండని నిరసన ప్రకటించారు.

కుల వ్యవస్థ కుప్పకూలిపోయే మాట ఇది. గుజరాత్ మోదీ తరహా అభివృద్ధి పథంలో ముందుకు దూసుకపోతోందనే ప్రచారం దాపున ఆ సమాజ వాస్తవ స్థితిని ఈ ఆందోళన ఎత్తి చూపుతోంది. పెట్టుబడులు, తళుకుబెళుకుల నినాదాలు కలిసి మోదీని అచ్చోసి గుజరాత్ నుంచి దేశం మీదికి వదిలేశాయి. కానీ గుజరాత్ అట్టడుగున ఉన్న అంటరానితనాన్ని, కుల సమస్యను ఆధారం చేసుకొని సంఘపరివార్ విచ్చలవిడిగా పెరిగిపోతోంది. మోదీ అభివృద్ధి-హిందుత్వ దాపున ఉన్న అసలు సమస్యలను ఈ ఆందోళన బయట పెట్టింది. అది గుజరాత్ నుంచి ఉత్తర, దక్షిణ భారతదేశాల్లోని దళితులను, ముస్లింలను, ప్రజాస్వామిక శక్తులను కదిలించింది. మోదీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయం నుంచి దేశవ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లో ప్రగతిశీల శక్తులకు, సంఘపరివార్ శక్తులకు మధ్య సాగుతున్న సంఘర్షణను ఉనా నినాదం ఒక మెట్టుపైకి తీసికెళ్లింది. కుల వృత్తులు, రకరకాల చేతివృత్తులతో కష్టం చేసి బతుకుతున్న చర్మకారులు, సఫాయి కర్మచారులు, ముస్లింలు దేశమంతా వినబడేలా హిందుత్వ బ్రాహ్మణీయాన్ని ప్రశ్నిస్తూ తమకు భూమి కావాలని అడుగుతున్నారు. ఆ రకంగా మన సామాజిక ఉద్యమాల్లో ఇది ముందడుగు. సంఘపరివార్ చెలరేగిపోతున్న ఈ తరుణంలో ఈ పోరాటం లౌకిక ప్రజాస్వామిక శక్తులకు ఒక ఆలంబన.

కవిత్వం

కామ్రేడ్ బొజ్జా తారకం స్మృతిలో ఆయన కవితా సంకలనం 'నది పుట్టిన గొంతుక' నుండి ఒక కవిత

నీతో చెప్పనే లేదు

నీతో చెప్పలేదు
నేను వెళ్తున్నప్పుడు
నన్ను పోలీసులు పట్టుకున్నప్పుడు
నీతో చెప్పలేదు...
నన్ను చూస్తూ నిలబడిపోయావు
నీ కళ్ళనిండా నీళ్ళు
నీ కన్నీళ్ళు తుడవడానికి
నా చేతులకు సంకెళ్ళు
నిశ్శబ్దానికి గంటలు కొడుతూ
పోలీసు బూట్ల చప్పుళ్ళు
సముద్రం హోరులా మనసులో
పొంగే మాటల కెరటాలు
నిశ్శబ్దాన్ని చీల్చలేని
హృదయ నాదాలు
నీతో చెప్పనే లేదు...

అప్పుడు
ఏ మాటలైనా ఎన్నైనా
ఉట్టి శబ్దాలేనని
అర్థం ఏమీ ఉండదని
చెప్పలేకపోయాను నీకు

ఉండ నీడలేని
ఎండు బ్రతుకులను
తిన తిండిలేని
మండు బ్రతుకులను
మంద కడుతున్న జీవాలను
మందగిస్తున్న శవాలను
చూశాను నేను.
వారి గాథలను, బాధలను
నా మాటల్లో పేర్చాను,
నా ఊపిరితో ఊదాను.
చీకటిని తొలగించాలని
వెలుగు తేవాలని
ఉవ్విళ్ళూరాను.

నాకు తెలియనే లేదు
ఒక రోజు...
నువ్వూ నేనూ సాయంకాలం
అందాలను మలచుకొంటున్నప్పుడు
ఆనందాలను తొలుచుకుంటున్నప్పుడు
హఠాత్తుగా వాళ్ళొచ్చారు.
నీతో చెప్పనే లేదు
నీ కన్నీళ్ళు
నా కొక్కడికే కాదని
కోటి కోటి బాధాతప్త హృదయాలకు
నివాళులని
ఆనంద జలదాలని
ఆశాకిరణాలని
అరుణార్ణవ కెరటాలని
నీతో చెప్పనే లేదు...
(సెంట్రల్ జైలు, 15-1-1976)

ఉదయమిత్ర కవితలు నాలుగు

రాసుకోండి

రాసుకోండి
అతనొక దేశద్రోహి
కలలు కంటాడు
కలలు కనని బతుకేమిటంటాడు
నరాల తీగలు మీటి
ఉద్యమ గానాలు జేస్తాడు

అంతేనా
కవిత్వం రాస్తడు
రాసి ఊరుకోడుగదా
కవిత్వాన్ని ప్రశ్నగజేస్తాడు
పారగజేసి
సమాజంలోని కుళ్ళునంతా
తవ్వి పోస్తాడు

అంతేనా
ఆదివాసీని
అథో జగత్సహోదరులను ప్రేమిస్తాడు
గాయపడ్డ గుండెను
తలమీద మణి దీపం జేసి
ఊరంతా కలెదిరుగుతాడు

అంతేనా
రోహిత్ తన ఆదర్శమంటాడు
కన్నయ్యతో కరచాలనం జేస్తాడు
భారత్ మాతాకి జై అనమంటే
కొండంత దుఃఖాల్ని మోస్తున్న
మా తల్లుల సంగతి జూడమంటాడు

ఆకలైనవాడికి
అన్నం పెడతానంటాడు

ఆకలి ఆయుధమెందుకయ్యేనో
ఆలోచించమంటాడు

అంతేనా
చదువుకోరా అంటే
జీవితమే
తనకో విశ్వవిద్యాలయమంటాడు

అరే యార్
ఇంకెన్ని రుజువులు గావాలె
రాసుకోండి
అతనొక దేశద్రోహి.

స్వేచ్ఛ కావాలి

మాకు స్వేచ్ఛ కావాలి
కులం పేరున
మతం పేరున
విద్యాలయాల్లో చిచ్చుబెట్టే
మతవాదుల నుండి
మనువాదుల నుండి
మాకు స్వేచ్ఛ కావాలి

దేశ వనరుల కొల్లగొట్టి
విదేశీ పెట్టుబడికి
తలుపులు బార్లా తెరిచి
తరాల సంస్కృతిని విచ్ఛిన్నం జేసి
బానిస బతుకును శాశ్వతంగా రుద్దే
డబ్ల్యూటీవో ఒప్పందాల నుండి
మాకు రుణ విముక్తం గావాలి

మేం పైస పైస కూడబెట్టి
పన్నులు గడ్తుంటే
కోట్లకు కోట్లు పన్నులు ఎగ్గొట్టి
మొత్తం సంపదనంతా
గుప్పెట్లో పెట్టుకున్న
పెట్టుబడిదారుల నుండి
వలసవాదుల వారసత్వాలుగ మిగిలిన
క్రూర చట్టాల నుండి
మాకు స్వేచ్ఛ గావాలి

అక్షరాన్ని బంధించి
అక్షరాన్ని వధించి
నాలుకల్ని ముడి వేసి
మూకుమ్మడి దాడి చేసి
మా ఆలోచన్లను
మా ఊపిర్లను

మా బతుకులను శాసించే
దుర్భర అసహన వాతావరణం నుండి
మాకిపుడు విముక్తి కావాలి

ఈ స్వేచ్ఛ కోసమే
మేమిపుడు సిద్ధంగా ఉన్నాం
నాడు భగత్‌సింగ్
నేడు రోహిత్
రేపు విద్యార్థి లోకమంతా
సంకెళ్ళను స్వీకరించడాన్కి సిద్ధంగ ఉన్నం.

గంగా జమున తెహజీబ్

నాకిక్కడ ప్రకృతి అంటే ఇష్టం
ఇక్కడి మనుషులంటే ఇష్టం
మేం బయటికే హిందువులం...ముస్లిములం
లోపలంతా మనుషులమే...దోస్తులమే

మా ఇండ్లూ...హృదయాలూ
తెర్చిన పుస్తకాలే

వాళ్ళ రంగుల పండుగ
మాకు ఇంద్రధనుస్సులు పంచితే
మా మొహర్రం పండుగ
వాళ్ళకు అలయ్ బలయ్ నిచ్చింది

ఆకలో అవమానమో
కష్టమో నష్టమో
కలిసి పంచుకున్నం

ఒంటరి దుఃఖం మమ్మెలనెప్పుడూ
వెంటాడలేదు
గంగాజమునల తెహజీబ్ మాత్రమే
మా జీవితాల నడిపించింది

గంజి గట్కలోకి
మట్టి రాలినట్టు
జనం బత్కుల నడుమకు
మతం వచ్చేసింది

అప్పుడు దేశ విభజన జరిగితే
ఇప్పుడు మనుషుల విభజన జరిగింది

ఎంత కౌగిలించుకున్నా
ఏవో లేస్తున్న గోడలు
ఏవో బిగుసుకుంటున్న సంకెళ్ళు
ఊపిరాడటం లేదు

అట్లొచ్చి ఇట్ల వొయ్యే కొట్లాటలు
మా ఇంటి చూరు పట్టుకొని వదలటం లేదు

తెలీని భయం
నీడలా వెంటాడుతుంటే
మానవ సంబంధాల మీద ప్రశ్నలు
ఈగల్లా ముసురుతున్నాయి

అయినా ఒక్కటి జెప్త
మా నాయన
గీడనే బుట్టిండు
గీడనే జచ్చిండు

నేను గూడ గీడనే బోత
ఒక హిందువుగ ఒక ముస్లిముగ కాదు
ఒక హాషింపుర వాసిగ
ఈ మట్టిని ప్రేమించే మనిషిగ

వేయి ప్రశ్నలకు
ఒక్కటే జవాబు
గంగా జమునల తెహజీబ్
మాకిక్కడ కితాబు....

అయినా సరే బయల్దేరాలె

నిద్రలేదు తిండి లేదు
క్షణం విశ్రాంతి లేదు
ఉన్నదల్లా పరుగెత్తడమే
శిథిలాల నుండి చిమ్మ చీకట్లనుండి
బయటపడడమే

అవతల ఎవరున్నారో తెలువదు
ఏ వెచ్చని పలుకరింపయినా
బతుక్కింత భరోసా ఇస్తుందో తెలీదు
ఏ భూమి దారులనిస్తుందో
ఏ భూమి నెర్రలిడుస్తుందో తెలీదు

అయినా సరే...బయల్దేరాలె
అగ్ని గుండాల నుండి బయటపడాలె

సముద్రమెపుడు గర్జిస్తుందో
ఏ బోటును మింగి
సముద్రమెప్పుడు త్రేనుస్తుందో తెలువదు
ఎక్కడ ఎవరు ఎప్పుడు
జలసమాధి అవుతారో తెలువదు
ఏ పసివాడి శవం
ఒడ్డున విషాదగీత మవుతుందో తెలవదు

అయినాసరే బయలుదేరాలె
బాంబుల మోతనుండి బయటపడాలె
ప్రాణాలు నిబెట్టుకోనీకె
అరికాళ్ళు చీలినా పరుగులు దీయాలె

ఓ రాజ్యం
రేజర్ వైర్ ఫెన్సింగ్‌లతో
బార్డర్ మూసివేస్తది
ఓ కరడు గట్టిన దేశభక్తి
ముప్పేటల దాడి జేస్తది
ఓ చట్టం
కొన ఊపిరికి ఉరి వేస్తది
ఓ బ్రోకరు త్రాచుగ మారుతాడు
ఓ తల్లిని కాటు వేస్తాడు
కన్న వాళ్ళ శరీరాల మీద
లాఠీలు బూట్లు కరాళ నృత్యం జేస్తుంటే
ఓ పసిపాప రోదన మిన్నంటుతుంది

కొన ఊపిరి కోసం
క్షణక్షణం యుద్ధం
గాఢాంధకారంలో
వెల్తురుకై వెతుకులాట

అంతర్యుద్ధపు తుపానుకు
మానవ సంబంధాలు చీలికలు పీలికలై
చెదిరిన అనామకులు వాళ్ళు
పచ్చని వసంతాలు
వనాంతరాల కేగిన చోట
కాలం మీద వేలాడే శిశిరాలు వాళ్ళు

ఉన్న చోట నుండి
పెరికి వేయబడి
పెంటకుప్పల మీద విసిరేయబడ్డ
మొక్కలు వాళ్ళు

సంపన్న రాజ్యాల కుట్రలకూ
మతవాదుల దాడులకూ
చారిత్రక తప్పిదాలకూ బలై
శిథిల శిల్పాలై
కాందిశీకులై
అంతర్జాతీయ సమాజం తలుపుల కేసి
తలలు బాదుకుంటున్నారు వాళ్ళు

ఓ చిన్న జాగా కోసం
చిటికెడు నిద్ర కోసం
పిడికెడు బతుక్కోసం
పరాయి రాజ్యాన

శిరసు వంచి
శిలువను మోస్తున్నారు
చిత్ర హింసల కొరడాలకు
ఛిద్రమవుతున్నారు
జ్ఞాపకాల పొరలు
ఒక్కొక్కటిగ తొల్చి వేస్తుంటే
దుఃఖాగ్నుల దగ్ధమౌతున్నారు
పికాసో చిత్రం
గుయేర్నికాల దలపిస్తున్నారు

అంతర్యుద్ధమా
నీకు అంతమెక్కడ?

కెక్యూబ్ వర్మ కవిత

ఔను సారు

మీరింకా మా భుజంపై గట్టిగా చరుస్తూ
నవ్వుతూ హత్తుకున్నట్టే ఉందింకా

అరిగిపోయిన బాటా చెప్పులతో
దేరువాడ ఏరియాలో 1/70 ఏక్టు అమలు కోసం
గిరిజనులతో ర్యాలీ చేస్తున్నట్టుంది

బొడ్డపాడు నడిబొడ్డులో అమరవీరులను
స్మరిస్తూ ఎర్ర జెండా చేతబట్టి తామాడ గణపతి
ఇంటి ముందు నుండి దండుగా కదులుతున్నట్లుంది

సారూ జోరువానలో కాలు జారిపోతున్నా
తెగిపోయిన చెప్పులతోనే కోపర్ డంగ్ కొండ
ఒక్క ఉదుటున ఎలా ఎక్కేసారు?

మా నాలుక తిరగని రష్యా రచయితల
పేర్లన్నీ పేపరయినా చూడకుండా
ఆ సాహిత్యాన్నంతా అర్థమయ్యేటట్లు ఆలవోకగా
చెప్పే మీ జ్ఞాపకశక్తికి జోహార్లు సారూ

ఇంకా మీరెత్తినాం విరసం జెండా
అలలలుగా పోరు పోరు జెండా
అని మీకే సాధ్యమయిన లయలో
గొంతెత్తి పాడుతున్నట్టే ఉంది సారూ

చెరగని మీ నవ్వు
ఎప్పుడూ నవ్వే ఆ కళ్లు
ఆత్మీయంగా దగ్గరకు తీసుకునే మీ చేతులు
నాలుగు వాక్యాలకే నిండిపోయే పోస్టుకార్డు
మరపురాకున్నాయి సారూ

విశాఖ సముద్రమంత మీ హృదయం
మాకింకా బువ్వపెడుతున్నట్టే ఉంది

ఒక్క మాటయినా చెప్పకుండా
వెళ్ళిపోయారన్న దిగులు
గూడుకట్టుకునే ఉంది సారూ...

వడ్డెబోయిన శ్రీనివాస్ కవితలు మూడు

మోపు

మోపు మోయడం
నాకలవాటే కాని
ఇది నా భార్య కట్టె!

ఆనాడు కాదు, ఈనాడు కాదు
ఏనాడు ఈ దేశానికి
మనుషులం కాలేకపోయాం కాని
చెట్టును
భూమి కట్టేసుకున్నట్టు
మమ్మల్ని
ఆడవి కట్టేసుకుంది
అందుకే
అడవి భయపడితే మేం
మేం భయపడితే అడవి
ఒకరికొకరం ఓదార్చుకుంటాం కాని
మా ఇద్దర్ని భయపెట్టేటోడు
అడవి లోపల చంపితే
ముందు వెనుక బానిసల మధ్య
కట్టెకు కట్టి
ఇవతల చస్తే
కట్టెల మోపులానే
అదృశ్యం కాని
ప్రశ్నలు లేని భేతాళంలానే.

దుఃఖం వెంట నడిచి వస్తుంటే
దూరం
చివికిన దారం తెగినట్టు
తెగిపోదుంది కాని
రూపాయి కాలేక
మధ్యయుగాల రూపాలుగా మిగిలి
స్వచ్ఛం
అచ్చమైన మనుషుల్లా
జంతు సహవాసాల్లో
జనన మరణాల్ని పోసుకుంటున్నాం కాని
ఈ రాజ్యం మనుషుల్లా చూడదు
తప్పుడు పందెంలా తప్ప

గుండెను తొవ్వి ప్రాణం తీసుకోవడం తప్పు

ఇక ఈ నాగరికుల ప్రేమ అంటావా
ప్రాణం లేని కన్ను చెబితేకాని
ప్రాణం ఉన్న చూపుకు అందలేదు
అయినా
రాజ్యం చూపే రాబందు చూపు కదా!
(భార్య శవాన్ని భుజం మోసిన గిరిజనుడ్ని చూసి)

దళిత సూర్యులం

ఆకలి ముద్ద మీద
మృత్యువై కూచుంటావు
నిచ్చెన మెట్ల వృత్తి మీద కత్తివై లేస్తావు
నువ్వే మనువాదం
మహా ప్రేమ కిరీటమై పుడతావుగాని
కాపు కాసి మేత మేసి
ఉచ్చ గత్తుల స్వర్గం ఉచ్ఛ్వాస నిచ్వాస అయి
మా బతుకు విరగ కాసింది

ఆలనా పాలనా ఆమడ దూరమై
పిడికెడు గడ్డీ గాసం కాలేదెన్నడు
ఉచ్చగత్తుల గొడ్ల కొట్టంజాట్టూసి
బట్టతలైంది కాని
నీ చూపు ముద్దు పెట్టుకోలేదన్నెడు

అయినా లేనిపోని ప్రమే లేఖ రాస్తూ
జంతువును ప్రేమించినంత కూడా
మనుషును ప్రేమించలేవు కదా

పశువుల మలమూత్రాల్ని పవిత్రం చేసినట్టు
నీ మల మూత్రాల్ని
మాకు పరమ పవిత్రం చేసిన జంతువ్వి

ఘోరాల రక్షకుడా!
ఉలిక్కి పడ్తావెందుకు?
ఉత్పాతమైతావెందుకు?
నీ తోలు తీశామా?
చచ్చిన గొడ్డు తోలు వొలిచామంతే!
తరతరాల మా బానిసత్వాన్ని
నీ కాళ్ళ కింది చెప్పులుగా నీకే కుట్టిద్దామని
సూరీడు
చీకటి శవాన్ని లాక్కుపోయినట్టు
గొడ్డు శవాన్ని మోస్కెల్తున్న దళిత సూరీలం

కండ్లు మూడుచుకుంటున్న
నువ్వు పీల్చాల్సిన మురుగు మేమే పీల్చి
నీదీ మాదీ మేమే కక్కుకున్నా
నీకు ఆరోగ్యం తొడిగాం!
నీ అనారోగ్యాల్ని మేమే కప్పుకున్నాం

కూటీశ్వర చెలగాటం నీది
ఆకలి...చావుల ఆపదలం మేం

ఆకలి పేగుల్లో
ఆహార తూణీరం కట్టుకొన్నవాడివా నువ్వు
మా ఆకలికి
పేగులే కరుగుతున్న వాళ్ళం మేం

ఈ కుప్ప కూలిన ఆకలి కింది
శిథిలాలం మేమే

అయినా బొక్కల్లో నిప్పు రాజేసి
లేచి నిలబడితే
ఈ చుక్కలు ఈ చంద్రుడు ఈ సూర్యుడు
ఈ భూమే మా వెంట నడుస్తుంది.
("ఊనా" లాంటి దాడులకు గురైతున్న దళితుల కోసం)

ఒమ్రాన్

ఈ భూమి కళ్లల్లో ప్రశ్నలా వేలాడుతున్నావు
ఆశ్చర్యార్థక వర్తమానంలా ఉన్నావు
మనిషి భవిష్యత్తు అంబులెన్స్‌లో కూర్చొని పోతున్నట్టున్నావు

ఈ భూమి ఒంగబెట్టి.
చెవులు మెలేసి
ఒక్క తన్ను తన్నాలన్నంత అమాయక కళ్లు
తీగె నుంచి తెంపేసిన బూడిద గుమ్మడి మౌనం

ఎవరి సిగ్గు లేని ఆటలో
రూపం కోల్పోయిన బంతివి
ఎవరి ఆధిపత్యంతొక్కి పోయిన
పాలపాల మొలకవి

ఆ సూర్యుడ్ని యాపిల్ పండులా పట్టుకొని
ఆడుకోవాల్సిన చేతులు
బుల్లి చూపల చుక్కలన్నీ దండగుచ్చి
చీకటి పందిరికి సీరియల్ బల్బుల్లా అలంకరించాల్సన చేతులు
పీల్చి విసిరిన డిస్పోజబుల్‌లా ఉన్నాయి

ముద్దు ముద్దు మాటల చుట్టూ
మందు గుండు మోహరించి

బుడి బుడి అడుగుల్ని బూడిద కుప్ప చేశారు
రక్తం పంచుకపుట్టని నా రక్త బంధువా
నిన్ను రక్త సిక్త పికాసో యుద్ధ చిత్రం చేసిందెవరు?

అమ్మ మాయమై
ఆటస్థలం మాయమై
నాన్న కానరాక
తమ్ముడూ లేక
నన్ను అనాథను చేసిందెవరని
నన్నే ప్రశ్నిస్తున్నట్టున్నావ్ నాయనా!
నిండని ఐదేండ్ల ప్రాణానికి ముందే
శత్రువు పుట్టించిందెవరని
నన్నే అడుగుతున్నట్టున్నావ్‌రా నాయనా!
బతుక్కోసం
సముద్రమీదడమే బతుకు సేసిందెవరన్నట్లున్నావు నాయనా?

అరే చిన్నోడా!
నీ నవ్వులు తాకి
మారణాయుధాలు మట్టైపోతే ఎంత బాగుండు

ఆ మట్టిలో కొన్ని గింజలు నాటి
కొన్ని నీళ్ళుపోసి
పెరిగిన చెట్టు చెట్టు మెడలో
"ఇది మనుషులు తిరిగే ప్రాంతం
నరరూప జంతువుల నిషిద్ధం"
అక్షరాల్ని అప్రమత్తం చేద్దును కదా.
(సిరియా అంతర్యుద్ధ బాధిత బాలుడు)

వెన్నెల పంట

పచ్చల కిరణ్ కుమార్

ఒకే సీటులో
పక్క పక్కనే కూర్చుంటాము
వందలకొద్ది మైళ్ళు
కలసే ప్రయాణిస్తాము
హలో అంటే హలో
మీరెక్కడిదాక!
పలాన ఊరు అంతే
మాట్లాడటం ముగుస్తుంది

నా చేతిలో, పక్క వ్యక్తి చేతిలో
చెరో సెల్ ఫోన్
ఇద్దరి తలలు వొరిగిపోతాయి
ఇక్కడ దూరంలో ఉన్న వ్యక్తితో సంభాషణ
అక్కడ ఎక్కడో ఉన్న వ్యక్తితో సంభాషణ
ఇక్కడ వీడియో గేమ్స్
అక్కడ ఫెస్ బుక్
ఇక్కడ ట్విట్టర్
అక్కడ వాట్సాప్, యూట్యూబ్‌లు
గూగుల్ సెర్చింగ్‌లు
నచ్చిన వాటిని వెదుక్కుని
వాటిల్లో లీనమవుతాం

గ్రామాలను దాటుతాం
పట్టణాలను దాటుతాం
తల పక్కకుతిప్పి
కిటికిల్లోనుండి బయటకు చూసినప్పుడు
మనుషుల మరణాలను తలపోస్తున్నట్టు
బీళ్లయిపోతున్న పంటపొలాలు
వర్తమానంలోకి వచ్చి ఎవరిని చూసినా
రంగులు పూసుకున్న ముఖాలే
చిరునవ్వుకి చిరునామలేని ప్రతిబింబాలే

కాలానికి కళ్ళెంలేదు
భద్రతకి భరోసాలేదు
అంతా పల్లేరుకాయల పరాకు

దుఃఖాలు ఎదురుపడతాయి
సోకాలు ఎదురుపడతాయి
అన్నింటిని
చూస్తూనే దాటిపోతుంటాము

స్ఫురణలోకి వచ్చినప్పుడు
ఎదురుపడిన దృశ్యాలు
నిమిషమో అరనిమిషమో
బాధను కలిగిస్తాయి

గమ్యం చేరువయ్యింది
ఎవరి దిశగా వారు వెళ్ళిపోతున్న దారిలో
నీడలు కనుమరుగయ్యాయ
అంతా గాఢాంధకారం
నిశ రాత్రిలో నిశ్శబ్దమే తప్ప
తీతువు పిట్ట అరుపులులేవు

అందరు అందరిలో ఉన్నా
ప్రతిఒక్కరిని ఒంటరితనం
వెంటాడుతున్న క్షణాన
వెన్నెల పంటకోసం కొందరు
వాళ్ళతో పాటు నేను



సంస్మరణ వ్యాసం

వాగ్ధాటి కాశీపతి

వరవరరావు

అప్పటికే వరంగల్‌లో ఉండి నక్సల్బరీ, శ్రీకాకుళ రైతాంగ పోరాటాల గురించి, సాహిత్య రంగంలో అందుకు మేం చేయదగిన దోహదం గురించి మథనపడుతున్న మాకు కాశీపతి పేరు 1969 'జనశక్తి' పత్రిక ఇంటర్వ్యూ ద్వారా తెలిసింది. అప్పటికింకా 'తిరుగబడు' కవితా సంకలనం రాలేదు. అప్పటి నుంచి చాలాకాలం దాకా శ్రీశ్రీ నుంచి కాశీపతి పలికించిన 'చీపురు పుల్లలతో విప్లవం రాదు' అనే మాట చాలా ప్రచారం అయింది. 'పోరాటమంటే సాయుధ పోరాటమే కదా' అనే ప్రశ్న వేసి ఈ జవాబు ఆయన రాబట్టాడు. అంతమాత్రమే కాదు, 'నేను శ్రీకాకుళం ప్రాంతానికి చెందిన వాడినే... నేను వాళ్లతో సజీవమైన సంబంధం పెట్టుకోదలిచాను... సందేశాలతో ప్రయోజనం లేదు... అందుకనే వాళ్లకిప్పుడు ఏ సందేశం ఇవ్వలేకపోతున్నాను...' అనే జవాబు చెప్పించినవాడు ఆయనే. కాశీపతి ప్రశ్న 'శ్రీకాకుళంలో గిరిజనులు ఈనాడు దోపిడి వ్యవస్థను అంతం చేయడానికి సాయుధులై అన్ని త్యాగాలకు సిద్ధమై పోరాడుతున్నారు. ఒకనాడు తెలుగుజాతిని మేల్కొల్పిన మహాకవిలా వారికి మీ సందేశం ఏమిటి?'

ఈ ఇంటర్వ్యూలో కాశీపతి తానే స్వయంగా 'ప్రధానంగా అభ్యుదయ మహాకవులైన మిమ్మల్ని రాజకీయ చర్చల్లోకి లాగాను' అని, 'శ్రీశ్రీ గారు రాజకీయ విషయాలపై జరిగిన సమగ్రమైన ఇంటర్వ్యూలో కూడ ఆలోచించి ఒక్కొక్క పదాన్ని జాగ్రత్తగా ఉపయోగించారు' అని రాసాడు. దానికి శ్రీశ్రీ కూడా 'ప్రపంచ రాజకీయ పరిస్థితి గురించి సింహావలోకనం చేసుకోవడానికి నాకీనాడు అవకాశం కల్పించారు' అని వినమ్రంగా ఒప్పుకున్నాడు.

'రెస్ట్ ఈజ్ హిస్టరీ' అన్నట్టుగా శ్రీశ్రీ షష్టిపూర్తి (1970 ఫిబ్రవరి), విరసం ఏర్పాటు (1970 జూలై 4) తరువాత యాదాటి కాశీపతి 1972 అక్టోబర్ గుంటూరు మహాసభల్లో విరసంలో చేరాడు. అప్పటికే ఆయన మూడేళ్లుగా విజయవాడ నుంచి వెలువడుతున్న 'జనశక్తి' పత్రికకు సబ్ ఎడిటర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన రాజకీయాభినివేశం గురించి తరిమెల నాగిరెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావులతో ప్రారంభమై 1972 నాటికే చంద్రపుల్లారెడ్డి, అంతకన్నా ముఖ్యంగా మాకు సన్నిహితంగా ములుగులో తెలిసిన పొట్లూరి రామనర్సయ్య గారి రాజకీయాల స్పోక్స్‌మెన్‌గా ఆ మూడేళ్లూ కాశీపతి గురించి పరోక్షంగా వింటూనే ఉన్నాం. ముఖ్యంగా అవే రాజకీయాలతో వరంగల్‌లో ఉన్న అట్లూరి రంగారావు, కానూరి వెంకటేశ్వరరావుల ద్వారా. ఇదే గుంటూరు మహాసభల్లో అజ్ఞాతంలో ఉన్న శివసాగర్‌కు విరసం గౌరవ సభ్యత్వం ఇచ్చాం. కాశీపతి విరసం సభ్యత్వానికి దరఖాస్తు పెడితే ఆయనకు రాజకీయాభినివేశమే కాని సాహిత్య ప్రవేశం లేదేమోనని సందేహించాం. కాని ఆయన మంచి కవి అని, వక్త అని, సాహిత్య విమర్శకుడు అని ఆ రెండు రోజుల సభల్లోనే ఆయనతో పరిచయమే సాన్నిహిత్యమైన సందర్భంలో అర్థమైంది.

అనంతపురంలో ఒక సంపన్న బ్రాహ్మణ కుటుంబంలో 74 సంవత్సరాల క్రితం (1942) పుట్టిన యాదాటి కాశీపతి సహజంగానే 1967 నాటికి తన ఇరవై ఐదేళ్ల వయసులో ఒక విద్యావంతుడుగా, ముఖ్యంగా జర్నలిజంలో ఉస్మానియా యూనివర్సిటీ నుంచి గోల్డ్ మెడల్ పొందిన ప్రతిభాశాలిగా నక్సల్బరీ రాజకీయాల వైపు ఆకర్షితుడు కావడం ఆశ్చర్యం కాదు. కలకత్తా, జాదవ్‌పూర్ యూనివర్సిటీలు మొదలు ఉస్మానియా యూనివర్సిటీ వరకు ఖరగ్‌పూర్ ఐఐటి మొదలు ఇంకెన్నో ఉన్నత విద్యాలయాల వరకు అత్యంత ప్రతిభాశాలురు నక్సల్బరీ రాజకీయాల వైపు ఆకర్షితులు కావడం అప్పుడు వీచిన గాలి ప్రభావం.

నిన్న (2016 ఆగస్ట్ 11) సాయంత్రం వార్త తెలియగానే వెళ్లినప్పుడు ఆయన మృతదేహం దగ్గర తెలిసిన విషయం నన్ను మరింత ఆశ్చర్యపరిచింది. ఆయన ఐఎఎస్‌కు ఎన్నికై శిక్షణకు ట్రెయినింగ్‌కు వెళ్లే ముందు అప్పటికే ఆయన అత్యంత అభిమానించే చంద్రపుల్లారెడ్డి గారి దగ్గరికి ఆ విషయం చెప్పడానికి విజయవాడకు వెళ్లాడట. ప్రభుత్వ సేవ చేయదలచుకున్నావో, ఇప్పటి తరుణంలో ప్రజల సేవ చేయదలచుకున్నావో ఎంచుకో అన్నాడట సిపి. అంతే, ఆయన 'జనశక్తి' పత్రికలో చేరిపోయాడు.

తనకు సాహిత్యాభినివేశం లేదేమోననే మా సందేహాన్ని తీర్చడానికి అన్నట్లుగా కాశీపతి గుంటూరు మహాసభలైన ఒకటి రెండు ఏళ్లలోనే 'ఎర్ర పిడికిలి' అనే కవితా సంకలనం వెలువరించి కెవిఆర్‌తో, నాతో ముందుమాటలు రాయించుకున్నాడు. 1972 నుంచి ఆఖరి శ్వాస దాకా మాకు అత్యంత సన్నిహితమైన స్నేహం. ఆయన స్వభావంలోనే ప్రేమాస్పదమైన స్నేహభావం ఉన్నది. చలసాని ప్రసాద్ వలెనే మనిషి కలవగానే పెనవేసుకుపోతాడు. అద్భుతమైన సంభాషణాశీలి. దానికితోడు నోట్లో సిగరెట్టు పెట్టుకొని పెదవుల మధ్య ఆడిస్తూ అంతే వేగంగా మాట్లాడే ఆయన మ్యానరిజం ఆయనతో పరిచయం ఉన్న ఎవరూ మరచిపోరు.

పదేళ్ల కింద పార్కిన్సన్ జబ్బు రావడం కన్నా ముందే, బహుశా 1980ల నాటికే ఆయన శరీరంలో స్వేద గ్రంథుల నుంచి చాలా పల్చటి రక్తబిందువులు కూడా వచ్చేవి. 1982 గుంటూరు జిల్లా మాచెర్లలో జరిగిన విరసం మహాసభల్లో కార్యవర్గ సమావేశంలో ఇద్దరం తీవ్రమైన పొలిమికల్ చర్చ చేసుకున్నాం. (గుంటూరు నుంచి మాచెర్ల దాకా పదేళ్ల విరసం సభల్లో బహుశా మేం అట్లా తలపడని సందర్భాలు ఉండవు. బయటికి రాగానే చెట్టపట్టాల్ వేసుకొని కలబోసుకొని సందర్భాలు ఉండవు.) బయటికి వస్తూనే ఆయన

శరీరం నుంచి పల్చటి చెమట, అది కాస్త ఎర్రగా రావడం గమనించి అడిగాను. అందుకే ఆయన ఎప్పుడూ చాలా శుభ్రంగా ఉండేవాడు కాని అందుకు కారణం ఏమిటో అప్పటికైతే తనకు ఏమీ తేలడం లేదన్నాడు. బహుశా ఆయన తన ఆరోగ్యాన్ని అంత పట్టించుకొని ఉండడు.

పార్కిన్సన్ జబ్బు వచ్చినప్పటికి, మాట స్పష్టత కోల్పోయినప్పటికి చివరి దాకా అద్భుతమైన జ్ఞాపకశక్తి, పరిశీలనా శక్తి మాత్రం ఉన్నాయి. ఇటీవలనె ఆయన వెలువరించిన "శ్రీశ్రీ మధ్యతరగతి మందహాసం" చదివితే అటువంటి అంశాలపై కూడా అంత సాహిత్య ప్రమాణాలతోటి, పరిశీలనతోటి రాసే శక్తి మిగిల్చుకున్నాడనేది స్పష్టం అవుతుంది.

1972లో విరసంలో ఆయన ప్రవేశం సాంస్కృతిక రంగంలో విప్లవోద్యమం నిర్వహించాల్సిన పాత్ర గురించి ఒక ప్రత్యేకమైన ఆలోచన ప్రవేశపెట్టినట్లైంది. అప్పటికే కొండపల్లి సీతారామయ్య నిర్దేశకత్వంతో చారు మజుందార్ రాజకీయాల పట్ల అభినివేశం ఉన్నవాళ్లు ఉన్నారు. 'సాంస్కృతిక రంగంలో మన కర్తవ్యాలు' అని ఓల్గా ప్రవేశపెట్టిన డాక్యుమెంట్ ద్వారా టిఎన్, డివిల రాజకీయ ఆలోచనలను బలపరుస్తున్నవాళ్లు ఉన్నారు. 1972 నుంచి 82 వరకు కూడా సాహిత్య, బౌద్ధిక రంగాల్లో సిపి రాజకీయాలను బలంగా వినిపించిన గొంతు కాశీపతిది. అంతే బలంగా ఆయనకు కవిత్వంలోనూ, సాహిత్య విమర్శల్లోనూ అభినివేశం ఉన్నది.

శ్రీశ్రీ మీద ఈగ వాలనివ్వని శక్తిమంతమైన అభిమానుల్లో చలసాని తర్వాత చెప్పవలసిన వాడు కాశీపతియే. అయితే ఆయన కార్యరంగం విరసం కన్నా విస్తృతమైనది. సిపి నాయకత్వంలోని ప్రజాసంఘాలన్నిటికీ ప్రచారపరంగా కాశీపతి ఇచ్చినంత బలం బహుశా మరెవ్వరూ ఇచ్చి ఉండరు. అవి పిడిఎస్‌యు కావచ్చు, అరుణోదయ కావచ్చు, ఇంకే ప్రజాసంఘమైనా కావచ్చు. ఆయన అరుణోదయ మిత్రులు చెప్పుకున్నట్లుగా 'గిట్టనివాళ్లు ఆయనను కూసేపతి అనవచ్చు కాని, ఆయన మాట ఒక మంత్రమై, లావా స్థితిలో ఉన్న ఎందరినో సీతాకోక చిలకలు'గా విప్లవాకాశంలో ఎగరవేసింది.

విరసంలో అగ్ర నాయకత్వానికి తోడుగా ఉంటూనే అంతకన్నా కీలకమైన పాత్ర ఆయన 1973లో ఎపిసిఎల్‌సి ఏర్పాటులోనూ, భారత-చైనా మిత్రమండలి ఏర్పాటులోను చేశాడు. ఆ రెండిటికీ ఆయన ఎమర్జెన్సీ దాక కూడా సంయుక్త కార్యదర్శిగా పనిచేశాడు. 1980 విరసం దశాబ్ది ఉత్సవాల్లో విరసం సహాయ కార్యదర్శిగా ఎన్నికయ్యాడు. ఈ మూడు సంఘాలతో పాటు మరిన్ని ప్రజాసంఘాల వేల సభల్లో అద్భుతమైన వక్తగా పాల్గొన్నాడు. రాజకీయార్థ శాస్త్రాన్ని వర్తమాన రాజకీయాలకు అన్వయించి పండు ఒలిచినట్టు వేలాది ప్రజలకు వివరించే విషయంలో కాశీపతి ముద్ర ప్రతి శ్రోత మీద ఉంటుంది. ముఖ్యంగా, విద్యార్థి, యువజన, సాంస్కృతిక కార్యకర్తల మీద.

తరిమెల నాగిరెడ్డి కుట్ర కేసు (హైదరాబాద్ కుట్రకేసు)లో కాశీపతి ముద్దాయి. అంటే మొదటిసారి 1970ల ఆరంభంలోనే ఆయన జైలుకు వెళ్లాడు. ఎమర్జెన్సీ ప్రకటించగానే మళ్లీ అరెస్టై సికిందరాబాద్ జైలులో ఉన్నాడు. అప్పుడు రాష్ట్రంలో వివిధ జైళ్లలో విరసం సభ్యులు ముప్పై మంది ఉండేవాళ్లు. హైకోర్టులో రిట్ పిటిషన్ వేసి ఈ జైలుకే వచ్చి నెలల తరబడి ఇక్కడే ఉండిపోయేవాళ్లం. ఎందుకంటే కెవిఆర్, టిఎంఎస్, కాశీపతి వంటి మా నాయకత్వమంతా ఇక్కడే ఉండేది. ఎంటి ఖాన్, చెరబండరాజు, బొజ్జా తారకం మాత్రం చెంచలగూడ జైలులో ఉండేవారు. ఒకరికొకరు 'బాబు'గా పిలుచుకునే కాశీపతి, ఎచ్ఆర్‌కెల సావాసం మాకు ఇక్కడే. 1979 తిరుపతి విరసం సాహిత్య పాఠశాలలో సాహిత్య రంగంలో విరసం పాత్ర గురించి 'నమ్మి డాక్యుమెంట్' పేరుతో ప్రతిపాదన పెట్టి, చర్చ ప్రారంభమైన తరువాత కాశీపతి స్థానంలో నమ్మి, ఎచ్ఆర్‌కె వంటి వాళ్ల కొత్త నాయకత్వం వచ్చింది. బహుశా కాశీపతి పూర్తికాలపు పార్టీ రాజకీయాల్లోకి వెళ్లిపోయినట్లున్నాడు. ఎందుకంటే ప్రతి ఎన్నికల సందర్భంలోనూ సిరిసిల్ల ఎంఎల్ అభ్యర్థికి ప్రచారం చేయడానికి ఆయన వస్తుండేవాడు. 1985లో జరిగిన ఎన్నికల్లో ఆయనే సిరిసిల్లలో నిలబడ్డాడని నాకు జ్ఞాపకం. నేను, బాలగోపాల్ వరంగల్ జైలులో ఉన్న సమయంలో ఆయన, చలసాని కలిసి వచ్చినట్లుగా గుర్తు.

ఎమర్జెన్సీ అంతా సికిందరాబాద్ జైలులో ఉండడం వల్ల మొదటి ఆరు నెలలు 1975 జూన్ 26 నుంచి నవంబర్ దాకా జైలులో ఉన్న వారందరికీ భూమయ్య, కిష్టాగౌడ్‌లతో చాలా సాన్నిహిత్యం ఏర్పడింది. కాశీపతి అప్పటికే ఎపిసిఎల్‌సి కార్యవర్గ సభ్యుడుగాను, వక్తగాను వాళ్ల ఉరిశిక్ష రద్దు గురించి వేల సభల్లో మాట్లాడి ఉన్నాడు. 1975 డిసెంబర్ 1న ఆ ఇద్దరిని ఉరి తీసినప్పుడు వీళ్లంతా ఆ జైలులో ఉన్నారు. ఆయన మనసు మీద అది గాఢమైన ముద్ర వేసింది. ఎమర్జెన్సీ ఎత్తివేసిన తరువాత జరిగిన ఎన్నికల్లోను, తర్వాతను జలగం వెంగళరావు అధికారంలో ఉన్నంత కాలం సభల్లో కాశీపతి శ్రీకాకుళం, ఉభయ గోదావరి జిల్లాలను కల్లోలిత ప్రాంతాలుగా ప్రకటించడం గురించి, ఎన్‌కౌంటర్‌ల గురించి, భూమయ్య, కిష్టాగౌడ్‌ల ఉరిశిక్ష గురించి మాట్లాడుతుండేవాడు. ఈ రాజ్యహింస గురించి ఎంతో ప్రభావితంగా చెప్పి, 'ఈ నరహంతకుడిని ఏం చేయాలి' అని అడుగుతుండేవాడు. ఆయన ప్రసంగంతో ఉత్తేజితులైన సభికులు 'ఉరితీయాలి' అని కేకలు పెట్టేవారు. 'ఎపిసిఎల్‌సి ఉరిశిక్షలకు వ్యతిరేకం. కనుక ఈ నరహంతకుడిని సజీవంగా ఒక బోనులో పెట్టి, నెహ్రూ జంతు ప్రదర్శనశాలలో పెట్టాలి అనేది నా ప్రతిపాదన' అనగానే చప్పట్లు మారుమోగుతుండేవి.

ఎంత రాజకీయాభినివేశంతో, ఉద్విగ్నతతో ధారాళంగా మాట్లాడేవాడో అంత సున్నితమైన కరుణాంతరంగం కూడా ఆయనది. ఆయనకు అత్యంత సన్నిహితులైన నీలం రామచంద్రయ్య, జంపాల ప్రసాద్‌లు ఎమర్జెన్సీలోనే గుంటూరు దగ్గర ద్రోహి ఇచ్చిన సమాచారంతో అరెస్టై బూటకపు ఎన్‌కౌంటర్‌లో అమరులయ్యారు. అప్పుడు ఆయన సికిందరాబాద్ జైలులో ఉన్నాడు. జంపాల ప్రసాద్ పిడిఎస్‌యు నాయకుడుగా ఎదిగి, పూర్తికాలపు విప్లవోద్యమంలోకి పోయినవాడు. వీరిద్దరూ పరస్పర ప్రభావం ఉన్న వాళ్లు. 'ఊయాలో జంపాలో... ఈ దోపిడీ



సంస్మరణ వ్యాసం

ఆవంత్స సోమసుందర్ జ్ఞాపకాలు
చిరకాల కవిత్వ స్నేహం - దృక్పథాల సంఘర్షణ

వివి

పందొమ్మిది వందల నలభైల ఉత్తరార్ధంలో బుద్ధి తెలిసిన వారెవరైనా తెలంగాణ అనే పేరు వింటేనే పులకించి పోయేవారు. అప్పుడు అది తెలుగు భాష కాదు. ప్రపంచానికంతా అర్థమైన తెలంగాణ పోరాట భాష. ఆ సామూహిక చైతన్యంలో ఒకానొక పర్యాయపదం దొడ్డి కొమురయ్య. అమరత్వంతో సర్వనామమైన ఒక నామవాచకం. ఒక ఊరు. అది ఏ ఊరైతేనేమి. సూర్యుడు పొడిచిన ఏ ఊరైనా అది ఏర్రై పారే పోరాట ఊరు. కడివెండి, ఐలమ్మ పాలకుర్తి, బందగీ కామారెడ్డి గూడెం. ఇంకెందరివో బాలెంల, సూర్యాపేట, బైరాన్‌పెల్లి, జనులందరిదీ జనగామ. జనగామ ప్రజల వీరోచిత పోరాట గాథలు 'బానిసల తిరుగుబాటు'గా 1949 నాటికే వినిపించిన వాడు ఆవంత్స సోమసుందర్.

'ఖబర్దార్ ఖబర్దార్ నైజాం పాదుషాహే
బానిసత్వ విముక్తికై
హిందూ ముస్లిం పీడిత శ్రమజనులు ఏకమయ్యి
తమపై స్వారీ చేసే దేశముఖులను ప్రతిఘటించి ప్రజాకోటి
కోరుతోంది
సూర్యాపేట బాలెంల వీరుల కాలే హృదయాలు ఆశలు
కాంతించుతాయి
అమరుడు మా కొమురయ్య అనంతయ్య అనంతుడే
అజేయుడుడై ప్రకీర్తులై శిరస్థాయి నిలుస్తారు
చరిత్రలో ధరిత్రిలో చిరస్థాయి నిలుస్తారు"

ఇవన్నీ గుర్తుపెట్టుకోని వాళ్లయినా ఇప్పటికీ ఎప్పటికీ గుర్తుపెట్టుకునే మాటలు

"ఒక వీరుడు మరణిస్తే వేల కొద్ది ప్రభవింతురు
ఒక నెత్తుటి బొట్టులోన ప్రళయాగ్నులు ప్రజ్వరిల్లు"

92 రెండేళ్ల నిండు జీవితం గడిపి అన్ని సాహిత్య ప్రక్రియల్లో దాదాపు అంత సంఖ్యలో పుస్తకాలు రాసి, నిరంతరం చదువు, రాత, సాహిత్య సంభాషణల్లో గడిపిన ఆవంత్స సోమసుందర్ కన్నుమూశాడు అనగానే ఎవరికైనా గుర్తుకొచ్చే పేరు 'వజ్రాయుధం'. అందులో 'బానిసల తిరుగుబాటు' పేరుతో ఆయన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంపై రాసిన కవితలు. ఆయనకది స్పార్టకస్ నాయకత్వంలో చేసిన బానిసల తిరుగుబాటు అంతటి స్ఫూర్తినిచ్చింది. 'నీ బాంచెన్ దొర' (నీ బానిసను) అనే మాటను రంగరించి ఉగ్గుపాలతో బలవంతంగా ఒంటబట్టించిన బ్రాహ్మణీయ భూస్వామ్యపు భావజాలాన్ని ప్రతిఘటిస్తూ ఆ వెట్టివాళ్లు అందుకున్న గుతుపలు, తుపాకుల కథలన్నీ సోమసుందర్ కళ్లకు కట్టించినట్లు చిత్రించాడు.

కాసేపు ఈ వర్గపోరాటాన్ని ఒక విశాలాంధ్ర భావనలో భాగంగా మహాభారత యుద్ధకాలపు సంస్కృత ప్రతీకలతో రాయడాన్ని అర్థం చేసుకోగలిగితే సోమసుందర్ 'బానిసల తిరుగుబాటు' ఆ పోరాటపు ఆవేశపూరిత కవితాక్షరాలు.

"ఒక పిడికిలి ఒక వంతుగా ఒక మ్రోతై ధ్వనిస్తారు
మృతవీరుల స్మరిస్తారు నవయోధుల సృజిస్తారు
మిషన్ గన్నులు మరఫిరంగి తుపాకులు
విషవాయువు ప్రజాశక్తిని ఆపలేవు"

ఇదేదీ అమూర్త అనిర్దిష్ట కవిత్వం కాదు. ఎట్లా బడితే అట్లా అన్వయించుకోవడానికి.

"అతడెవడు అతడెవడు జనగామలో జమ్మికొమ్మపై ఎక్కాడు
అతడే ప్రజాసమర ఉద్యముత్సాహకుడు
అతడే ప్రజాసమర జగతికధ్యాపకుడు
అతడే తెలంగాణ గెరిల్లా నాయకుడు

పుడమి గర్జించింది
ఇంటికొక మానవుడు వీరుడై పొంగాడు

కూలదోయాలో' అని కాశీపతి జైలులో రాసిన పాట ఆయన స్వరంలోను, అరుణదోయ రామారావు స్వరంలోను జైలులోను, బయటా విస్తృత ప్రచారాన్ని పొందింది.

ఆరంభంలో ఆయన సంపన్న బ్రాహ్మణ కుటుంబం నుంచి వచ్చాడని రాశాను. అది పెద్ద అగ్రహార భూస్వామ్య సంప్రదాయ కుటుంబం. కాని ఉద్యమంలో ఆయన శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఆదివాసి మహిళ పుష్ప సాహచర్యాన్ని ఎంచుకున్నాడు. ఆయనకు ఇద్దరు కూతుర్లు - ప్రగతి, వెన్నెల. నిన్న మరణించే నాటికి ఆయనకు ఎక్కడా సొంత ఇల్లు కూడ లేదు.

గత ముప్పై ఏళ్లుగా వార్త, ఇండియన్ ఎక్స్‌ప్రెస్, ఆంధ్రప్రభ వంటి పత్రికల్లోను, తరువాత కలర్ చిప్స్‌లోను పూర్తికాలపు జర్నలిస్టుగా, పదేళ్లుగా అనారోగ్యంతో ఉన్నప్పటికీ విప్లవోద్యమానికి, విరసంకు ఇప్పటికీ తడి తడి జ్ఞాపకంగానే ఉండిపోయాడు కాశీపతి. ఎల్లకాలం కొరకు అట్లాగే ఉంటాడు. చెమట చెమ్మలో కలిసి బయటికి వచ్చే పల్చటి నెత్తుటి జ్ఞాపకం వలె, పెదాల మధ్య కదలాడుతున్న ఉత్తేజకరమైన నిప్పు కణికల వంటి మాటల జ్ఞాపకం వలె, భుజం మీద ఆత్మీయమైన స్పర్శ అనుభూతి వలె.

ఘోరమై బీభత్సమై రూపమై జనగామ
వ్యక్తమై పైశాచభుక్తమై జనగామ
వీరుల ప్రవాహమై కదిలింది జనగామ
విప్లవ ప్రవాహమై పొంగింది జనగామ
ప్రజావాహిని ఎదురుదాడులకు సిద్ధమై
సాయుధ తరంగాల ఉరకలై పొంగింది
ఈటెలు, బల్లెములు, నాటు బందూకులు,
రోకళ్ళ, కారాల మూటలతో కదిలారు
గెలిచారు శత్రువంతటి మహాశక్తి మృత్యువును
జయించారు హత్యలు జయించారు
జనగామలో విజయభేరి మోగించారు"

దేవులపల్లి వెంకటేశ్వరరావు ఎంతో సాధికారతతో రాసిన 'జనగామ ప్రజల వీరోచిత పోరాట చరిత్ర' చదివినట్టుగా లేదూ. ఇటీవల విరసం కవులం కొందరం సెంట్రీ విధులు, కర్తవ్యాలు, సెంట్రీ చేస్తున్న సమయంలో వాళ్ల మనోభావాల గురించి కవిత్వం రాయాలనుకున్నాం. సోమసుందర్ అటువంటి ఒక దీర్ఘకవిత రాశాడు.

"తుపాకి పట్టిన రెండు నెలల్లో పొందిన అనుభవాలను పరవేశిస్తూ...

అర్ధరాత్రి దాడులకై ముష్కరులు వస్తున్నారా
గుహలోపల కునుకుతున్న తోటి పులులను మేల్కొల్పెను"

వాళ్ల తుపాకులు పేల్చడం, రోడ్డు పక్క తవ్వబడ్డ కందకాల్లో బురదల్లో శత్రువుల గుర్రాలు, గూండాలు కూరుకుపోవడం, అట్లాగే గెరిల్లాలు ముగ్గురు అమరులు కావడం తనదైన భాషలో వర్ణించి "తల్లీ ఏడువకమ్మా మళ్లీ జన్మన్నది మాకుంటే నీ కడుపుల జన్మిస్తాం" అనే చరణాలు చదువుతుంటే చారు మజుందార్ అమరుడైనప్పుడు శివసాగర్ రాసిన కవిత గుర్తుకొస్తుంది. "ఆ సమాధి దగ్గర ఇంకా ఎందుకు ఏడుస్తూ కూర్చున్నావు తల్లీ, అందులోని వీరుడు ఎప్పుడో లేచి మళ్లీ యుద్ధానికి వెళ్లాడు".

తెలంగాణ అట్లా మళ్లీ మళ్లీ ఓడిపోతూ గెలుస్తూ యుద్ధాలు చేస్తూ దండకారణ్యానికి, జనతన రాజ్యానికి విస్తరించిన ఒక వర్గపోరాటం. అందుకనే ఇవాల్టికీ దాదాపు అరవై ఏడేళ్ల తరువాత కూడా 'బానిసల తిరుగుబాటు' ఇప్పటి పోరాటాన్ని చదువుతున్నట్టుగానే ఉంటుంది.

తెలంగాణలో మూడువేల గ్రామాల్లో పది లక్షల ఎకరాల భూమిని స్వాధీనం చేసుకొని బీజప్రాయంలో ఎర్రరాజ్యాన్ని చవిచూసిన సందర్భాన్ని కూడా సోమసుందర్ తన కవిత్వంలో నమోదు చేశాడు.

"తెలుగు గడ్డ నడిబొడ్డున నవ్వుతున్న నల్లని కొండలు
నల్లగొండ పరిసర ప్రాంతాలకు ప్రతిధ్వనులు వ్యాపించిన నవ్వులు
విజయానందంతో పారవశ్యం ఒళ్లుమరచి పకపక నవ్వుతున్న నల్లని కొండలు
అడవులు బంజరులు బీళ్లు ఏకంగా సమతలమొనరించిన రైతులు
ఉమ్మడిగా సౌఖ్యం పండించిన రైతులు
భూదేవత కనుల పంటలు
నల్లగొండ లోయల్లో గుమికూడిన పేదల కూలీ రైతుల సభలో
లక్షమంది నినదించిన కోర్కెలు
ఆశలు ప్రతిధ్వనించిన లోయలు
ప్రజారాజ్య పరిషత్తుల ఎన్నుకొన్న ఘడియలు
పంచాయతీల పరిపాలన పల్లెల్లో వెల్లివిరిసి పొంగిన ఆనందం
స్వేచ్ఛా నవజీవన రాజ్యాంగం నెలకొల్పబడిన శుభసమయం
నూతన చట్టాలకు పట్టం కట్టిన ఘడియలకు ప్రాణం పోసిన కాలం
మానవులంతా కాచుకునే న్యాయం నరులంతా సోదరులై పంచుకునే ధర్మం
కత్తివంటి ప్రజావాణి న్యాయం"

ఇప్పుడిది చదువుతూంటే దండకారణ్యంలో జనతన సర్కార్ గురించి చదువుతున్నట్టు లేదూ. గతం మరింత ఉజ్వలమైన వర్తమానంగా మనకు కనిపిస్తున్నప్పుడు ఇప్పుడిది నాస్టల్జియా కాదు. ఒక ప్రేరణ. ఒక ఉత్తేజం.

తెలంగాణ గురించి సోమసుందర్ రాసిన 'వజ్రాయుధం', ఆరుద్ర రాసిన 'త్వమేవాహం' రెండూ కూడా శ్రీశ్రీ 'మహాప్రస్థానం' గీతాలు పుస్తక రూపం కన్న ముందే వెలువడినవి.

ఈ కవిత్వ స్వభావంగానూ లక్ష్యంగానూ ప్రకటించుకున్నట్లుగా సోమసుందర్ ఇందులో ఒక మాట కోట్ చేశాడు. "Art is an invincible weapon in the hands of people". అప్పటికే ఆయన జార్జ్ థాంప్సన్ రాసిన 'మార్క్సిజం - పొయెట్రీ' పుస్తకం చదివి ఉన్నాడు. అది లారెన్స్ అండ్ విశార్ట్ వాళ్లు 1945లో ప్రచురించారు. 1946 అక్టోబర్‌లో ఆయన ఆ పుస్తకం కొనుక్కున్నాడు. అప్పటి నుంచీ దాన్ని అనువదించాలని ఆయన అనుకున్నాడు. 1983లో ఆరుద్రతో కలిసి ఇంగ్లండ్ వెళ్లి తొంభై రోజులు గడిపినప్పుడు కాని ఆయన జార్జ్ థామ్సన్‌ను కలుసుకోలేకపోయాడు. ఇదే పుస్తకాన్ని జార్జ్ థాంప్సన్ 'హ్యూమన్ ఎసెన్స్' పేరుతో మరింత విస్తృతపరిచి పరిణతి పుస్తకంగా తెచ్చాడని సోమసుందర్‌కు తెలిసినట్టు లేదు. సోమసుందర్ జార్జ్ థామ్సన్‌ను కలిసేనాటికి ఆయనకు 83 ఏళ్లు. బర్మింగ్‌హామ్‌లో ఉంటూ విశ్రాంత జీవితం గడుపుతున్నాడు. 1983 సెప్టెంబర్ 27న థామ్సన్‌ను కలిసిన సోమసుందర్ మూడు గంటలు ఆయనతో గడిపాడు. థామ్సన్ కంఠస్వరం చాలా క్షీణించి మైక్‌తో మాట్లాడితే తప్ప వినిపించని స్థితిలో ఉన్నాడు. తిరిగి వచ్చాక 1989లో 'మార్క్సిజం - కవిత్వం' అనువాద పుస్తకాన్ని సోమసుందర్ ప్రథమ ముద్రణగా తెచ్చాడు. రెండవ ముద్రణ 2007లో వెలువడింది. 'మార్క్సిజం - పొయెట్రీ'గాను తిరిగి 'హ్యూమన్ ఎసెన్స్'గా అది వెలువడగానే నన్ను విపరీతంగా ప్రభావితం చేసిన ఈ జార్జ్ థామ్సన్ పుస్తకం తన తెలుగు అనువాదం రెండో ముద్రణకు సోమసుందర్

నన్ను ముందుమాట రాయమని అడిగాడు. నేను 'మానవసారం' పేరుతో ముందుమాట రాశాను.

ఈ మధ్యకాలంలో మా మధ్య ఎన్ని బ్లూహాట్, బ్లాకోల్డ్ (వేడి వేడి చల చల్లని) గాలులు వీచాయో చెప్పలేను. 1949లో 'వజ్రాయుధం' వెలువడగానే 1950లో నా పదేళ్ల బాల్యంలో అది చదివిన దగ్గరి నుంచి సోమసుందర్‌తో పరోక్ష పరిచయం ఉంది. 1960-64లో ఉస్మానియా క్యాంపస్‌లో చదువుతున్న రోజుల్లో సోమసుందర్ హైదరాబాద్ వస్తే ఫ్రీవర్స్ ఫ్రంట్ కవి సమ్మేళనాలకు కూడా వచ్చేవాడు. ఆయనతో కరచలనాలు ఉండవు, ఆలింగనాలే ఉంటాయి. స్నేహశీలి.

1964 మేలో నెహ్రూ చనిపోయాక నేను రాసిన కవితకు ఆయన కన్నీళ్లు పెట్టుకున్నాడు. అప్పుడు మా స్నేహం ఎంత గాఢమైందంటే ఈ కన్నీళ్లతోనే అర్థం చేసుకోవచ్చు. నాలుగు వేల కమ్యూనిస్టులను చంపేసిన నెహ్రూను సోషలిజం తెస్తాడనే ఏకమానసిక స్థితిలో ఇద్దరం ఉన్నాం. ఆయన 'వజ్రాయుధం' నుంచి వచ్చి కూడ అట్లా కావడం విషాదం. అప్పటికది అవిభక్త కమ్యూనిస్టు పార్టీ అవగాహన. కిషన్ డాక్యుమెంట్ పేరుతో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట కాలంలోనే రావినారాయణరెడ్డి చేసిన సూచన.

ఇదే నెహ్రూ ఢిల్లీలో తాత్కాలిక ప్రభుత్వానికి ప్రధాని అయినప్పుడు 1946 నవంబర్‌లో నైజాంతో యథాతథ ఒడంబడిక చేసుకున్నాడు. 1947 ఆగస్ట్ 15న అధికార బదిలీ అధికారికంగా అయింది. భ్రమలు తొలగిన కమ్యూనిస్టు పార్టీ సెప్టెంబర్ 11న ఇదే రావినారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మగ్దూం మోహియొద్దీన్ నాయకత్వంలో సాయుధ పోరాట పిలుపు ఇచ్చింది. ఈ సాయుధ పోరాటాన్ని అణచడానికే రజాకార్ల నెపంతో నెహ్రూ, పటేల్ సైన్యాలు 'ఆపరేషన్ పోలో' పేరుతో 1948 సెప్టెంబర్ 13న హైదరాబాద్ సంస్థానంలో ప్రవేశించారు. సెప్టెంబర్ 17 నాటికి అంటే ఐదు రోజుల్లో హైదరాబాద్ సంస్థానంలోనే కాదు, మద్రాస్ ప్రావిన్స్‌లో ఉన్న ఆంధ్ర ప్రాంతమంతటా మూడు వేల మంది కమ్యూనిస్టులను, సానుభూతిపరులను ఊచకోత కోశారు. నంజప్ప, పళనియప్పన్ సైనిక క్యాంపులలో పాకాల చెరువు కింద కాలాపానీలో కాన్సంట్రేషన్ క్యాంపులు నిర్వహించి చిత్రహింసలు పెట్టారు. అదొక మారణకాండ, అదొక రక్తపాతం.

1947-48 మధ్యకాలంలో తప్ప హైదరాబాద్ సంస్థానంలో రజాకార్లు లేరు. 1940లకు పూర్వం ఖుతుబ్‌షాహీల, అసఫ్ జాహీల పాలన అంతా మతసామరస్య కాలం. ఉస్మాన్ అలీ ఖాన్ కూడా కమ్యూనిస్టులను, రైతాంగాన్ని అణచివేయడానికి తన రాజ్యాంగ యంత్రం, బలం చాలక రజాకార్లను సృష్టించాడు. దానికి ఆయన స్వతంత్రంగా ఉండాలనే ఆకాంక్ష, పాకిస్తాన్ అండ ఉంటుందనే అత్యాశ కూడా తోడ్పడ్డాయి. అయితే సృష్టి ఉస్మాన్ అలీ ఖాన్‌దే అయినా అది హిందూ భూస్వాములు గ్రామీణ స్థాయి నుంచి నిర్మాణం చేసిన ఒక పిరమిడ్ వంటి స్థితి. ఈ రజాకార్లను ఉపయోగించుకున్న వాళ్లంతా హిందూ జాగీర్దార్లు, జమీన్దార్లు. అశేష ప్రజానీకం కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో సంఘటితం అయి గ్రామాల్లో వీళ్లను నిలువరించారు. ప్రజల్లో వీళ్లకు ఎన్నడూ బలం లేదు. ముస్లిం పేద ప్రజల్లో కూడ. బందగీ మొదలు మగ్దూం వరకు వాళ్లంతా తమను తాము రైతాంగం, ప్రజలు అనుకున్నారు తప్ప ఒక మతస్థులుగా భావించలేదు. కనుక సెప్టెంబర్ 17 తరువాత రజాకార్ అనే మాట లేదు. కాని అది నెపంగా యూనియన్ సైన్యం తెలంగాణలోని మద్దూరు, లద్దనూరు వంటి గ్రామాల్లో, హైదరాబాద్ నగరంలో, హైదరాబాద్ కర్ణాటకలో, మరాఠ్వాడలో నలభై వేల నుంచి రెండు లక్షల మంది దాకా ముస్లింలను చంపింది. నెహ్రూ పనుపుపై హైదరాబాద్‌కు వచ్చిన ఆయన మిత్రుడు సుందర్‌లాల్ జవహర్‌లాల్‌కు ఇచ్చిన తన నివేదికలో యూనియన్ సైన్యం రజాకార్ల నెపంతో కనీసం నలభై వేల మంది ముస్లింలను చంపిందని రాసాడు. ప్రజాస్వామిక హక్కుల నేతగా డా. జయసూర్య స్వయంగా కేంద్ర హోం సెక్రటరీకి ఒక సమగ్రమైనటువంటి నిజనిర్ధారణ నివేదికను ఇచ్చాడు. అందులో యూనియన్ సైన్యం రజాకార్ల నెపంతో రెండు లక్షల మంది ముస్లింలను చంపిందని రాశాడు.

చరిత్ర ఒకసారి ఫార్స్‌గా, ఒకసారి విషాదంగా పునరావృతం అవుతుందని అంటాడు మార్క్స్. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట విరమణ ఒక విషాదం అయితే, ఒక విద్రోహం అయితే, సెప్టెంబర్ 17ను విమోచన దినంగా, తెలంగాణ స్వాతంత్ర్య దినంగా ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బిజెపితో గొంతు కలిపి సిపిఐ ఒక ఉద్యమంగా చేపట్టడం ఒక విషాదం, ఒక ఫార్స్, ఒక స్వీయ వంచన, పర వంచన. దీనికంతా మూలం కిషన్ డాక్యుమెంట్‌లో ఉంది. జవహర్‌లాల్ నెహ్రూ అధికారానికి వస్తే శాంతియుతంగా ఆయనే సామ్యవాదం తెస్తాడని, కనుక పోరాటం అక్కర్లేదని సారాంశంగా తేల్చిన డాక్యుమెంట్ ఇది. దీనితో ఆమోదం ఉన్నవాళ్లు 1964లో కమ్యూనిస్టు పార్టీ చీలినప్పుడు సిపిఐతో ఉండిపోయారు. అరసం సిపిఐతో ఉండిపోయింది. సోమసుందర్ అరసం నాయకత్వంలో ప్రముఖుడు. కనుక సోమసుందర్‌లో ఆ మార్పు వ్యక్తిగతం మాత్రమే కాదు, అది కమ్యూనిస్టు పార్టీలోను, అరసంలోను వచ్చిన రివిజనిస్టు ధోరణి.

1964లో మేమిద్దరం నెహ్రూ మరణానికి ఏడ్చాం. నా నేపథ్యం ఆయన నేపథ్యం కాకపోవచ్చు. నాకప్పటికి రాజకీయాలు లేవు. ఇట్లా గాఢతరమైన మా స్నేహంతో కవి బాలగంగాధర్ తిలక్‌తో పాటు సోమసుందర్‌ను వరంగల్‌లో రెండు రోజులపాటు నిర్వహించిన మిత్రమండలి వార్షికోత్సవాలకు కూడా పిలిచాం. సాహితీ మిత్రులందరితో వాళ్లిద్దరు ఎంతో ఆత్మీయంగా గడిపారు. అక్కడ తిలక్‌తో ఏర్పడిన గాఢానుబంధమే తర్వాత కాలంలో 'సృజన' ఆవిర్భావానికి కారణమైంది. అది తిలక్‌తో పంచుకున్న ఆలోచన కనుకనే ఆయన ఆకస్మాత్తుగా మరణించడంతో ఆయన సాహిత్య సమాలోచనగా మొదటి సంచిక వచ్చింది. 1965లో నా వివాహానికి సోమసుందర్‌కు ఆహ్వానం పంపాను. నా సహచరి పేరు హేమలత. వాళ్ల ఊరు రాజవరం. ఆయన 'హేమవరం' పేరుతో కవిత రాసి మా పెళ్లికి శుభాకాంక్షలు పంపారు.

కవిత్వాభిమానంతోను, స్నేహంగా మారిన పరిచయంతోను,

ఇట్లా పరోక్షంగానూ, ప్రత్యక్షంగానూ ఆయనతో ప్రేరణ, స్నేహం నక్సల్బరీ, శ్రీకాకుళ సాయుధ రైతాంగ పోరాటాల కాలానికి దృక్పథాల సంఘర్షణగా మారిపోయింది. అది విశాఖపట్నం శ్రీశ్రీ అరవై ఏళ్ల సభ (ఫిబ్రవరి 1970)లో వేదిక మీదనే బహిరంగమైంది. అప్పటికే 'దిగంబర కవులు' ముఖ్యంగా జ్వాలాముఖి, 'తిరుగబడు కవులు' ముఖ్యంగా నేను సోమసుందర్ గురించి ఈ భావఘర్షణలో భాగంగా చాలా రాసి ఉన్నాము. అట్లా మా బాటలు విడిపోయాయి. ఆయనా, ఆరుద్ర శ్రీశ్రీకి పోటీగా శ్రీరంగం నారాయణబాబును నిలబెట్టే ప్రయత్నం చేశారు. ఆరుద్ర శ్రీశ్రీకి పోటీగా దాశరథిని దించే ప్రయత్నం చేశాడు. దాశరథి ఆరుద్రను తెచ్చే ప్రయత్నం చేశాడు. వీళ్లెవ్వరూ కవిత్వం దినుసు తెలియనివాళ్లు కాదు. దీని వెనుక ఉన్నది నక్సల్బరీ శ్రీకాకుళ రైతాంగ పోరాటం పట్ల ఉన్న వైఖరి. కనుకనే దీనిని సాహిత్యంలో వర్గపోరాటం అనడం.

సోవియట్ సోషల్ సామ్రాజ్యవాదం, తూర్పు యూరప్‌లో దాని విస్తరణ కూడా పతనమై 1991 సామ్రాజ్యవాద ప్రపంచీకరణతో, 1992 బాబ్రీ మసీదు విధ్వంసంతో కాని మొనగాడుగా ముందుకు వస్తున్న అమెరికన్ సామ్రాజ్యవాదం, దానికి అండగా ఇండియాలో బ్రాహ్మణీయ భూస్వామ్య హిందూత్వ భావజాలం, సిపిఐతో, అరసంతో మాకున్న ఘర్షణ ప్రాధాన్య క్రమాన్ని తగ్గించింది. 1991లో బాగ్దాద్‌పై అమెరికా బాంబు దాడి, ఇటు బాబ్రీ మసీదు విధ్వంసం తర్వాత 1994-95 జైలు పోరాటంలో పౌరహక్కుల సంఘాల నేతృత్వంలో విరసం, అరసం కలిసి పనిచేశాయి. ఇంక గుజరాత్ మారణకాండ (2002) తరువాత ఏర్పడిన ప్రజాసాంస్కృతిక వేదికలో విరసం, అరసం క్రియాశీలంగా పాల్గొన్నాయి. 'గుజరాత్ గాయం' గురించి ఇక్కడ వివరంగా చెప్పనక్కర్లేదు.

1991 సామ్రాజ్యవాద ప్రపంచీకరణ స్థితి 1995లో చంద్రబాబు నాయుడు అధికారానికి వచ్చినప్పటి నుంచి ఆంధ్రప్రదేశ్‌లో దగ్గరగా అనుభవానికి వచ్చింది. అదే మలి తెలంగాణ ప్రజాస్వామిక ఉద్యమానికి కూడా దారితీసింది. 2004లో మన్‌మోహన్ సింగ్ ప్రధాని అయ్యాక ఇది దేశవ్యాప్తంగా మరింత తీవ్రతరం అయింది. మరొకవైపు 1995 సెప్టెంబర్‌లో విప్లవోద్యమం ప్రత్యామ్నాయ రాజకీయాల కోసం ఏర్పాటు చేసిన గ్రామరాజ్య కమిటీలు క్రమంగా 2004 నాటికి జనతన సర్కార్ స్థాయికి ఎదిగినవి. రెండు అభివృద్ధి నమూనాల మధ్యన ఘర్షణ తీవ్రతరం అయింది. గ్రామస్థాయి నుంచి, పట్టివేళ్ల స్థాయి నుంచి స్వపరిపాలన, స్వావలంబనగా అమలయ్యే ప్రజల ప్రజాస్వామ్యం సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధ్వంసపూర్వక అభివృద్ధి నమూనా మధ్యన ఘర్షణ తీవ్రతరం అయింది. 2009లో గ్రీన్‌హంట్ ఆపరేషన్ పేరుతో ప్రజల మీద యుద్ధం కేంద్ర, రాష్ట్ర దళారీ ప్రభుత్వాలు తూర్పు, మధ్య భారతాల్లో ప్రారంభించడంతో ఇవాళ ఇది ప్రజా యుద్ధం ప్రాతిపదికగా ప్రతిఘటన ఉన్నత రూపాన్ని తీసుకున్నది. గుజరాత్ నమూనా మోడిత్వ పేరుతో సామ్రాజ్యవాద ప్రపంచీకరణ, బ్రాహ్మణీయ హిందూ భావజాలంగా సారభూతమైన కలయికగా మారింది.

ఇటువంటి నేపథ్యంలో సోమసుందర్ 'మార్క్సిజం - కవిత్వం' అనువాదం రెండో ముద్రణ వెలువడింది. నేను రెండో ముద్రణకు 'మానవసారం' పేరుతో ముందుమాట రాయడానికి వెనుక ఉన్న కథ ఇది.

"సోమసుందర్ వలెనే నాకు 'మార్క్సిజం - కవిత్వం' పుస్తకానికి సంబంధించిన ఒక అనుభవం, ఒక అరుదైన అనుభూతి ఉంది. విరసం ఏర్పడిన కొత్తలో నా చేతికి జార్జ్ థామ్సన్ 'మార్క్సిజం - పొయెట్రీ' పుస్తకం వచ్చింది. చదివి చాలా ప్రభావితుడిని అయ్యాను. కొద్దో గొప్పో మార్క్సిస్ట్ సాహిత్య విమర్శతో పరిచయం లేని రోజుల్లో నన్ను చాలా ప్రభావితం చేసిన పుస్తకం అది. అయితే జార్జ్ థామ్సన్ 'మార్క్సిజం అండ్ పొయెట్రీ'ని పునర్ముద్రించకుండా ఆ ప్రతులు చెల్లిపోయాక చాలా ఏళ్లకు అదనంగా లభించిన ఆధారాలతో సంగీతం, సైన్స్, కళల గురించి కూడా కవిత్వంతో పాటు మరింత వెలుగును ప్రసరిస్తూ 'హ్యూమన్ ఎసెన్స్' (మానవ సారం) ప్రచురించాడు. దాని ఇండియన్ ఎడిషన్ మొదట 1985లో వచ్చింది. కవిత్వం గురించి అప్పటి వరకు ఉన్న మార్క్సిస్ట్ అవగాహన అంతా ఈ పుస్తకంలో ఇమిడిపోయిందని, ఇది మార్క్సిజం కవిత్వం కన్నా సమగ్రమైంది మాత్రమే కాకుండా క్రిస్టోఫర్ కాడ్వెల్ కవిత్వ సిద్ధాంతం (ఇల్యూషన్ అండ్ రియాలిటీ) కన్నా ప్రామాణికమైందని త్రిపురనేని మధుసూదనరావు గారు అంటుండేవారు. ఆయన 'హ్యూమన్ ఎసెన్స్'ను 'మానవసారం' పేరుతో తెలుగు చేశాడు కూడా. అది ఇప్పటికీ వెలుగు చూడలేదు. అందులో 'బుద్ధిజీవులు, శ్రామికులు' అనే చివరి అధ్యాయం ఒక్కటే 'సృజన'లో అచ్చయింది. మార్క్సిస్ట్ సాహిత్య సిద్ధాంతాలను పరిచయం చేసే క్రమంలో జనసాహితి రాల్ఫ్ ఫాక్స్ 'నవల - ప్రజలు'తో పాటు 'మానవసారం' ధారావాహికంగా ప్రచురించి పుస్తక రూపంలో తెచ్చింది. మళ్లీ ఇన్నాళ్లకు నేను సోమసుందర్ గారి అనువాదంలో 'మార్క్సిజం - కవిత్వం' చదవగలిగాను. ఈ రెండో ముద్రణను ఆయన ప్రథమ ముద్రణ కన్నా 'మెలుగాను పరిశుద్ధంగాను' వెలువరించే ప్రయత్నం చేశారడానికి నిదర్శనం ఇది నాకు చేరగానే దానినొక అద్భుత కల్పగానో, నవలగానో ఏకబిగిన చదవగలగడమే" అని ముందుమాటలో రాశాను.

ఈ మధ్యకాలమంతా మనుషులపట్ల ఉండే స్నేహ, ప్రేమ భావాలతో చలసాని ప్రసాద్ సో.సు.తో ఉత్తర ప్రత్యుత్తరాలు నడుపుతూనే ఉన్నాడు. కలుస్తూనే ఉన్నాడు. ఆయన ద్వారా సో.సు. నా క్షేమ సమాచారాలు తెలుసుకుంటూనే ఉన్నాడు. ఇటీవల కాలంలో అనారోగ్యంతో హైదరాబాద్‌కు వచ్చినప్పుడు ప్రత్యేకించి నన్ను కలవాలనుకుని తన కొడుకు ఉంటున్న ఇంటికి పిలిపించుకుని కలిశాడు.

రాజకీయ చైతన్యంలో ఎంతో ముందుకు వెళ్లిన కమ్యూనిస్టు కుదురు నుంచి వచ్చిన విప్లవాభిమానులు సోమసుందర్‌లోని ఈ పరిణామాన్ని అంతా ఆకళించుకొని నేర్చుకోవాల్సింది మాత్రం నిరంతర అధ్యయనం, నిరంతర రచన, నిరంతర సాహిత్య సంభాషణ. ఈ క్రమంలో ఏమరుపాటున కూడా మరిచిపోకుండా నిర్వహించవలసింది సాహిత్యంలో వర్గపోరాటం.

అజరామర వజ్రాయుధ బలం!
ఆవంత్స సోమసుందర్ కలం!!

గౌరవ్

రజాకార్ల పేరు వింటేనే బేజారెత్తిపోయే చీకటి రోజుల్లో నిజాం కర్కశత్వాన్ని 'ఖబడ్దార్' అని బహిరంగంగా హెచ్చరించి, నిషేధానికి గురైె చరిత్ర సృష్టించిన ప్రజా కలం అది.

కమ్యూనిస్టులంటేనే గంగవెర్రులెత్తి వార్ని దుర్మార్గ కాల్చి చంపుతున్న కాలంలో సుఖ జీవితపు సౌకర్యాల్ని కాదని సమాజంలోని అసమానతల్ని రూపు మాపడం కోసం సొంత కుటుంబంలో నుంచే తిరుగుబాటు బావుటా ఎగరేసి అజ్ఞాత జీవితాన్ని ఇచ్ఛికంగా కౌగిలించుకున్న విప్లవ కలం అది.

గ్రాంథిక భాష వాడుకతోనూ, ఛాందస భావాల పాడు కంపుతోనూ సంకుచితంగా కాలం వెళ్ళబుచ్చుతున్న తెలుగు సాహితీ జగత్తుని తన వాడుక భాషతో లాగి లెంపకాయ కొట్టి 'సాహిత్య ప్రయోజనం సామాజికమే' నంటూ ఖచ్చితంగా గర్జించి చాటిన కవితా కలం అది.

ఎనిమిది దశాబ్దాల నిరవధిక అక్షర కృషితో తొంబై పైచిలుకు వయసు వరకూ నిత్య యవ్వనుడిగా జీవించి వందకి పైబడ్డ గ్రంథాల్ని నిరంతరాయంగా ప్రచురించి వివిధ సంఘాల్ని, పత్రికల్ని స్థాపించి, అనేక యుద్ధాల్లో ఆరితేరి లెక్కలేనంత మంది ఆత్మీయుల్ని సంపాదించుకున్న మానవీయ కలం అది.

పదిమందిని ఉత్తమ సాహిత్యాభిరుచి కల సంస్కార వంతులుగా మంచి మానవ సంబంధాలతో మలచడానికి మించిన విప్లవం వేరేదీ లేదనే ప్రేమపూర్వక కలం అది.

ఆవంత్స సోమసుందర్ ఆ కలం పేరు.

కమ్యూనిజం దాన్ని నడిపిన కాలాతీత హుషారు.

ఒక్కసారి ఆయనతో పరిచమైన వాళ్ళెవరైనా ఆయన మృదుత్వానికి గులాము కాక మానరు. చిక్కటి నవ్వుతో వెచ్చని స్పర్శతో హృదయపూర్వకంగా అర్థవంతమైన సంభాషణని ఎల్లప్పుడూ ఆహ్వానిస్తున్నట్లు నిండు మనసుతో పలకరించడం ఆయన నైజం.

సుమారు దశాబ్ద కాలపు సాన్నిహిత్యంలో ఆయనతో ఎన్నో అపురూపమైన విషయాలు చర్చించే అవకాశం వచ్చింది. సో.సు. స్వీయచరిత్ర 'కలలు-కన్నీళ్ళు' ప్రూఫులు చూసి సమన్వయం చేయడం మొదలుకుని 'షెల్లీ జీవితాన్ని' అనువదించడంలో పాలుపంచుకోడం వరకూ, వజ్రాయుధం ముఖచిత్రాన్ని (సిగార్ పట్టుకుని సోసు నిల్చున్నది) ఎంపిక చేయడం నుంచీ ఎంతో కాలం నుంచి తన వద్ద భద్రంగా దాచుకున్న 'శ్రీశ్రీ' సంతకాన్ని నాకివ్వడం దాకా షెల్లీ కావ్యం 'ప్రామిథియస్ అన్‌బౌండ్' ని 'ప్రమథనాథుని బంధవిముక్తి' శీర్షికతో తెలుగు చేయ ప్రయత్నించడంతో ఆరంభమై 'క్రిస్టాఫర్ కాడ్వెల్' 'ఇల్యూజన్ అండ్ రియాలిటీ' అనువాదాన్ని సమన్వయం చేయలేక ఇద్దరం తలలు పట్టుకునే వరకూ ఎన్ని జ్ఞాపకాల్నని వివరించను? ఎన్నెన్ని అనుభావాల్నని వర్ణించను?

'అంటరాని వసంతం' పై సమీక్ష రాయమని ఆయనెంతగా సతాయించానో, సూర్యరాయ విద్యాకేంద్ర గ్రంథాలయానికి పుస్తకాలు ఇవ్వకపోతే ఊరుకునేది లేదని అంతే అల్లరి చేసాను. పట్టుమని పాతికేళ్ళు లేని కుంక చేష్టలతో ఆయన నాకిచ్చిన చనువుని ఆధారం చేసుకుని ఎంత పెత్తనం చెలాయించే వాడినో తల్చుకుంటే ఆశ్చర్యం వేస్తుంది.

ఆయనే ఒకసారన్నట్లు ఆయన జీవితంలో అతి తక్కువ కాలంలో అత్యంత సన్నిహితుడిగా మారిన చిన్న వయసు వాడ్ని నేనే నేమో! ఎంత ఉదారంగా లేకపోతే అభ్యంతరకర పదాల్ని కూడా ఉపయోగించి ఆయనకి బహిరంగ లేఖలు రాసే ధైర్యం నాకు చిక్కుతుంది? అదంతా ఇంతకాలంగా నా గొప్పతనమే అనుకున్నా గానీ నిజానికది ఆయన ఔన్నత్యమని ఇప్పుడనిపిస్తుంది. నా రచనల్లోని పదును తగ్గించుకోవాలనీ, భాషని సంస్కరించుకోవాలనీ ఎప్పుడూ సూచిస్తుండేవారు. అలాగే ఆయన పదజాలం గురించీ, భాషా ప్రయోగాల గురించీ నేను విమర్శిస్తుంటే మనసులోనే మురిసిపోయేవారు. ఆయనకంత పట్టులేదనీ, తెలివనీ అనుకున్న సంగతుల్ని నేను చెబుతోంటే ఎంతో సహనంగా వినేవారు. తన జీవిత యవనికపై పరిచయమైన ప్రతి వ్యక్తి పాత్రనూ గుర్తించి, గౌరవించి వార్ని చివరివరకూ, వారికి సంబంధించి తన పరిధిలోకి వచ్చిన ప్రతీ చిన్న విషయాన్నీ స్పష్టంగా జ్ఞాపకం పెట్టుకోవడమే కాక, ఆ పెట్టుకున్న విషయాన్ని సందర్భం వచ్చినపుడు అంతే స్పష్టంగా, కూలంకషంగా జ్ఞప్తికి తెచ్చుకుని చెప్పే అరుదైన గుణం సో.సు.లో ఉండేది.

కవిత్వం, కథలు, విమర్శ, వ్యంగ్యం, సమాజం, కళ, శాస్త్రం.... .విషయం ఏదైనా తనకి తెలిసిన దానిని చాలా సౌమ్యంగా, గోముగా, అనునయిస్తూ చెప్పడం సో.సు. గారికి చాతనయినంతగా ఇంకెవరికీ చాతకాదనేది. నా అభిప్రాయం.'ఉర్దూ సాహిత్యంలో ఉన్నత శిఖరాలు' ఆవిష్కరణ కనుకుంటాను హిందుస్థానీ గీతాల్ని నేను పాడుతుంటే చాలా ఆసక్తితో విన్నారు. తర్వాత 'భారద్దేశ పతనానికి పదకొండు కారణాల'పై బళ్ళారి రాఘవగారి భావాలకి సో.సు. రూపాన్నివ్వడంపై చర్చిస్తూ దానికి కారణమైన అసలు ఉపన్యాసం వెలికితీయడం కోసం పూనా వెళతానంటే సంతోషంగా ప్రోత్సహించారు. కొత్త భాషలు నేర్చుకోవడం పట్ల ఆ కాలంలో నాకు గల చొరవనీ, తెల్సిన వాటిని ఆయనతో చర్చించాలన్న తపననీ ఎన్నడూ కాదనని స్నేహశీలి ఆయన. ఇక సాహిత్య రంగంలో ఆయన కృషి అనన్య సామాన్యమైందీ, అసాధారణమైన ప్రతిభతో

అరుణతార గత రెండు సంచికల్లో వివి కవిత్వంపై బిఎస్ రాములు వ్యాసం చదివాక ఈ నాలుగు మాటలు రాద్దామనిపించింది. వివి కవిత్వం గురించి బిఎస్ రాములు కొన్ని మంచి పరిశీలనలు, సూత్రీకరణలు చేశారు. వాటి నుంచి ఇంకొంచెం విశ్లేషణ ఇచ్చి ఉండవచ్చు. కానీ ఆయన తన రచనా పద్ధతి వల్ల విపరీతంగా కవిత్వాన్ని ఉటంకించారు. కవితా పాదాలను విరివిగా ఎత్తిరాయడం .. వాటిని వివరించడం వల్ల వ్యాసం నిడివి పెరిగిపోయింది. అలాంటి చాలా చోట్ల వివరణ తప్ప విశ్లేషణ పెద్దగా లేదు. కొన్ని చోట్ల ఆసక్తికరమైన వ్యాఖ్యలు ఉన్నప్పటికీ కవితా పాదాలను మళ్లీ వచనంలో వివరించడమే ఎక్కువగా ఉంది. అట్లాగే కవిత్వ వస్తువు వగైరాల రీత్యా చాలా ఉప శీర్షికలు ఉన్నాయి. ఒకేలా ఉండే కొన్ని ఉప శీర్షికలు మళ్లీ మళ్లీ వచ్చాయి. ఒకే విషయాన్ని వేర్వేరు ఉపశీర్షికలుగా(ఉప శీర్షికలు పెట్టడం తప్పనికాదు) కూడా వేరు చేసి రాశారు. ప్రతి దాని కిందా ఎన్నో కవితలు ఉటంకిస్తూ పోయారు.

మంచి మాటో, చెడ్డ మాటోగాని దీన్ని అకడమిక్ పద్ధతి అంటారు. ఇట్లా విస్తారమైన ఉటంకింపులతో, ఉప శీర్షికలతో ఆ తరహా రచనలు ఉంటాయి. ఆ ధోరణి మొత్తంగా తెలుగు సాహిత్య విమర్శలో పెరుగుతోంది. ఈ పద్ధతిలో ఎవరు రాసినా వాచకం లోపలి పొరల్లోకి చాలా అరుదుగానే వెళుతుంటారు. వాచకం తానుగా ప్రకటించుకుంటున్న విషయాన్నే తమ మాటల్లో విమర్శకులు మళ్లీ ఎత్తి చెబుతూ ఉంటారు. ఇంకో రకమైన విమర్శ పద్ధతి కూడా ఇప్పుడు నడుస్తోంది. కవిత్వ వాచకం గురించి తిరిగి కవిత్వ భాషలో చెప్పడం. వర్ణనపై వర్ణన అన్న మాట. ఈ పద్ధతిలో కూడా విశ్లేషణ ఉండదు. వర్ణనామయ వాక్యాల్లో విశ్లేషణకు అవసరమైన పదాలు, వ్యాఖ్యలు ఉంటే ఉండొచ్చు.

బిఎస్ రాములు రాసిన ఈ వ్యాసం మొదటి వరుసలో నిలబడుతుంది. అందులో కొంత విశ్లేషణ ఉన్నప్పటికీ వివరాలే ప్రధానం. ఇప్పుడు చాలా మంది సాహిత్య విమర్శకులు ఇట్లాగే రాస్తున్నారు కాబట్టి ఇది బిఎస్ రాములు సమస్య మాత్రమే కాదు.

దీని వల్ల ఒక ఇబ్బంది ఉంది. నిర్దిష్ట వాచకానికి ఉన్న అర్థాల విశ్లేషణ కొరబడుతుంది. ఒక రచనను తీసుకుంటే దానిలోని అంతర్గత నిర్మాణాన్ని, అది సాహిత్యంగా రూపొందిన తీరును విశ్లేషించవచ్చు. ఒక రచయిత మొత్తం కృషిని కూడా ఒక చారిత్రక యుగావధిలో భాగంగా చూసి వస్తు, దృక్పథ చర్చ చేయవచ్చు. మార్క్సిస్టులు ఈ ఆవరణనే ఎన్నుకుంటారు.

ఈ పని చేయలేకపోయినా, తక్కువ చేసినా వాచకాన్ని ఉటంకించడం తప్పనిసరవుతుంది. ఎంత ఉటంకిస్తూ పోయినా ఆ పని ఎక్కువ సేపు కుదరదు కాబట్టి ఇష్టమైన రచన అయితే పొగడ్త, ఇష్టం లేకపోతే తెగడ్తలోకి వెళ్లిపోవాల్సి వస్తుంది. అందుకే మనకు విమర్శ అంటే ప్రశంస అని లేదా వ్యతిరేకించడం అనే అర్థాలే నికరంగా తేలాయి.

బిఎస్ రాములు వ్యాసంలో విశ్లేషణ పాలు తగ్గడం వల్ల సహజంగానే ప్రశంస ఎక్కువైంది. వివి కవిత్వాన్ని సుమారు 50 ఏళ్ల విప్లవ కవిత్వ వికాసంలో భాగంగా చూడాలి. ఆ వికాసంలో ఎందరో కవుల పాత్ర ఉన్నది. వాళ్లు చేసిన ప్రయోగాలు ఉన్నాయి. అనేకానేక విప్లవోద్యమ, సామాజిక ఉద్యమ, చారిత్రక రాజకీయార్థిక సందర్భాల వ్యక్తీకరణలు కలగలసి ఉన్నాయి. దీర్ఘకాలంగా సృజనాత్మక కలాపంలో ఉండే వాళ్లు వీటన్నిటి మధ్య తమదైన ముద్ర నిలబెట్టుకుంటూ కొనసాగుతారు. విస్తరిస్తుంటారు. ఎవరినైనా, ఏ రచననైనా ఇలా చూస్తే వస్తుగత విశ్లేషణ పెరుగుతుందని నమ్మవచ్చు. అలాకాక విమర్శలో ప్రశంస కనిపించే కొద్దీ చురుకైన పాఠకులకు సందేహాలు మొదలవుతాయి. అది విమర్శకుల సామర్థ్యం మీద, సంవిధానం మీద కూడా ప్రసరిస్తే విమర్శ నిర్వహించే సామాజిక, కళా కర్తవ్యాలు దెబ్బతింటాయి.

- పాణి

కూడుకున్నదీ.

సాహితీ జగత్తులో ఆయన దృష్టి ప్రసరించని అంశమింకా జన్మించలేదని ప్రతీతి. రాష్ట్రం నలుమూలల్నుంచీ అనేకమంది యువ వర్ధమాన కవులు, రచయితల్ని తనకి చాతనైన అన్ని మార్గాల్లో చివరి వరకూ ప్రోత్సహించిన ఆయన రాష్ట్రంలోని అన్ని సాహిత్య కళా సాంస్కృతిక ప్రజా ఉద్యమాలన్నింటా తనదైన ముద్ర వేసేలా 'సోమసుందర్ లిటరరీ ట్రస్ట్' స్థాపించి భావితరాలకి కూడా స్ఫూర్తినందించే ఏర్పాటు చేయడం ఆయనలోని సాహిత్య పిపాసకి నిదర్శనం. యుద్ధమంటూ వస్తే ఎదుటివారు ఎంతటివారైనా సరే, సో.సు. నిర్మాణాత్మక అక్షర పోరాటం ముందు లొంగిపోయి ఆత్మవిమర్శ చేసుకోవాల్సిందే. తప్పుని తప్పుగా, ఒప్పుని ఒప్పుగా సూటిగా చెప్పే సో.సు. అధ్యయనం ఒక అసిధారావ్రతం. తొంభై సంవత్సరాల వయసు వచ్చినా రోజులో ఎక్కువ భాగం సాహిత్యాధ్యయనానికే కేటాయించే ఆయనకి ఎంతో మంది ప్రముఖులు శిష్యులవడం ఆశ్చర్యం అనిపించదు. 'After a great storm, a little lull begins'అంటూ తన చేరాతతో రాసిచ్చిన ఆత్మకథ గ్రంథాన్ని చూసుకున్నప్పుడల్లా అనిపిస్తుంది, సాంఘిక చైతన్యాన్ని నాలో ఎలా కలిగించారో. డామ్ మోరిస్ మై సన్స్ ఫాదర్' నుంచి నెరుడా 'మెమొయిర్స్' దాకా, జూలియస్ ఫ్యూజిక్ 'నోట్స్ ఫ్రమ్ గేలోస్' నుంచీ గోర్కీ 'చైల్డ్‌హుడ్, మై యూనివర్సిటీస్' వరకూ నా చేత ఎన్ని విలువైన గ్రంథాలు చదివించారో. సో.సు. గారి భార్య రవణమ్మ గారు చేసిన సేవని ప్రస్తావించకపోతే ఇది పూర్తి కాదు. ఆవిడ జీవించుండగా ఆయనకి చేసిన సేవలు వేటికీ సాటిరావు. ఆయనెప్పుడూ గోర్కీ జీవితం గూర్చిన సినిమాలో గోర్కీకి వాళ్ళ మామ్మ చెప్పిన వాక్యాన్నొకదాన్ని చెబుతుండేవారు. బహుశా నా జీవితంలో నన్నత్యంత ఎక్కువగా ప్రభావం చేసిన వజ్రం లాంటి వజ్రాయుధ వాక్యమది. స్వేచ్ఛగా, స్వతంత్రంగా, సత్యాన్వేషణా దృష్టితో జీవించాలనుకునే ప్రతి ఒక్కరికీ అదో ప్రమాణవాక్కు. మనల్ని మనం తెల్సుకోడానికి మరొకరి చైతన్యాన్ని ముసుగుగా ధరించొద్దని బోధించే మహనీయ వాక్యమది. అది

"Never Hide Behind Anothers Consciousness"

జాతి వ్యతిరేక ఆవు

షహీదా

రెండు రోజులుగా ఎర్రటి ఎండను కూడా లెక్కజేయకుండా నడుస్తున్నానేమో నాలో ఉన్న కాస్త శక్తి కూడా ఉడిగిపోయింది. ఇక ఈ రాత్రికి పూర్తిగా ఆరామ్ చేస్తే గానీ నడవలేను. అయినా అంత త్వరగా పోవాల్సిన పని కూడా నాకేముంది? నాకెవరున్నారు? నేను చేసేదేముంది?

ఇలా అనుకోగానే నా కళ్లల్లో నీళ్లూరాయి. అమ్మ గుర్తొచ్చింది. అమ్మ గుర్తు రావటం ఏంటి? మర్చిపోతే కదా. అమ్మ గుర్తొచ్చి ఒంటరిగా అనిపించింది అనబోయి గుర్తొచ్చింది అన్నట్టున్నా.

కానీ కతకడానికి ఏమైనా దొరికినా దొరకకున్నా కొద్ది నీళ్లయితే తాగక తప్పదు. నాలుక పిడచకట్టుకుపోతోంది. ఎదురుగా కాలిబాట కనిపిస్తోంది. దాన్ని పట్టుకుని పోతే నాలుగు చుక్కలు దొరుకుతాయేమో. మొరాయిస్తున్న కాళ్లను ఎలాగో యీడుస్తూ బైల్దేరాను.

ఒక బోరింగు కనిపించగానే ప్రాణం లేచొచ్చింది. ఇది మా ఊర్లోలాగే యెండిపోయిందో? లేక నీళ్లున్నాయో? ఆత్రుతగా, ఆశగా దానికేసి నడిచాను. అప్పుడే ఒక పాప బిందె పట్టుకొని దానికేసి రావడం చూసి ఆశ చిగురించింది.

నేను దగ్గరకు చేరేవరకూ ఆ పాప తన చిన్ని చేతుల్లోని శక్తినంతా పెడుతూ బోరింగు నుండి నీళ్లను బైటకు లాగే ప్రయత్నం చేస్తోంది. కొట్టిన ప్రతిసారీ ఎత్తు సరిపోక బోరింగుకు వేలాడపడిపోతోంది. కానీ నీళ్లు రావడం లేదు. తను తెచ్చిన బిందెలోంచి కొన్ని చుక్కలు బోరింగులో పోసి మళ్లీ కొడుతోంది.

నేను ఆశగా చూస్తూ నిల్చున్నాను ఓపిగ్గా.

"మాకే నీళ్ల దొరక్క చస్తున్నాం. నీకెక్కడ దొరుకుతాయే తల్లీ," అని నాతో అంటూనే కొడుతోంది. పాపకు ఆయాసం వస్తోంది. మొత్తానికి నాలుగేసి చుక్కల చొప్పున నీళ్లు రావడం మొదలైంది. బిందె నిండడానికి ఎంతసేపు పట్టిందో. నేనలాగే కూలబడి ఓపిగ్గా ఎదురుచూస్తున్నాను.

"బుజ్జిముండా, తెల్లగా, నల్ల నల్ల కళ్లతో, చిన్ని ముట్టెతో ఎంత ముద్దుగా వున్నావో, ఎత్తుకుపోదామనిపిస్తోంది, కానీ నీకు యివ్వడానికి మా యింట్లో నీళ్లు, గడ్డీ ఏమీ లేవే, సరే దా ఈ నీళ్లు తాగుదువు," అంటూ ఆ కొద్ది నీళ్లలోంచే కొన్ని నీళ్లు నాకు తాపించింది. కృతజ్ఞతగా చూశాను.

పాప నా వీపంతా ఆప్యాయంగా నిమిరింది. అమ్మ నన్ను నాకినంత సంతోషంగా తోచింది.

"కాటుక కళ్లు," అంటూ నా కళ్లు చూసి మురిసింది. బిందెనెత్తుకుని వెనుతిరిగింది.

కాస్సేపు అలాగే చూస్తూ నుంచున్నాను.

ఇక్కడ వుండి ఏం చేస్తాను అనిపించి నేనూ పాప వెనకాలే నడవడం మొదలెట్టాను. ఇంటికి వెళ్లేదాకా పాప నన్ను చూసుకోలేదు. చీకటి వడుతుండడంతో ఇండ్లల్లో చిన్న చిన్న దీపాలు వెలుగుతున్నాయి.

"సీతా, వచ్చావా?" అంటూ పాప వాళ్లమ్మ కావచ్చు బైటికొచ్చి బిందె దించింది.

నన్ను చూసి, "ఇదెక్కడి నుంచి వచ్చింది?" అని అడిగింది ఆశ్చర్యంగా.

సీత వెనక్కి తిరిగి, "నా వెనకాలే వచ్చావా? అమ్మా, బోరింగు దగ్గర దాహంతో పడి వుంటే కాసిని నీళ్లిచ్చాను. వెనకాలే వచ్చింది, ఎంత ముద్దుగా వుందో కదా?" అంది నన్ను నిమురుతూ.

"తనకు దూర కంత లేదు, మెడకో డోలు అన్నట్టు దీన్నేం చేసుకుంటాం?" అంటూ నన్ను పట్టించుకోకుండా ఆమె బిందె తీసుకుని పోయింది. పాప నన్ను నుదుటి మీద ముద్దు పెట్టుకుని తనూ లోపలకి పోయింది. నేనక్కడ ఓ పక్కన కూలబడ్డాను. వీళ్లింట్లో పశువులు లేనట్టున్నాయి. ఒక్క గడ్డిపరక ఆ వసారాలో దొరికతే ఒట్టు.

నా చిన్ని జీవితంలో ఆకలి నాకేం కొత్త కాదు కనుక అలాగే కూచున్నాను. రేపు ఉదయాన్నే లేచి పోదాం, చూద్దాం 'రేపు'లో ఏం వుందో, అదే కదా నడిపించే ఆశ అనుకున్నా. కండ్లు మూతలు పడుతున్నాయి.

అలికిడికి మెలకువ వచ్చి చూస్తే సీత వాళ్లమ్మ తపేలా నా ముందు పెట్టి నా వీపు నిమురుతోంది. తపేలాలో నీళ్లలో కొంచెం అన్నం వుంది. ప్రాణం లేచి వచ్చినట్టయ్యి ఇక ఆవిడకేసి కృతజ్ఞతగా ఓ చూపు విసరడం కూడా మర్చిపోయి అదంతా తినేశాను. తపేలా అంతా నాకేశాను చివరి నీటి బొట్టును కూడా విడవకుండా. తిన్నాక తలెత్తి చూశాను. ఆమె నాకేసి దయగా, బాధగా చూస్తోంది.

"ఏం కాలం వచ్చి పడింది. మూడేళ్లుగా వర్షాలు లేవు, పంటలు లేవు, నీళ్లు లేవు, దాణా లేదు, ఎట్ల బతుకుతాయి యివి, మనుషులమైతే ఆత్మహత్యలైనా చేసుకోగల్గుతాం, పాపం ఇవేం చేస్తాయి, రైతులు సాకలేక వదిలేస్తే ఇలా దిక్కులేకుండా తిరుగుతున్నాయి," అని తనలో తనే గొణుక్కుంటూ తపేలా తీసుకుని లోపలకు పోయింది.

'కరువు లేని ప్రాంతానికి చేరాలంటే నేనింకా ఎంత నడవాలో ఏంటో,' అనుకునేలోగానే నిద్ర వచ్చేసింది.

ఉదయాన్నే లేచి మళ్లా నడక మొదలెట్టాను.

"వాళ్లూ వీళ్లూ అనుకుంటున్న మాటల్ని బట్టి చుట్టుపక్కల అంతా కరువే వుందిరా చిన్నాడా, నువ్వు చాలా దూరం వెళితే గానీ కనీసం బతకడానికి నాలుగు నీటి చుక్కలూ, రెండు గడ్డి పరకలూ దొరికేలా లేవు. ఎంత కష్టమైనా సరే వలస పోతేనే బతుకుతావు. నా

జీవితం ఇక చివరకొచ్చింది. మనల్ని చంటిపిల్లల్లా చూసుకునే మన రెహ్మాన్ భాయి ముందే ఎప్పుడో ఉరేసుకున్నాడు. మన యజమానురాలు పిల్లల్ని పట్టుకోని పుట్టెడు దుఃఖంతో పుట్టింటికి పోయింది. మనకిక ఈ ఊర్లో ఏం మిగల్లేదు. వెళిపోరా చిన్నాడా..."

అమ్మ కొనవూపిరితో అన్న మాటలే పదే పదే గుర్తుకొస్తున్నాయి. నేను అమ్మ నొదిలి పోనని మొరాయించాను. అమ్మ నన్ను తరిమినంత పని చేసింది. వలస పోతున్న ఊరోళ్ల వెనకాతలే పొమ్మని తరిమింది. కానీ నేను అమ్మను వదల్లేదు. అమ్మ దొరికిన నాలుగు గడ్డి పరకలూ నాకే పెట్టి నన్ను బతికించి తను చనిపోయింది. ఎండిపోయి నెర్రెలు పడ్డ చెరువులో మిగతా పశువుల కళేబరాల్లో అమ్మదీ ఒకటైపోయింది. చచ్చిన పశువుల్ని లాగేసేవాళ్లూ, చర్మాలు ఒలిచేవాళ్లూ కూడా ఎవరూ లేరు. వాటి దగ్గర కనిపిస్తే 'ఆవుని చంపేరనే' పేరుతో ఎవరో ప్రాణాల్ని తీస్తారని భయపడి ఎవరూ ఆ ఛాయలకే రావడం లేదు. మా ఊర్లో జరగలేదు గానీ దగ్గర్లో ఎక్కడో అలా జరిగిందని చెప్పుకుని భయపడ్డారు. ఆ కళేబరాలు అలాగే కుళ్లి మట్టిలో కలిసిపోతున్నాయి. అమ్మా అంతే....

అందరూ వలస పోయి ముసలోళ్లు తప్ప మిగలని మా ఊరిని వదిలి నేను ఒంటరిగానే బయల్దేరాల్సి వచ్చింది. అయినా నేను బాధపడలేదు. అమ్మ దగ్గర చివరి దాకా ఉన్నానని సంతృప్తిపడ్డాను.

నడుస్తూనే వున్నాను. దారంతా మా ఊరి లాంటి పరిస్థితే కనిపిస్తోంది. అలా ఎన్ని రోజులు నడిచానో నాకు లెక్క తెలీలేదు. దారిలో సీత లాంటివాళ్లు కలిసినప్పుడు ఏదో కతికాను. లేనప్పుడు పస్తులు పడుకున్నాను. ఈ నేల మీద ఇంకా సీత లాంటి వాళ్లు వుండబట్టే ప్రపంచం నడుస్తోందని నాకు నమ్మకం కుదిరిపోయింది. తిండి లేకున్నా ఏ బోరింగు దగ్గరో కడుపు నిండా నీళ్లు తాగి పడుకునే పరిస్థితి ఒకప్పుడు వుండేదట. ఇప్పుడదీ లేదని జనాలు వాపోడం నా చెవిన పడుతూనే ఉంది.

అలా, అలా చివరికి ఒకరోజు ఒక నగరం చేరుకున్నాను. మా అమ్మ చెప్పింది నాకు నగరాల గురించి. అమ్మ ఎప్పుడూ అలాంటి నగరాల్ని చూసినామె కాదు. కానీ అక్కడ్నుంచి మా ఊరివాళ్లు కొనుక్కు వచ్చిన కొన్ని గిత్తలు ఉండేవి. అవి నగరాలు ఎలా వుంటాయో మా ఊరి పశువులన్నిటికీ వర్ణించి వర్ణించి చెప్పి ఉన్నాయి. వాటి నుండి విన్న విషయాలన్నీ మా అమ్మ నాకు చెప్పింది. ఇవన్నీ చెపుతూ అమ్మ నాకేసి చాలా విషాదంగా చూస్తూ వుండేది.

నా చిట్టితల్లి అంత పెద్ద నగరాల్లో, అంతమంది మనుషుల మధ్య ఎన్ని తిప్పలు పడుతదో అనే భావం నాకు మా అమ్మ కళ్లలో కనిపించేది. నాకు భయం కంటే కూడా వాటిని ఎప్పుడు చూస్తానా అని కుతూహలంగా వుండేది. దాణా, నీళ్లూ పూర్తిగా దొరకడం మానేశాక అదంతా ఏం లేకుండా పోయింది. ఇప్పుడిక నాకు తెలీకుండానే నా అడుగులు ముందుకు పడుతూ ఈ నగరానికి చేరుకున్నాను గానీ చిన్నప్పటి కుతూహలం అంతా ఏం లేకుండా నిర్వికారంగా, ఆకలిదప్పులతో ఆ నగరంలోకి అడుగు పెట్టాను.

తొలిచూపులోనే నాకు నగరం అంటే వికారం పుట్టింది. అంతా దుమ్మూ, ధూళి, మురికి, ఈగలు, దోమలు, పొగ వదుల్తూ తిరిగే చక్రాల బండ్లూ, కింయ్యి మంటూ వాటి చప్పుడూ, ఎటు చూసినా ఆకాశం కింద పడిపోతుందేమో అన్నంత కంగారుగా ఉరుకుతున్న మనుషులూ....అబ్బే మా ఊరి ముందు పూర్తిగా దిగదుడుపే. దీన్నేనా ఆ గిత్తలు అంతగా వర్ణించి చెప్పింది...ఛ...

కడుపు నకనకలాడుతోంది. చూస్తే ఇక్కడ సీతలు దొరికేలా కూడా అనిపించలేదు. అలాగే ఆ వీధుల్లో పడి నడవసాగాను మావోళ్లు ఎవరైనా కనిపించకపోతారా అన్నట్టు.

"ఏయ్, ఏ వూరు మన్ది?" అన్న అరుపు వినబడ్డంతో ఉలిక్కిపడ్డాను. అటు, ఇటు చూస్తే ఎవరూ కనిపించలేదు.

"ఇటూ," అనడంతో అటు చూశాను. మురికిలో మురికిగా కలిసిపోవడంతో గుర్తుపట్టలేకపోయానని అర్థమైంది.

"సలాం పెద్దమ్మా, అక్బర్‌పూర్ నుండి వస్తన్నా," అన్నాను సంతోషంగా.

"అంత దూరం నుండి ఒక్కదానివే వచ్చావా? చూస్తే చిన్నపిల్లలా వున్నావు?"

అంత ఆప్యాయంగా అడిగేవరకూ నాకు దుఃఖం ఆగలేదు. పెద్దమ్మ కంగారుపడి, "సరే, సరే, ఏమన్నా తిన్నావా, లేదా?" అని అడిగింది. తల అడ్డంగా ఊపాను.

"నాతో రా," అని ఒక కూరగాయలమ్మే మండీకి దగ్గర్లో చెడిపోయిన కూరగాయలన్నీ పారేసే చెత్తకుప్ప దగ్గరకు తీసుకుపోయింది. అసలే ఖాళీ కడుపు, ఆ కంపుకు నాకు వాంతికొచ్చినట్టయ్యింది. కానీ పెద్దమ్మకదేం పట్టలేదు. ముట్టెతో అటూ, ఇటూ కుళ్లగించి మురిగిపోయిన కొన్ని కూరగాయలు అవీ లాగి నా ముందు పెట్టింది. నేను అలాగే చూస్తుంటే,

"ఇక్కడ యింతకంటే నవనవలాడే గడ్డీ గాదం ఏం మనకు దొరకవు, నగరం యిది, అలవాటు పడు," అంది కొంచెం సానుభూతిగా.

ఆకలి అన్నిటినీ జయించింది. ఆ తర్వాత కొన్ని కాయితాల్లాంటివి కనిపిస్తే లాగి తినబోయాను. వెంటనే పెద్దమ్మ వాటిని లాగేసి,

"నీలాంటి పిల్లోల్లు తినాల్సినవి కావు, ప్లాస్టిక్ అంటారు దీన్ని, పొరపాట్న కూడా తినకు, తింటే ఇగో నాలాగా అయిపోతావు," అంది తన పొట్ట కేసి చూపిస్తో. అప్పుడు గమనించాను పొట్టంతా ఉబ్బిపోయినట్టుగా వుంది.

"మరి నువ్వెందుకు తిన్నావు?" అడిగేశాను చనువుగా.

"ప్రమాదం అని తెలిక, ఆకలికి తట్టుకోలేక," అంది. "సరే, నీ కతేంటో చెప్పు ముందు."

నేను నా కతంతా ఏదీ మర్చిపోకుండా చెప్పాను. పెద్దమ్మ ఏమాత్రం ఆసక్తి లేకుండా మెల్లగా నెమరువేస్తూ విన్నది.

"ఊ, కొత్త విషయమేం లేదు, రోజూ వింటున్నదే, రెండేళ్ల క్రితం నా కతనే నువ్వు చెప్తున్నట్టుగా వుంది. సరే ఇవాళటికి నాతోనే వుండు. నీ సంగతి రేపు ఆలోచిద్దాం," అంది.

నేను సంతోషంగా తలూపాను. అమ్మ చనిపోయాక యిన్నాళ్లకు ఆదరణ దొరికింది. రోజంతటిలో చెత్తకుప్ప దగ్గరకు మళ్లో రెండు ట్రిప్పులేశాం. ఎక్కడికో తీసుకుపోయి మురికినీళ్లే తాగించింది. ముక్కు మూసుకుని అదీ తాగేశాను. అలా నగరంలో నా మొదటి రోజును ముగించి పడుకున్నాను.

ఉదయాన్నే నాకు బేదులయినయి.

"కొన్నాళ్లకు అలవాటు పడతావులే," అంది పెద్దమ్మ. ఇంతలో, "ఏటి పెద్దమ్మా, కబురంపావు?" అనుకుంటూ ఒక ఎర్రావు వచ్చింది.

"ఎర్రోడా, నీకో చిన్న చెల్లి దొరికింది. కాస్త తీసుకపోయి నగరం తిప్పి మన విషయాలవీ నేర్పు, నాకు వయసయిపోయింది. ఇయ్యాల్లో, రేపో అన్నట్టుంది, నువ్వే చూసుకో చెల్లిని," అంది పెద్దమ్మ.

నేను చిన్నబోయి నడుస్తుంటే ఎర్రావు, "అంత బాధపడమాకు, మన ఆవు బతుకులింతే, ఊర్లల్లో కరువుతో చచ్చిపోతున్నాం, ఇక్కడ ప్లాస్టిక్ తిని, మురుగు నీళ్లు తాగి చనిపోతున్నాం," అంది వేదాంతంగా.

"అంతేనా, మనల్ని పట్టించుకునేవాళ్లు యింత పెద్ద ప్రపంచంలో ఎవరూ లేరా?" అడిగాను ఆవేదనగా.

"ఎందుకు లేరు? అగో ఆ బవిరి గెడ్డపాడిని సూడు, రోజా పొద్దుగూకులూ మనకు మైకుల్లో యినిపించేది ఈడి గొంతే, యినీ, యినీ చెవులు తుప్పట్టిపోతున్నాయి, ఎదవగోల," అంది ఎర్రావు కోపంగా, వ్యంగ్యంగా.

చూస్తే గోడల నిండా ఒకే ఒకాయన కనిపించాడు, బవిరి గెడ్డంతో. ఆయన చేతిలో మా వూరి చెరువులో పూసే తామర పువ్వులాంటి పువ్వు వుంది.

ఎర్రావు ఆ బొమ్మలన్నిటినీ కసిగా నాలుకతో లాగేస్తూ కసాపిసా నమిలేస్తోంది. 'నువ్వూ కానియ్' అన్నట్టు చూసింది. నేనూ మొదలెట్టాను తినడం. వాటి వెనక వాటిని అంటించడానికి వాడిన పదార్థాన్ని నాకుతూ, మెల్లగా కాయితాలు తినడం అలవాటు చేసుకున్నాను. ఆకలి తీరాక అడిగాను "ఏటీ, ఈయన కత," అని.

"ఈ దేశంలో ఊర్లూ, రైతులూ ఏం లేకుండా చేస్సి అంతా నగరాలు కట్టేసి, జనాభానంతా నగరాలకి ఈడ్చేయాలని ఈయనగారి కల. ఈ దేశం మనుషులు ఆయన్ని తమ పెద్దగా ఎన్నుకున్నారు కనుక ఆయనిక యిప్పుడు తన కలను నెరవేర్చుకోవడం కోసం పగలూ, రాత్రీ పని చేస్తన్నడు," చెప్పింది ఎర్రావు.

నేను విస్తుపోయ్యాను. "ఛీ, మొత్తం అందర్నీ యిలాగ బతకమంటాడా?" అన్నాను చుట్టూ నగరాన్ని అసహ్యంగా చూస్తూ.

"అందరూ యిలగెందుకుంటారు? వీళ్లలో డబ్బులున్నోల్లు సుఖంగా వుంటారు, మిగతావోల్లంతా ఇలాగ మురికిలో బతుకుతే వాల్లు మేడల్లో సుఖంగా వుంటారన్నమాట," వివరించింది ఎర్రావు.

"మరి మనమూ?" అన్నా ఆందోళనగా.

"రైతే లేకుండా పోయాక ఇక నువ్వేటి, నేనేటి, అధోగతే," అంది ఎర్రావు నిరాశగా.

"ఇంతకీ దేశం అంటే ఏటి, డబ్బంటే ఏటి, అది అందరి దగ్గరా ఎందుకుండదు?" అడిగాను.

"మన ఆవులకి లేని బాధ ఈ మనుషులకిదొటి వుందిలే. ఎవరికి వాళ్లు కొంత నేలని వుంచేసుకుని, గీతలు గీసుకుని ఇది మా దేశం అంటే ఇది మా దేశం అనుకుంటారు. అనుకుంటే అనుకున్నారు, ఎవరికి వాళ్లు బతకొచ్చు కదా, మా దేశం గొప్పంటే మా దేశం గొప్ప అని కొట్టుకుచస్తారు, కొన్నాళ్లుంటే నీకూ అర్థం అవుతుందిలే వీళ్ల దేశభక్తి అదీ. ఇక వీళ్లకి డబ్బు అంటే కొన్ని కాయితాల్లాంటివి వుంటాయి, అదేటో నాకూ అర్థం కాలేదు కానీ నేను చూసినదేటంటే బాగా కష్టపడేవోళ్ల దగ్గర ఆ కాయితాలుండవు, కష్టపడనివాళ్ల దగ్గర అవి చాలా వుంటాయి, వాటితో వాళ్లు అన్నీ సుకంగా అనుబగిస్తుంటారు," చెప్పింది ఎర్రావు ఓపిగ్గా. ఆ కాయితాలు వాడుతున్న మనుషుల్ని చూపించింది.

మా రెహ్మాన్ భాయి దగ్గర ఆ కాయితాలు ఒకసారి చూసినట్టు గుర్తుకొచ్చింది నాకు. పంటకు గిట్టుబాటు ధరలు వుండట్లేదని ఏడుస్తుండె వాటిని పట్టుకుని. మా ఆవులకు ఈ దేశాలూ, డబ్బులూ ఏమీ లేనందుకు నాకు చాలా సంతోషంగా తోచింది. నాకు తెలిసి మాకందరికీ ఒకే ప్రపంచం ఎక్కడ వున్నా గానీ, మా ఆవులమంతా ఒకటే, సమానమే ఏ ప్రాంతం వాళ్లమైనా. సరిహద్దులు లేని, డబ్బులు లేని ఆవు లోకం నాకు ఎంత అందంగా తోచిందో. నయ్యం! వీళ్ల పద్ధతులు నేర్చుకోలేదు.

అలా నగరంలో చాలా గల్లీలు తిప్పి ఇలాంటివే ఏవో మనుషుల విషయాలు చెప్పుకొస్తూ నా జ్ఞానాన్ని పెంచింది ఎర్రావు. మేం చీకటి పడుతుండగా పెద్దమ్మ దగ్గరకి తిరిగి వెళ్లేసరికి అక్కడంతా మనుషులు గుమిగూడి వున్నారు. ఎర్రావు, "భయపడ్డంతా అయ్యింది," అన్నది ఆ మధ్యలోకి దూరి వెళ్లి చూసొచ్చి.

"ఏం జరిగింది?"

"ప్లాస్టిక్ తినీ, తినీ విషమైపోయి మన పెద్దమ్మ చనిపోయింది, బతికున్నప్పుడు ఒక్కడూ పట్టించుకుని ఇంత గడ్డిగాదం పెట్టింది లేదు గానీ ఇప్పుడు వచ్చి ఆసుపత్రికి తీసుకుపోతున్నారు, థూ, ఈ మనుషులు," కళ్లల్లో నీళ్లు కారుతున్నాయి ఎర్రావుకి. నేనూ ఏడ్చేశాను. పెద్దమ్మ వెనకాలే ఆసుపత్రి దాకా వెళ్లి అక్కడే బైట నుంచున్నాం.

కొంతసేపటికి, "పొట్ట నిండా కిలోల కొద్దీ ప్లాస్టిక్కేనట, పాపం," అనుకుంటూ జనాలు పోతున్నారు.

నాకు ఒక్కక్షణం అక్కడ వుండబుద్ధి కాలేదు. "పోదాం పా," అని ఎర్రావును లాక్కునిపోయాను.

* * *

ఎర్రావూ, నేనూ మంచి దోస్తులమయ్యాం. ఇప్పుడిక మేం కలిసి తిరగడం లేదు, రాత్రికి మాత్రం కలిసి ఒకేచోట నెమరేసుకుంటున్నాం. అలాంటప్పుడు ఒకోసారి ఎర్రావు భలే తత్వాలు బోధించేది.

"చిన్నా, ఈ ప్రపంచంలో ఏమాత్రం ఎవులికీ ఉపయోగపడని జంతువు ఏదన్నా వుంటే అది మనిషే అన్పిస్తది నాకు," అనేది.

"ఎందుకు?" అంటే

"ఈ ప్రకృతిలో చూడు చెట్టూ, చేమా, పువ్వూ, పుడకా, పక్షులూ, జంతువులూ, పురుగులూ అన్నీ ఏదో ఒక వక్కదానికి ఉపయోగపడతాయి, అవి మళ్లీ వీటికీ లేదా పక్కాటికీ...అలా. ఎవులికీ ఉపయోగపడనిది మనిషే, అందర్నీ ఉపయోగించుకుంటాడు. మన జంతుజాతుల్లో గానీ, చెట్టూ చేమల్లో గానీ ఏది లేకపోయినా ప్రపంచంలో వేరేవాటికి ఏదో ఒక నష్టం జరుగుతాది, ఈ మనుషులు లేకుండా పోతే మాత్తరం ప్రపంచానికి ఏటీ నష్టం వుండదు, చూడు కావాలంటే," అనేది.

ఇంకెప్పుడైనా, "ఈ మనుషులు ఎవరైనా చెడ్డ పనులు చేసేవోల్లని పశువులు అని తిడుతుంటారు, కానీ మన పశువులకి వున్న నీతి ఆల్లకు వుందా? మనం ఎప్పుడైనా మన తోటి పశువులకు అన్యాయం చేసిందుందా?" అనేది. ఇలాగే ఏవో తత్వాలు...పాపం

మనసులో చాలా బాధ వుంచుకుని కూడా పగలంతా నవ్వుతూ తిరిగేది.

మేం వుండేది పాత నగరం అంట. నాకు పాత నగరం మీద మాంచి పట్టు వచ్చేసింది. ఏది ఎక్కడ దొరుకుతుందో తెలిసిపోయింది. అప్పుడప్పుడూ మా రెహ్మాన్ భాయ్ లాంటి రైతులు కూరగాయలకు ధర రాక అక్కడే ఎత్తేసి పోయేవారు. అలాంటప్పుడు మాకు మంచి కూరగాయలు దొరికేవి. నిజానికి మా రెహ్మాన్ భాయి కూడా ఉరేసుకోవడానికి ఒక రోజు ముందు టమాట వేసిన పొలంలోకి మమ్మల్ని తోలి పంటంతా మాకే తినబెట్టాడు. రాత్రిపూట ఒంటరిగా ఉన్నప్పుడు అవన్నీ గుర్తుకొస్తే బాధగా తోచేది. ఎర్రావు చెప్పింది నిజమే, రైతు బాగుంటే మేమూ బాగుంటాం. రైతును మట్టికొట్టుకుపోయేలా చేస్తున్న ఆ గడ్డపోడి మీద చాలా కోపం వచ్చేది.

* * *

ఎప్పుడూ పాతబస్తీలోనే ఏం తిరుగుతాం అని నేను కొత్త నగరం వైపు వెళ్లాను ఓరోజు. ఎర్రావు జాగ్రత్తలు చెప్పింది.

"నువ్వు తెలుసుకుంటానంటే నేను ఆపను గానీ అక్కడంతా డబ్బులున్నోళ్లు, రాజకీయ నాయకులు, పోలీసులూ, ఎర్రబొట్టోళ్లు అందరూ వుంటారు, జాగ్రత్తగా వుండు," అని హెచ్చరించింది.

అలా నడుస్తుంటే ఒక దగ్గర ఒక కర్రావు కట్టేసి కనిపించింది. దాని దగ్గరే ఒకాయన బల్ల మీద కూచుని వున్నాడు. ఆయన కాళ్ల దగ్గర కొన్ని గడ్డి కట్టలు వున్నాయి. చాలా రోజుల తర్వాత పచ్చగడ్డి చూసి నోరూరింది నాకు.

"హాయ్," అని పలకరించాను ఆ కర్రావుని. నగరంలో తిరిగీ, తిరిగీ నా భాష కూడా మారింది కొంత.

"హలో," అంది కర్రావు దీనంగా.

"పచ్చగడ్డి తింటూ కూడా అంత దిగులేంటమ్మా," అన్నాను.

"నీకేం తెలుసు నా బాధలు, చూస్తుండు," అంది. నేను గెడ్డపోడి పోస్టర్ ఒకటి లాగి మెల్లగా నములుతూ గమనించసాగాను. వీటికి మాత్రం కొదవ లేదు.

ఒకతను వచ్చి, ఆ బల్ల మీద కూచున్నతనికి కొన్ని డబ్బు కాయితాలిచ్చి ఒక గడ్డి కట్టను తీసుకుని కర్రావు ముందేసి ఆవుకి దండం పెట్టాడు.

"గోమాతా, నాకు ఉద్యోగం దొరికేలా చేయి తల్లీ నీకు పది గడ్డికట్టలు సమర్పించుకుంటాను," అని దీనంగా వేడుకున్నాడు. ఆవు ఆత్రుతగా గడ్డిని కొరకడం మొదలెట్టింది. అతను వెనక్కి తిరిగి నాలుగడుగులు వేశాడో లేదో, ఆ బల్ల మీది మనిషి ఆ గడ్డి కట్టను లాగేసుకున్నాడు. మళ్లీ ఎవరొచ్చి గడ్డి కొంటారో అన్నట్టు చూస్తూ కూచున్నాడు.

"చూశావుగా," అంది కర్రావు.

"ఏటి నీ కత?" అడిగాను సానుభూతిగా. దొరకనే పోతే అదో రకం, నోటి కాడిది లాక్కుంటే అది భరాయించడం మహా కష్టం అని నాకు అర్థమైంది.

"అంతా గెడ్డపోడూ, వాడి తొట్టి గ్యాంగూ చేస్తున్న పనే," అంది కసిగా. కాస్సేపు పళ్లు నూరి, "ఈ గెడ్డపోడు అందరికీ ఉద్యోగాలు యిచ్చేస్తాను అని తెగ ఊదరగొట్టేస్తే వెర్రి జనం ఓట్లేసి గెలిపించేశారు. అప్పుడు చాలామంది ఉద్యోగాలు దొరుకుతాయని సంబరంగా వచ్చి గడ్డి వేసి మొక్కుకుని పోయేవాళ్లు. రెండేళ్లు కూడా కాకుండానే అదంతా గ్యాసేనని అర్థమై ఎవడూ రావడం లేదు, నాకు గడ్డి లేదు. ఇంకోపక్క కరువు వుందనీ, గడ్డి మహా ప్రియం అయిపోయిందని మా యజమాని ఇగో యిలాగ నా కడుపు మాడ్చేస్తున్నడు," వాపోయింది ఆవు.

ఇంతలో ఆ బల్ల మీది వ్యక్తి నాకేసి అదే పనిగా చూడ్డం గమనించి, "చెల్లీ, ఎళిపో, లేకుంటే మా యజమాని నన్ను పట్టుకున్నట్టే నిన్నూ పట్టుకుని కట్టేస్తాడు," అని తొందరపెట్టింది.

"నిన్ను తప్పిస్తాను," అన్నాను.

"అంత సులభం కాదులే, ముందు ఎళిపో అంటుంటే," అంది అసహనంగా కర్రావు. అతను బల్ల మీంచి లేవడంతో నేను గబగబా అక్కడ్నుంచి ముందుకెళిపోయాను.

అలా తిరుగుతుంటే, ఒక దగ్గర కొంతమంది ఎర్రబొట్లు పెట్టుకున్న మనుషులు ఒక పెద్ద భవనం ముందు, "ఆవుని జాతీయ జంతువుగా ప్రకటించాలి, లేకుంటే ఈ విషం మింగేస్తాం," అని అరుస్తున్నారు.

పక్కనో ఆవుని అడిగితే, "అది కలెక్టరాఫీసు, జనాలు వాళ్ల డిమాండ్లతోని ఇక్కడకొచ్చి యిలగే గొడవలు చేస్తుంటారు," అని చెప్పింది. ఇంతలో ఒకతను విషం తాగి చచ్చిపోయాడు.

"ఈళ్లకు మనమంటే ఇంత ప్రేమా? ప్రాణాలు కూడా యిచ్చేస్తున్నరు?!" అన్నాను ఆశ్చర్యంగా.

"ప్రేమా, దోమా? అదో పిచ్చి, గెడ్డపోడి గ్యాంగు ఈళ్లకి ఉద్యోగాలు యివ్వలేక ఇదుగిలాటి పిచ్చి అంతా ఎక్కిస్తుంది, ఈళ్లు అది ఎక్కించుకుని ఇలగైపోతుంటారు. ప్రాణాలు ఇవ్వడం తక్కువే, ప్రాణాలు తీయడం ఎక్కువ మన పేరు మీద. ఛీ, మనకెంత అవమానం!" అందా ఆవు.

"మన పేరు మీద ప్రాణాలు తీయడం ఏటి, తీసుకుంటే వాళ్ల పేరు మీద వాళ్లని తీసుకోనీ, వాళ్లకెలాగూ యుద్ధాలు చేసుకుని చంపుకోవడం అలవాటేనటగా," అన్నాను కోపంగా.

"అదే కదా, ఎవరో మేక మాంసం తింటే ఆవు మాంసం తిన్నాడని అబద్దాలు చెప్పి ఆయన్ని చంపేశారు. ఇంకెవరో పశువుల్ని అమ్ముకోడానికి తీసుకెల్తుంటే ఆవుల్ని చంపేస్తున్నారని పుకారు పుట్టించి చంపేశారు. చిన్నపిల్లాడని కూడా చూడకుండా చంపేశారు. నాది కలెక్టరాఫీసు బీటే, రోజు ఇలాంటి విషయాల మీద జనాలు ఇక్కడ ధర్నాలు గట్రా చేస్తుంటారు, వాళ్ల మీద కూడా మళ్లీ ఈ ఎర్రబొట్టోళ్లు దాడులు చేస్తుంటారు," చెప్పింది కలెక్టరాఫీసు ఆవు.

నాకు మాట రాలేదు.

"నిజంగా ఈళ్లకి మన మీద ప్రేమ వుంటే మనం ఇలా దిక్కులేకుండా పెంటకుప్పలు కుళ్లగించుకుంటూ ఎందుకు తిరుగుతున్నాం? కరువులో గడ్డీ, నీళ్లూ లేక ఎందుకు చచ్చిపోతున్నాం? మనం బాగుండాలంటే రైతుల బాధలు తీర్చాలి, వాళ్లు బాగుంటేనే మనమూ బాగుంటాం, వాళ్లే మనల్ని చంటిపిల్లల్లా సాకేది," అచ్చం ఎర్రావులాగే మాట్లాడింది ఈ కలెక్టరాఫీసు ఆవు కూడా. నేను తలాడించి అక్కడ్నుంచి కదిలాను.

అలాగే ఆ గెడ్డపోడి పోస్టర్లు ఒకటీ, అరా నములుతూ తిరిగాను. కొత్త నగరంలో ఎక్కడా ఒక్క చెట్టు లేదు, వర్షం పడితే ఒక్క చుక్క

నీరు నేలలోకి ఇంకకుండా అంతా సిమెంటు, కాంక్రీటే ఎటు చూసినా. నోరెండుకుపోయిన భూమి తల్లికి కోపమొస్తే ఈళ్ల పని మటాషే. కలెక్టరాఫీసు దగ్గర మాత్రం ఎప్పటిదో గానీ ఒక చెట్టు వుంది కనుక అటిటు తిరిగి అక్కడికే చేరుకుని ఆ చెట్టు కింద కూచుని నెమరేస్తున్నా. ఇంతలో కొంతమంది యువకులు వచ్చి ఒక ప్లాస్టిక్ ఆవులో గాలి నింపి దాన్ని అందరికీ కనిపించేలా ఎత్తుగా ఎగరేయడానికి ప్రయత్నిస్తున్నారు.

ఎక్కడ్నుంచి వచ్చారో ఎర్రబొట్లవాళ్లు వచ్చేసి వాళ్లతో తగువు పెట్టుకున్నారు, "ఆవును అవమానిస్తారా?" అంటూ.

"అవమానించడం కాదు, ప్లాస్టిక్ తిని ఆవులు చనిపోతున్నాయి కదా, జనాలందరికీ ఈ విషయంలో చైతన్యం పెంచాలని ఇలా ప్రచారం చేద్దామనుకున్నాం." వాళ్లు ఎంత మొత్తుకుని చెప్తున్నా ఈ బొట్టోళ్లు పట్టించుకోవడం లేదు. వాళ్ల మీద దౌర్జన్యం చేస్తున్నారు. మరోవైపు కొంతమంది వాళ్ల నుంచి లాక్కున్న ప్లాస్టిక్ ఆవుకి దండలు వేసి, బొట్లు పెట్టి మొక్కుతున్నారు. నాకు పెద్దమ్మ గుర్తొచ్చి చాలా బాధ, ఆవేశం కలిగాయి.

'దొంగనాయాల్లారా, మా పెద్దమ్మ ఇలగే సచ్చిపోయిందిరా, దాని గురించి వాళ్లేదో ప్రచారం చేస్తామంటే మీకేందిరా తెగులు? అమ్మ పెట్టదు, అడుక్కు తిననివ్వదు అన్నట్టు మీరేందిరా మా ఆవుల ప్రాణానికి. మా ఉసురు తగిలి మీరూ ప్లాస్టిక్ తిని, ప్లాస్టిక్ తాగి, ప్లాస్టిక్ లోనే మునిగి సస్తార్రా,' మా పల్లెటూరి తిట్లూ, నగరంలో నేర్చుకున్న బండబూతులన్నీ మనసులో తిడుతూ లేచాను.

ఆ ఆవేశంలో మా అమ్మ చెప్పిన జాగ్రత్త మర్చిపోయి మనుషుల భాషలో, "వదలండిరా ఆళ్లని," అని అరిచేశాను. ఒక్కసారిగా అంతా నిశ్శబ్దమైపోయింది.

అలా అరిచింది ఎవరా అని చూశారు ఆ బొట్లోళ్లు. అక్కడ నేను తప్ప ఎవరూ కనిపించలేదు. నన్ను అనుమానంగా చూస్తున్నారు. చెట్టు మీదకు చూశారు, అక్కడా ఎవరూ లేరు. ఇక మాట్లాడింది నేనే అని వాళ్లకి అర్థమైపోయింది.

"మాట్లాడే ఆవురా, మన నాయకుడికి చెప్తే చాలా సంతోషిస్తాడు, తీసుకుపోదాం," అంటూ వచ్చేసి నన్ను పట్టేశారు.

"నీకు మనుషుల భాష వచ్చని ఎవరికీ తెలీనివ్వకు, ప్రమాదం," అని అమ్మ చెప్పిన మాట విననందుకు ఎంత పశ్చాత్తాపపడితే మాత్రం ఏం లాభం? ఎర్రావు కూడా 'జాగ్రత్త అక్కడి మనుషులతో' అని హెచ్చరించింది పాపం. వినలేదు నేనే, దొరికిపోయాను వీళ్లకు.

"రేపు మన నాయకుడు వస్తున్నాడు కదరా, ఈ మాట్లాడే ఆవుని స్టేజి ఎక్కిస్తే ఫుల్లు ప్రచారం మనకు. విదేశాల్నుంచి నల్లధనం తెచ్చి మనిషికి పదిహేను లక్షలిస్తానన్నావు ఏదీ, ఉద్యోగాలన్నావు ఏవీ, నీళ్లు కావాలి, పప్పుల ధరలు తగ్గించు అని నానా రకాల డిమాండ్లతో మన నాయకుడిని ప్రశ్నించాలని ప్రజలు తయారవుతున్నారని ఇంటలిజెన్సు వచ్చిందట. ఈ మాట్లాడే ఆవుని స్టేజి ఎక్కిస్తే జనాలు అవన్నీ అడగడం మానేసి దీన్నే చూస్తారు, మన నాయకుడి మీటింగుకి ఇంకేం ఢోకా వుండదు. ఆయనకు యిష్టమున్నంత సేపు ఒర్లి పోవచ్చు," అంటున్నాడు వాళ్లలో ఒకడు.

దాంతో ఆ నాయకుడు గెడ్డపోడే అని అర్థమైంది నాకు. పొద్దుగూకులూ మైకుల్లో యిన్న గోల సరిపోదా, నేరుగా మళ్లీ యినాలా అనుకునే వరకూ నాకు నీరసం వచ్చేసింది. ఎలా తప్పించుకోవాలో తెలీడం లేదు.

నన్ను ఒక పెద్ద తోటలోకి తీసుకెళ్లారు. ఆ లోపల ఒక పెద్ద షెడ్డు వుంది. అందులో చాలా ఆవులున్నాయి. అన్ని ఆవుల్ని ఒక దగ్గర చూసి ఆశ్చర్యపోయాను. నన్ను కూడా తీసుకెళ్లి వాటి దగ్గర కట్టేసి కొంత గడ్డి పడేశారు నా ముందు, పక్కనే గోలెంలో కొన్ని నీళ్లు పోశారు.

"తిని తొంగో, రేపు మీటింగులో మాట్లాడాలి నువ్వు, ఎక్కువేం అవసరం లేదు, మన నాయకుడు మన దేశాన్ని ప్రపంచంలోకెల్లా గొప్ప దేశంగా మార్చేస్తాడు అని సర్టిఫికెట్టు ఇవ్వు సరిపోతుంది, నాయకుడు మనకు దేవుడిచ్చిన వరం అని కూడా ఓ మాట చెప్పు మొన్న నాయుడు బావ చెప్పినట్టు," అన్నాడు ఒకడు.

"దేశాలూ, దేవుళ్లూ మీకు, మా ఆవులకు దేశాలు లేవు, దేవుళ్లూ లేరు, దేశభక్తులూ లేవు," అన్నాను, మనసులో 'అదృష్టవశాత్తూ' అనే మాటను చేర్చుకుని.

"ఇగో, జాగ్రత్తగా యిను, ఇంకే జంతువులన్నా ఏమో గానీ ఆవులు అస్సలుకే అలా అనకూడదు, మీది ఈ పవిత్ర భారత దేశమే, మీకు దేశభక్తి దండిగా వుండాల్సిందే, అసలు నువ్వే దేవతవు, నువ్వు దేవుళ్లు లేరంటే ఎలా? అర్థమైందా? వందేమాతరం!!!" బెదిరించినట్టుగా అన్నాడు ఒకడు.

వాడు వందేమాతరం అని అరిచిన తీరుకు గుండె గుభేలుమంది. పైకి మాత్రం బింకంగా,

"మీరు చెప్పినట్టు చెప్పకపోతే?" అడిగాను ధిక్కారం వినిపించేలా.

"తాట ఒలుస్తాం," వీపు మీద ఒక్కటి చరిచి పెద్దగా నవ్వుతూ వెళిపోయారు వాళ్లు.

ఆవులన్నీ నన్ను ఆశ్చర్యంగా, ఆసక్తిగా చూస్తున్నాయి. ఆలోచించుకోవడానికి రాత్రంతా వుందిలే, ముందు వీటి కతేంటో అడుగుదాం అని అడిగాను.

"ఇదో గోశాల. ఆవుల్ని కాపాడ్డం కోసం కట్టారు. ఎవరైనా సంతల్లో అమ్ముకోవడానికి ఆవుల్ని తీసుకెళ్తుంటే ఆ ట్రక్కుల్నుండి ఆవుల్ని దొంగిలించేసి ఇలాటి గోశాలల్లో సాకుతుంటారు. ఇంకెలాగ తెస్తారో నాకు తెలీదు, నన్నయితే అలాగే తెచ్చారు. నన్ను తెచ్చినప్పుడైతే ఆ ట్రక్కు నడిపే అబ్బాయిలు 'చంపడానికి కాదు బాబులూ, వ్యవసాయం పనుల కోసం కొత్తెద్దుల కోసం సంతలో అమ్ముకోవడానికి పోతున్నాం' అని ఎంత చెప్పినా వినకుండా ఇద్దర్ని నరికేశారు కూడా," చెప్పింది పక్కావు.

అమ్మో, మనుషుల్నే చంపారంటే నా తాట ఒలుస్తానన్నది ఒట్టి బెదిరింపు కాదన్నమాట.

"కానీ మీరంతా ఇంత బక్కగా వున్నారేంటి, సాకుతామని తెచ్చి మంచి గడ్డి కూడా పెట్టడం లేదా?" అడిగాను.

"అంతా వుత్తదే. మార్వాడీలని వుంటారు, బాగా డబ్బులున్నోల్లు, వాళ్ల పుణ్యం కోసం గోశాలలు నడిపిస్తుంటారు, ఇది అలాంటిదే. గొప్ప చెప్పుకోవడానికే గానీ మనల్ని పట్టించుకునేదుండదు. మొన్నెవడో ఒక బాబా అంట వచ్చాడు గోమూత్రంతో ఏవో చేస్తాను, పేడతో ఇంకేదో చేస్తాను అని. మన మూత్రాన్నీ, పేడనీ మందుగా

ప్రకటించాలనీ, కిలో పేడకి ఐదు రూపాయలివ్వాలనీ డిమాండ్ చేస్తూ ఉద్యమం చేస్తారట. ఆ లాభాలన్నీ లెక్కలేసుకుంటున్నారు. మాకు కడుపు నిండక, ఇక్కడ్నుంచి తప్పుకుని పోయే మార్గం లేక ఇలా పడున్నాం," అంది పక్కావు దిగులుగా.

"బైటకు పోయినా పరిస్థితి అంత బాగా ఏం లేదులే," అని నా కత, నగరంలో నా అనుభవాలు అన్నీ కొంచెం క్లుప్తంగానే వివరించాను.

"మన ఆవు బతుకులు యింత అధ్వాన్నం అయిపోయాయే," అని ఇద్దరం కాసేపు విచారించి ఎవరికి వాళ్లం నెమరేసుకుంటూ కూచున్నాం.

నాకు ఎందుకో ఆ గెడ్డపోడిని పొగడాలంటే కారం రాసుకున్నట్టుగా వుంది. మా రైతుల్నీ, మమ్మల్నీ ఇన్ని బాధలు పెడ్తున్న వీడికి సర్టిఫికెట్టు ఇస్తే, అందులోనూ ఒక ఆవు యిస్తే ఇంకేమన్నా వుందా, వాడికి పట్టపగ్గాలు వుంటాయా? ఎర్రావు, కర్రావు, పక్కావు, కలెక్టరాఫీసు ఆవు, మా అమ్మ, పెద్దమ్మ అన్నీ నాకు చెప్పిన విషయాలన్నీ బుర్రలో తిరుగుతున్నాయి. ఇంతలో,

"మాట్లాడే ఆవు నువ్వేనా?" అంటూ ఒక యువకుడు రహస్యంగా అడుగుతూ నా ముందు ప్రత్యక్షమయ్యాడు.

"నేనే, కానీ ఇన్ని ఆవుల్లో నన్ను ఎలా గుర్తుపట్టావు? నువ్వు ఎవరసలు?" గద్దించాను.

"నేనో విలేకరిని. నిన్ను పట్టినవాళ్లు తాగేసి గొప్పలు చెప్పుకుంటూ వుంటే విన్నాను. తెల్లగా, కాటుక కళ్లతో భలే అందంగా వుంది కదరా అని వాళ్లు నిన్ను వర్ణిస్తా వుండినారు. అలా పోల్చుకున్నాను," అన్నాడతను నా పక్కనే సెటిలైపోతూ.

"ఇంతకీ ఏం నిశ్చయించుకున్నావు? గెడ్డపోడికి సర్టిఫికెట్టు ఇద్దామనేనా?" అడిగాడు అనుమానంగా.

"నీ సలహా ఏటి?" ఎదురు ప్రశ్న వేశాను ఇతగాడేందో తెలుసుకుందామన్నట్టు.

"చచ్చినా ఇవ్వకు."

ఫర్వాలేదు మనోడే అని నమ్మకం కుదిరింది.

"ఎందుకు?" అడిగాను ఆసక్తిగా.

"దేశాన్ని తూకానికి అమ్మేస్తున్నాడు," అన్నాడు.

"ఎవరికి?"

"వేరే దేశాల డబ్బున్నవాళ్లకు, మన దేశంలో పెద్ద పెట్టుబడిదారులకు, పెద్ద జమీందార్లకు..."

"అదేంటీ దేశభక్తి వుంటే వేరే దేశాలకు ఎలా అమ్ముతాడు?"

"దేశభక్తా, పాడా. అది లేదని కప్పి పెట్టుకోడానికే ఈ దేశభక్తి అరుపులు. రేపు మీటింగులో జనాలు వాడిని గట్టిగా ప్రశ్నించాలని తయారవుతున్నారు. కరువుతో, నీళ్లు లేక అల్లాడుతున్నారు, నువ్వు సర్టిఫికెట్టు ఇస్తే వాళ్ల పోరాటానికి అన్యాయం చేసినట్టవుతుంది," అన్నాడు వేడుకున్నట్టుగా.

"తాట ఒలుస్తామన్నారు," అన్నాను.

"నీకా భయం లేదు, గోహత్య మహాపాతకం వాళ్లకు. అందుకని చంపరు, కాపోతే కొట్టచ్చు, అరెస్టు చేయచ్చు, దేశద్రోహం కేసు పెట్టొచ్చు, అయితే గోమాతవు కనుక యివి కూడా రహస్యంగానే చేయాల్సి వుంటుంది. ఆహా, లేదులే, ఏం చేయరు నిన్ను, ఏమన్నా చేస్తే వాళ్ల గోమాత ప్రచారానికి దెబ్బయిపోతుంది కదా," అన్నాడు నవ్వుతూ.

నేను ఊపిరి పీల్చుకున్నాను.

"ఇగో నువ్వు మాట్లాడదల్చుకున్నది ధైర్యంగా మాట్లాడేయ్. నేను విలేకరుల్లో వాడి డబ్బులకు లొంగని మా గ్యాంగునంతా వేసుకొస్తాను. ఎలాగూ వాడికమ్ముడుపోయిన పేపర్ల వాళ్లు నిజాలు రాయరు. మేం విడియోలు తీసి సాక్ష్యాలతో సహా నిజాలు బైటపెడతాం, పేపర్లలో వేయకపోయినా ఇంటర్నెట్లో అప్‌లోడ్ చేస్తాం, ఈమధ్య ఇదో మార్గం దొరికింది మాకు. ప్రజలకు నిజం తెలిస్తే తిరగబడతారు ఆదివాసుల్లాగా."

"ఆదివాసులా?"

"ఆ, అడవుల్లో వుంటారు. వాళ్లొకళ్లే ఈ గడ్డపోడికి వ్యతిరేకంగా గట్టిగా పోరాడుతున్నారు, వీని మాటలకు మోసపోకుండా," అన్నాడు.

విలేకరి మాటల్తో నాకు కొంచెం ధైర్యం వచ్చింది. సర్టిఫికెట్టు ఇవ్వను అని అతనికి హామీ యిచ్చాను. అతను సంతోషంగా వెళిపోయాడు చాలా పనుందంటూ.

* * *

ఉదయాన్నే ఎర్రబొట్టోళ్లు వచ్చి నాకు మంచిగా స్నానం చేయించారు. నా నుదుటన కూడా ఎర్రబొట్టు పెట్టారు. నాకు చిరాగ్గా తోచినా సహనం వహించాను.

"ఆలోచించుకున్నావా?"

తలూపాను. అంటే వాళ్లు చెప్పినట్టే మాట్లాడ్తాను అని అర్థం చేసుకున్నారు వెర్రోళ్లు.

మీటింగు చోటుకెళ్లి చూద్దును కదా ఇసకేస్తే రాలనంత జనం. విలేకరి కోసం వెతికాయి కళ్లు. స్టేజి దగ్గరే కెమెరా పట్టుకుని వున్నాడు. నన్ను చూసి కుడిచేయి బొటనవేలు పైకెత్తాడు. అంటే ఏటో తెలీకపోయినా నేనూ తలూపాను ధైర్యంగానే వున్నాను అన్నట్టుగా. కానీ అంతమంది జనాన్ని చూశాక నాకు కొంచెం కంగారుగా తోచింది.

స్టేజి ఎక్కించి నాకోసం ప్రత్యేకంగా కట్టిన గద్దె మీద కూచోబెట్టారు. ఎవరెవరో వచ్చి నా మెడలో పూలదండలు వేసి మొక్కిపోతున్నారు. నాయకుడు రాగానే అతని అనుచరులంతా కుడిచేయిని చాచి, రెండు కాళ్లూ దగ్గరగా తాటించి అతని పేరు పిచ్చెత్తినట్టుగా అరవసాగారు. నాకు తలవాచిపోయినట్టవుతోంది.

ఈ గోలంతా అయ్యి చివరికి నాకు మాట్లాడే అవకాశం దొరికింది. నా ముందో మైకు పెట్టారు. నా దోస్తు విలేకరి తన దోస్తు విలేకరులతో పూర్తి సన్నద్ధంగా వున్నాడు నేను చెప్పేవన్నీ రికార్డు చేయడానికి. అతను చెప్పిన 'అమ్ముడుపోయిన విలేకరులు' ఎలాగూ పెద్ద సంఖ్యలో వున్నారు.

"ప్రియమైన ప్రజలారా! అస్సలామాలేకుం!" అన్నాను.

ఒక్కసారిగా అంతా నిశ్శబ్దమైపోయింది. నాయకుడు నన్ను పట్టుకొచ్చిన ఎర్రబొట్టోళ్లను ఉరిమి చూశాడు. ఎర్రబొట్టోళ్లంతా అంత ఉగ్రంగా నాకేసి ఎందుకు చూస్తున్నారో నాకు అర్థం కాలేదు. మా రెహ్మాన్ భాయి ఎవరినైనా అలాగే ప్రేమగా పలకరించేవాడు. ఒకడు నా గద్దె వెనకాలకొచ్చి,

"వందనాలు అను, నమస్కారాలు అను, భారత మాతా కీ జై

అను, ఇంకేమైనా అను, అస్సలామాలేకుం ఏంటి, తాట వలుస్తా," అన్నాడు నాకు మాత్రమే వినిపించేలా.

"వందనాలు, నమస్కారాలు, భారత మాతా కీ జై, " అన్నాను. ఎర్రబొట్టోళ్లు కాస్త నెమ్మదిపడ్డారు.

"నాకు ఈ అవకాశం కల్పించినందుకు ఇక్కడి నిర్వాహకులందరికీ ధన్యవాదాలు. నాది ఈ నగరం కాదు. చాలా దూరం అక్బర్‌పూర్ మా ఊరు. మా అమ్మ చెప్పింది, అక్కడ ఒకప్పుడు పచ్చగా ఉండేదట. నీళ్లూ, చెట్టూ చేమా పుష్కలంగా వుండేవట. పేదలకు భూములు లేకున్నా కనీసం నీళ్లూ, పనీ దొరికేవట. కొన్నేండ్ల క్రితం అక్కడ ఇనుప గనులు తవ్వడం మొదలెట్టారు. ఆ తర్వాత నుండి మాకు చాలా కష్టాలు మొదలయ్యాయి. కొన్ని సంవత్సరాల్లో అక్కడ భూమిలో నీళ్లు లేకుండా పోయినాయి. దానికి తోడు వర్షాలు లేవు, అంతా కరువు. ఆ కరువులోనే మా యజమాని రెహ్మాన్ భాయి ఉరేసుకున్నాడు, రైతులందరూ తమ పశువుల్ని పోషించలేక వాటి మానాన వాటిని వదిలేశారు. అలా మా అమ్మ కూడా తిండీ, నీరూ లేక తీసుకుని, తీసుకుని చచ్చిపోయింది...."

ఎవడో వెనక నుంచి, "ఈ ఏడుపు మాటలన్నీ ఎందుకు, నాయకుడి గురించి మాట్లాడు," అని పాములా బుసకొట్టాడు. స్టేజి మీద వున్న వాళ్లందరూ ముఖాలు చూసుకుంటున్నారు, అసహనంగా వున్నారు. నన్ను ఎలా ఆపాలా అని ఉపాయాలు వెతుకుతున్నారు. ఖాకీ బట్టలు వేసుకున్నవాళ్లు మెల్లగా కమ్ముకొస్తున్నారు. వాళ్ల చూపులు చాలా క్రూరంగా వున్నాయి. అంతమంది జనం మాత్రం సూది పడితే వినిపించేంత నిశ్శబ్దంగా నేను చెప్పేది వింటున్నారు.

"దాంతో నేనూ, నాలాంటి చాలా పశువులూ పొట్టకూటి కోసం వలసదారి పట్టాం. నేనూ మీ ఈ నగరానికి వచ్చాను. ఇక్కడా మా ఆవుల పరిస్థితి అధ్వాన్నంగానే వున్నది. మా పెద్దమ్మ ప్లాస్టిక్ తిని చనిపోయింది, మా కర్రావులూ, ఎర్రావులూ అన్నీ పెంటకుప్పల మీద బతుకుతున్నాయి."

ఇక లాభం లేదనుకున్నట్టున్నారు, మెల్లగా ఎర్రబొట్టోళ్లు నా చుట్టూ మూగసాగారు. ఇక ఎక్కువసేపు మాట్లాడనివ్వరని అర్థమైంది.

"ప్రజలారా! మా గోవులకు దేశాలూ, సరిహద్దులూ ఏమీ లేవు. కానీ మీకు అవన్నీ వున్నాయి. మీ నాయకుడు మీ దేశాన్ని చాలా ముందుకు తీసుకుపోతాను అని మీ అందరికీ చెవినిల్లు కట్టుకుని చెప్తున్నాడు. కానీ రైతులు ఆత్మహత్యలు చేసుకునే దేశం ఎలా ముందుకు పోతుంది? మాకు దేవుళ్లూ, దేవతలూ లేరు, కానీ మీరు గోమాత అంటూ మాకు పూజలు చేస్తున్నారు. పూజలు కాదు, గడ్డీ, నీళ్లూ కావాలి. రైతును ఆదుకుంటేనే దేశమూ ముందుకు పోతుంది, గోమాతకూ ఆదరువు దొరికి బతుకుతుంది..."

నేనింకా మాట్లాడుతూ వుండగానే నా మైకు ఆపేశారు. నేను కనబడకుండా ఒక పేద్ద మూడు రంగుల జెండాను అడ్డంగా ఊపసాగారు. ఆ జెండా వెనక ఖాకీబట్టలోళ్లు, ఎర్రబొట్టోళ్లు అంతా నన్ను కమ్ముకున్నారు. నన్ను గద్దె మీంచి దింపేసి స్టేజి వెనక్కి లాక్కుపోతున్నారు. ప్రజలంతా, "గోమాతను మాట్లాడనివ్వాలి, మాట్లాడనివ్వాలి" అని పెద్దెత్తున నినాదాలు చేస్తూ స్టేజి వైపుకు దూసుకొస్తున్నారు. అంతా గందరగోళంగా మారిపోయింది. నాయకుడిని భద్రమైన చోటుకు తరలిస్తున్నారు. జనాల ఆవేశం కట్టలు తెంచుకుంటోంది.

ఆ తర్వాత ఏమైందో నాకు తెలీదు, ఎందుకంటే నన్ను వేగంగా అక్కడి నుండి ఓ బందెలదొడ్డికి తరలించేశారు. కొద్దిసేపటి తర్వాత నన్ను ఖాకీబట్టలోల్ల ఆఫీసుకు తీసుకుపోయారు, అక్కడంతా ఖాకీలు ఫోనుల్లో మాట్లాడుతూ, హడావుడిగా అటూ, ఇటూ తిరుగుతూ కనిపించారు. నన్ను వాళ్లంతా చాలా అనుమానంగా చూస్తున్నారు.

వాళ్లు నా ఉపన్యాసాన్ని పదేపదే వింటున్నారు, నేను మాట్లాడిన ఒక్కో మాటనూ తీసుకుని నన్ను ప్రశ్నించడం మొదలెట్టారు.

"అస్సలామాలేకుం అని ఎందుకు మొదలుపెట్టావు, నీకు ఏ ముస్లిం టెర్రరిస్టు గ్రూపుతో సంబంధాలు వున్నాయి? పాకిస్తాన్ ఎన్నిసార్లు పోయి వచ్చావు? లేక నేరుగా ఇస్లామిక్ స్టేట్‌తో సంబంధాలా?"

"రెహ్మాన్ భాయి మా యజమాని అన్నావు అంటే అతనే మీ టెర్రరిస్టు గ్రూపుకు నాయకుడా? ముంబయ్ మాఫియానా? కశ్మీరు వేర్పాటువాదా? లేక ఐఎస్ఐతో సంబంధాలున్నాయా? "

"ఎర్రావు నీకు ఎప్పట్నుంచి పరిచయం? మీరు ఎక్కడెక్కడ కలిశారు, ఏమేం కుట్రలు పన్నారు?"

"నువ్వు తెల్లగా వున్నావు, కర్రావుతో నీకేం పని? కర్రావు బృందంలో ఎంతమంది సభ్యులున్నారు? వాళ్ల పేర్లేంటి?"

"మాకు దేశాలు లేవన్నావు? అంటే నువ్వు కమ్యూనిస్టువా? ఏ కమ్యూనిస్టు పార్టీలో నీకు సభ్యత్వం వుంది?"

"రైతుల ఆత్మహత్యలతో దేశం ముందుకెలా పోతుందన్నావు? అంటే నువ్వు మావోయిస్టు పార్టీలో సభ్యురాలివా? ఆ పార్టీలో నీకు ఎవరెవరు తెలుసు?"

"దేవుళ్లు లేరన్నావు? నీకు హేతువాద సంఘాలతో సంబంధాలున్నాయా?"

ఇలా నాకు ఊపిరాడకుండా నా ఉపన్యాసంలోని ఒక్కో పదాన్నీ పట్టుకుని ఒకటే ప్రశ్నలు. నేను నిజమే చెప్తూ పోయాను.

నిజానికి నాకు వాళ్లు మాట్లాడే పదాలు చాలా అర్థం కావడం లేదు. కానీ నేను బుకాయిస్తున్నానని వాళ్ల అనుమానం.

"ఎప్పుడైనా యూనివర్శిటీ దిక్కు పోయావా?"

"యూనివర్శిటీ అంటే ఏంటి?" అడిగాను.

పెద్ద ఆఫీసరుకు సర్రుమంటోంది. "నాలుగు తగిలిస్తే గానీ..." అంటూ లేచాడు.

మిగతావాళ్లు పట్టుకుని ఆపారు, "గోమాతను కొట్టొద్దు, తిట్టద్దు అని నాయకుడి ఆర్డర్, బైట 144 సెక్షన్ వున్నా గోమాతను కోర్టులో ప్రవేశపెట్టాలి అని జనం హోరెత్తిపోతున్నారు, వాహనాలు తగులబెడుతున్నారు, అసలే స్టింగ్ రోజులు, ఎవడైనా విలేకరికి తెలిసిందా, అంతే," అన్నారు.

"ఛ, ఛ, ఎలాంటి రోజులు వచ్చాయి, కొట్టకుండా, తిట్టకుండా ఇంటరాగేషన్ ఏంటి?" అని తెగ చిరాకుపడిపోయాడు ఆయన.

"ఆకలవుతోంది," అన్నాను. ఏమాటకామటే చెప్పుకోవాలి, పెంటకుప్పల మీద బతుకుతున్న నాకు మంచి గడ్డే తీసుకొచ్చి పెట్టారు. నాయకుడు చెప్పాడు కామోసు....నేను నింపాదిగా గడ్డి నములుతూ వాళ్ల మల్లగుల్లాలు పడడం చూస్తూ వున్నాను.

ఇంతలో ఇద్దరు పరిగెత్తుకుని వచ్చి, "సార్, సార్, పూరాగా పరిశోధించి వస్తున్నాం. ఎర్రావు, కర్రావు ఇవన్నీ బేవార్సుగా పెంటకుప్పల మీద బతికే ఆవులే సార్, వాటికి ఏ రాజకీయాలు తెలీవు, గోమాత నిజమే చెప్తోంది," అన్నారు.

"ఎక్కడైనా మార్క్స్, అంబేద్కర్ పుస్తకాలు లేదా మావోయిస్టు సాహిత్యం, హేతువాద సాహిత్యం వాటికి నమలడానికి దొరకలేదంటారా? గ్యారంటీనా?"

"గ్యారంటీ సార్, మన నాయకుడి పోస్టర్లతోనే పొట్ట పోసుకుంటున్నాయి రోజూ," అన్నారు కోరస్‌లో.

"ఎంత ఆశ్చర్యంగా వుందీ, నాయకుడి పోస్టర్లు తింటూ కూడా గోమాత ఇంత దేశద్రోహకరంగా, జాతికి వ్యతిరేకంగా ఎలా మాట్లాడింది? ఏ రాజకీయాలూ లేకుండా గోమాత మావోయిస్టుల్లా రైతుల గురించి నిజాలు ఎలా మాట్లాడింది? దీని మీద అధ్యయనం చేసి రిపోర్టు ఇవ్వండి," ఆర్డరేశాడు పెద్ద ఆఫీసరు.

పొట్ట నిండడంతో నాకు నిద్ర వచ్చింది. వాళ్లంతా లావు, లావు పుస్తకాలు ముందేసుకుని అధ్యయనంలో మునిగిపోయి నన్ను కాస్సేపు వదిలేశారు. నేను కునికాను.

"యురేకా," అన్న అరుపుతో ఉలిక్కిపడి లేచాను.

"తెలిసింది సార్, సమస్య అక్కడ లేదు, ఇక్కడ వుంది," అని ఒక కుర్ర ఆఫీసరు తన బుర్రకేసి వేలు చూపాడు.

'చెప్పు' అన్నట్టు చూశాడు పెద్ద సారు.

"మనకిప్పటికే కల్లూరి సిండ్రోమ్ గురించి తెలుసు, అదున్నవాళ్లకు ఆదివాసీ కనిపిస్తే చాలు మావోయిస్టులాగే కనిపించి ట్రిగ్గర్ మీద వేళ్లు తమంత తామే బిగుసుకుపోతాయి. అలాగే మనకు ట్రంప్ సిండ్రోమ్ గురించీ తెలుసు, దీన్నే దేశీయంగా సంఘ్ సిండ్రోమ్ అని కూడా అంటుంటాం, అంటే ముస్లిం కన్పిస్తే చాలు టెర్రరిస్టు లాగ అవుపించి ఒంట్లోంచి పొగలు కక్కుతుంటారు. అంతకు ముందు ప్రభుత్వం నుంచీ ఇవ్వాళటికీ ఏ మార్పు లేకుండా కొనసాగుతున్న మన్మోహన్ సిండ్రోమ్ గురించీ మనకు తెలుసు, అదున్నవాళ్లకు మావోయిస్టు కన్పించక్కరలేదు, ఆ మాట వింటే చాలు మా ఆస్తులకు, భద్రతకు ముప్పు అని ముచ్చెమటలు పట్టి స్పృహ కోల్పోతుంటారు. ఇప్పుడు మనకు యింకో కొత్త సిండ్రోమ్ తగులుకుంది. దీనికేం పేరు పెట్టాలో మనం అనుకోవచ్చు, నేను దీన్ని ఖాకీ సిండ్రోమ్ అంటాను."

"అంటే?"

"కళ్లూ, చెవులూ, బుద్ధీ పని చేసే వాళ్లకెవరికైనా దేశంలో ఏం జరుగుతోందో సులభంగానే అర్థం అవుతుంటుంది. ఉదాహరణకు గోమాత మాట్లాడిన రైతు సంగతే తీసుకుందాం. రైతు పరిస్థితి ఇదీ అని తెలవడానికి మావోయిస్టు రాజకీయాలు అవసరం లేదు, బుర్రా, బుద్ధీ వుంటే సరిపోతుంది. కానీ మనం చాలా ఏండ్లుగా మావోయిస్టు ఉద్యమాన్ని అణచివేస్తూ ఒక భ్రమకు గురై వున్నాం, అంటే నిజాలు మావోయిస్టులు మాత్రమే మాట్లాడతారు అనేది మన బ్రెయిన్‌లో డిఫాల్టుగా ఇన్‌స్టాల్ అయిపోయి వున్నది. అందుకని ఎవ్వరైనా నిజం మాట్లాడితే చాలు మనకు వాళ్లు మావోయిస్టుల్లాగ కనిపిస్తారన్న మాట, దటీజ్ ఖాకీ సిండ్రోమ్," అని గబగబా చెప్పి ఊపిరి పీల్చుకున్నాడు కుర్ర ఆఫీసరు.

"ఐసీ," సాలోచనగా తలూపాడు పెద్ద సారు.

నాకిదంతా చాలా అయోమయంగా వున్నా ఈ మావోయిస్టులెవరో గానీ వాళ్లు చెప్పే విషయాలంటే వీళ్లకు చాలా భయం అని మాత్రం అర్థమైంది. మా ఎర్రావు, కర్రావు లాంటి వాళ్లం మాలో మేం ఎన్ని మాట్లాడుకున్నా అవన్నీ ఉత్తుత్తి మాటలే. రోజూ గెడ్డపోడినీ, వాడి తొట్టి గ్యాంగునూ తిట్టుకోవడం, నిరాశగా తొంగోడం, ఇంతే. మళ్లీ ఉదయం లేచిన కాడ్నుంచీ అదే రొడ్డగొట్టుడు బతుకు. అసలు యిలా రోజూ తిట్టుకునీ, తిట్టుకునీ అలవాటైపోయి యింకేమైనా చేయగలమా అనే ఆలోచనే లేకుండా పోయిందేమో అని ఈ మాటలు వింటుంటే నాకెందుకో అనుమానం వచ్చింది. మా బాధలకి ఏదో మార్గం దొరుకుతున్నట్టుగా తోచింది. దాంతో శ్రద్ధగా వింటున్నా.

"అంతే కాదు సార్, ఈ గోమాతకు గానీ, బేవార్సుగా తిరిగే మన నగరంలోని ఆవులకు గానీ మావోయిస్టులతో సంబంధం లేదు అనేదాన్ని తెలుసుకోవడానికి నేనో ఈక్వేషన్ కూడా కనిపెట్టాను," అంటూ బోర్డు మీద బరబరా గీకాడు. దాన్నిలా చదివాడు,

"వి ప్లస్ వి ఈజ్ ఈక్వల్ టూ ఎం అంటే వాస్తవాలు ప్లస్ వ్యవసాయ విప్లవం ఈజ్ ఈక్వల్ టూ మావోయిజం. అంటే రైతుల పరిస్థితి అధ్వాన్నంగా వుందని తెలవడానికి కళ్లూ, చెవులూ, బుద్ధీ వుంటే చాల్సార్. కానీ ఆ బాధలకి మందు వ్యవసాయ విప్లవం అని తెలిస్తే ఇక వాళ్లు మావోయిస్టులని మనం అనుకోవచ్చు. ఖాకీ సిండ్రోమ్ వల్ల మనకు ఎవరైనా వాస్తవాలు మాట్లాడ్డం మొదలెడితే చాలు వ్యవసాయ విప్లవం దాకా పోతారనే బెదురుతో వాళ్లంతా మావోయిస్టుల్లాగ కనిపిస్తున్నారు. గోమాతకూ, మిగతా ఆవులకూ వ్యవసాయ విప్లవం గురించి ఏమాత్రం తెలీదని మన పరిశోధనలో తేలిపోయింది. రైతుల పరిస్థితి గురించి అదెన్ని మాటలు మాట్లాడినా మనకు నష్టం లేదు, వ్యవసాయ విప్లవం గురించి తెలీనంత వరకూ. మహా అయితే వాస్తవాలు మాట్లాడేవాళ్లను చేసినట్టు మూడు రంగుల జండాకర్రతో నాలుగు బాదచ్చు, దేశద్రోహం కేసు పెట్టొచ్చు లేదా గూండాలకు నల్లకోట్లు తొడిగించి కోర్టుల్లో దాడులు చేయించచ్చు. కానీ గోమాతను అవేవీ చేయద్దని ఆదేశాలు కాబట్టి దీన్ని వదిలేయచ్చు."

ఉపన్యాసంతో అలిసిపోయి కుర్చీలో కూలబడ్డాడు కుర్ర ఆఫీసరు. అక్కడున్న ఖాకీలన్నీ చప్పట్లు కొట్టాయి.

"ఓహ్, వాటే రిలీఫ్! కొట్టకుండా, బూతులు తిట్టకుండా చేతులూ, నోరూ దగ్గర పెట్టుకోవడం నాకు చిత్రహింస లాగా వుంది. వదిలిపారేద్దాం దీన్ని, మావోయిస్టుల అణచివేతలో తీరిక లేని మనకు ఈ బేవార్సు గోవుల కేసుల పనిభారం కూడా మోయడం అంటే చాలా కష్టం," అన్నాడు పెద్ద సారు.

నన్ను వదిలించుకోవడం అనేది ఖాకీలందరికీ చాలా సంతోషాన్నిచ్చింది అని కళకళలాడిపోతున్న వాళ్ల ముఖాలు చూస్తే నాకు అర్థమైంది. గబగబా వచ్చి కొయ్యకు కట్టిన పలుపుతాడు విప్పారు. పెద్ద సార్ లేచి నిలబడి ఎంతో గౌరవంగా ఎవరితోనో ఫోన్లో ఈ విషయాలన్నీ చెప్పాడు.

"ఓకే సార్, ఓకే సార్," అని మెలికలు తిరిగాడు. ఫోన్ పెట్టేసి నాతో,

"ఊ, నువ్వు ఇక నగరంలో వుండడానికి వీల్లేదు, నువ్వంటే మాకు శాంతి భద్రతల సమస్య, కాబట్టి నగర బహిష్కరణ శిక్ష విధిస్తున్నాం. నీకు దిక్కున్న చోటుకు వెళ్లు. కానీ మా భాష వచ్చినట్టుగా ఎవరికీ చెప్పకు, ఇక్కడ మాట్లాడిన విషయాలు ఎక్కడా మాట్లాడకు. అలా చేస్తే జాతి వ్యతిరేక ఆవుగా దేశద్రోహం కేసు మోపుతాం, నువ్వు ఎక్కడ తిరుగుతున్నా నీమీద మా కన్ను వుంటుంది. బుద్ధిగా వుండు," అన్నాడు.

ఖాకీలు నన్ను నగరానికవతల చాలా దూరం తీసుకెళ్లి వదిలిపెట్టి వెళిపోయారు. వెనక్కి తిరిగి చూశాను. నగరంలో చాలా చోట్ల మంటలు ఎగుస్తున్నాయి, వుండీ వుండీ కాల్పుల శబ్దాలు వినిపిస్తున్నాయి. నా దోస్తులందరూ గుర్తొచ్చారు. కానీ నాకెందుకో అంత బెంగగా కూడా లేదు. ఎందుకంటే ఖాకీలు మాటల వల్ల నాకు చాలా కొత్త విషయాలు తెలిసినట్టు అనిపించింది. వాటి సంగతి ఏంటో తేల్చుకోవాలి అని ఏదో కుతూహలంగా, పట్టుదలగా తోస్తోంది. రోడ్డు పట్టుకుని నడవడం మొదలెట్టాను.

ఒక రెండు చక్రాల బండి బుర్రుమని వచ్చి నా పక్కన ఆగింది. విలేకరి.

"నువ్వు చెప్పింది నిజమే, గోమాత అని చెప్పి నాకు మర్యాదలు చేశారు, ఏవో ప్రశ్నలేసి విసిగించారు గానీ కొట్టలే, తిట్టలే, కాస్త మంచి గడ్డి కూడా పెట్టారు, భక్తే" అన్నాను.

"వాళ్లకి నిజంగా ఎంత భక్తో నాకు తెలీదు, కానీ ప్రజలు ఊరుకోరు అని యెక్కువ ఆలోచించి వుండొచ్చు. సరే, నగరం వదుల్తున్నందుకు బాధగా వుందా? ఎటు ప్రయాణం?"

"ఏమో, యెటో అటు పోవాల్సిందే కదా అని నడుస్తున్నాను, అన్నట్టు నన్ను మీ భాష మాట్లాడద్దు అన్నారు."

"ఇక్కడ వినేవాళ్లెవరూ లేరులే. మళ్లెప్పుడు కలుస్తావో, కానీ నువ్వు నిజాలు మాట్లాడి మాకు చాలా మేలు చేశావు, ప్రజలు చేస్తున్న పోరాటానికి మంచి నైతిక మద్దతు దొరికింది, థాంక్స్," అన్నాడు కొంచెం బెంగగా.

"అవునూ, ఇంతకీ ఈ మావోయిస్టులంటే ఎవరు? వ్యవసాయ విప్లవం అంటే ఏంటి? దాని వల్ల రైతులకేమైనా ఒరుగుతుందా? మా ఆవులకి గానీ..."

ఖాకీల మాటల్లో దొర్లిన మిగతా పేర్ల గురించీ అడగాలనుకున్నాను గానీ నోరు తిరగక గుర్తు లేవు. మావోయిస్టులూ, వ్యవసాయ విప్లవం అనేవి మాత్రం చాలాసార్లు వినడం వల్ల గుర్తున్నాయి.

"వ్యవసాయ విప్లవం అంటే చాలా వుంది కానీ నీకర్థం కావాలంటే దున్నేవారికి భూమి, వ్యవసాయం అభివృద్ధి అంటే సరిపోతుంది. అంటే రైతులకీ, ఆవులకీ కూడా మంచిదనే. మావోయిస్టులంటే అడవుల్లో వుండి రైతుల కోసం, కష్టజీవుల కోసం కొట్లాడుతుంటారు," గబగబా చెప్పేసి మళ్లీ నాకేసి అనుమానంగా చూస్తూ, "అయినా నీకెందుకు?" అనడిగాడు.

"ఏం లేదు, ఖాకీలు ఇంకెవరికీ భయపడనంతగా వాళ్లకి భయపడుతుంటే కుతూహలంగా తోచింది. అడవుల్లో వుంటారంటే వీళ్లూ ఆదివాసులా?"

"అంటే ఆదివాసులందరూ మావోయిస్టులు కారు గానీ మావోయిస్టులు చాలామంది ఆదివాసులే."

"ఆదివాసులేం చేస్తారు?"

"వ్యవసాయమే, అడవిలో. అడవి మీద ఆధారపడి బతుకుతుంటారు."

"మావోయిస్టులు చాలామంది ఆదివాసులంటే మరి వాళ్లూ చాలావరకూ రైతులన్నట్టేగా?"

"ఒకరకంగా అంతే అనుకో."

"ఎక్కడుంది వాళ్ల అడివి?"

"వద్దులే, ప్రమాదం. ఎన్‌కౌంటర్ చేస్తారు అంటే కాల్చి పడేస్తారు."

"గోమాతను కూడానా?"

"ఊ, గోవుల్లాంటి రైతుల్నీ, రైతుల్లాంటి గోవుల్నీ వేటినీ వదలరు మావోయిస్టులని అనుమానం వస్తే."

నేను ఏమనలేదు. 'ఆదివాసులందరూ రైతులు, ఆదివాసులే గడ్డపోడి మాటలకి మోసపోకుండా కొట్లాడుతున్నారు, అంటే వాళ్ల ఆత్మహత్యలు చేసుకోవడం లేదు, మావోయిస్టులంటే ఎక్కువమంది ఆదివాసులే అంటే మావోయిస్టులు చాలావరకూ రైతులే', ఇలా రకరకాలుగా మనసులో బేరీజు వేసుకున్నాను. నాకెందుకో ఈ కొట్లాడే-రైతులైన-ఆదివాసులైన-మావోయిస్టులని కలవాలని బలంగా అనిపిస్తోంది. అడివి ఎటు వుందో ఎలాగోలాగ తెలుసుకోవచ్చులే, నగరానికి రాకముందు దారి తెలిసే వచ్చానా ఏంటి అనుకున్నా మనసులో.

"ఆఖరుగా ఏమన్నా చెప్పేదుందా?" అడిగాడు విలేకరి వణుకుతున్న గొంతుతో.

కాస్సేపు ఆలోచించాను. నాకెందుకో ఆవును జాతీయ జంతువును చేయాలని విషం మింగి చచ్చిపోయిన ఆ కుర్రాడు గుర్తొచ్చాడు.

"పేపర్లలో వేయకున్నా అదేదో దాంట్లో పెడతానన్నావు కదా?" అడిగాను.

"ఊ, యూట్యూబ్," అంటూ జేబులోంచి ఫోన్ తీసి, "చెప్పు," అన్నాడు.

"ప్రియమైన ప్రజలారా, మా ఆవులం సాధుజీవులమని మీకందరికీ తెలుసు. నిజానికి మా జంతుజాతిలో క్రూరజంతువులు కూడా ఆకలేసినప్పుడు చంపుతాయి, అంతేగానీ మీలాగ తమ జాతిని తామే చంపుకోవడం, ఎన్‌కౌంటరు చేయడం లాంటివి ఎప్పుడూ చేయవు. అలాంటిది మీరు మా గోవుల పేరు మీద వేరేవాళ్ల ప్రాణాలు తీయడం మాకందరికీ చాలా అభ్యంతరంగా వుంది. మరోపక్క మీలో కొందరు మా పేరు మీద అంటే ఆవును జాతీయ జంతువును చేయాలి లాంటి డిమాండ్ల కోసం ప్రాణాలు కూడా తీసుకుంటున్నారు. మా పేరు మీద వేరేవాళ్ల ప్రాణాలు తీయడం గానీ, స్వంత ప్రాణాలు తీసుకోవడం గానీ చేయవద్దని మీ గోమాతగా చివరి సందేశం యిస్తున్నాను," అని ముగించాను.

విలేకరి రికార్డు చేయడం ఆపి నా మెడను కావలించు కున్నాడు. పాపం కన్నీళ్లు కూడా పెట్టుకున్నాడు. నేను యిటూ, అతను అటూ ఎవరి గమ్యం వైపు వాళ్లం మళ్లాం.

మీ పేరేమిటి?

ఆర్. శశికళ

దసరా శెలవులు ముగిసాయి. శెలవుల మత్తు దిగలేదు. పిల్లలింకా సరిగా రాలేదు. ఆ రోజు శనివారం సాయంత్రం స్టాఫ్ మీటింగని సర్క్యులర్ వచ్చింది. ఇంటర్వెల్ కావటంతో అంతా స్టాఫ్ రూంలో ఉన్నాం. ముచ్చట్లు నడుస్తున్నాయి. సర్క్యులర్ పై సంతకం చేసి వారి మాటలు వింటూనే ఆలోచనల్లో పడ్డాను. 8వ తరగతి అనిల్ "మే ఐ కమిన్ మేడమ్" అడిగాడు. తలూపాను. గసపోస్తూ ఉన్నాడు. ఏంది కత? ఎందుకలా పరిగెత్తావు? అడిగా.

'ఆన్సర్ పేపర్' వకాబ్యులరీ టెస్ట్ పేపర్ మేడం 20/25 వచ్చాయి. సంతోషంతో వెలిగిపోతోంది వాడి మోహం - వెరీగుడ్, అని వ్రాసి సంతకం చేసి మెచ్చుకొన్నాను. పేపర్ చేతిలోకి తీసుకొని పరిగెత్తిపోయాడు. వీడికెప్పుడూ సింగిల్ డిజిట్లోనే అని సుకన్య మేడమ్ ఆశ్చర్యపోయింది. ఆమె వాళ్లకు సైన్స్ టీచర్. విద్యావతి అదెలా సాధ్యం అని!

సాయంత్రం స్టాఫ్ మీటింగ్ నడుస్తోంది. సున్నాలు, ఒకటి, రెండు మార్కులు వచ్చే వాళ్ళంతా కలిపితే 100 మంది తేలారు. 6 నుండి 10 వరకూ అన్ని సెక్షన్లు.

"టైమ్ చాలటం లేదు. వీళ్ళకు రివిజన్ చేయలేకపోతున్నాం. వీళ్ళంతా శుంఠలు. ఎంత చెప్పినా తెలుగే అర్థం కాదు. ఏమైనా ఒకటి రెండు ప్రశ్నలు, పదాలు ఒప్పజెప్పించుకోవాలంటే ఇంటిలిజెంట్స్ గబగబా చెప్పేస్తారు. బెల్ అయిపోతుంది. వీళ్ళు అలాగే మిగిలిపోతున్నారు" అంది విద్యావతి మేడమ్. ఆమె తెలుగు టీచర్.

"ఇంత సిలబస్ ఉంటే ఏం చేయాలి?" సోషల్ సార్.

"పిల్లలు ఇంతమంది? ఎవరిపై దృష్టి పెట్టాలి? పాఠాలే శ్రద్ధగా వినరు. ఇంట్లో హోం వర్క్ చేసుకురారు. ఎలా వీళ్ళను దారిలో పెట్టాలి" సైన్స్ టీచర్ సుకన్య.

"కొంత మంది శుంఠలుంటారు. వాళ్ళను ఇండ్లల్లో కూడా పట్టించుకోరు. నిర్లక్ష్యం అంటే చాలా నిర్లక్ష్యం. ఎట్లా చేయాలి. ఎన్ని సార్లు రిపీట్ చేసినా మరచిపోయామంటారు?" విద్యావతి టీచర్.

ఇలా అంతా రివ్యూ చేశాక ఇక నా వంతు వచ్చింది.

"నేనూ మీలానే ఎన్నో వంకలు వెతుకుతూనే వెళ్ళాను ఇదివరకు. పిల్లలపై తప్పంతా నెట్టేశాను. క్లాసులో పాఠం అర్థమయ్యేలా చెప్పేదాన్ని. ఏం అర్థమయిందో తిరిగి చెప్పమంటే ఒకరిద్దరు తప్ప ఎవరూ నోరు కదిపే వారు కాదు. ఇంగ్లీషు టీచర్ కావటంతో నా పని ఇంకా ఇబ్బందిగానే ఉండేది. కనీసం 10 పదాలు + అర్థాలు నేర్చుకొని వచ్చి అప్పజెప్పమనేదాన్ని. ఒక వారమంతా అడిగినా వృథా ప్రయాస. ఏ కొందరో చెప్పేవాళ్ళు. 80 శాతం పిల్లల్లో మాత్రం చలనం లేదు. తిట్టటం, కోప్పడటం, అసైన్‌మెంట్ ఇవ్వటం, దిద్దటం ఎంతో సమయం వృథా అయ్యేది. హోంవర్క్ ఒక రోజు చూడకుంటే ఇంక ఎగవేత - విజయ మాల్యా కంటే ఇంకా పెద్ద ఎగవేతదారులబ్బా వీళ్ళు. క్లాసులోనే కొంచెం ఓపిక చేసుకోవాలని నిర్ణయించుకొన్నాను. వీటన్నిటి నుండి బయటపడ్డాను. శుంఠలకు శఠగోపం ఎలా పెట్టాలా? అని ఆలోచించాను..."

నేను ఏం చేశానా అని అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

"విన్ - విన్ ఫార్ములా ప్రయోగం చేశాను. నాకు సమయం వృథా కారాదు. వాళ్ళకు శ్రమ తగ్గించాలి. సిలబస్ తగ్గించే వరకు ఎదురుచూస్తే పిల్లలు అలా క్లాసులు మారుతూనే ఉంటారు. కానీ ప్రయోజనం శూన్యం. వారిలో ఉత్పాదక నైపుణ్యాల వైపు శ్రద్ధ పెట్టాలి. ఒక వారం పాఠాలు చెప్తూనే ఉన్నాను. అన్యమనస్కంగా గడిపాను. ఆ రోజు 8వ తరగతిలో ఇడియమ్స్ అండ్ ఫ్రేజస్ చెప్పాలి. కనీసం కొన్ని అయినా వాళ్ళు గుర్తు పెట్టుకోవాలని నా ఆలోచనలో నేనున్నాను. ఇంతలో 'చూడండి మేడమ్. వీడు కిందకు తోస్తున్నాడు.' 'ఎవర్రా అది'? అరిచా. వాడు గీడు ఏంది పేరు లేదా? నేను 'అనిల్' మేడం అన్నాడు. మీ పేర్లు మాత్రం మీకు బాగా గుర్తుంటాయి. ఇంకేమీ గుర్తుండవు కదా? చికాకు పడ్డాను.

'ఈ రోజు మీ పేర్లు మార్చేస్తున్నా - నేను పెట్టిన పేర్లు గుర్తు పెట్టుకోవాలి. ఇంకెవరైనా ఈ వారం లోపల ఫిర్యాదు చేయాలంటే నేను పెట్టిన పేరుతోనే చేయాలి. అర్థమయిందా?.

ఉత్సాహంగా ఎదురు చూస్తున్నారు. రెండో పీరియడ్ కూడా తీసుకోవాలనుకున్నాను. అటెండెన్స్ పిలిచాను. నెంబర్ 1 - రాజశేఖర్, (బ్రింగ్ అప్ అనిల్ (ఫర్ గుడ్); క్రిష్ణ గెట్ రిడ్ ఆఫ్; రవి - డిస్పోజ్ ఆఫ్; సుధీర్ - బై లీప్స్ అండ్ బౌండ్స్; రామాంజనేయులు - కట్ డౌన్; నరేష్ - ఫ్రెండ్ ఫాల్ట్ విల్; సుప్రియ - లెండ్ ఇయర్స్; లావణ్య - పుట్ ఆఫ్; దీప్తి - మేక్ అవుట్; సౌమ్య - ఇన్ ది లాంగ్ రన్; ఇలా 35 మంది విద్యార్థులకు పేర్లు పెట్టాను. వారి పేర్లకు అర్థమేమిటో చెప్పాను. 15 నిమిషాలు సమయం గడిచిపోయింది.

గేమ్ మొదలవుతుంది - జాగ్రత్త హెచ్చరించాను. నియమాలు నిశ్శబ్దంగా వింటూ ఉండాలి. ఎవరూ నోరు మెదపొద్దు. ఎక్కడా ఏమీ వ్రాయద్దు. ఎవరు ఎవరి పేరైనా జ్ఞాపకం పెట్టుకోవచ్చు. ఇక్కడ కాసేపు బ్రెయిన్‌కున్న శక్తి వివరించాను... ఒక్కొక్కరు క్లాసు చివరలో కనీసం 10 పదాలు చెప్పాలి అన్నాను.

మొదటి రౌండ్‌లో - వారికి మార్చిన పేర్లు అడిగాను. 99 శాతం క్లాసు త్వరగా ఆత్రంగా చెప్పారు. రెండవ రౌండ్‌లో పక్కనోడి పేరు అడిగాను. అంటే రెండు పదాలు + అర్థాలు. 3వ రౌండ్‌లో బెంచ్‌మేట్స్ పేర్లు అడిగాను. 3+3 పదాలు చెప్పారు. చివరి 5 నిమిషాలు - ఇంక ఎవరు ఎవరి పేర్లయినా చెప్పొచ్చు. ఒక్కొక్కరు - 10-15 పదాలు చెప్పేశారు. అందరినీ కాక, అక్కడక్కడ అడిగాను.

దేవీ దీపం

వి. వెంకట్రావు

1871 మార్చి 21 వ తేది: బొగ్గు గనుల ప్రాంతం: ఉదయం వేళ:

పెద్ద ఇనుప తలుపులతో చేసిన ద్వారాలు తెరచి చాలా సేపయ్యింది. లోన కొంతవరకూ నేల చదునుగా ఉంది. కాస్త దగ్గరలోనే గనుల లోనికి వెళ్ళడానికి గొయ్యి లాంటి మార్గం. ఆ గొయ్యికి అటు వైపుకి వెళ్ళడానికి వీలుగా చిన్న కర్ర వంతెన. ఒక పక్కగా గనుల లోనికి మనుషుల్ని దించడానికి ఇనప బళ్ళు. వాటికి లావుపాటి తాళ్ళు కట్టి వున్నాయి.ఆ తాళ్ళు పక్కనే వున్న ఇనప స్తంభానికి ముడి పెట్టి వున్నాయి. ఆ ఇనప తలుపులకు కాస్త దూరంలో చిన్న పెంకుటిల్లు. ఆ ఇంటికి రెండు వైపులా వున్న గోడలకి ఆనుకుని రెండు ద్వారాలు. ఒక ద్వారం వద్ద పెద్ద క్యూ ఉంది. వరుసగా కార్మికులు నిలబడి వున్నారు. ఉదయం బంగారపు రంగు సూర్య కిరణాలు అంతటా పరచుకొని వున్నాయి. సూటిగా తగులుతున్న ఎండ వేడిమికి కొందరు కార్మికులు చేతులు అడ్డం పెట్టుకుంటున్నారు. అందరూ దాదాపు నలబై లోపు వాళ్ళే. అంతకంటే పెద్ద వయసు వాళ్ళు గనులలోనికి దిగడం కష్టం. అయినా అవసరం కొద్ది కొంతమంది పెద్దవాళ్ళు కూడా వున్నారు. క్యూ నెమ్మదిగా కదులుతోంది.

ఒక్కొక్కరూ పెంకుటింటిలోని మొదటి ముఖద్వారం నుండి లోనికి వెళుతున్నారు. లోపల చీకటిని ప్రాలద్రోలుతూ రెండు గాజు చిమ్నీ దీపాలు వున్నాయి. ఒక్కొక్కరి పేరు రాసుకుని, సంతకం పెట్టించుకుని పంపిస్తున్నాడు గుమస్తా. బయట ఒక్కొక్కరికి ఇనప టోపీ పెట్టి, దవడ కింద పట్టితో ముడి వేస్తున్నాడు వేరొక వ్యక్తి. పైన పెట్టిన టోపీ మీద గుండ్రని ఆకారం కాకుండా, నలుచదరంగా,కాస్త లోతుగాకుడా ఉంది. ఆ లోతులో ఎర్రని మట్టి అదిమి మధ్యలో లావుపాటి కొవ్వొత్తిని పెడుతున్నాడు. తరువాత ఒక్కొక్కరూ కాస్త దగ్గరలోనే వున్నరేకుల షెడ్ లో టీ తాగి బయటకు వస్తున్నారు. ఒక్కొక్కరూ గని ముఖద్వారం వద్ద కు చేరుకుంటున్నారు. సమయం గడుస్తున్న కొద్ది ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. ఎండ అయినా, వర్షం అయినా గని లోపల ఒక్కలాగే వుంటుంది. ఎలాంటి వాతావరణం అయినా గనిలోనికి దిగక తప్పదు. లేకపోతే రోజుగాడవడదు ఆ కార్మికులకు.

టీ సేవించిన అనంతరం గని లోపలకు వెళ్ళడానికి సిద్ధంగా వున్నారు. లోపలికి వెళ్లేముందు నెత్తిమీద వున్న కొవ్వొత్తిని, పక్కనేవున్న కాగడాతో వెలిగించి పంపిస్తున్నాడు మరో కార్మికుడు. ఆరువందల అడుగుల పైచిలుకు లోతు వున్నగని లోపలకు మనుషులను దించడానికి ఇనప బళ్ళు సిద్ధంగా వున్నాయి. ఒక్కొక్క బండిలో నలుగురు మాత్రమే పడతారు. అలాంటి బళ్ళు కర్ర వంతెనపై అయిదు వున్నాయి. కార్మికులు ఆ బళ్ళలో కూర్చుంటే, ఒక్కో బండిని లోనికి వదులుతున్నారు కర్ర వంతెనపై వున్న తోటికార్మికులు. కాసేపటికే మొత్తం అందరూ లోపలికి వెళ్ళిపోయారు.

రాక్షసి బొగ్గు పెద్ద గునపాలతో తవ్వి, ఆ తవ్విన బొగ్గుని,

ఇంటర్వెల్ ఇచ్చారు. టాయ్‌లెట్స్ దగ్గర - బయట ఫ్రెండ్స్ మాట్లాడుకునేటప్పుడు సొల్లు మాటలు మాయమై పోయాయి. నీ పేరేమిటి? అని ఒకరికొకరు చెప్పుకొని గుర్తుంచుకునే ప్రయత్నం చేశారు. లంచ్ టైమ్‌లో ఇదే గొడవ. పదాల మననం జరుగుతోంది. ఏం హోంవర్కు ఇవ్వలేదు. మరుసటి రోజు నేనిచ్చిన లిస్ట్ బయటికి తీశాను. పేరు పిలిచాను. అర్థం చెప్పమన్నాను. ఎవరి పేరు అర్థం వాళ్ళు చక్కగా గుర్తు పెట్టుకొన్నారు. అప్రయత్నంగా ఎన్నెన్నో పదాలు వాళ్ళ పెదవులపై నాట్యం చేస్తున్నాయి.

ముఖాల్లో ఉత్సాహం తొంగి చూస్తోంది. ఇదివరకూ నన్ను బాధపెట్టిన ఈ దరిద్రంగొట్టు పదాలు నాకూ వచ్చేశాయి. ఆ మరుసటి రోజు నుండి చెప్పబోయే పాఠం కంటే పదాలు ముందు రావాలి. ఇదీ నా నియమం. పదాలకు 25 మార్కులుంటాయన్నాను. వ్రాసినవి, మళ్ళీ టెస్ట్‌లో వ్రాయరాదు. కొత్తగా వ్రాయాలి. చెప్పాను. తలూపారు అంతా...

ఇప్పుడు సింగిల్ డిజిట్ మార్కులేదు. జీరోలు లేవు. అంతా 15, 20, 25 పదాలు వ్రాస్తున్నారు. వారి మార్కులు చూసుకొని మురిసిపోతున్నారు. భాషా పరిజ్ఞానం పెరగాలంటే పదాలు - అర్థాలు అత్యద్భుతంగా.రావాలి. ఉత్పాదక నైపుణ్యాలు వృద్ధి చెందుతాయి. 220 పని దినాల్లో కేవలం 50 రోజులు - రోజుకు 10 పదాలు నేర్పిస్తే 50 × 10 = 500 పదాలు. సంవత్సరానికి ఒక్కో సబ్జెక్టులో 4 × 500 = 2000 పదాలు. నాలుగు సబ్జెక్టుల్లో అయితే..? నా కల నిజమవుతుంది. మీరంతా ఇలా చేస్తారా?

మీరు ఆలోచించండి. ఆచరించండి. ఈ హోం వర్క్ గోల ఎందుకు? ఇక్కడ చేతనయినంత నేర్పండి. నేను చేశాను. నా సబ్జెక్టులో 90 శాతం మంది ఉత్తమమైన ఫలితాలు సాధిస్తున్నారు. మనకు కూడా ప్రిపరేషన్ టైం తగ్గుతుంది. పిల్లలకు శ్రమ తగ్గుతుంది, ఫలితం బాగుంటుంది. శుంఠ అని అందరూ ముద్రవేసిన అనిల్ లాంటి వాళ్ళు కూడా తామూ చదివి మార్కులు సాధిస్తామనే ఆనందంలో ఉన్నారు. మీరే చూసారు కదా!

నా క్లాసులో శుంఠలకు శఠగోపం పెట్టాను - మరి మీరెప్పుడు?" నా తోటి టీచర్లతో మాట్లాడాను.

ఎవరి ఆలోచనల్లో వాళ్ళున్నారు. స్టాఫ్ మీటింగ్ అయిపోయింది.

వాళ్ళని లోనికి తీసుకువెళ్ళిన బండ్లని నింపాలి. బొగ్గు నిండిన సూచనగా కిందనుండి విజిల్ వేస్తారు. ఆ విజిల్ శబ్దం విని బండిని మీదకు లాగుతారు మీదన వుండే వాళ్ళు. అలా మధ్యాన్నం వరకూ తవ్వుతూనే వుండాలి. మధ్యాన్నం తరువాత, అదే బండ్లలో మీదకు వచ్చేస్తారు. మధ్యాన్నం దగ్గర నుంచి వేరే కార్మికులు గని లోపలకు వెళ్తారు. ఇదంతా ఒక క్రమం. ఒడ్డుకు వచ్చిన బొగ్గులను కాస్త దూరంగా కుప్పలుగా పోస్తారు. పక్కనే పెద్దతూకం. బొగ్గును తూకం వేసి ఎడ్లబళ్లలో నింపుతారు. పక్కనే వున్న గుమస్తా ఎంత బొగ్గు పంపింది, ఎక్కడకు పంపింది లెక్క రాసుకుంటాడు. గనుల లోపల నుండి ఎంత బొగ్గు తవ్వి తీసింది కూడా లెక్క రాసుకుంటాడు. అక్కడ నుండి ఎద్దుల బళ్ల ద్వారా దూర ప్రదేశాలకు వెళ్తాయి.

అసలు ఈ రాక్షసి బొగ్గు పరిచయం కాక పూర్వం వంట చెరుకు కోసం అడవులను నరికివేసే వారట. ఆ కాలంలో కలప ఎంత విస్తారంగా వాడేసేవారంటే, త్వరలోనే అడవులు అదృశ్యం అయిపోతాయా అనిపించింది. అంతలోనే పరిశ్రమలన్నిటికి రాక్షసి బొగ్గు వాడవచ్చునని గ్రహించారు. దానితో అరణ్యాలకు ప్రమాదం వెంట్రుక వాసిలో తప్పిపోయిందని చరిత్ర చెబుతోంది.

* * *

గని బయట వున్న పెంకుటింటిలో గుమస్తా రామయ్య ఏవో లెక్కలు రాసుకుంటున్నాడు. పక్కనే వున్న గురవయ్య తో ఏదో మాట్లాడుతున్నాడు. ఇంతలో ఇద్దరికి గుర్రపు డెక్కల చప్పుడు వినిపించింది. "దొరగారు వస్తున్నట్లున్నారు" అన్నాడు రామయ్య. కాసేపటికే దూరంగా దుమ్మురేపుకుంటూ గుర్రం దగ్గరయ్యింది. దొర శామ్యూల్ తెల్లని బలిష్టమైన గుర్రం మీదనుండి దిగాడు. నల్లటి ట్రౌజర్, ఎర్రటి కోటు, భుజాలు నిలబడేటట్లు చేతులు. లేతనీలం రంగు కనుపాపలు. మనిషి తెలుపూ, ఎరుపూ కలగలిసిన ఛాయతో చాలా ఠీవిగా, దర్జాగా వున్నాడు. దొరగారు రాక ముందే గ్రహించిన పనివాళ్ళందరూ చుట్టూ వినయంగా నిలబడ్డారు. అందరికన్నా గుమస్తా రామయ్య ముందుకు వచ్చాడు. రామయ్యను ఉద్దేశించి "ఎంతమంది గని లోనికి వెళ్లారు" అడిగారు దొరగారు.

"అయ్యా!దొరగారూ! నూట పంతొమ్మిది మందండి"

"మరొక్కడు అయితే, 120 మంది అయ్యేది కదా!ఆ ఒక్కడికి ఏం పొయ్యేకాలం వచ్చింది." మొత్తం 120 మంది లెక్క.. ఉదయం షిఫ్ట్ లో 125 మంది పనిలోనికి వెళ్ళాలి. అయిదుగురు సెలవు పెట్టినా, 120కి తగ్గకూడదు.అలాయితే రావలసిన ఉత్పత్తి తగ్గిపోతుంది. ఒక్కడు తక్కువ వచ్చినా ఇబ్బందే. డిమాండ్ ఎక్కువగా ఉంది. వీలయినంత ఎక్కువ ఉత్పత్తి రాబట్టాలి.' అనుకున్నాడు మనసులో. ఈలోగా మరికొంత మంది చేరారు.

"ఊ!సరే మధ్యాన్నం ఒక అరగంట ఎక్కువసేపు లోపల వుంచండి"

"అయ్యా!వాళ్ళకు వేళలు తెలుసండి"

"మీదనుండి బళ్ళు పంపకపోతే ఏం చేస్తారు?ఎగురుకుంటూ పైకి వస్తారా? చెప్పినట్లు చెయ్!"అన్నాడు అధికారస్వరంతో అంటూ..గుర్రాన్ని వెనక్కి తిప్పాడు. కొద్దిదూరం వెళ్లి మళ్లీ వెనక్కి వచ్చి" మాట వినకపోతే రోజు కూలిలో కోతపెట్టు. ఆ నష్టాన్ని ఎవడు భరిస్తాడు. ఇలా ఒకసారి చేస్తే రెండోసారి ఎవడూ సెలవు పెట్టాడు." అంటూ అవతలి వాళ్ళ మాటలు వినకుండా గుర్రాన్నిఅదిలించాడు. మళ్లీ దుమ్ము రేపుకుంటూ గుర్రం పరుగు తీసింది.

"దొరగారు ఏట్రా ఇలా అంటారు. ఒకడు సెలవు పెడితే అందరి జీతాల్లోనూ కోతా? ఇతగాడు మరీ కర్కోటకుడురా! దయా, దాక్షిణ్యాలు వుండవు."

"మనకెందుకురా! ఏవైనా అంటే..మన కూలిలో కోత పెడతాడు. దొరగారు ఏటి చెబితే అది చెయ్యడమే మన పని అనుకుంటూ వాళ్ళు, వాళ్ళ పనుల్లో నిమగ్న మైపోయారు.

* * *

సూర్యుడు నడి నెత్తికొచ్చిన వేళ. భగ, భగ మంటూ ఎండ నిప్పులు చెలరేగుతున్న వేళ. లోపల నుండి వచ్చిన బొగ్గు బళ్ళను తోసుకుంటూ...దగ్గరలోనే వున్న పెద్ద బొగ్గు కుప్ప దగ్గరకు తీసుకువెళుతున్నారు. గుమస్తా లెక్క రాసుకుంటున్నాడు. ఆ గుమస్తా బ్రిటీషరే. అక్కడ పనిచేసే వాళ్ళలో మేనేజ్మెంట్ చేసేవాళ్ళూ, మేధా శ్రమలు చేసే వాళ్ళూ ఇంగ్లీష్ వాళ్ళే. ఎటొచ్చీ చెమటోడ్చి, కాయకష్టం చేసే కూలీలు మాత్రం భారతీయులు. అందరూ ఎవరి పనుల్లో వారు నిమగ్నమై వున్నారు. అంతలో.....

ఉన్నట్టుండి ఒక్కసారిగా గని లోపలనుండి పెద్దశబ్దం....పెద్ద పేలుడు... ఒకసారికాదు. రెండుసార్లు. ఆ చుట్టుపక్కల అరమైలు ప్రదేశంలో భూమి దడ దడ లాడింది. ఆ చప్పుడు ఉరుములాగా నాలుగైదుమైళ్ళ దూరం వినిపించింది. దట్టమైన దుమ్మూ, బొగ్గునలుసులు బ్రహ్మాండమైన కుక్కగొడుగులాగా ఆ సొరంగం నుండి పైకి లేచాయి.

సూర్యుడు దాని మరుగునపడి మైలున్నర ప్రదేశంలో చీకట్లు కమ్ముకున్నాయి. ఆ పొగలో ఒకరికి ఒకరు కనిపించడం లేదు. ఎటు మనుషులు ఎటు వెలుతున్నారో అర్థం కావడంలేదు. ఆ పేలుడు చప్పుడు విని, కార్మికుల భార్యలూ, పిల్లలూ పరిగెత్తుకుంటూ గని దగ్గరకు చేరుకున్నారు. తమ వాళ్ళు ఏమైపోయారోనన్న వెర్రి భయంతో ఏడుపులూ, పెడబొబ్బలూ పెడ్తున్నారు. అసలు ఏం జరిగిందో అర్థం కావడంలేదు.

మరికాసేపటికే బొగ్గుగనులలోనుండి ఎర్రని మంటలు నాలుకలు చాపుకొని బయటకు వస్తున్నాయి. ఆ మంటలను ఆర్పే ప్రయత్నాలు మొదలుపెట్టారు. కానీ, ఆర్పడం ఎవరి వల్ల కావడం లేదు. అసలు అటువంటి ప్రయత్నం వృధా అని అందరూ గ్రహించారు. గనికి ఒకవైపు నుండే మంటలు వస్తుండటంతో, రెండోవైపు కొంతమందైనా బ్రతికి వుంటారనే ఆశ అందరికీ ఉంది. మనుషుల్నీ, బొగ్గునీ పైకి లాగే బళ్ళు ఆపేలుడు వలన పాడయ్యాయి. బయటవున్న మామూలు పగ్గాలు జారవిడిచారు. వాటి ఆధారంతో 32మంది చచ్చి చెడి గాయాలతో బయటకు రాగలిగారు. అందులో ముగ్గురు కాసేపటికే చనిపోయారు. ఇంకా గనిలో 87మంది వుండిపోయారు. వాళ్ళ భార్యలూ, పిల్లలూ బయట ఏడుస్తూనే వున్నారు. వాళ్ళ బాధను చూడలేక ఎవరినైనా రక్షించడానికి వీలవుతుందేమోనని, తొమ్మండుగురు సాహసవంతులు పగ్గాల సాయంతో గనిలోనికి దిగేరు. గనిలో కొంత దూరం వెళ్లేసరికి ఊపిరి

అందక ఉక్కిరిబిక్కిరి అయ్యారు. దానితో ఇక చేసేదేమిలేక తిరుగుదారిపట్టారు. కానీ, వాళ్ళలోఐదుగురు మాత్రమే బయటకు రాగలిగారు. నలుగురు ఊపిరి ఆడక చనిపోయారు. గనిలో మరోసారి పేలుడు వినిపించింది.

ఇంతలో శామ్యూల్ దొరగారికి విషయం తెలిసి, వెంటనే గుర్రంపై వచ్చారు. వెంటనే మిగతా భాగస్వాములకు కబురు తెలిసి వాళ్ళువచ్చారు. లోపల మనుషులు వున్నారనే ధ్యాసేలేదు. మంటలు అలాగే వుంటే గనిలోవున్నబొగ్గు తగలబడిపోయి, చాలా నష్టం వస్తుంది.మంటలు ఎలాగైనా ఆర్పాలి. అదే ఆలోచన. గని తలుపులు మూసేస్తే గాలి అందక మంటలు ఆరిపోతాయి. తలుపులు మూసేయ్యమని ఆజ్ఞాపించాడు. దొరగారి ఆదేసాన్ననుసరించి తలుపులు ముసేయ్యడానికి సిద్దపడ్డారు. అదంతా గమనిస్తున్న మిగతా కార్మికులూ, భార్యలూ, పిల్లలూ తీవ్ర స్వరంతో ఒక్కసారిగా ప్రతిగటించారు. కొందరు "హత్య !హత్య!" అంటూ కార్మికుల గుడిసెలవైపు పరుగులు తీసారు.

శామ్యూల్ దొరగారికి ఏమిచెయ్యాలో తోచలేదు. ఇటువంటి ప్రతిఘటన ఊహించలేదు. మిగతా భాగస్వాములు ఏమి మాట్లాడడం లేదు. మాట్లాడరు కూడా. ఎందుకంటే గనిలో సింహభాగం పెట్టుబడి శామ్యూల్దే. అందుకే అతని మాటకు ఎదురులేదు. ఇక గత్యంతరం లేని పరిస్టితిలో గని తలుపులు మూయించలేదు. వీలయినంతవరకు నీళ్ళతోనే ఆర్పమని ఆదేశించి గుర్రాన్ని వెనుకకు తిప్పి వెళ్ళిపోయాడు.

అదేరోజు సాయింత్రం చీకటి పడేవేళ:

బొగ్గుగనికి రెండు ఫర్లాంగులదూరంలో మట్టిరోడ్డుకి ఇరువైపులా గుడిసెలు. లోపల మనుషులు ఎవరూ వున్నట్లు అలికిడిలేదు. త్రోవ పొడుగునా .కొంచెం దూరం దూరంగా పెద్దకర్రలు పాతిపెట్టి వున్నాయి. ఆ కర్రల మీదన ఒకకర్ర అడ్డంగా ఉంది. దాని చివర గాజు చిమ్నితో చేసిన లాంతరు. ఒక మనిషి తోపుడు బండి మీద కిరసనాయిలు తెచ్చి, ఒక్కో స్తంభం దగ్గరా ఆపుతున్నాడు. ఆ స్తంభానికి ఒక పక్కగా కట్టిన తాడు వదులు చేస్తే, పైన వున్న లాంతరు కిందికి దిగుతోంది. అందులో నూనె నింపి, వెంట తెచ్చిన కాగడాతో దీపం వెలిగిస్తున్నాడు. దీపానికి పైకప్పు మూసేసి, తాడు లాగితే లాంతరు పైకి వెళుతోంది. తాడును స్తంభానికి పైన కట్టేస్తున్నాడు. ఎర్రటి వెలుతురు చక్రంలాగా పరుచుకొంది. అలాగే మరొక స్తంభం.(అప్పటికీ ఇంకా విద్యుత్ రాలేదు)దీపం వెలుగులో కార్మికుల పిల్లలు గోల చేస్తూ ఆడుకుంటున్నారు. అక్కడి నిశ్శబ్దాన్ని భగ్నం చేస్తూ, వాళ్ళ అల్లరి మాత్రమే వినిపిస్తోంది. కొన్ని గుడిసెలముందు నులక మంచాల మీద ముసిలమ్మలు కూర్చోనివున్నారు. వాళ్ళకొడుకులో, అల్లుళ్లో ఎవరో వుండిపోయి వుండాలి. ముఖాలన్ని విచారవదనంతో వున్నాయి. బయటకురాని దుఃఖమేదో లోపల దొలిచేస్తోంది. ఆ వీధికి కాస్త మలుపులో మొత్తం కార్మికులంతా గుమికూడి వున్నారు.

ఒక మర్రిచెట్టు క్రింద అందరూ నేలపై కూర్చోని వున్నారు. కొమ్మలకి కట్టిన నాలుగు కాగడాలు ఎర్రటి వెలుతురును వెదజల్లుతున్నాయి. అందులో నాయకుడులాంటి ఒక వ్యక్తి బిగ్గరగా చెబుతున్నాడు. "ఈరోజు ఉదయం జరిగిన సంఘటన మనం ఎవ్వరం ఊహించనిది. నిన్నటి వరకూ మనతో పనిచేసిన కార్మికులు ఈరోజు మనతో లేరు. అసలు వాళ్ళు బ్రతికి వున్నారో లేదో కూడా తెలీదు. మన దురదృష్టం ఏమిటంటే వెతకడానికి వెళ్ళిన కార్మికులు కూడా నలుగురు బయటకు రాలేదు."

"అసలు ఇంత పేలుడు ఎలా సంభవించిందో తెలియడం లేదు. ఎన్నడూ వినలేదూ, కనలేదు." అన్నాడొక కార్మికుడు. మధ్యాహ్నం పేలుడు సంభవించిన దగ్గరనుండి అందరి మనసుల్లోనూ అదే ప్రశ్న.

"ఎలా జరిగిందో, జరిగింది. దానికి పరిష్కారం యాజమాన్యం ఆలోచిస్తుంది. కానీ, రేపటినుండి ఎవరూ పనిలోనికి వెళ్ళవద్దు. కొంతమంది వెళ్ళినా మనచేత పనిచేయించుకుంటారు. ప్రమాదాలు వాళ్ళకి పట్టవు."

"నిజమే కానీ, మనకి రోజు గడిచేదెలా?"

"అలా అని గనిలోనికి వెళ్లి ప్రాణాలు పోగొట్టుకుంటామా?"

ఈ పని కాకపోతే ఇంకోపని. కొన్నాళ్ళు చూద్దాం. అంతే తప్ప ఈ పరిస్తితుల్లో గనిలోనికి వెళ్ళకూడదని అందరూ ఒక నిర్ణయానికి వచ్చారు. అందులోనే కాస్త అవకాశం వున్నవాళ్ళు మిగతావాళ్ళకు అప్పులిస్తామని అనడంతో తాత్కాలికంగా సమస్య పరిష్కారమైంది.

అదే సమయం దొరగారి బంగళా:

శామ్యూల్ పెద్ద సోఫాలో కూర్చున్నాడు. మిగతా ఆరుగురు భాగస్వాములు ఇరువైపులా కూర్చున్నారు. అందులో నలుగురు ఇంగ్లీష్ వాళ్ళు, ఇద్దరు భారతీయులు. అందరికీ సర్వర్ సిద్దప్ప టీలు, బిస్కెట్లు సప్లయి చేస్తున్నాడు.

"ఇంత పెద్ద పేలుడు ఎలా సంభవించిందో అర్థం కావడం లేదు." శామ్యూల్

"పాపం 87 మంది ప్రాణాలు పోయాయి"

"87మంది అంటావేం. తరువాత వెళ్ళినవాళ్ళు నలుగురు. బయటకు వచ్చినవాళ్ళలో మరో ముగ్గురు. మొత్తం 94 మంది"

"వాళ్ళ ప్రాణాలు ఎవడిక్కావాలయ్యా! బ్రతికితే ఎంత, పొతే ఎంత. మనసంగతి చూడండి. రేపటి నుండి బొగ్గు బయటకు రాదు. అవతల చూస్తే డిమాండ్ చాలావుంది. రాక్షసి బొగ్గు గనులు బయట పడిన దగ్గరనుండి, ఎవ్వరూ వంటచెరుకు వాడడం మానేసారు. అయినా దీనికున్న వేడి దానికి రాదు."

"అందుకే కదండీ దొరగారూ ఈ డిమాండ్. అయినా బొగ్గురానపుడు మనం మాత్రం ఏం చేస్తాం. జరిగింది చెబుతాం"

"చెబుతాం సరే! మన గనిలో ఇలా అయ్యిందని వాళ్ళ కంపెనీల్లో పనులు ఆపేసుకుంటారా? వేరే గనినుండి తెప్పించుకుంటారు. ఖాతాలు పోతాయి. మనకి లాభాలు రావు. ఇలా ఎన్నాళ్ళు అది ఆలోచించండి."

"ఆలోచించడానికి ఏం ఉంది. కొన్నాళ్ళు పనివాళ్ళ కడుపులు మాడితే వాళ్ళే పనిలోనికి వస్తారు. ఎన్నాళ్ళు పెళ్ళాం పిల్లలతో పస్తులుంటారు."

"అలా వచ్చి పనిలో జాయిన్ అయిపోవడానికి ఇదేమీ జీతాల సమస్యకాదు. తక్కువో, ఎక్కువో ఎలాగో ఓలగా సర్దుకు పోవడానికి. ప్రాణాలతో చెలగాటం. ఒక్కడు కుడా రాడు. కొన్నాళ్ళు చూసి

వేరే పనుల్లోకి వెళ్ళిపోయినా, వెళ్ళిపోతారు."

"అదీ నిజమే, అలా వెళ్లిపోయారంటే అది మరీ సమస్య. మన గనిలో ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రచారం అయితే, తరువాత కాలంలో కూడా ఎవ్వరూ పనిలోనికి రారు."

"కాబట్టి, మనముందు రెండు సమస్యలు వున్నాయి. ఒకటి కార్మికుల్ని, బయట పనుల్లోకి వెళ్ళకుండా ఆపాలి. అలా ఆపాలి అంటే, ఈ సమస్యకు త్వరలోనే పరిష్కారం ఆలోచిస్తామని హామీ ఇస్తూ.. కనీసం సగం జీతం అయినా అడ్వాన్స్ రూపంలో ఇవ్వాలి. అంటే, ఆ రోజుల్లో మనకు లాభాలు రావు సరికదా మన చేతిది కొంత ఇచ్చుకోవాలి. ఇక రెండో సమస్య అసలు ఆ ప్రమాదం ఎందుకు జరిగిందో, ఎలా జరిగిందో తెలుసుకోవాలి. ఈ రెండు సమస్యలూ తేలితేగాని, మనకి పూర్వంలాగా లాభాలు రావు."

"మొదటి సమస్య అయితే ఎలాగోలా పరిష్కరించగలం. కానీ, రెండో సమస్యజటిలమైనదే."

"అందుకే ఈ రెండో సమస్య పరిష్కరించడం మనవల్ల అయ్యేపనికాదు. దానికి తగిన కారణాలు తెలుసుకోవాలంటే, ఏ రసాయన శాస్త్రవేత్తకో తెలియాలి."

"అలాంటి వాళ్ళు ఎవరైనావున్నారా?"

"రాత్రంతా ఈ సమస్యగురించే ఆలోచించాను. దీన్నుండి మనల్ని బయట పడెయ్యడానికి ఒక వ్యక్తి వున్నాడు."

"ఎవరుసార్! అతను"

"హంఫ్రీ డేవీ" అతనే మన సమస్యకు పరిష్కారం కనిపెట్టగలడు. అయితే అతని రప్పించాలి. ఈ ప్రయోగం విజయవంతం అయ్యేదాకా, అతన్ని ఇక్కడే ఉంచాలి. దానికి అయ్యే ఖర్చులు అన్నీ మనమే భరించాలి." అన్నాడు శామ్యూల్.

"అలాగేసార్!అసలు గని మూసెయ్యడం కన్నాఇది నయమేకదా!వెంటనే కబురు పంపించండి."అన్నారు ముక్త కంఠంతో.

"కబురు ఎప్పుడో వెళ్ళింది. ఈపాటికే అతను ప్రయాణ సన్నాహాల్లో వుంటాడు." భాగస్వాములందరూ ఊపిరిపీల్చుకున్నారు.

* * *

వారం రోజుల అనంతరం... ఒక రోజు సాయింత్రం వేళలో రెండు మట్టిరంగు మచ్చలున్న, బలిష్టమైన గుర్రపు బగ్గీమీద నుండి, చాలా టీవిగా దిగాడు హంఫ్రీ డేవీ. అందరూ అతనికోసమే కాసుక్కూర్చున్నారు. అందరూ ఒకేసారి. "గుడీవినింగ్ సార్! వెల్ కమ్" అంటూ బంగాళా లోనికి దారితీసారు. వారిని అనుసరిస్తూ లోనికి నడిచాడు డేవీ. అందరూ పెద్ద హాలులో గతంలో కూర్చున్నట్లుగానే కూర్చున్నారు. పెద్దసోఫాలో శామ్యూల్, పక్కనే డేవీ కూర్చున్నాడు. సమస్యగురించి గతంలో డేవీకి వివరించడం వలన, డేవీ ఏమీ అడగలేదు. సిద్దప్ప అందరికీ టీలు, బిస్కెట్లు సర్వ్ చేస్తున్నాడు. టీ సేవించిన అనంతరం చాలా చిన్న స్వరంతో అన్నాడు డేవీ.

"ప్రమాదం జరిగిన రోజు కొంత మంది ప్రాణాలతో బయటపడ్డారని అన్నారు కదా!అందులో ఒకరిద్దరికి కబురు పంపించండి. అసలు ఈ ప్రమాదం ఎలా జరిగిందో తెలుసుకోవాలి. ప్రమాదం దగ్గర వున్న వాళ్ళకే అసలు నిజం తెలుస్తుంది."

వెంటనే శామ్యూల్ "సిద్దప్పా! నువ్వు వెంటనేవెళ్లి ఆ రోజు ప్రమాదం నుండి బయటపడిన వాళ్ళను ఒక ఇద్దరిని తీసుకురా!"

"అలాగేనండయ్యా" అంటూ దాదాపు పరుగు లాంటి నడకతో వెళ్ళాడు.

"ఈలోపు మీరు కాస్త రిలాక్స్ అవ్వండి" అన్నాడు భాగస్వాముల్లో ఒకడైన రాబర్ట్.

"నో...నో.. ఏం పరవాలేదు. రానివ్వండి.అసలు ఏం జరిగిందో పూర్తిగా నాకు తెలిస్తేనే గాని నాకు స్తిమితం వుండదు."

వెళ్ళిన కాసేపటికే సిద్దయ్య ఇద్దరిని వెంట బెట్టుకు వచ్చాడు. ఒంటి మీద కట్లతో దొరగారికి దూరంగా తలా, నడుమూ కాస్త వంచుకొని వినయంగా నిలబడ్డారు.

"అసలు ఆరోజు ఏం జరిగింది? ఏ సమయంలో జరిగింది? మీరు లోపలకు వెళ్ళిన ఎంతసేపటికి జరిగింది?వున్నది వున్నట్లు చెప్పండి."అన్నాడు డేవీ.

"అయ్యా!ఆ రోజు సూర్యుడు నడినెత్తికొచ్చిన సమయంలో పెద్ద పేలుడు పేలిందండి."

"అంటే...మీరు లోనికి వెళ్ళిన మూడు, నాలుగు గంటల తరువాత జరిగిందా?"

"వేళ సరిగ్గా తెలీదండి. కానీ, సుమారుగా అలాగే అనుకోండి"

"ఆ సమయంలో బొగ్గు తవ్వుతున్నారా?"

"అవునండయ్యా!"

"మీరు ఏవైపుకి తవ్వుతున్నారు? గని గోడల వైపా? కిందకీ... అంటే భూమి లోపలికా?"

"అంటే ముందు గని లోపలికి వెళ్ళిన వెంటనే, గోడలవైపే తవ్వామండి. ఆ తరువాత భూమి లోపలికి తవ్వామండి"

"అంటే లోతుకి తవ్వినపుడే పేలుడు వచ్చిందా?"

"అవునండయ్యా!పేలుడు రాబోయే ముందు ఏదో వాసన కూడా వచ్చిందండి."

"సరే మీరు వెళ్ళండి"

దొరగారు వెళ్ళిపొమ్మని ఆజ్ఞ అయిన వెంటనే, అతి వినయంగా ఇద్దరూ ఎలా వచ్చారో అలాగే నడచుకొంటు వెళ్ళిపోయారు.

"మై డియర్ ఫ్రెండ్స్! పేలుడు ఎందుకు జరిగిందో అర్థమయ్యింది. దానికి పరిష్కారమేమిటో ఆలోచించాలి."

"ఎందుకు జరిగిందంటారు? అన్నాడు భాగస్వాముల్లో ఒకడు.

"వాళ్ళ మాటలు విన్నారుగా, గని గోడల వైపు తవ్వినంత సేపూ ఏం జరగలేదు. లోతు తవ్వినపుడు మాత్రమే పేలుడు సంభవించింది. ఏదో వాసన కూడా వచ్చిందని వాళ్ళు అనడం మీరు విన్నారుకదా! అదే మిథేన్ వాయువు. అది భూమి లోపల పొరల్లో వుంటుంది. ముఖ్యంగా బొగ్గుగనుల్లో ఉంటుందని ఈ మధ్యకాలంలో వింటున్నాం. మనం తవ్వడం కొంతవరకూ అయితే పర్వాలేదు. అంతకన్నా లోతుకు వెళితే ఆ వాయువు విడుదల అవుతుంది. దానికి తగిన ఉష్ణోగ్రత తగిలితే మండుతుంది. మండడమేకాదు, పేలుతుంది కూడా. అయితే, దానికి తగిన

ఉష్ణోగ్రత ఉంటేనే పేలడం జరుగుతుంది. మన కార్మికులు వెలుతురుకోసం కొవ్వొత్తులు తీసుకు వెళతారు కదా! ఆ ఉష్ణోగ్రత చాలు పేలడానికి. ఇక్కడ జరిగింది అదే.

"సార్! ఆమాత్రం వెలుతురు లేకపోతే ఎలా తవ్వుతారు?" చీకటిలో నైనా సరే ఎలాగో ఒకలాగా బొగ్గు బయటకు వచ్చేస్తే బాగుండుననే మనసులో ఉంది కానీ, అలా సాధ్యం కాదుకదా అందుకే ఈ మాట అన్నాడు ఒక భాగస్వామి.

"ఇక్కడ మనం ఆలోచించవలసింది అదే, వెలుతురు కోసం దీపం వుండాలి కానీ, దాని ఉష్ణోగ్రత బయటకు రాకూడదు."

"సార్!దీపం చుట్టూ గాజు చిమ్నీ ఏర్పాటుచేస్తే"

"అదీ ఆలోచించాను. గాజు చిమ్నీతో దీపపు మంటలను అన్నివైపులా మూసేయ్యడానికి వీలులేదు. గాలి లోపలికి వెళుతుంటే తప్ప మంట మండదు. కనుక దీపం కింద రంధ్రాలు వదిలిపెట్టాలి. మంట మండుతూ వుండడం వలన ఏర్పడే పొగ, కార్బన్ డయాక్సైడ్, నీటి ఆవిరి బయటకి పోవడానికి సందు ఉంచకపోతే దీపం ఆరిపోతుంది. ఆ రంధ్రాలగుండా మంట బయటకు వెళ్లి గనిలోని మీథేన్ వాయువును మండించే ప్రమాదం ఉంది. కనుక గాజు చిమ్నీ కుదరదు.....సరే చూద్దాం"

ఆరుగురిలో కొంతమందికి ఏమీ అర్థం కాలేదు. ఒకడు బుర్రగోక్కున్నాడు. ఏమిటో ఈ మీటింగులు. త్వరగా వ్యవహారం తెమిలిపోతే బాగుండును. ఎలాగో ఒక లాగా పనివాళ్ళు పనిలోనికి వెళ్ళిపోతే, సరుకు ఉత్పత్తి అయితే, లాభాలు వచ్చేస్తాయి. వాడికి ఎప్పుడూ లాభం, నష్టం తప్ప ఇంకో మాట తెలీదు. మరి ఈ సైన్స్ సంగతులు ఏం తెలుస్తాయి. అయినా ఏం అనాలో తెలియక "సార్! ముందు మీరు రిలాక్స్ అవ్వండి" అన్నాడు.

"సిద్దప్పా! దొరగారికి అన్ని ఏర్పాట్లు చేసావా?"

"చేసానండయ్యా"

"సార్! మీరు వెళ్ళండి. అక్కడ చాలామంది పనివాళ్ళు వున్నారు. ప్రయోగాలకి అవసరమైనవి అన్నీ సమకూరుస్తారు. మీకు ఏరకమైన ఇబ్బంది రాకుండా తగిన ఏర్పాట్లన్నీ చేశాం" అన్నాడు శామ్యూల్. "అలాగే" నంటూ అక్కడనుండి కదిలాడు డేవీ.

రెండు నెలల తర్వాత:

ఒకరోజు ఉదయమే. అందరికీ కబురు చేసాడు డేవీ. శామ్యూల్ బంగాళా లోనే, గతంలో కూర్చున్న చోటనే, భాగస్వాములందరూ కూర్చున్నారు. వెంట నౌకరు సంచిలో తెచ్చిన పరికరం అందరికీ కనిపించేటట్లు మధ్య చిన్న టేబుల్ పై ఉంచాడు. అందర్నీ ఉద్దేశిస్తూ డేవీ అన్నాడు.

"ఈ కొత్త దీపాన్ని చూస్తున్నారు కదా! ఈ దీపం చుట్టూ వున్నది గాజు చిమ్నీ కాదు. కాపర్(రాగి) తీగలతో చేసిన వల. లోహం మంచి ఉష్ణవాహకం. అందులోనూ రాగి మరీను. అందుకే దీనికి రాగిని ఉపయోగించాను. ఈ తీగల చట్రం, మంట తాలూకా వేడిని గ్రహించి, ఆ వేడిని త్వర త్వరగా ఆ ప్రదేశం నుండిచట్రం మీద అన్నిప్రదేశాలకు పంపించేస్తుంది. అక్కడనుండి రేడియేషన్ ద్వారా వేడి బయటకు పోతుంది. కనుక మంట చట్రానికి రెండో వైపుకి వెళ్ళడం సాధ్యం కాదు. ఈ సూత్రాన్ని ఉపయోగించికుని కొత్త లాంతరు తయారు చేశాను. గాజు చిమ్నీ బదులు, రాగి తీగల వలతో చిమ్నీ లాగా చేశాను. ఆ చిమ్నీకి పైనా, కిందా కూడా అటు వంటి తీగలతోనే మూసేసాను. అంతే.... బొగ్గుగనుల్లోకి నిర్భయంగా వెళ్లగల దీపం తయారైంది. గనిలోని మీథేన్ వాయువు, వల చిల్లుల లోనించి లోపలికి వెళుతుంది. వెళ్లి అక్కడ దీపపు మంటకు తగిలి మండుతుంది. కానీ ఆ మంట లోపలే వుండిపోతుంది. అది తీగల వల దాటి బయటకు రాలేదు. ఆ వల మంట పాలిట లక్ష్మణ రేఖ వంటిది. కనుక బయట ఎంత దట్టంగా మీథేన్ వాయువు వున్నా మండదు. వల కన్నాల్లోంచి వెలుతురు మాత్రం బయటకి వస్తూనే వుంటుంది."

అందరూ మహా ఆశ్చర్యంతోనూ, ఆనందంతోనూ చూసారు. చప్పట్లు కూడా కొట్టారు. "దీన్ని మన కార్మికులు నమ్ముతారా అని నా సందేహం" అన్నాడు రాబర్ట్.

"మనమే నమ్మకం వచ్చేలా చెయ్యాలి. అందుకే ముందు అందరి కార్మికుల సమక్షంలో ఒక తాడుకి ఈ దీపం కట్టి ఒక రోజంతా గని లోపలకి వదలాలి. ఎటువంటి పేలుడూ జరగలేదని వాళ్ళకు నమ్మకం కలుగుతుంది. అప్పటికీ నమ్మకం కలగపోతే రెట్టింపు కూలీలు ఇస్తామని ఆశ పెట్టి ఒకరినో, ఇద్దరినో లోపలికి పంపించుదాం. దానితో క్రమంగా అందరికీ నమ్మకం కలుగుతుంది. దానితో అందరూ పనుల్లోకి వెళ్తారు. తరువాత మామూలే....గతంలో ఇచ్చిన కూలీలే ఇస్తాం."అన్నాడు శామ్యూల్. ఇది అందరికీ నచ్చింది.

"ఇంకెందుకు ఆలస్యం. రేపే ఆ పని చేద్దాం" అన్నాడు లాభాల భాగస్వామి.

మరుచటి రోజే కార్మికుల అందరి సమక్షంలో డేవీ తయారుచేసిన కొత్త దీపాన్ని తాడు కట్టి గనిలోనికి దించారు. సాయింత్రం వరకూ ఎటువంటి పేలుడు సంభవించలేదు. కొంతమందికి దీపం మీద నమ్మకం కుదిరింది గానీ, ఇంకా కొంతమందికి నమ్మకం కుదరలేదు. నమ్మకం కుదిరిన కార్మికులు మరుసటి రోజునుండే గనిలోనికి దిగారు. గని లోనికి వెళ్లి క్షేమంగా బయటకు రావడంతో క్రమంగా మిగిలిన కార్మికులు కూడా గనిలోనికి వెళ్ళడం మొదలుపెట్టారు. కొద్దిరోజులలోనే పూర్తి స్థాయిలో కార్మికులు పని లోనికివెళ్లారు. యాజమాన్యం అలాంటి దీపాలు చాలా తయారు చేయించి దగ్గరే పెట్టుకుంది.

రోజూ శ్రమదోపిడీకి గురి అవుతున్నా, తమ ప్రాణాలకు రక్షణ కలిగినందుకు సంతోషంగా వున్నారు కార్మికులు. తమ లాభాలకు ఎటువంటి ఆటంకం లేనందుకు, దానికి కారకుడైన డేవీకి కృతజ్ఞత తెలుపుకుంటూ యాజమాన్యం సంతోషంగా ఉంది. 94మంది ప్రాణాలుకాపాడినందుకు, ఇంకెందరో కార్మికులకు రక్షణ కల్పించడానికి వీలైన దీపం కనిపెట్టినందుకు కొండంత ఆత్మ తృప్తిని పొందుతూ సంతోషంగా వున్నాడు డేవీ. ప్రపంచానికి నూతన వస్తు ఆవిష్కరణ చేసినందుకు ప్రభుత్వం డేవీకి "సర్" అనే బిరుదును ఇచ్చి సత్కరించింది.

(బొగ్గుగనుల్లో 94 మంది కార్మికులు చనిపోయే సంఘటన ఇంగ్లాండ్‌లో నిజంగానే జరిగింది. తెలుగు ప్రాంతానికి అనుగుణంగా పేర్లు, సంభాషణలు మార్చాను.)

(చైనా శ్రామిక వర్గ సాంస్కృతిక విప్లవానికి 16 మే 2016 నాటికి యాభై ఏళ్లు. అలాగే రాబోయే మూడు నాలుగేళ్లలో బోల్షివిక్ విప్లవం వందేళ్లు, మార్క్స్ 200 జయంతి, చైనా విప్లవానికి 70 ఏళ్లు, నక్సల్బరీ యాభై ఏళ్లు, విరసం యాభై ఏళ్ల వంటి చారిత్రక సందర్భాలు రాబోతున్నాయి. వీటిని పురస్కరించుకొని మార్క్సిస్టు సిద్ధాంత, రాజకీయ అధ్యయనంలో భాగంగా విరసం 'సోషలిజమే ప్రత్యామ్నాయం' అనే నినాదాన్ని ఇచ్చింది. దీని గురించిన విరసం కార్యదర్శి ఓ చిన్న నోట్ అరుణతార ఏప్రిల్ 2016 సంచికలో రాశారు. అప్పటి నుంచి విప్లవ సిద్ధాంత, సృజనాత్మక సాహిత్య పరిచయ వ్యాసాలు అరుణతారలో అచ్చేస్తున్నాం. అలాంటి రచనలు అరుణతారలో ఎప్పుడూ వచ్చేవే అయినా ఈ సందర్భంలో ప్రత్యేకంగా వస్తున్నాయి. గమనించే ఉంటారు. ఈ మూడు నాలుగేళ్లు ఇలాంటి రచనలకు అరుణతారలో మరింత ప్రాధాన్యత ఇద్దామనుకున్నాం. విరసం అంతర్జాల పత్రికలో కూడా ఈ తరహా వ్యాసాలు అచ్చవుతున్నాయి. అక్కడ 'సోషలిజమే ప్రత్యామ్నాయం' అనే శీర్షిక కింద వస్తున్నాయి. కాబట్టి అరుణతారలో కూడా ఇక నుంచి ఇలాంటి వ్యాసాలకు ఇదే శీర్షిక ఇద్దామనుకుంటున్నాం. మార్క్సిస్టు మౌలిక రచనల పరిచయం, అనువాదం, ప్రపంచ విప్లవోద్యమాల విశ్లేషణలు, మార్క్సిస్టు మహోపాధ్యాయుల జీవిత రేఖలు, ఆయా విప్లవాల నేపథ్యంలో వచ్చిన సృజనాత్మక సాహిత్య పరిచయాలు ఈ శీర్షికకు రాసి పంపమని మనవి. - సం.)

మహత్తర శ్రామిక వర్గ సాంస్కృతిక విప్లవం

వరవరరావు

"మహత్తర శ్రామివర్గ సాంస్కృతిక విప్లవానికి 2016 మే 16 నాటికి యాభై ఏళ్లు పూర్తయ్యాయి. సామ్యవాద చైనాలో ఇది అపూర్వమైన విప్లవ ప్రజా వెల్లువ. మావో సె టుంగ్, కమ్యూనిస్టు పార్టీ దీనికి నాయకత్వం వహించారు. దేశంలోని సామ్యవాద రాజకీయ ఆర్థిక పునాదికి అనుగుణంగా సాంస్కృతిక ఉపరితలంలోని ప్రతి ఒక పార్శ్వాన్ని లక్ష్యంగా చేసుకొని ఈ విప్లవం వచ్చింది. బూర్జువా వర్గానికి అభివృద్ధి నిరోధక సంస్కృతికి సంబంధించిన అన్ని రూపాలకు వ్యతిరేకంగా శ్రామిక ప్రజా బాహుళ్యాన్ని ఉవ్వెత్తున కదిలించడం దీని లక్ష్యం. పెట్టుబడిదారీ మార్గానుయాయులకు వ్యతిరేకంగా కఠోరమైన వర్గ పోరాటాన్ని ఇది నిర్వహించింది. ఇది మహత్తర చర్చ (గ్రేట్ డిబేట్ 1956-66)కు కొనసాగింపు. ఇది రివిజనిజానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటానికి కొనసాగింపు. చైనా విప్లవ పురోగమనంలో ఒక కొత్త దశకు సంకేతం.

'కమ్యూనిజం సాధనలో ఇంకా చాలా సాంస్కృతిక విప్లవాల అవసరం ఉంది' అని మావో బోధించిన అవగాహనను ఇది రుజువు పరిచింది. ఇది సామ్యవాద నిర్మాణం చేసి సుస్థిరపరచుకోవడం ద్వారానే సాధ్యమవుతుంది. అంతర్జాతీయంగా వివిధ దేశాల్లో కమ్యూనిస్టు ఉద్యమాల్లో పొడసూపిన రివిజనిస్టు ధోరణులపై పోరాడుతూ కొత్తదారులను వెతుక్కోవడానికి ఇది దోహదం చేసింది. అన్ని చోట్ల మార్క్సిస్ట్-లెనినిస్ట్ పార్టీలు ఏర్పడ్డాయి. సాయుధ వ్యవసాయ విప్లవ పోరాటాల కొత్త గాలి ఒకటి వీచింది. ఇండియాలో మహత్తర నక్సల్బరీ రైతాంగ విప్లవ సాయుధ పోరాటం ఈ ప్రేరణతోటే ప్రారంభమైంది. నక్సల్బరీ పోరాటం 2017, మే 23-25కు యాభై ఏళ్లు పూర్తి చేసుకోనున్నది. నక్సల్బరీ పోరాటాన్ని ప్రారంభించినవాడు చారు మజుందార్. ఈనాటి మావోయిస్టు పార్టీ నిర్మాణానికి మూలపురుషులైన ఇద్దరిలో ఆయన ఒకరు. మరొకరు కామ్రేడ్ కన్నయ్య ఛటర్జీ. వాళ్లిద్దరు గొప్ప నాయకులు, విప్లవ అధ్యాపకులు. మన దేశంలోని ప్రజాస్వామిక విప్లవ చరిత్రలో నక్సల్బరీ ఒక కొత్త ప్రారంభం."

చైనాలో మహత్తర శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవం 1966, మే 16న ప్రారంభించాడు. ఈ షాంఘై నగరాన్ని మావో సె టుంగ్ ఎన్నుకోవడానికి ఒక కారణం ఉంది. ఇది ప్రధానంగా కార్మిక నగరం. విప్లవ కాలంలో మావో సె టుంగ్ విముక్తమైన యానాన్‌ను కేంద్రంగా చేసుకొని విప్లవ వర్గ పోరాటాన్ని ముందుకు నడుపుతూ ఈ షాంఘై నగరం నుంచి లీషాచీ అజ్ఞాత జీవితంలో ఉండి విప్లవ సేనను ముందుకు నడిపాడు. మంచి కమ్యూనిస్టు ఎలా ఉండాలి? అని పుస్తకం రాసిన లీషాచీ మొదటి నుంచి కూడా మితవాద వర్గానికి, పెట్టుబడిదారీ పంథాకు ప్రతినిధిగా ఉన్నాడు. ఆయనకు ప్రజావిముక్తి సైన్యం మీద, అక్కడి కార్మిక రంగం మీద పట్టు ఉంది. షాంఘై యూత్ లీగ్ అనే సంస్థలో ఈ రెండు ధోరణుల పార్టీ శ్రేణులుండేవి. మొత్తం మీద షాంఘైలో లీషాచీ మార్గదర్శకత్వం ఇరవై ఏడేళ్ల కాలంలో ఒక బూర్జువా కేంద్రంగా మారిందనేది మావో పరిశీలనలోనూ, విశ్లేషణలోనూ తేలింది. డెంగ్ సియావోపిన్ ఈ లీషాచీ అనుచరుడే. ఇటువంటి భావజాలానికి మూలాలు చైనాలో భావవాదానికి, భౌతిక వాదానికి మధ్యన వేల సంవత్సరాలుగా జరుగుతున్న ఘర్షణలోనే ఉన్నాయని మావో మూడు వేల సంవత్సరాల రైతాంగ పోరాటాల విశ్లేషణలో అర్థం చేసుకున్నాడు. ముఖ్యంగా ఈ భావవాద తాత్విక ధోరణికి కన్ఫ్యూషియస్ సిద్ధాంతాలు మూలమని సాంస్కృతిక విప్లవ కాలమంతా కూడా వీటిపై రాజీలేని పోరాటం చేశాడు. కన్ఫ్యూషియస్ కాలంలోనే రైతాంగం ఆయనను ఎన్నడూ ప్రవచనాలు చెపుతూ, శిష్యులను వెంట వేసుకుని చేతులూపుతూ తిరిగేవాడే తప్ప ఆ చేతులను శ్రమలో ఉపయోగించేవాడు కాదని చెప్పుకునే కథలను మావో సె టుంగ్ చైనా చరిత్రలో గమనించి, చర్చకు పెట్టాడు.

అప్పటి కమ్యూనిస్టు పార్టీకి, చైనా పీపుల్స్ రిపబ్లిక్‌కు చైర్మన్‌గా ఉన్న మావో సె టుంగ్ తాను స్వయంగా షాంఘై నదిని ఈది పెకింగ్ (బీజింగ్) నుంచి కార్మిక నగరమైన షాంఘై చేరుకుని ఈ విప్లవాన్ని ప్రారంభించాడు. 'కేంద్రాన్ని బద్దలు కొట్టండి, ఆలోచించడానికి సాహసించండి, ఏటికి ఎదురీదండి' అనే నినాదాలతో కార్మిక వర్గానికి, విద్యార్థి యువకులకు రివిజనిజం మీద పోరాటానికి పిలుపునిస్తూ, తాను స్వయంగా షాంఘై నగరంలోని కర్మాగారాల మీద గోడ పత్రికలు వేశాడు. ఇది ప్రపంచ వ్యాప్తంగా ఒక సంచలనానికి, రివిజనిజం మీద పోరాటానికి ఒక ఆరంభమైంది. 1956 నాటికి చైనాలో నూతన ప్రజాస్వామిక విప్లవం సామ్యవాద దశకు చేరుకున్నది. 1949 నుంచి 56 వరకు నూతన ప్రజాస్వామిక విప్లవ ప్రయోగం మార్క్సిజం-లెనినిజం మౌలిక సూత్రాలకు, వాటి శాస్త్రీయమైన ఆచరణకు అనుగుణంగా జరిగి, 1956లో అది సామ్యవాదంలోకి ఒక పెద్ద గెంతు వేసింది. ఇప్పటి దాకా రెండు కాళ్ల మీద స్థిరంగా నడిచి, సాధించుకున్న ఫలితాలను ఒక గుణాత్మక దశలోకి తీసుకువెళ్లి వర్గపోరాటం, ఉత్పత్తి ప్రయోగం (అభివృద్ధికి) ద్వారా సామ్యవాదాన్ని ఆచరిద్దామని మావో సె టుంగ్ 1956లో 'పురోగమనానికి ఒక పెద్ద ముందడుగు' (గ్రేట్ లీప్ ఫార్వర్డ్) అని పిలుపు ఇచ్చాడు. అందుకు అనుగుణంగా దేశంలో కార్మికవర్గ నాయకత్వంలో ప్రజల ఆలోచనల్లో 'నూరు పూలు వికసించనీ, నూరు ఆలోచనలు ఘర్షణ పడనీ' అని కూడా పిలుపునిచ్చాడు. సామ్యవాద దశ అంటే ఉత్పత్తిలో సహకార దశ నుంచి సమష్టి దశలోకి ప్రవేశించడం. వ్యక్తిగత ఆస్తి రద్దు కావడం. సామ్రాజ్యవాద భూస్వామ్య వ్యతిరేక దళారీ వర్గాలకు వ్యతిరేకంగా పోరాడి అధికారంలోకి వచ్చి కలిసి పనిచేస్తున్న వర్గాలు క్రమంగా శ్రామికవర్గ నియంతృత్వంలో సంలీనం అయ్యే దశ. కమ్యూన్‌ల దశ. ఈ దశలో అభివృద్ధి పూర్తిగా శ్రమైక జీవనానికి అనుగుణంగా సాగాలి. కార్మికవర్గం జీవన ప్రమాణాలు అత్యున్నతంగా పెరగాలి. విప్లవ విజయ ఫలాలన్నీ కార్మికవర్గానికి అందాలి. కార్మిక వర్గ నాయకత్వంలో ప్రజలకందాలి. జీవితంలోని అన్ని పార్శ్వాలపై, అన్ని రంగాలపై శ్రామికవర్గం తన హెజిమోనిని (ప్రాబల్యాన్ని) నెరపగలగాలి. అయితే, అందుకోసం నూరు పూలు వికసించి, ఘర్షణపడి ఎన్ని ప్రయోగాలు జరిగినా, ఉత్పత్తిలో ఎంత అభివృద్ధి వచ్చినా అది వర్గ పోరాట ప్రాతిపదికగా జరగాలి. అందుకే పదేళ్లు పోయాక 1966లో ఈ దశాబ్దం ఈ దిశగానే పురోగమించిందా? వర్గ పోరాటం ప్రాతిపదికగనే ఉత్పత్తి, అభివృద్ధి జరిగాయా? అని మావో సె టుంగ్ ఒక సమీక్ష చేశాడు. కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ ఆ దిశలో మొత్తం పార్టీని, శ్రామికవర్గాన్ని నడిపించిందా అని కూడా సమీక్షించాడు. ఈ సమీక్షలో ఆయన దృష్టికి ఆశ్చర్యకరమైన అంశాలు వచ్చాయి. దేశంలో ప్రజల మీద 40 శాతంగా బూర్జువా భావజాల ప్రభావం ఉందని విశ్లేషించాడు. వ్యవసాయ విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాలు కూడా వ్యవసాయ రంగంలో ఒక రైతుకు ఉండే ఆచరణాత్మక అనుభవం ఆధారంగా కాకుండా డిగ్రీల ఆధారంగా దొరుకుతున్నాయనే చిన్న ఉదాహరణ ఆయనకు విద్యాలయాల మీదికి దృష్టిని మళ్లించింది. చాలా యూనివర్సిటీలలో ప్రొఫెసర్లు క్యాంపస్‌లకు, క్లాస్‌రూంలకు పరిమితమై బోధన చేస్తున్నారు తప్ప వాళ్ల బోధనలకు సంబంధించిన సామాజిక ఆచరణతో ప్రజలతో ఎక్కడా సంబంధం లేకుండా ఉంటున్నారని బయటపడింది. ఈ విశ్లేషణ తీగ లాగితే డొంకంతా కదిలినట్టుగా, అసలు పార్టీ కేంద్ర కమిటీలోనే బూర్జువా భావజాల ప్రభావం కనిపించింది. చైనా ఆంతరంగిక రాజకీయార్థిక ప్రజా జీవితంలో ఈ ప్రభావానికి ఒక ముఖ్యమైన బాహిర కారణం ఉన్నది. అదే 1956 మాస్కోలో జరిగిన 80 దేశాల కమ్యూనిస్టు పార్టీల కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ సోవియెట్ యూనియన్ (సిపిఎస్‌యు) మహాసభలో కృశ్చేవ్ చేసిన ప్రతిపాదన.

ఈ సభలో సోవియెట్ కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి కృశ్చేవ్ ఒక సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. ఒక్క మాటలో అది వర్గసామరస్య సిద్ధాంతం. ప్రపంచంలో రెండు పెద్ద దేశాల్లో సామ్యవాదం వచ్చింది గనుక, అందులోనూ రష్యాలో దాదాపు నాలుగు దశాబ్దాల్లో అది స్థిరపడి, రెండో ప్రపంచ యుద్ధానికి అది నాయకత్వం కూడా వహించి, విజయాన్ని సాధించింది గనుక ఇంక వర్గపోరాటం అవసరం లేదనేది ఆ ప్రతిపాదన. అమెరికా, యూరప్ వంటి పెట్టుబడిదారీ దేశాలతో రష్యా, చైనాల నాయకత్వంలో సోషలిస్టు దేశాలు, మూడో ప్రపంచం మార్కెట్ రంగంలో పోటీపడవచ్చునని శాంతియుత పోటీ సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. ఈ రెండు దేశాల నుంచి సామ్యవాదం వైపు పయనించాలని అనుకుంటున్న దేశాలలో సామ్యవాద పరివర్తన తేవాలని రెండో ప్రతిపాదన. అంటే ఈ సామ్యవాద ప్రతిపాదన ద్వారా మూడో ప్రపంచ దేశాల్లో పబ్లిక్ రంగంలో పరిశ్రమలు పెడితే, అది శాంతియుతంగానే సామ్యవాదానికి పరివర్తన తెస్తుందని. ఈ పోటీ, పరివర్తనల కారణంగా పెట్టుబడిదారీ దేశాలతో శాంతియుత సహజీవనం చేయవచ్చుననేది దీని సారాంశం. కనుక ఇక వర్గపోరాటం అవసరం లేదనేది సందేశం.

సమాజంలో వర్గాలు ఉన్నంత కాలం వర్గపోరాటం ఉంటుందని మావో నాయకత్వంలో ఈ సిపిఎస్‌యు ప్రతిపాదనలకు భిన్నంగా వివిధ దేశాల కమ్యూనిస్టు పార్టీలు చర్చను లేవదీశాయి. ఒక అగ్రదేశపు కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలోనే ఇటువంటి ఆలోచన వచ్చిందంటే వర్గాలు ఎక్కడో కమ్యూనిస్టు పార్టీ బయట కాదు, కమ్యూనిస్టు పార్టీలోనే వర్గేతర భావజాలం ఉండే అవకాశం ఉందని ప్రతిపాదించాయి. కమ్యూనిస్టు పార్టీలో రెండు ధోరణుల మధ్య లేదా రెండు పంథాల మధ్య పోరాటం జరుగుతుంది అని చెబుతున్నాం అంటేనే దానర్థం శ్రామికవర్గ, శ్రామికవర్గేతర భావజాలం మధ్య అది వర్గపోరాటం అని అర్థం. ఇంకా ముందుకు తీసుకువెళ్లి చైనా శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవంలో మావో సె టుంగ్ 'కేంద్రాన్ని బద్దలు కొట్టండి' అనే పిలుపు పదేళ్ల తరువాత అందుకే ఇవ్వాల్సి వచ్చింది. అంటే, పదేళ్ల మహత్తర చర్చ మాత్రమే కాదు, ఈ చర్చ క్షేత్రస్థాయిలో ఒక ఆచరణకు అనుగుణంగా వచ్చింది అనే విషయం రుజువైంది. ఈ పది సంవత్సరాలు ప్రపంచ వ్యాప్తంగా మావో సె టుంగ్ నాయకత్వంలో వివిధ దేశాల కమ్యూనిస్టు పార్టీలు కృశ్చేవ్ సిద్ధాంతానికి వ్యతిరేకంగా పోరాడాయి. ఆ పోరాటమంతా మహత్తర చర్చ రూపంలోనే ఉన్నదంటేనే దానర్థం రష్యాలోనూ, వివిధ దేశాల్లోనూ శ్రామికవర్గ భావజాలం

బూర్జువావర్గపు భావజాలంతో క్షేత్రస్థాయిలో ఘర్షణ పడుతూనే ఉన్నది. సముద్రంలో నుంచి మంచు శిఖరం కనిపించినట్లుగా (టిప్ ఆఫ్ ది ఐస్ బర్గ్) అది చైనాలో ఈ చర్చ ముగిసే నాటికి శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవంగా బయటపడింది. సామ్యవాద పునాది చెదిరిపోకుండానే, శ్రామికవర్గ నాయకత్వం ఉండగానే ఈ బూర్జువా భావజాలం ప్రబలిందంటే దానర్థం పునాది ఆచరణపై ఉపరితల భావజాల ప్రభావం ఉంటుందనే సత్యం బయటపడింది. అందుకే ఇది శ్రామికవర్గ పోరాటం. బోల్షివిక్ విప్లవం (1917) వలె చైనా విప్లవం (1949) వలె. అదే సమయంలో ఇది సాంస్కృతిక విప్లవం కూడ. శ్రామికవర్గానికీ, పీడిత పోరాట ప్రజలకూ సామ్యవాద ఫలాలు న్యాయంగా అందకపోవడం మాత్రమే కాదు, వాళ్లకు నాయకత్వం వహిస్తున్న పార్టీలో, ప్రభుత్వంలో, వివిధ శాఖల్లో బూర్జువా భావజాలం పేరుకొనిపోయింది. ఎంత సంచయం అయిందని కాదు, సంచయ భావన నాయకత్వంలో పోలేదని ఇక్కడ ముఖ్యమైన అంశం. అందుకే ఇది ఒక సమగ్రమైన విప్లవం. దీనికి రష్యా విప్లవం నాటి వలె ఒక సాయుధ తిరుగుబాటు, చైనా విప్లవ కాలం వలె ఒక దీర్ఘకాలిక సాయుధ పోరాటం అవసరం లేకపోవచ్చు కాని, ఇది ఒక వర్గ పోరాటమే. దీనికి శ్రామికవర్గమే నాయకత్వం వహించాలి. ఇది 1946 మే 16న ప్రారంభమైందంటే దానర్థం ఒకరోజు మొదలై ఒకరోజు ముగిసిందని కాదు. పదేళ్లుగా దేశంలో పేరుకున్న బయటి దేశాల ప్రభావాలతో ఒక పెట్టుబడిదారీ పంథా దశగా సాగుతున్న నాయకత్వానికి వ్యతిరేకంగా ఆ రోజు మొదలైందే తప్ప ఒకప్పుడు ముగిసిందని కాదు. అందుకే మావో సె టుంగ్ అది నిరంతరం జరగాలని అన్నాడు. వాస్తవానికి బోల్షివిక్ విప్లవ కాలానికే లెనిన్ ఇటువంటి సాంస్కృతిక విప్లవాల అవసరాన్ని గుర్తించాడు. ఆ తరువాత ఆయన నాలుగేళ్లే బతకడం రష్యాలో సామ్యవాద నిర్మాణ దశలో స్టాలిన్ నాయకత్వంలో కార్మికవర్గేతర ధోరణుల నుంచి కొన్ని సమస్యలు ఎదుర్కోవలసి రావడం, ఇంతలో ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మాంద్యం, యుద్ధ వాతావరణం, యుద్ధం వంటివన్నీ అటువైపుగా కృషి జరగడానికి కొన్ని పరిమితులు అయ్యాయి. విప్లవాన్ని అర్థం చేసుకోవడంలో కూడ ఆ కాలపు పరిణతి, పరిమితులు కొన్ని కారణమయ్యాయి.

మావో సె టుంగ్ శ్రామిక వర్గ సాంస్కృతిక విప్లవాన్ని నిర్వహించడానికి రెడ్ గార్డ్స్ అనే ఒక విద్యార్థి, యువ ఎర్ర సైన్యాన్ని తయారు చేశాడు. అంటే, పదేళ్లుగా నిర్మాణం అవుతున్న సామ్యవాదాన్ని పెట్టుబడిదారీ బాట పట్టకుండా కాపాడుకోవడం. చెదలు పట్టకుండా కాపాడుకోవడం. దాడి చేయడానికి, కాపాడుకోవడానికి పోరాట పద్ధతుల్లో తేడా ఉంటుంది. మావో సె టుంగ్ ఇచ్చిన పిలుపు అయితే చైనా సామ్యవాద సమాజంలో శ్రామిక వర్గానిదే నాయకత్వమూ, పైచేయి కనుక అధికారం వాళ్లదే కనుక బూర్జువా వర్గంతో తలపడే క్రమంలో దాడిచేయాల్సిన అవసరం లేదు. కాని, ఆ వర్గాన్నీ, ఆ భావజాలాన్నీ ప్రతిఘటించాల్సి ఉన్నది. ఆ ప్రభావంలోకి పోతున్న ప్రజలకు ఓపికగా సామ్యవాద భావజాలాన్ని వివరించి సరియైన మార్గంలోకి తేవాల్సి ఉన్నది. మావో సె టుంగ్ మొత్తం విప్లవ కాలంలో చెప్పిన అధ్యయనం, పరిశోధన, చర్చల ద్వారా ఒప్పించడం అనే అంశానికి మరింత ప్రాధాన్యం ఇవ్వాల్సిన తరుణం ఇది అని చెప్పాడు.

1973 చైనా కమ్యూనిస్టు పార్టీ పదవ కాంగ్రెస్‌లో రూపొందించిన ఒక సూత్రీకరణ ప్రాతిపదికగా 1966 నుంచే శ్రామికవర్గం ఈ పోరాట ఆచరణ ఉండాలని చెప్పాడు. అవి ఈ పోరాటానికి ప్రాతిపదికగా వర్గపోరాటం. అది భూమిక. దాని ఒక కోణం ఉత్పత్తి, మరొక కోణం ఉత్పత్తిలో చేయవలసిన ప్రయోగం. అంటే, వైజ్ఞానిక, సాంకేతిక పరిశోధన కావచ్చు, విజయాలు కావచ్చు. అది అభివృద్ధికి దారి తీసే మార్గం అవుతుంది.

యాదృచ్ఛికమే కావచ్చు కాని ఈ విప్లవం కూడ పదేళ్లు (1966-76) నడిచింది. రెండు దశలుగా నడిచింది. మొదటి దశ, 1966 నుంచి 73, రెండవ దశ 1973 - 76. మొదటి దశ విప్లవకాలంలో చైనా కమ్యూనిస్టు పార్టీ తొమ్మిదవ కాంగ్రెస్ జరిగింది. అది ముగిసిన కాలంలో 1973లో పదవ కాంగ్రెస్ జరిగింది. ఈ పదవ కాంగ్రెస్‌లోనే ఏడేళ్ల అనుభవాలతో కొన్ని సూత్రీకరణలు చేశారు. ఒక విధంగా చెప్పాలంటే శ్రామిక వర్గ సాంస్కృతిక విప్లవ కాలంలో వలె ఇది మార్క్సిజం-లెనినిజం అనే అమ్ములపొదిలో మరికొన్ని కొత్త ప్రతిపాదనల, ఆలోచనల, ఆచరణల ఆయుధాలను చేర్చింది.

రెడ్ గార్డ్సును రూపొందించి సమాజంలోని ఏయే రంగాల్లో బూర్జువా భావజాలం పేర్కొని పోయిందో ఆ మూలాలకు వెళ్లి పోరాడడానికి ముందు బయట పడిన విషయమేమిటంటే చైనాలో పదేళ్ల సామ్యవాద ప్రయోగం తరువాత కూడ శరీర శ్రమకు, బౌద్ధిక శ్రమకు మధ్యన వ్యత్యాసం సామ్యవాద భావజాల అనుగుణంగా జరగలేదు. బూర్జువా భావజాలందే ప్రాబల్యంగా ఉన్నది. కమ్యూన్‌లలో పనిచేసేవాళ్లు శ్రామికులూ, రైతాంగంగా ఉంటున్నారు, బుద్ధిజీవులు అధికారంలోని శాఖల్లో, విద్యాలయాల్లో ఉంటున్నారు. కమ్యూన్‌లలో పనిచేసేవాళ్లకే పనులు. విద్యాలయాల్లో పనిచేసేవాళ్ల సంతతికి, అధికారంలో ఉన్నవాళ్ల సంతతికే చదువులు. కనుక ముందుగా ఒక సంవత్సర కాలం పాటు విశ్వవిద్యాలయాలను మూసేయాలని నిర్ణయం తీసుకున్నారు. విశ్వవిద్యాలయాల్లోని అధ్యాపకులు తమ విద్యార్థులతో పాటు కమ్యూన్‌లలో వెళ్లి శరీర శ్రమలో పాల్గొనాలని నిర్ణయం తీసుకున్నారు. ఆ తర్వాత కాలంలో 1973 నాటికి ఇండియాలో బీహార్ ఉద్యమంలో జయప్రకాశ్ నారాయణ్ మీద ఇది వేసిన ప్రభావాన్ని మనం తరువాత మాట్లాడుకోవచ్చు. కంపూచియాలో పోల్‌పాట్ నాయకత్వంలో ఇది మరింత కఠినంగా ఆచరించే ప్రయత్నం చేస్తేనే బూర్జువా ప్రపంచం గగ్గోలు చేసింది. చైనా శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవం గురించి, రెడ్ గార్డ్స్ గురించి కూడా పాశ్చాత్య బూర్జువా సమాజం తక్కువేమీ బదనామ్ చేయలేదు.

అయితే, ఈ మొదటి దశలో కొన్ని అతివాద ధోరణలు రాలేదని కాదు. ముఖ్యంగా తొమ్మిదవ కాంగ్రెస్‌లో మావో సె టుంగ్ కమ్యూనిస్టు పార్టీకి శాశ్వత చైర్మన్‌గా, లిన్‌పియావోను శాశ్వత వైస్ చైర్మన్‌గా ఎన్నుకోవడం, నక్సల్బరీ విప్లవం తరువాత చైనా చైర్మన్ మా చైర్మన్ అని మన దేశంలో నినాదమిచ్చేంత విపరీత ధోరణికి కారణమయింది. ఈ తొలి దశలో ఆచరణలో లిన్‌పియావో చేసిన కొన్ని ప్రతిపాదనలు అతివాద ధోరణికి దారులు వేశాయి. దేశంలో

మావో సె టుంగ్ చిత్రాల పెద్ద పెద్ద హోర్డింగ్‌లు, కటౌట్‌లు పెట్టడం, మావో సూక్తులతో రెడ్‌బుక్ లక్షల సంఖ్యలో ప్రచురించి, ప్రతి రెడ్ గార్డు చేతిలో అది ఉండి, అది ఒక్కటి చదివితే చాలనడం అటువంటిదే. ఎక్కువ అధ్యయనం చేస్తే పుస్తకాల పురుగులవుతారని, రెడ్ బుక్ ఒక్కటే సాంస్కృతిక విప్లవమంతా మార్గదర్శకంగా ఉండాలని ఆయన ప్రతిపాదించాడు. చైనా విప్లవకాలంలో వచ్చిన చాలా సాహిత్యంలో రివిజనిజం ఉందని, ఆ సాహిత్యంపై, రచయితలపై దాడులు చేయడం, షేక్స్పియర్ నాటకాల ప్రదర్శనను నిలిపివేయడం వంటివి ఈ కాలంలో జరిగాయి. చివరకు లిన్‌పియావో ఈ మొదటి దశలో రెడ్‌గార్డ్స్‌లోనూ, సైన్యంలోనూ తన అతివాద వాగాడంబరం, ఆచరణతో పట్టు సాధించి మావో పేరు జపిస్తూనే మావో నాయకత్వాన్ని కూల్చడానికి ప్రయత్నం చేశాడనేది 1973లో బయటపడింది.

అయితే, శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవ కాలంలో అన్ని రంగాలలో వర్గపోరాటం ప్రాతిపదికగా అపూర్వమైన విజయాలు సాధించారు. ఒక్కమాటలో ఒక నూతన మానవ ఆవిష్కరణ ప్రయోగం ప్రారంభమైంది. విలియం హింటన్ (టర్నింగ్ పాయింట్ హండ్రెడ్ డేస్ వార్), జోన్ రాబిన్సన్, హన్‌సూయిన్, జోస్ మారియస్ సిసాన్, అజిత్ వంటి ఎందరో ఈ విప్లవ కాలంలో రాసిన పుస్తకాలు ప్రపంచంలో ప్రజాస్వామ్యవాదుల దృష్టిని ఆకర్షించాయి. జోన్ రాబిన్సన్ 'రేపటి చైనా' అనే పుస్తకాన్ని ఈ విప్లవ కాలంలో నూరు కోట్ల జనాభా ఉన్న చైనా నూరు కోట్ల మావోలు రూపొందే నూతన మానవ ఆవిష్కరణ చేస్తున్నదని, అయితే అందుకోసం నూరు విప్లవాల అవసరం రావచ్చునని రాసింది. వ్యవసాయం, విద్య, వైద్యం, సహకారం, సమష్టి కృషి వంటి వివిధ జీవన పార్శ్వాలకు వర్గపోరాటాన్ని ప్రాతిపదికగా చేసి ప్రయోగాలు చేశారు.

1) వ్యవసాయ రంగంలో అప్పటికే కమ్యూన్‌లు పనిచేస్తున్నప్పటికీ సహకార స్థాయి నుంచి సమష్టి స్థాయికి భూపంపకాలను గానీ, ఉత్పత్తిని గానీ తీసుకుపోవడం అనేది సామ్యవాద సమాజ ప్రధాన లక్ష్యం అయితే, అంతకన్న ఉన్నత దశ ఎవరి చేతనైనంత వారు, ఎవరికి అవసరమైనంత వారు పొందడమనేది. ఇది అమలు చేసే క్రమంలో ఆరోజుల్లో సుప్రసిద్ధమైనటువంటి టాచై ప్రయోగం అనేది జరిగింది. ఈ కాలంలోనే విస్తృతమైన ప్రజా ఉద్యమాల ద్వారా వ్యవసాయ కమ్యూన్‌లను విప్లవీకరించి పీస్ మీల్ కూలీ రేటు విధానాన్ని ప్రవేశపెట్టారు. ఉత్పత్తి, పంపిణీ విధానాల్లో ప్రజలందరికీ చెందే విధానాన్ని విప్లవీకరించడానికి ఒక ఉదాహరణ.

ఒక గ్రామంలో ఉత్పత్తి చాలా ఎక్కువగా జరిగింది. మరొక గ్రామంలో అక్కడి భూమి తదితర అననుకూల పరిస్థితుల వల్ల అక్కడి జనాభాకు అవసరమైనంత ఉత్పత్తి జరగలేదు. కనుక అక్కడికి అవసరమైన ధాన్యాన్ని పంపించాలని వ్యవసాయశాఖ నిర్ణయం తీసుకున్నది. శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవానికన్నా ముందు రైళ్లు చాలా ఆలస్యంగా నడిచి ప్రయాణికులకూ, అవసరాల చేరవేతకూ చాలా ఇబ్బందులు ఏర్పడ్డాయి గనుక, రైళ్లు సకాలంలో నడపాలని రైల్వేలను పర్యవేక్షిస్తున్న పార్టీ శాఖ ఒక నిర్ణయం తీసుకుంది. ఉత్పత్తి ఎక్కువగా జరిగిన గ్రామంలో ధాన్యం బస్తాలను రైళ్లో వేయడానికి ఆలస్యం జరిగి, రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయని ఈ శాఖ అభ్యంతరం పెట్టింది. ఈ ధాన్యం చేరాల్సిన గ్రామానికి ఇది ఒక ఆటంకంగా మారింది. రెండు శాఖలను సమన్వయపరిచి, ఈ ధాన్యాన్ని బోగీలకు ఎక్కించడంలో ఇప్పుడు ఎంతమంది పాల్గొంటున్నారు, ఇంకెంత ఎక్కువ మందిని ఇందులో భాగస్వాములను చేస్తే బోగీలోకి ధాన్యం ఎక్కించగలం, రైళ్లు సకాలంలో నడవగలవు అని సమీక్షించి పార్టీ అది ఆచరించింది. ఈ ఉదాహరణలో ఇమిడి ఉన్న ప్రజాదృక్పథం ఏమిటంటే పొరుగు గ్రామానికి సహాయం చేయడం అనే పనిలో ఈ గ్రామస్థులు అందరూ పాల్గొనగలిగారు. సహాయ సహకారం అనే భావన ఎక్కువ మందిలో కలిగించగలిగారు. ఇది చైతన్య స్థాయి పెరగడానికి దోహదం చేస్తుంది. సాంస్కృతికంగా వర్గ పోరాట చైతన్యం అంటే మచ్చుకు ఇది ఒక ఉదాహరణ. ఒక్కమాటలో కమ్యూనిస్టు అంటే ఏమిటో నిర్వచించమని మావో సె టుంగ్‌ను అడిగితే ప్రజలకు సేవ చేయడం అన్నాడు. ఈ ప్రజలకు సేవ చేయడం అనే ఒక సంస్కృతి ఒక చైతన్యంగా, మావన నైసర్గిక స్వభావంలో ఈ వర్గసమాజంలో కలగడమే విప్లవం.

2) వైద్య రంగంలో వికేంద్రీకృత వైద్య, ఆరోగ్య విధానం ప్రవేశపెట్టాడు. ముఖ్యంగా ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధమైనటువంటి పాదరక్షలు లేని వైద్యులు (బేర్‌ఫుట్ డాక్టర్స్) వేల, లక్షల సంఖ్యలో రూపొందారు. ఏడేళ్ల నుంచి పదిహేనేళ్ల దాకా వైద్యం శాస్త్రం చదివే పాశ్చాత్య భావవాద వైద్య విధానానికి భిన్నంగా ప్రజల నుంచి ప్రాథమిక ఆరోగ్య రక్షణకు అవసరమైన వైద్యులను తక్కువ కాలపు శిక్షణతో తయారుచేసే పద్ధతి ఈ కాలంలో రూపొందింది. ఇదే క్రమంలో అన్ని దేశాలలోని వేల సంవత్సరాల ప్రజల అనుభవం నుంచి, ముఖ్యంగా చైనా ప్రజల అనుభవం నుంచి రూపొందిన వైద్య, ఆరోగ్య చికిత్సలను పరిశోధించి బయటికి తెచ్చారు. ఈ ఒక్క వైద్య విషయంలోనే కాదు, ఒక విధంగా జీవితంలోని అన్ని రంగాలకు అన్వయించారు.

దీనినే ఒక విధంగా ప్రజల సాంకేతిక విజ్ఞానం (ఇండీజినస్ టెక్నాలజీ) అని పేర్కొనవచ్చు. సుదీర్ఘ కాలపు విశాల ప్రజానీకకు శ్రమ నుంచి, అనుభవం నుంచి, అందువలన వచ్చిన జ్ఞానం నుంచి, ఊహ నుంచి, వీటి సారంగా పొందే వివేకం నుంచి అభివృద్ధి చెందే జ్ఞానం. అదే ప్రజల సాంకేతిక విజ్ఞానం. వైద్య రంగం గురించే చెప్పాలంటే చెట్లు చేమల నుంచి, ఆకు అలముల నుంచి, ఆదివాసులు రూపొందించే చికిత్సా విధానమిది. రైతాంగం వ్యవసాయ క్రమంలో రూపొందించే చికిత్సా విధానం. చైనా అత్యంత ప్రాచీనమైన రైతాంగ దేశం గనుక వాళ్లకీ వివేకం అపారంగా ఉన్నది. అది తవ్వితీసి మోటుగా, ముడిసరుకుగా ఉన్న దానిని శాస్త్రీయంగా అన్వయించడమే పోరాట ఫలితంగా పొందిన సంచిత జ్ఞానం చేయగలదు. చైనాలో విస్తృత ప్రచారమైన ఆక్యుపంచర్ అటువంటి వైద్య విధానమే. రెండు ప్రపంచాలకు అన్వయించి చెప్పాలంటే శ్రామిక వర్గ సాంస్కృతిక విప్లవ కాలంలో ముందుకు వచ్చి ఇవాళ దండకారణ్యంలో ఒక యుద్ధ స్థాయిలో జరుగుతున్న ఘర్షణ అంతా పెట్టుబడిదారీ సాంకేతిక జ్ఞానమూ, అభివృద్ధికీ ప్రజల స్వావలంబన,

సాంకేతిక జ్ఞాన వివేక చోదితమైన అభివృద్ధికీ మధ్యనున్నదే.

వైద్య రంగంలో చేసిన ఎంతో సృజనాత్మకమైన చికిత్సలకు ఉదాహరణగా ఒక కార్మికుడి చేతివేళ్లు తెగిపోతే అవి మళ్లీ అతికించిన క్రమాన్ని, విరిగిన ఎముకలను మళ్లీ వాటి స్థానంలో పెట్టిన విధానాన్ని ఆ కాలపు సాహిత్యం పాశ్చాత్య దేశాలకు కూడా ఆశ్చర్యపడేంతగా పరిచయం చేసింది. పేద ప్రజానీకానికి ఈ కాలంలో అందినంత విస్తృతంగా ఏ కాలంలోనూ వైద్యసేవలు అందలేదు. జోషువా హార్న్ అనే ఒక రచయిత 'అవే విత్ ఆల్ పెస్ట్స్' అనే పేరుతో వైద్యరంగంలోని కృషి గురించి రాశాడు. (డా. ఎం.వి. రమణారెడ్డి తెలుగులోకి అనువదించాడు.) 1973-76 మధ్య చైనా రికన్‌స్ట్రక్ట్స్, చైనీస్ లిటరేచర్, చైనా పిక్టోరియల్ వంటి పత్రికల్లో విస్తారంగా ఈ విప్లవకాలపు ఎన్నో ప్రయోగాల గురించి రాశారు. పెకింగ్ రివ్యూ సరేసరే. ఈ రెడ్‌గార్డ్స్‌కు కమ్యూన్‌లలో, గ్రామాలలో ఎక్కడికక్కడ కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం వహించింది.

3) విద్యారంగంలో మావో సె టుంగ్ విద్యారంగంపై దృష్టి పెట్టడానికైనా, విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు తేవడానికైనా ఈ వ్యాసంలోని ఆయా సందర్భాల్లో ప్రస్తావించడం జరిగింది. శరీర శ్రమకు, బౌద్ధిక శ్రమకు మధ్యన ఏర్పడిన అంతరాన్ని తొలగించడానికి బూర్జువా భావజాలం పేర్కొన్న పాఠశాలలను, విశ్వవిద్యాలయాలను మొదట మూసివేయాలని నిర్ణయించు కున్నారు. అట్లాగే పరీక్షా విధానాన్ని రద్దు చేయాలనుకున్నారు. విద్యార్థులు రైతాంగం నుంచి, కార్మికుల నుంచి నేర్చుకోవాలని, అందుకోసం ఉత్పత్తిదాయకమైన శ్రమలో పాల్గొనాలని నిర్ణయం తీసుకున్నారు. కమ్యూన్‌లో వెళ్లి చదువు నేర్చుకోవడం, పాఠశాలలు కర్మాగారాలకు అనుసంధానం చేయడం ప్రవేశపెట్టారు. ఉత్పత్తి నుంచి విజ్ఞానశాస్త్రాన్ని నేర్చుకునే విధానాన్ని ప్రవేశపెట్టారు. విద్యార్థులూ, ఉపాధ్యాయులూ గ్రామాలకు వెళ్లి వ్యవసాయంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, అవి పరిష్కరించుకునే క్రమంలో వాళ్లు అనుసరించే విధానాలను నేర్చుకునే పద్ధతిని ప్రవేశపెట్టారు. తరగతి గదిలో అధ్యాపకుడు పాఠం సరిగా చెప్పకపోతే విద్యార్థికి నిద్రపోయే హక్కుందని ఈ కాలంలో మావో రాసిన వ్యాసం 1968 ఫ్రెంచ్ విద్యార్థి ఉద్యమంలో, అట్లాగే 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో కూడా చాలా ప్రచారంలోకి వచ్చింది. మావో పేపర్స్, విద్యపై మావో (సృజనలో సిఎస్ఆర్ ప్రసాద్ చేసిన అనువాదం ఒకటి రెండుసార్లు అచ్చయింది) పుస్తకాలు ప్రపంచ మంతా విశేష ఆదరణ పొందాయి. రొట్టె మాత్రమే కాదు, గులాబీలు కావాలి అని ఫ్రెంచ్ విశ్వవిద్యాలయాలలో విద్యార్థులు ఇచ్చిన నినాదం చదువులో సృజనాత్మకత కోరుకున్న ఆకాంక్షకు వ్యక్తీకరణ.

4) రైతుల, కార్మికుల ప్రజాస్వామిక హక్కుల సాధన కోసం విప్లవ కమిటీల ఏర్పాటు జరిగింది. ఈ కాలంలోనే ప్రతి నిర్మాణంలోను 'ఒకటిలో మూడు' (త్రీ ఇన్ వన్) అనే పద్ధతిని ప్రవేశపెట్టారు. ఈ మాట ఎన్నో అంశాలను సూచిస్తుంది. ప్రాతిపదిక మొత్తం కృషినే ఒక త్రికోణంగా భాగిస్తే భూమిక వర్గపోరాటం. ఒక కోణం ఉత్పత్తి. మరొక కోణం ప్రయోగం. అట్లాగే ప్రతి కమిటీలో మూడు తరాల ప్రాతినిధ్యం. మూడు వైవిధ్యాల ప్రాతినిధ్యం. ఈ మూడిటికీ వెనుక ఉన్న అవగాహన మొదటిది. దృక్పథం, అనుభవం, నైపుణ్యం అనే మూడు అంశాలు అన్ని కమిటీల్లో, అన్ని పనుల్లో, అన్ని చర్యల్లో, అన్ని నిర్మాణాల్లో ప్రతిఫలించాలి.

5) ప్రజాసైన్యం కూడా ఉత్పత్తిలో పాల్గొని, నిర్మాణాలలో, తుపానులు, వరదలు నివారించడంలో, కాలువలు తవ్వడంలో, రైతాంగానికీ, కార్మికులకూ సహకరించడంలో పాల్గొనాలి. సైన్యంలో ఎక్కువ తక్కువ పదవుల అంతరాలను రద్దు చేశారు. రైతాంగానికీ, కార్మికులకూ ఇచ్చినట్లే సైన్యానికి మార్క్సిస్ట్ - లెనినిస్ట్ సైద్ధాంతిక అవగాహన కలిగించారు. ఒక విధంగా విప్లవ ప్రజాస్వామిక సైన్యం రూపొందింది.

6) సాహిత్య, కళా రంగాలలో కూడా శ్రామికవర్గానికి ప్రాతినిధ్యం వహించే ఎన్నో కొత్త సృజనాత్మక అంశాలను ప్రవేశపెట్టారు. సంగీతం గురించి మావో సె టుంగ్ రాసిన వ్యాసం మళ్లీ ఇటు ప్రాచ్య, అటు పాశ్చాత్య సంగీతంలోని ప్రజల వివేక సంపదను ఉపయోగించుకోవాలనే విషయాన్ని ముందుకు తెచ్చింది.

7) ప్రజలకు విస్తృతంగా గోడపత్రికలు వేసి ప్రచారం చేసే అవకాశాలు కల్పించారు. వేల సంఖ్యలో ప్రజలు కదిలి మహత్తర చర్చను నిర్వహించారు. అభివృద్ధి నిరోధక భావజాల వ్యతిరేకంగా పోరాటాలు చేశారు. అవినీతి అధికారులను శిక్షించారు. పత్రికా స్వేచ్ఛ కోసం, ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడారు. స్వేచ్ఛగా మాట్లాడడం, స్వేచ్ఛగా భావాలను ప్రకటించడం, స్వేచ్ఛగా మహత్తర చర్చలో పాల్గొనడం, స్వేచ్ఛగా గోడపత్రికలు ప్రచురించడం అనే నాలుగు స్వేచ్ఛలు అనుభవించారు.

8) విప్లవ ప్రజాస్వామిక సైన్యం ప్రజాసైన్యాలకు అండగా నిలబడ్డది. వర్గపోరాటాలు గ్రహించిన మౌలిక విశాల ప్రజల హృదయంగా, ఆత్మగా ఈ సైన్యం నిలబడ్డది. పౌరులతో ఘర్షణ వచ్చినప్పుడు విప్లవ పంథాను బలపరచే విషయంలో వాళ్లకు తలొగ్గవలసిందేనని మావో ఇచ్చిన పిలుపును ప్రజావిముక్తి సైన్యం శిరసా వహించింది.

1973 పదవ కాంగ్రెస్‌లో ఈ ఏడేళ్ల ఆచరణను సమీక్షించుకొని కొన్ని సూత్రీకరణలు చేశారు. అప్పటికి లిన్‌పియావో చైనా నుంచి పారిపోయే ప్రయత్నంలో విమానం కూలి చనిపోవడం, మావో నాయకత్వంలోని ప్రభుత్వాన్ని కూల్చి పార్టీని విచ్ఛిన్నం చేయాలనే కుట్ర బయటపడింది. అతడు అతివాద ముసుగులో ఉన్న పెట్టుబడిదారీ పథగామి అని బయటపడింది. అయినా, దీనినొక ధోరణిగా పదవ కాంగ్రెస్ విశ్లేషించి తేల్చింది. వర్గపోరాటంలో ఒక ధోరణికి వ్యతిరేకంగా చేసే పోరాటం జరగవలసిన పద్ధతిలో జరగకపోతే మరొక ధోరణికి దారితీస్తుంది. మావో సె టుంగ్ రైతాంగానికి చెప్పే అర్థమయ్యే పద్ధతిలో చెప్పాలంటే తలనొప్పి కోసం వాడే మందు కణతలకు ఎక్కువ ప్రయోగిస్తే అక్కడ చర్మం నల్లబడి తొలగిపోతుంది. రివిజనిజంపై చేసే పోరాటం వర్గపోరాట ప్రాతిపదికగా జరగకపోతే అది అతివాదానికి దారితీస్తుంది. అతివాదం రివిజనిజం మరో రూపమే. రివిజనిజం అంటే మితవాదమే కానక్కర్లేదు. రివిజనిజం అంటే అతివాదం కూడా. వర్గపోరాటానికి వ్యతిరేకమైనది ఏదైనా అది రివిజనిజమే.

రెండవది, కుట్రలూ, కుహకాలూ చేయకండి, పారదర్శకంగా (అబోవ్ బోర్డ్) ఉండండి. మూడవది, చీలిపోవద్దు, ఐక్యంగా

ఉండండి. నాల్గవది, పంథా సరియైంది అయితే ఎన్ని నష్టాలు వచ్చినా అంతిమంగా విజయం లభిస్తుంది. ఆ పంథా సరియైందని రుజువవుతుంది. రష్యా విప్లవంలో బోల్షివిక్ పార్టీని ఏర్పాటు చేసి లెనిన్ రుజువు చేసిందైనా, హునాన్‌లో భూసంబంధాల విశ్లేషణ కాలంలో మావో సె టుంగ్ రుజువు చేసిందైనా ఇదే. తెరచాప చినిగినా, మొనగాడు తమ్ముణ్ని మొసలి మింగేసినా, పడవ మునకేసినా చుక్కాని సరియైందైతే తీరాన్ని చేరుకుంటామనే కవితా స్పందన దీన్నించి వచ్చిందే.

అయితే, 1966లో సాంస్కృతి విప్లవం ప్రారంభమైనప్పుడు పార్టీ నుంచి తొలగించిన డెంగ్ సియావోపింగ్‌ను 1973లో మళ్లీ పార్టీలోకి తీసుకున్నారు. పార్టీలోనూ, ఎర్రసైన్యంలోనూ మొదటి నుంచి అటు లిన్‌పియావోకు, డెంగ్ సియావోపింగ్‌కు నిర్మాణాల మీద పట్టు ఉన్నది. స్థూలంగా ఒకరు అతివాదానికి, మరొకరు మితవాదానికి ప్రతినిధులు అనే భావన ఒకటి ఉన్నది. ఈ ఇద్దరి మధ్యన ఒక సమతూకాన్ని ఎల్లకాలమూ ఉండేటట్లుగా చౌఎన్‌లై చూసేవాడనే భావన కూడా ఉన్నది. అటు లిన్‌పియావో మరణం, అతడు చేసింది కుట్ర అని బయటపడడం, ఇటు మళ్లీ తనకు పార్టీలో పట్టు చిక్కడంతో డెంగ్ సియావోపింగ్ తన మితవాద పంథాను ప్రవేశపెట్టిన క్రమమే 1973 నుంచి 76 దాకా కొనసాగింది. ఆయన పూర్తిగా తన చేతుల్లోకి పార్టీ, ప్రభుత్వ అధికారం తీసుకునేదాక రెండు పంథాల మధ్య పోరాటం సాగలేదని కాదు, కాని, సరియైన మార్గాన్ని అనుసరించేవాళ్లు క్రమంగా బలహీనపడ్డారు. ఆ వివరాలకన్న ఒక్కమాటలో చెప్పాలంటే డెంగ్ చేసిన ప్రతిపాదన అభివృద్ధి, అభివృద్ధి. 'ఏ పిల్లి అయితే ఏమిటి, ఎలుకను పట్టడానికి' అంటే అభివృద్ధిని సాధించడానికి వర్గపోరాటం అనే ఎర్ర పిల్లియే కానక్కర్లేదు. ఉత్పత్తిలో ప్రయోగం ద్వారా అభివృద్ధి వస్తుంది. ఆ ప్రయోగానికి వర్గపోరాటమే ప్రాతిపదిక కానక్కర్లేదు. గమ్యానికి అనుగుణమైన గమనం ఉండాలనే ప్రజాపంథాకు ఇది భిన్నమైంది. లక్ష్యం మీదనే దృష్టి ఉండడమనే ప్రజాపంథాకు, వర్గపోరాట స్వభావానికి ఇది విరుద్ధమైన అవగాహన. పెట్టుబడిదారీ దేశాలతో సమవుజ్జీగా పోటీపడడానికి తాను అధికారంలోకి వచ్చి పట్టు చిక్కిన తర్వాత, ముఖ్యంగా, సామ్రాజ్యవాద, ప్రపంచీకరణ నేపథ్యంలో డెంగ్ అమెరికాకు కొన్ని వేల మంది సాంకేతిక వైజ్ఞానిక శాస్త్రవేత్తలను పంపించడం, వాళ్లు తిరిగి వచ్చి తమకు అమెరికాలో వంటి స్వాతంత్ర్యం కావాలని కోరడం, తీన్‌మెన్ స్క్వేర్ ఘటన ఈ ఆలోచన ధోరణికి పరాకాష్టయే.

శ్రామికవర్గ నాయకత్వంలో సామ్యవాదం అమలయ్యే ప్రజల ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛకు గీటురాయి ప్యారిస్ కమ్యూన్ అవుతుంది. ప్యారిస్ కమ్యూన్‌లో కమ్యూనార్డులు, శ్రమజీవులు అనుభవించిన స్వేచ్ఛ అవుతుంది. అది బూర్జువా వర్గం స్వేచ్ఛ కాదు. చూపేది అమెరికాలోని లిబర్టీ స్టాచ్యూనే కావచ్చు కాని, అక్కడ తీన్‌మెన్ స్క్వేర్ నాటికే అమలులో ఉన్నది అబ్రహం లింకన్ ఆశించిన ప్రజాస్వామ్యం కాదు. అది ప్రజల కొరకు, ప్రజల చేత, ప్రజలే అమలు చేస్తున్న ప్రజాస్వామ్యం కాదు. కాని, బూర్జువా భావజాలం ప్రబలే క్రమంలో అది విద్యావంతులు కోరుకొనే స్వేచ్ఛగా కనిపిస్తుంది.

1976, సెప్టెంబర్ 9న మావో సె టుంగ్ అమరుడయ్యాడు. అప్పటికే ఆయనకు పార్టీ మీద, ప్రభుత్వం మీద పట్టు తగ్గింది. అప్పటికే పార్టీలోనూ, ఎర్రసైన్యంలోనూ డెంగ్ సియావోపింగ్‌కు చాలా ప్రభావం పెరిగింది. ఆ తర్వాత కాలంలో కొన్ని నాయకత్వాలు, కొన్ని ప్రభుత్వాలు మారినప్పటికీ కొంతమంది ముఖ్యంగా ఇతరులు గ్యాంగ్ ఆఫ్ ఫోర్‌గా పిలిచిన నలుగురు సాంస్కృతిక విప్లవం భావాలను కొనసాగించాలని ప్రయత్నం చేసినప్పటికీ వాళ్లమీద లిన్‌పియావో అతివాద ప్రభావం పూర్తిగా తొలగిపోలేదు. స్వయంగా మావో సె టుంగ్ సహచరి చియాంగ్ చింగ్ మీద ఆ ప్రభావం ఉన్నట్టు మావో తన చివరి రోజుల్లో ఆమెకు ఒక లేఖ రాశాడు. చైనా కమ్యూనిస్టు పార్టీ తొమ్మిదవ కాంగ్రెస్‌లో తనను శాశ్వత చైర్మన్‌గా నిర్ణయించినప్పటి స్థితి గురించి అందులో ప్రస్తావించాడు. కేంద్ర కమిటీలో ఉన్నవారిలో లిన్‌పియావో ఆ ప్రతిపాదన చేస్తే ఒక్కరు కూడా వ్యతిరేకించలేదని, శ్రామికవర్గ పార్టీలో ఈ శాశ్వత నిర్ణయాలు తప్పని తాను చెపితే లిన్‌పియావోకు ఎటువంటి ఆమోదం వచ్చిందో, తనకూ అటువంటి ఆమోదం వస్తుందని తెలిసినా అట్లా ఒక వ్యక్తి మాటతో నిర్ణయాలు మారడం కాకుండా చర్చ జరిగి సమష్టి నిర్ణయాలు రావాలని, ఆ చైతన్యం కేంద్ర కమిటీలోనే లోపించిందని, అందుకే తాను కేంద్రాన్ని బద్దలు కొట్టాలనే పిలుపు ఇవ్వాల్సి వచ్చిందని రాశాడు. ఒక తప్పు నిర్ణయానికి తాను మౌన సాక్షినయ్యాననే మచ్చ మాత్రం తన చరిత్రలో ఉండిపోతుందని అన్నాడు. అట్లాగే ఆమె 'అగాథమైన లోతుల్లో (అబిస్మల్ డెప్త్స్)కి కూరుకుపోతుందని, ఇప్పుడు చేయి అందించినా అందుకోలేని స్థితి వచ్చిందని బాధపడ్డాడు.

అయితే, 1971లో అమెరికా అధ్యక్షుడు నిక్సన్ చైనాకు మొదటిసారి రావడానికి ఆహ్వానం అందించడంలోనే రివిజనిజానికి ఒక తలుపు తెరిచినట్లయిందని భావించేవాళ్లున్నారు. స్టాలిన్ కాలంలో రష్యా గురించి బైటి ప్రపంచానికి రష్యాకు మధ్యన ఒక ఇనుప తెర ఉందనేవాళ్లు. అట్లాగే చైనాకు ప్రపంచానికి మధ్య ఒక వెదురు తెర ఉందని 71 దాకా చెప్పుకునేవాళ్లు. 71 దాకా పెట్టుబడిదారీ ప్రపంచం చైనా విషయంలో అటువంటి ఆంక్షల, నిషేధ, బహిష్కృత విధానాన్నే అవలంబించింది. నిక్సన్ చైనాకు వెళ్లిన రోజుల్లో సుప్రసిద్ధ బ్రిటిష్ చరిత్రకారుడు మాక్స్‌వెల్ కూడా వెళ్లాడు. పెకింగ్ విమానాశ్రయానికి దగ్గరగా ఉన్న ఒక పెద్ద హోర్డింగ్ ఆయన చూశాడు. 'బూర్జువా భావజాలం నశించాలి, ప్రోలిటేరియట్ భావజాలం వర్ధిల్లాలి' అని పెద్ద పెద్ద అక్షరాలు దాని మీద చదివి ఆ కమ్యూన్‌లో పనిచేస్తున్న వాళ్ల దగ్గరకు వెళ్లి ఆయన అడిగాడు. బూర్జువా అంటే ఏమిటి, ప్రోలిటేరియట్ అంటే ఏమిటి అని. వాళ్లు వెంటనే జవాబు చెప్పడానికి తడబడి, తమలో తాము చాలాసేపు చర్చించుకొని బూర్జువా అంటే స్వార్థ భావన, సంచయ భావన అని, ప్రోలిటేరియట్ అంటే ప్రజాసేవ భావన, త్యాగ భావన అని ముక్తకంఠంతో చెప్పారట. ఒక్కమాటలో శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవం అంటే స్వార్థ, సంచయ భావజాలానికి వ్యతిరేకంగా, అంటే బూర్జువా వర్గానికి వ్యతిరేకంగా, ప్రజాసేవ, త్యాగ భావజాలంతో శ్రామికవర్గం చేసిన వర్గపోరాటం.

మహత్తర శ్రామిక వర్గ సాంస్కృతిక విప్లవం - ఒక అంచనా

హర్ష్ ఠాకూర్

అనువాదం: సి.ఎస్.ఆర్. ప్రసాద్

మానవ జాతి చరిత్రలో చైనాలో జరిగిన మహత్తర శ్రామిక వర్గ సాంస్కృతక విప్లవం ఒక యుగాన్ని అంతటినీ ప్రభావితం చేసే చరిత్రాత్మక సంఘటన. సోషలిస్ట్ చరిత్రలో అది ఒక నూతన అధ్యాయనం. మానవజాతి చరిత్రలో ఇంతకు ముందు ఎన్నడూ, కనీవినీ ఎరగని రీతిలో వివిధ రంగాలలో అది విజయాలు సాధించింది. అయినప్పటికీ అంతిమంగా అది అపజయం పొందింది.

సాంస్కృతిక విప్లవ అధికారిక ప్రకటన వెలువడి ఈ సంవత్సరం మే 16కు యాభై సంవత్సరాలు. ఆ సందర్భంగా వెలువడిన డాక్యుమెంటులో సాంస్కృతిక విప్లవ ఉద్దేశాన్ని, శ్రామిక వర్గ నియంతృత్వ విప్లవం అనే దృక్పథాన్ని వివరించారు. మావో ఆలోచనా విధానం లెనినిజంలో ఒక భాగం. అలాకాక అది మార్క్సిజం, లెనినిజం భావజాలం నుండి వేరుపడి ఉంటే ఆచరణలో నిరుపయోగం అవుతుంది. అన్ని జీవన రంగాలలోనూ వర్గపోరాటం తీవ్రంగా అమలైందనేది, శ్రామిక వర్గం విప్లవాధికారాన్ని హస్తగతం చేసుకుందనేది నిస్సందేహం.

అయితే సాంస్కృతిక విప్లవ ఓటమి తరువాత కార్యకర్తలలో చాలా ప్రశ్నలు తలెత్తాయి. అవి (ఎ) కామ్రేడ్ మావో వ్యక్తి పూజ అవసరమైనదానికంటే ఎక్కువైనదా? (బి) చర్యకు, అసమ్మతికి తగినంత అవకాశం లేకపోయిందా? (సి) ప్రజా సంఘాల పట్ల పార్టీతో వైఖరిలో ఆధిపత్య ధోరణి తల యెత్తిందా? (డి) ముఠా తగాదాలు (ఇ) ప్రజా విముక్తి సైన్యానికి మితిమీరిన అధికారాలు (ఎఫ్) ప్రజాస్వామిక ప్రజా బృందాల నిర్మాణం తగినంతగా లేకపోవటం (జి) మేధావుల పట్ల దురుసుతనంతో వ్యవహరించడం (హెచ్) విప్లవ కమిటీల నిర్వహణ. లెనినిస్ట్ పార్టీ నాయకత్వం, బహుళ పార్టీలకు అవకాశాన్ని ఇవ్వటం వంటి అంశాలపై ప్రధాన చర్చ నడిచింది. ప్రతి అంశాన్ని మావో ఆలోచనా విధానం అనే పట్టకం ద్వారానే విశ్లేషించారు. సాంస్కృతిక విప్లవ ఆచరణ మూడవ దశకు చేరింది. స్టాలినిజం పట్ల విమర్శనాత్మక వైఖరిని అవలంబించినా, అది ఎప్పుడూ స్టాలిన్ వ్యతిరేక వైఖరిని ప్రదర్శించలేదు. పైగా ఆ కామ్రేడ్ కృషిని సమర్థించింది.

కాలక్రమంలో సాంస్కృతిక విప్లవం ముఠా తగాదాకా మారిందని నేననుకుంటున్నాను. చియాంగ్-చింగ్, చాంగ్చున్ చియావలతో కూడిన నలుగురు ముఠా సోషలిజం కోసం కృషి చేసిన వాళ్ళేనని నా అభిప్రాయం. అయితే భావజాలాన్ని ప్రక్షాళన చేయటం ఒక ముఠాకు శక్తికి మించిన పని. కార్మిక వర్గ పార్టీని ప్రశ్నించటానికి, నియంత్రించటానికి అవసరమైన విప్లవ ప్రజాస్వామిక నిర్మాణాలని అభివృద్ధి చేయాల్సిన బాధ్యత శ్రామిక వర్గ నియంతృత్వంపై ఉన్నది. తమ నిరసనను తెలియజెప్పటానికి ప్రజా బాహుళ్యానికి ఒక స్వతంత్రమైన వేదిక ఉండాలి. రివిజనిజాన్ని, పెట్టుబడిదారీ పరిధిలోకి తిరిగి మళ్ళడాన్ని ఓడించటం కోసం ఒక ప్రజా ఉద్యమం అభివృద్ధి కావాల్సిన అవసరం ఉంది. అది కమ్యూనిస్టు పార్టీ నుండి స్వతంత్రంగా ఉండి, మావో ఆలోచనా విధానాన్ని కూడా ప్రశ్నించగలిగేదిగా ఉండాలి. మావో అనుయాయులు పెట్టుబడిదారీ మార్గంలో ప్రయాణిస్తున్న వ్యక్తులకు వ్యతిరేకంగా పోరాడారనేది వాస్తవమే గాని దాన్ని మూలాల దగ్గర దెబ్బ తీయలేకపోయారు. ప్రజలు తమదైన ప్రజా సంఘాలని స్థాపించుకొని, కమ్యూనిస్టు పార్టీ నుండి స్వతంత్రంగా ఉంటూ ఉద్యమాలు నిర్వహించటం అనే అంశంపై తనదైన సిద్ధాంతాన్ని అభివృద్ధి చేయకముందే మావో చనిపోయారు. లెనిన్ కూడా సోవియట్ పార్టీలో తలెత్తిన బ్యూరోక్రటిక్ (నిరంకుశ) ధోరణి పట్ల స్వీయవిమర్శ ధోరణని ప్రదర్శించారు. గాని దానిని ప్రక్షాళన చేసే అవకాశం లేకుండా ముందుగానే చనిపోయారు. బహుళ పార్టీ వ్యవస్థను ముఠాల సంస్కృతిని మనం తప్పని సరిగా తిరస్కరించాలి. అదే సమయంలో విప్లవాధికారానికి సంబంధించిన ప్రత్యామ్నాయ ప్రజానిర్మాణాలను మనం రూపొందించగలగాలి. కమ్యూనిస్ట్ పార్టీ మాత్రమే కాకుండా, పెట్టుబడిదారీ నాయకులకు వ్యతిరేకంగా ప్రజల ఉద్యమంలో పాల్గొని ఉంటే వాళ్ళను తప్పనిసరిగా ఓడించి ఉండేవాళ్ళు. ఈ లక్ష్యాన్ని సాధించటానికి అవసరమైన బలమైన ప్రయత్నాలు కొన్ని జరిగాయి కానీ, అవి ఫలించలేదు.

మార్క్సిస్టు, లెనినిస్ట్ భావజాలాన్ని ఆచరణలో అత్యున్నత స్థాయికి తీసుకువెళ్ళిన సాంస్కృతిక విప్లవాన్ని మనం సంపూర్ణంగా సమర్థించాలి. బూర్జువా విమర్శకుల నోళ్ళు మూయిస్తూ అది కనీ, వినీ ఎరుగని విజయాలు సాధించింది. సాంస్కృతిక విప్లవాన్ని కించపరిచే రీతిలో పాశ్చాత్య మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని మనం క్రమపద్ధతిలో తిప్పి కొట్టాలి. మావో విధానాలని ఎత్తిపట్టే బృందాలు ఇప్పటికే చైనాలో ఉన్నాయి.

సోషలిస్టు శక్తులు ఏకాగ్రతతో అవిశ్రాంతంగా, సృజనాత్మకంగా పూర్తిగా ప్రజానుకులమైన సమాజ నిర్మాణానికి అవసరమైన పునాది వేశారు. ఫెలిక్స్ గ్రీన్, ఎడ్గార్ స్నో, విలియమ్ హింటన్, బెత్లహ్లోమ్ వంటి రచయితలు ఈ కృషిని సోదాహరణంగా తమ రచనలో వివరించారు. వాళ్ళు మావో కాలం నాటి చైనాలో మారుమూల ప్రాంతాలకు కూడా వెళ్ళి ప్రజల నుంచి వివరాలు సేకరించి అప్పటి చైనా సాధించిన విజయాలను, పోరాట రూపాల అభివృద్ధిని ప్రపంచానికి తెలియజేసారు. ఆ క్రమంలో భాగంగానే వాళ్ళు బూర్జువాల, ట్రాట్స్కీవాదుల, రివిజనిస్టుల విమర్శలను తిప్పికొట్టారు. ఇక్కడ ముఖ్యంగా గమనించాల్సిన అంశం ఏమిటంటే సాంస్కృతిక విప్లవ భావన ఆకాశం నుండి ఊడిపడలేదు. చైనా

విప్లవ విజయానంతరం 17 సంవత్సరాల కఠినమైన ఆచరణ నుండి అది రూపొందింది. శ్రామిక వర్గ నియంతృత్వం అనే లెనినిస్టు భావనను అది సృజనాత్మకంగా అభివృద్ధి చేసింది.

సాంస్కృతిక విప్లవ విజయాలు

1. వైద్య రంగాన్ని వికేంద్రీకృతం చేసి, కాలి నడక వైద్యులను సృష్టించింది. వైద్య రంగంలో నూతన ఆవిష్కరణలకు నాంది పలికింది. ఏ మూడవ ప్రపంచ దేశంలోనూ లేనంతగా వైద్యం పేద రైతాంగానికి సేవ చేసింది.

2. విద్యార్థులు, రైతులు, కార్మికుల నుండి నేర్చుకొనే అవకాశాన్ని కల్పించింది. వాళ్ళని ఉత్పాదక శ్రమలో భాగస్వాములని చేసింది. రైతులు, కార్మికులు విద్యార్థులకు గురువులుగా మారారు. ఉత్పత్తి ద్వారా విద్యార్థులు శాస్త్రీయ సూత్రాలను తెలుసుకోవటానికి వీలుగా, పరిశ్రమలను పాఠశాలలకు అనుబంధం చేసారు. గ్రామీణ ప్రాంతాలలోని విద్యార్థులు వ్యవసాయోత్పత్తి గురించిన జ్ఞానాన్ని రైతుల ద్వారా పొందారు.

3. కర్మాగారాలలోనే అధ్యయన తరగతులను నిర్వహించి, కార్మికులకు మార్క్సిస్ట్, లెనినిస్ట్ తత్వశాస్త్రాన్ని అధ్యయనం చేసే అవకాశాన్ని కలిగించారు. తమకు అవసరమైన యంత్రాలను తామే నిర్మాణం చేసుకొనేటట్లు తమ ఫ్యాక్టరీలను తామే నిర్వహించుకునేటట్లు కార్మికులకు శిక్షణ నిచ్చారు.

4. కార్మికుల, రైతుల, ప్రజాస్వామిక హక్కులకు ప్రాతినిధ్యం కలిగించేలా విప్లవ కమిటీలను ఏర్పరిచారు.

5. భవన నిర్మాణం, కాలవల తవ్వడం వంటి పనులలో సైన్యం ప్రజలకు సేవ చేసింది. అంతేగాక కార్మికులకు, రైతాంగానికి వారి వారి పనులలో సహాయపడింది. సైనికుల్లో రాజకీయ చైతన్యం ఏర్పడింది. చరిత్రను, రాజకీయాలను మార్క్సిజం, లెనినిజం కోణం నుండి అర్థం చేసుకోవటంలోను, విప్లవ ప్రాధాన్యతను గుర్తించటంలోను సైన్యానికి శిక్షణ ఇచ్చారు. బూర్జువా రాజ్యాంగాలకు భిన్నంగా, సైన్యం ప్రజా ఉద్యమాలని రక్షించింది. సైన్యంలో హోదాలు రద్దయ్యాయి.

6. ప్రజా ఉద్యమాల ద్వారా వ్యవసాయం కమ్యూన్‌లను విప్లవీకరించారు.

7. తమ డిమాండ్లను తెలియజెప్పటానికి, ప్రజా వ్యతిరేకులను విమర్శించటానికి అవసరమైన రీతిలో పోస్టర్లను, బ్యానర్లను పట్టుకొని ప్రజానీకం పెద్ద పెద్ద ఊరేగింపులు నిర్వహించింది. చైనా కమ్యూనిస్ట్ పార్టీ దీన్ని శాంతి భద్రతల సమస్యగా చూడలేదు. మితవాదులకు వ్యతిరేకంగాను, మహత్తర చర్యకు అనుకూలంగాను ప్రచారాలు జరిగాయి. అవినీతి అధికారులను శిక్షించాలని అధికారిక నియమత్వాన్ని వ్యతిరేకించాలని, పత్రికా స్వాతంత్ర్యం తదితర ప్రజాస్వామిక హక్కుల కోసం ప్రజలు నినదించటానికి అవకాశం కల్గింది.

8. ప్రజా ఉద్యమాల పక్షాన నిలబడే విప్లవ ప్రజాస్వామిక సైన్యం రూపొందింది. పునాది వర్గాల మీద ఆధారపడిన ప్రజా బాహుళ్యం గుండె చప్పుళ్ళకు సైన్యం ప్రాతినిధ్యం వహించింది. సాంస్కృతిక విప్లవం ప్రారంభమయ్యాక రెడ్‌గార్డ్స్, రెడ్ రెబెల్స్ వంటి వివిధ ముఠాల మధ్య జరిగిన పౌర యుద్ధంలో సైన్యం జోక్యం చేసుకోలేదు. వారు ఏ శత్రులకు మద్దతునివ్వమని మావో ప్రజా విముక్తి సైన్యాన్ని ఆదేశించారు.

అలజడులు పతాక స్థాయికి చేరి పార్టీ ఛిన్నాభిన్నమై ఆర్థిక వ్యవస్థ ప్రతిష్టంభనకు గురైన సమయంలో, బాధ్యతలు నిర్వహించ గలిగిన ఒకే ఒక్క నిర్మాణంగా సైన్యం కనపడింది. పరిస్థితిని అదుపులో పెట్టటానికి మావో సైన్య సహకారం తీసుకున్నారు. ఫలితంగా అల్లర్ల తరువాత ప్రజా విముక్తి సైన్యం స్థాయీ, అధికారం పెరిగాయి. స్థానిక పాలనకు బాధ్యులైన కొత్తగా రూపొందిన కమిటీలకు సీనియర్ సైనిక అధికారులు బాధ్యులయ్యారు. 1969లో పార్టీ - కేంద్ర కమిటీకి ఎన్నికయిన సభ్యులలో సగం మంది పనులలో రైతాంగానికి సహాయం చేసేది. గ్రామీణ ప్రాంతాలలో మట్టి తవ్వకం పనిని, ఆహార ధాన్యాల రవాణా పనిలో సైన్యం జోక్యం చేసుకున్నది.

సైన్యంలో నిచ్చెన మెట్ల వ్యవస్థ, పితృస్వామిక వ్యవస్థ రద్దయింది. విప్లవ కమిటీ తన నాయకుడి ఆదేశాలను ఎట్లా శిరసావహిస్తుందో సైనికుడు కూడా తనపై అధికారి పట్ల అలాగే వ్యవహరించేవారు. అంటే అధికారి సేవకుడు అనే పద్ధతి ఉండేది కాదు. అయినా సైన్యం క్రమశిక్షణాయుతంగా ఉండేది. మావో ఆలోచనా విధానాన్ని సైన్యం అధ్యయనం చేసేది. ప్రపంచ వ్యాప్తంగా ప్రజా విముక్తి పోరాటాలకు వాళ్ళు మద్దతుని ప్రకటించేవారు. పాఠ్యాంశాలలో జాతీయ దురహంకారానికి తావుండేది కాదు. సైనికులు పొలాలలో పని చేసి తమ ఆహారాన్ని తామే సంపాదించు కునేవారు. అవసరమైనప్పుడు కమ్యూన్ సభ్యులకు సహాయం చేసేవారు.

9. సాహిత్య కళారంగాలలో సృజనాత్మకతను ప్రదర్శించ టానికి కార్మికులను ప్రోత్సహించారు.

వర్గపోరాటం సోషలిస్టు సమాజ స్థాపన దిశగా కొనసాగుతుందా లేక పెట్టుబడిదారీ మార్గంలోకి మళ్ళుతుందా అనే అంశమే పార్టీలోను, ప్రభుత్వంలోను ఉన్నత స్థాయిలలో చర్చించబడింది. దీన్ని పరిష్కరించే క్రమంలో, పాశ్చాత్య విమర్శకులు ప్రచారం చేసినట్లు అధికారాన్ని హస్తగతం చేసుకోవటానికి మావో సాంస్కృతిక విప్లవాన్ని ఉపయోగించుకోలేరు. ఆయన తలచుకుంటే ప్రత్యర్థులందరినీ నిర్బంధించగలిగేవారు. విప్లవం వెనుకతట్టు పట్టకుండా నిరోధించటానికి అలాంటి నిర్బంధం ఉపకరించదు కాబట్టి మావో ఆ పని చేయలేదు. అందుకు భిన్నంగా ఆయన సమాజం ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజలని రాజకీయంగా సమీకరించాలనుకున్నారు. తనకు ఎంతటి ప్రమాదం వాటిల్లిన ఆ పంథా పైననే ఆధారపడాలని ఆయన అనుకొన్నారు. పెట్టుబడిదారీ పంథాను అనుసరిస్తున్న వారిని అధికారంలో నుంచి తొలగించడం కోసం జరిగే పోరాటమే సాంస్కృతిక విప్లవం అని మావో సూచించారు. అంతకంటే ఇంకాస్త లోతుగా ఆలోచిస్తే సాంస్కృతిక విప్లవం ప్రాపంచిక దృక్పథానికి సంబంధించిన ప్రశ్న ప్రపంచాన్ని చైతన్యవంతంగా అర్థం చేసుకొని మార్చటానికి తద్వారా తమని తాము మార్చుకోవటానికి ప్రజలను సంసిద్ధులని చేసే సైద్ధాంతిక ఆయుధమే మహత్తర శ్రామిక వర్గ సాంస్కృతిక విప్లవం. ✩

విశాఖ మత్స్యకార మహిళల జీవనచిత్రం

జి. సత్యవతి

విశాఖపట్నంలో స్థానికులు, వందల సంవత్సరాలుగా జీవిస్తున్న మత్స్యకారులు తప్పితే అందరూ అభివృద్ధి పథంవైపు సాగిపోతున్నారు. ఎక్కడినుండో వచ్చిన వ్యాపారులు, ఉద్యోగస్తులు, రాజకీయనాయకులు, సినీపరిశ్రమ, సినీయాక్టర్లు అందరూ అందలాలెక్కుతున్నారు. అంతేకాదు, చిన్నగా రాజకీయ జీవితం ప్రారంభించిన వాళ్ళు కూడా పెద్ద పెద్ద రాజకీయ నాయకులుగా ఎదిగి కోట్లు సంపాదిస్తూ ప్రజలను దోచుకుంటున్న వాళ్ళే. కానీ సముద్రాన్ని నమ్ముకొని, దానినే ఆనుకొని జీవిస్తున్న కుటుంబాలు చాలా ఉన్నాయి. భద్రత లేకుండా బతుకుతున్నారు. వాళ్ళ కోసం ఆలోచిస్తాం అనే వాళ్ళే లేకుండా పోయారు.

ఇసాకపట్టణం విశాఖపట్నం అయ్యింది కాని మత్స్యకారుల జీవితాలు మాత్రం మారలేదు. విశాఖసిటీలో తీరం వెంబడి ఉన్న పెద జాలారిపేట, కొత్త జాలారిపేటల్లో నివసించే మత్స్యకారులు వందల సంవత్సరాల నుంచి చేపల వేట మీదే బతుకుతున్నారు. చేపల వేటతో మొదలయ్యే వీరి జీవితాలు అప్పుడెలా ఉన్నాయో ఇప్పుడూ అలాగే ఉన్నాయి. అత్యంత శరవేగంగా అభివృద్ది చెందుతున్న స్మార్ట్‌సిటీల్లో విశాఖ ఒకటి. కాని మత్స్యకారుల జీవితాలు మాత్రం ఎక్కడేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉన్నది.

పెదజాలారిపేటకి ఆనుకుని శాంతి ఆశ్రమం, ఆర్. టి. సి డిపో, బధిరుల స్కూల్ మరోపక్క ఉడాపార్క్ దానిని ఆనుకొని పార్క్ హోటల్, ఆర్. కె. బీచ్ వీటి మధ్య మత్స్యకారుల గ్రామం పెద జాలారిపేట ఉంది. వాళ్ళ ఇళ్ళు సముద్రానికి దగ్గరగా ఉన్నా ఎప్పుడు కూడా తుపాన్లుకు గాని, సునామీకి గాని కనీసం భయపడ లేదు. ఎక్కడ ఉన్నవాళ్ళు అక్కడే ఉన్నారు. సముద్రం ఆటుపోటు లకు గురైనా మాకేమీ కాదు అనే మొండి ధైర్యం జాలర్లకు ఉంది. ఆఖరికి హుద్ హుద్ తుపాను కూడా ఏమీ చేయలేక పోయింది. కాని వాతావరణ మార్పులు జరిగినా, తుపానులు వచ్చినా వాళ్ళకు తిండికి మాత్రం ఇబ్బందే. ఎందుకంటే తుపాను రాకకి రెండు రోజుల ముందే జాలర్లు సముద్రంలోకి వెళ్ళకూడదు అని ప్రభుత్వం వారు హెచ్చరిస్తూంటారు. అందువలన తుపాను రాకకి రెండు రోజుల ముందే వేటకు వెళ్ళరు. వేటకు వెళ్ళకపోతే వేరే జీవనాధారం లేక చేపల వ్యాపారం లేక పస్తులు ఉండాల్సి వస్తుంది. ప్రభుత్వం తుపాను ఉంది మత్స్యకారులు సముద్రం మీదకి వేటకు వెళ్ళకూడదు అని చాలా బాధ్యతగా చెపుతుంది కాని ఆ సమయంలో వాళ్ళు ఏం తిని బతుకుతారు అని మాత్రం ఆలోచించదు. ప్రభుత్వమే కాదు ఓట్లు దండుకోడానికి వచ్చే రాజకీయ నాయకులు కూడా ఆలోచించరు.

మత్స్యకారుల జీవనాధారం: జాలర్లకు ముఖ్య ఆధారం సముద్రం. ఒక కుటుంబంలో వేటకు వెళ్లేవాళ్లు ముగ్గురు ఉంటే చిన్న పడవ తయారు చేసుకుని ఆ ముగ్గురే వేటకు వెళతారు. దాని మీద వచ్చే ఆదాయం ఆ ముగ్గురు పంచుకుంటారు. లేకపోతే ఒక కుటుంబంలో కొంచెం పెద్దపడవ తయారు చేసుకునే స్తోమత ఉంటే వేరే కుంటుంబాల నుంచి కూడా చేరి వేటకి వెళతారు. అప్పుడు వచ్చే ఆదాయంలో పడవకి వలలకి కొంత భాగం ఉంచి మిగిలిన భాగం అందరూ పంచుకుంటారు. వేటకు వెళ్ళే సమయాలు ఒక్కొక్కరి వీలును బట్టి కొందరు వేకువ జామున కోడికూతకే లేచి వేటకు వెళ్ళి సాయంత్రం తిరిగి వస్తారు. కొందరు కొంచెం దగ్గరలోనే వేట ముగించుకుని మధ్యాహ్నానికి తిరిగి వస్తారు. వేకువ జామున వెళ్ళేవారు తప్పనిసరిగా చద్దన్నం పిండివడియం, లేకపోతే ఉల్లిపాయ, పచ్చిమిరపకాయ (నంజుకోవడానికి) తీసుకొని వెళతారు. ఉదయం వేటసమయంలో సముద్రంలోనే పందుంపుల్ల (వేపపుల్ల)తో పళ్ళుతోముకుని చద్దన్నం తింటారు. మరల వేట ముగించుకుని వచ్చేసరికి సాయంత్రం అవుతుంది. అప్పుడు స్నానం చేసి అన్నమో, అంబలో తింటారు. వేటనుంచి తీసుకొచ్చిన చేపలు ఎందరైతే వెళతారో వాళ్ళందరూ కొంచెం చేపలు ఆ పూటకు కూరకు తీసుకుని మిగతావి దళారులకో లేకపోతే ఆడవాళ్ళకో అమ్మి ఇళ్ళకు చేరతారు.

కుటుంబం: భర్త చేపల వేటకు వెళితే భార్య ఇంటి దగ్గర పిల్లల్ని చూసుకోవడం, వంట చెరుకు ఏరుకుని రావడం ఇతర పనులు. చూస్తుంటారు. వాళ్ళకు చదువు విలువ తెలియదు. మగపిల్లలు ఎక్కువగా సముద్రంలో ఆడుకోడానికి అలవాటు పడతారు. ఆడపిల్లలు ఇంటి పనిలో అప్పుడప్పుడు బడికి వెళతారు. మగపిల్లలు కూడా అప్పుడప్పుడు బడికి వెళతారు. కనీసం 10వ తరగతి వరకైనా చదవరు. బడిమానేసి 10 యేళ్లకే వేటకు వెళ్ళిపోతారు. తల్లిదండ్రులు కూడా చదువుకుంటే ఎక్కడైనా ఉద్యోగం చెయ్యొచ్చు ఏమో అనే ఆలోచన కూడా ఉండదు. ఎందుకంటే వీళ్ళు జీవించడానికి మూడుపూటలా తిండి దొరికితే చాలు అనే అల్పసంతోషంతో బతికేస్తుంటారు. సముద్రం మీద వేటకి వెళితే తినడానికి వస్తుంది. అలాంటప్పుడు బయటికి వెళ్ళి కష్టపడాలి అనుకోరు. వాళ్ళ జీవనవిధానం చాలా చిన్నది. ఇల్లు తాటికమ్మలతో ఉంటుంది అది కూడా 30 గజాలలో చాలా చిన్నదిగా ఉంటుంది. ఆరు బయటే కట్టెలతో వంట చేసుకుంటారు. మరుగుదొడ్డి ఉండదు. మల, మూత్ర విసర్జనకి ఆరుబయటే వెళతారు. ఆడవాళ్లు అయినా సరే బయటే. పక్కనే ఉన్న ఉడా పార్కుకి, పార్క్ హోటల్‌కి అక్కడ ఉన్న సంపన్నుల అపార్‌మెంట్సుకి ఉన్న డ్రైనేజి విధానం పక్కనే ఉన్న జాలారిపేటకు లేదు. డ్రైనేజి

విధానం లేక మరుగుదొడ్లు నిర్మించకపోవడం వలన ఆడవాళ్ళు అనేక శారీరక బాధలకు, మానసిక ఇబ్బందులకు గురవుతున్నారు. ఆడపిల్లలు పెద్ద పిల్ల అయ్యిన దగ్గర్నుంచి వాళ్ల ఆరు బయట మలవిసర్జన, మూత్ర విసర్జన సరే నెల నెలా బహిస్టు సమయంలో కూడా ఆరుబయటకు వెళ్లడమే. బహిస్టు సమయంలో బట్టను ఉపయోగిస్తారు. దానిని ఉతికి ఆరుబయటే ఆరబెడతారు. దానిమీద ఎన్నో రకాల కీటకాలు, దుమ్ముధూళి పడడం వలన అది వాడే వారికి చాలా రకాల జబ్బులు వస్తాయి. ఇప్పుడు బజారులో దొరికే నాపికిన్స్ వాడే స్తోమత లేక మూడు, ఐదు రోజులు పాటు నరకయాతన పడతారు. చుట్టూ మగవాళ్ళు తిరుగుతూ ఉంటారు. అయినా వాళ్ళు సిగ్గు, బిడియం వదిలేసి, ఎవరినీ పట్టించుకోకుండా వాళ్ళ పని వాళ్ళు చేసుకుంటారు. అంతకంటే వాళ్ళకు గత్యంతరం లేదు.

సంప్రదాయం: జాలర్లకు గంగమ్మంటే ఎంతో నమ్మకం. ప్రతియేటా గంగమ్మ తల్లి పండగ చేస్తారు. సునామీ వచ్చినా ఆ గంగమ్మ తమకు ఏ హాని తలపెట్టలేదని వారి నమ్మకం. డిసెంబర్ 26న గంగతల్లికి ఆడవాళ్ళంతా చిన్న చిన్న బిందెలతో పాలు కలిపిన నీళ్ళు పోసి దానిలో పసుపు, కుంకుమ వేసి దాని మీద పువ్వులు వేసి అందరూ ఆ బిందెని నెత్తి మీద పెట్టుకుని భాజా భజంత్రీలతో గంగ దగ్గరకు ఊరేగింపుగా వెళతారు. గంగమ్మ దగ్గరికి వెళ్ళి ఆ ఊరు పెద్ద మనుషులు పూజలు చేసిన తర్వాత ఆడవాళ్ళు బిందెలతో ఉన్న పాలు కలిపిన నీళ్ళను, పూలను, పసుపు, కుంకుమను సముద్రంలో పోస్తారు. మమ్మల్ని బాగా చూడు గంగమ్మ తల్లి అని మొక్కుకుని ఇంటికి వెళతారు. ఇదే కాకుండా చాలామంది దేవతలను వారు పూజిస్తారు. ఊరమ్మ వారి పండగ, పోలమ్మ తల్లి పండగ ఇది విశాఖలో ఉన్న 14 గ్రామాల మత్స్యకారుల పండగ. ఈ పండగని చాలా ఖర్చు పెట్టి రెండు రోజుల పాటు చాలా ఘనంగా చేస్తారు. ప్రస్తుతం దీనికి ఆదాయం ఎక్కువ రావడం చూసి దేవాదాయశాఖ తీసుకుని దాని నిర్వాహణ బాధ్యతని చూస్తోంది. ఇంతకు ముందు మత్స్యకార పెద్ద మనుషులు దాని నిర్వహణ బాధ్యత కష్టం అయినా నష్టం అయినా చూసుకునేవారు. ఇప్పుడు మొత్తం ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉంటుంది. మత్స్యకారులు మాత్రం మామూలు భక్తుల్లా వెళ్ళి వస్తున్నారు. ఏ బాధ్యతాలేదు. జాలర్లకు చాలామంది అమ్మవార్లు అంటే భూలోకమ్మ, కొత్తమ్మ, మాంకాలమ్మ ఇలా ఇరవై వరకు దేవతలు ఉంటారు. ఒక దేవత పండగ చేయాలి అంటే ఊరందరూ వేటకు వెళ్ళి ఆ రోజు ఎవరికి ఎంత ఆదాయం వచ్చినా పండగకోసం ఇవ్వాల్సిందే. అలా వచ్చే ఆదాయం సుమారు 20 లక్షల నుంచి 30 లక్షల వరకు ఉంటుంది. అది అంతా అమ్మవార్ల పండుగలకే వెచ్చిస్తారు. వాళ్ళ వ్యక్తిగత, కుటుంబాల, ఊరు బాగోగులు కంటె అమ్మవారి పండుగకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. ఈ శతాబ్దంలో కూడా ఈ మహాపట్టణంలోని మత్స్యకారులు ఎంత అజ్ఞానంలో ఉన్నారో అర్థం చేసుకోవచ్చు.

మత్స్యకార మహిళలు: ఆడవాళ్ళ విషయానికి వస్తె పెళ్ళి అయిన దగ్గర్నుంచి ఇంటికి, ఇంట్లోవాళ్ళకి ప్రాధాన్యత ఇస్తూ చేపల వ్యాపారం చెయ్యాలి లేకపోతే గడవని పరిస్థితి. కుటుంబ ప్రాధాన్యత ఆడవాళ్ళకు తెలిసినంతగా మగవాళ్ళకు తెలియదు. మగవాళ్ళు వేటకు వెళ్ళినా వెళ్ళకపోయినా మద్యం తాగడానికి మాత్రం డబ్బులు తప్పనిసరిగా ఇవ్వకపోతే భార్యని కొట్టడం సహజం. మహిళలు మాత్రం ఇంటిపనితో పాటు బజారులో చేపల వ్యాపారం కూడా చెయ్యాల్సిందే.

జాలారిపేటలో ఉన్న మత్స్యకార మహిళలే కాకుండా చుట్టు పక్కల ఉన్న భీమిలి, కోనాడ, మంగమారిపేట, జోడుగుళ్ళపాలెం, తిమ్మాపురం ఇలా చాలా ప్రాంతాల నుంచి చేపల జెట్టీకి (ఫిషింగ్ హార్బర్) కు వచ్చి ఎండు చేపలు, పచ్చి చేపలు కొనుక్కుని వివిధ ప్రాంతాలకు వెళ్ళి ఎండైనా, వానైనా అమ్ముతుంటారు. ఇంట్లో అందరూ దీనిమీదే ఆధారపడి బతికే పరిస్థితి. ఒక్కొక్కసారి మగవాళ్ళు వేటకు వెళ్ళి చనిపోతే ఇంక ఆ కుటుంబం పరిస్థితి చాలా అధ్వాన్నంగా ఉంటుంది. ఒకవేళ ఇంట్లో మహిళలకి చేపల వ్యాపారంలో అనుభవం లేకపోతే ఇంక ఆ కుటుంబాన్ని పోషించు కోవడానికి అప్పులు చేయడం, అధిక వడ్డీలకు ఫైనాన్స్ తీసుకోవడం లాంటివి చేసి కుటుంబాన్ని పోషించాలి. దాని వలన బతుకులు రోజు రోజుకి ఎంతో ఛిద్రమవుతున్నాయి. మత్స్యకార మగవాళ్ళు సముద్రంలో చనిపోతే గ్రామపెద్దలు కాని, రాజకీయ నాయకులు కాని, ప్రభుత్వం కాని పట్టించుకునే పరిస్థితి లేదు. వ్యవసాయం మీద ఆధారపడే వాళ్ళకి కాని, ట్రాన్స్‌పోర్టు మీద ఆధారపడేవాళ్ళకు గాని ఏ విపత్తు వచ్చినా స్పందించే ప్రభుత్వం మత్స్యకారులను మాత్రం పట్టించుకోదు. వేటకెళ్ళి ఏడేళ్ళ వరకు తిరిగి రాకపోతే చనిపోయినట్టు గుర్తిస్తామంటుంది ప్రభుత్వం. ఆ ఏడేళ్ళే కాదు ఏడు దశాబ్దాలుగా తన పెనిమిటి వస్తాడని ఎదురు చూసిన మహిళలు ఉన్నారక్కడ. కానీ ప్రభుత్వం పట్టించుకునే స్థితి లేదు. నేటికీ జాలర్ల చావులకు కనీసమైన గుర్తింపు లేదు. నష్ట పరిహారం లేదు. దశాబ్దాలుగా ఎన్నో జీవితాలు నీట మునుగుతూనే ఉన్నాయి. ఆఖరికి ఆ కుటుంబ భారం మొత్తం ఒంటరి మహిళల మీద పడుతోంది.

భర్త చనిపోతే మహిళలే ఫిషింగ్ హార్బర్‌కి వచ్చి బోట్లు యజమాని దగ్గర ఎండుచేపలు, పచ్చిచేపలు కొనుక్కుని వ్యాపారం చేస్తారు. కొందరైతే ఎండుచేపల వ్యాపారం ఒక్కటే చేస్తారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు హార్బర్‌కి దగ్గరలో ఇల్లులు అద్దెకి తీసుకుని ఉంటారు. కుటుంబంతో సహా. మగవాళ్లు ఉంటే వేటకు వెళతారు. లేకపోతే మహిళలు, ఇంట్లో పిల్లలు కలిపి కష్టపడాలి. యువకులు చదువులు చిన్నప్పుడే వదిలేయడం వలన వేటకు వెళ్ళి వచ్చిన బోట్లను జెట్టీకి కట్టేస్తారు. ఆ బోట్లకు కాపలాగా వీళ్ళు ఉంటారు. ఆడపిల్లలు ఇంటి పనులు లేక దగ్గరలో ఉన్న షాపులలో పనులకు వెళతారు. మగదిక్కులేకపోతే భారం అంతా మహిళల మీదే పడుతుంది. చేపలు అమ్మడం ఒక్కటే వీళ్ళకు తెలిసిన విద్య. పిల్లలు కూడా ఇదే వృత్తంలో ఉంటారు.

ఫిషింగ్ హార్బర్ దగ్గర మహిళల్ని చూస్తే "ఎండుచేపలు ఎండలోనే అమ్మాలేమో" అన్నట్టు ఉంటారు. ఎండ నుండి వాన నుండి రక్షణగా అక్కడ వాళ్ళకు పై కప్పుకి ఏమీ ఉండదు. వర్షం వస్తే ఇక వ్యాపారం సాగడం కష్టం. చేపలు కూడా తడిచిపోయి

అమ్మడానికి వీలు లేక ఎంతో నష్టాన్ని భరిస్తారు.

మహిళలకు గాని, పురుషులకు గాని, యువతకు గాని ప్రభుత్వం ట్రెనింగ్ సెంటర్స్ లాంటివి పెట్టి వాళ్ళు కూడా అభివృద్ధి చెందేటట్లు చేయవచ్చు. కాని ప్రభుత్వాలు మత్స్యసంపద మీదే గాని మత్స్యకారుల మీద దృష్టి పెట్టకపోవడం వలన, ప్రైవేటు వ్యక్తులు మీద ఆధారపడడం వలన మత్స్యకారులు ఓట్లుకి తప్ప ఇక ఎందుకూ పనికి రారు అనే ఉద్దేశ్యంతో ఉన్నట్టు ఉంటుంది.

కొత్త జాలారిపేట చుట్టుపక్కల ఉండే ఆర్. కె. బీచ్, నేవీ క్వార్టర్స్, కె. జి. హెచ్, ఎవిఎన్ కాలేజ్, కలెక్టర్ ఆఫీసు అనుకుని ఉండడం వలన కొంచెం అభివృద్ధి చెందినట్టు ఉంటుంది గాని ఇక్కడ కూడా చేపలవేటను నమ్ముకునే బతుకుతున్నారు. తాతలు, ముత్తాతలు దగ్గర నుంచి చేపల వేట మీదే ఆధారం. కొత్త జాలారిపేటకి దగ్గరగా ఉండేది పోర్టు ఏరియా. మత్స్యకారుల వేటకనువైన ప్రాంతంలోనే విశాఖ పోర్టు నిర్మించారు. ఆ పోర్టు వచ్చిన తరువాత కాలంలో వీళ్ళంతా వేటకు దూరమై అక్కడ కూలీలుగా మారిపోయారు. పోర్టుకి సరుకులు తీసుకుని వివిధ దేశాల నుంచి ఓడలు వస్తాయి. ఆ ఓడలో సరుకులు దింపడానికి కూలీలు కావాలి అంటే మత్స్యకారులే వెళ్ళాలి. అప్పట్లో బీర్ డబ్బా, అమూల్యా లాంటి చాలా వస్తువులు నిషేధంలో ఉండేవి. కూలీలుగా వెళ్ళిన మత్స్యకారులు నిషేధించబడిన వస్తువులను తెచ్చుకోవడం వలన కస్టమ్స్ అధికారులు దాడులు చేసి కేసులు పెట్టేవారు. ఆ కేసుల నుంచి బయటపడడానికి చాలా కష్టాలు పడాల్సి వచ్చేది. ఇదే కాకుండా మత్స్యకారులు వేటకు వెళ్ళేటపుడు సముద్రంలో ఎక్కడైనా వేట చేసే హక్కున్న మత్స్యకారుడిని పోర్టు సిబ్బంది పట్టుకుని మా పోర్టు ఏరియాలో వేట చెయ్యొద్దు అని హెచ్చరించే వారు. ఎవరైనా చేపలు ఎక్కువగా దొరుకుతున్నాయి అని అటువైపు వెళితే పోర్టు సిబ్బంది పట్టుకుని కేసులు పెడతారు. మత్స్యకారులు మీద కేసులు పెట్టడానికి వాళ్ళు చేసే ఆరోపణలు ఏమిటంటే పోర్టుకి సంబంధించిన ఇనుపముక్కలు దొంగలిస్తున్నారని. ఆ విధంగా పోర్టు వచ్చాక మత్స్యకారుడి జీవితం ముందు నుయ్యి వెనుక గొయ్యి చందంగా ఉంది. అప్పటి నుండి ఈనాటి వరకు విశాఖ పోర్టు ట్రస్టు మత్స్యకారుల వేటనే కాదు ఇక్కడ వాళ్ళ ఇళ్ళను, గ్రామాలను కూడా మింగేస్తోంది. చివరకు ఫిషింగ్ హార్బర్‌ను కూడా భీమిలికి తరలించడానికి ప్రయత్నాలు చేస్తోంది.

కుటుంబంలో ఎక్కువమంది వేటకు వెళ్ళే వాళ్ళు ఉంటే పిల్లలు చదువుకునే వెసులుబాటు ఉంది. అది కూడా మూడు నాలుగు తరగతుల వరకు చదువుకునే అవకాశం ఉండేది. అలాంటివాళ్ళు ఆ చదువుతో చుట్టుపక్కల ఉండేటువంటి పరిశ్రమలు డాక్ యార్డులో డాకీయార్డు లేబర్ బోర్డులో కళాసీలుగా పనిచేసేవారు. అది కూడా కూలీలుగా డి. ఎల్. బిలో ఎక్కువ ఓడల మీద భాస్వరం, గంధకం, యూరియా లారీలలో బస్తాలతో వచ్చేది. ఆ బస్తాలను మోసుకుని వెళ్ళి గోడౌన్‌లలో నింపాలి ఆ పని చేయడానికి శక్తి కావాలని మద్యానికి బానిసలు అయ్యేవారు. కనీసం అలా అయినా అభివృద్ధి చెందుతారు అనుకుంటే తెచ్చిన డబ్బులతో మద్యానికి బానిసలు అయిపోయేవారు. సీనియార్టీని బట్టి చిన్న చిన్న ప్రమోషన్స్ ఇచ్చేవారు. ఇలా కూలీ పనులు చేసుకుంటూ, కళాసీలుగా పనులు చేసేవాళ్ళు. పిల్లలు ప్రభుత్వ బడులలో చదివేవారు. ఒకటినుంచి ఐదవ తరగతి వరకు ప్రాథమిక పాఠశాలలో చదువుకునేవారు. సి.బి.ఎం. హైస్కూల్, ఆర్‌సి.ఎం. హైస్కూల్ లేక ఎ.వి.ఎన్ స్కూళ్ళలో చదివేవారు. ఆడపిల్లలు అయితే ఐదవ తరగతి వరకు మాత్రమే చదివేవారు. క్వీన్‌మేరీ హైస్కూల్ పెట్టిన తర్వాత బాలికలు పదవ తరగతి వరకు చదువుకునే అవకాశం వచ్చింది.

పెళ్ళి విషయంలో అయితే ఇప్పటికీ లేచిపోయే విధానమే ఉంది. అమ్మాయి అబ్బాయి ఇష్టపడితే రెండు కుటుంబాలు బీదవాళ్ళు అయితే లేచిపోయి గుళ్ళో పెళ్ళి చేసుకుంటారు. ఇద్దరూ వెళ్ళిపోయిన తర్వాత పెద్దలకు తెలిస్తే ఇద్దర్ని ఇంటికి పిలిచి సంప్రదాయంగా పెళ్ళి చేస్తారు. లేకపోతే ఇద్దరూ కొన్నాళ్ళు వేరే ప్రాంతంలో ఉండి మరలా గ్రామానికి వస్తారు. అప్పటికే భార్యభర్తలుగా ఉండడంవలన గ్రామంలో భార్యాభర్తలుగా అంగీకరిస్తారు. ఎన్నేళ్ళ తర్వాత వచ్చినా ఇంట్లో అమ్మవారి పండుగ చేసుకుంటే అక్కడ భార్యకి భర్త పుస్తె కట్టె ఆనవాయితీ ఉంటుంది. మహిళ చనిపోయేనాటికి ఎప్పుడైనా పుస్తె కట్టి తీరాలి. చనిపోయినపుడు మంచిది కాదని దానికి ప్రాధాన్యత ఇస్తారు.

మత్స్యకారులకు మహిళా దేవతల ప్రాధాన్యత ఎక్కువ అలాగే కుటుంబాల్లో మహిళ పాత్ర చాలా ముఖ్యం. కష్టమైనా సుఖమైనా ఇంటిని, పిల్లల్ని చివరికి భర్తను కూడా చూసుకునే బాధ్యత మహిళ మీదే ఉంటుంది. వారి పేర్లు కూడా అమ్మ వార్ల పేర్లే పోలమ్మ, ఎల్లమ్మ, మాంకాలమ్మ, భూలోకమ్మ ఇలా. మత్స్యకార్లు అమ్మవార్ల జాతర్లే ఎక్కువగా చేస్తారు. అమ్మవారి పండగ ఉంటుంది. ఇంట్లో అమ్మవారికి కుటుంబసభ్యులు ఒకే ఇంటి పేరు కలవారు చేసుకుంటారు. ఊరమ్మవారి పండగ గ్రామం మొత్తం చేస్తారు. ఆ పండగ చేసేటపుడు మేకల్ని, గొర్రెల్ని కోడిపుంజలని వేట వేయడం సహజం. మామూలుగా హిందువు అనేవాళ్ళు చేసే పూజలతో సంబంధం ఉండదు. ఆరోజు ఈ రోజు అనే తేడా లేకుండా వేటకి వెళ్ళి వచ్చిన తర్వాత తప్పని సరిగా చేపలే వండుకోవాలి. ఇది కాకుండా వేరే గత్యంతరం లేదు. మత్స్యకారులు తరతరాలుగా ఇంట్లో ఉన్న అమ్మవార్లుని పూజించడం అలవాటు. తర్వాత సినిమాల ప్రభావం లేక హిందూ మత ప్రభావం రాముడ్ని, శివుడ్ని ఇప్పుడు రకరకాల దేవుళ్ళను పూజిస్తున్నారు. ఇంట్లో అమ్మవార్ల తర్వాత సింహాచలం నర్సింహస్వామికి కూడా అంతే ప్రాధాన్యత ఇస్తారు. ఇప్పటికీ సింహాచలంలో స్వామి వారి పెళ్ళిలో మత్స్య కారులకు ప్రాధాన్యత ఉంటుంది. మత్స్యకారులు స్వామి వారి రథం లాగడంలో ప్రముఖంగా ఉంటారు. అలాగే బురుజు పేటలో ఉన్న కనక మహాలక్ష్మి అమ్మవారి పండగలో కూడా మత్స్యకారులుకు ప్రాధాన్యత ఉంటుంది.

ఇంత పెద్ద విశాఖపట్నంలో పది ఎకరాలు కూడా ఉండని కొత్తజాలారిపేటలో చాలా తక్కువ 25 గజాలలోనే ఒకప్పుడు ఒక కుటుంబం జీవించేది. ఇప్పుడు ఆ ఒక్క కుటుంబం మూడునాలుగు కుటుంబాలు అయ్యాయి. అయినా అందులోనే స్లాబ్ వేసి పైన చిన్న చిన్న గదులు కట్టుకుని జీవిస్తున్నారు. కె. జి. హెచ్ దగ్గరే

ఉన్నా వైద్యం చేయించుకునే పరిస్థితి లేదు. కలెక్టర్ ఆఫీసు పక్కనే ఉన్నా ఏ సమస్యలు పరిష్కరించే పరిస్థితి లేదు. నడకకి దగ్గర ఉన్నా ఎ. వి. ఎన్ కాలేజి చదువు లేదు. ఫిషింగ్ హార్బర్ దగ్గరగా ఉన్న లక్షల్లో వ్యాపారం జరిగినా మత్స్యకార్లకి మాత్రం అందులో భాగం ఉండదు. ఎందుకంటే అక్కడంతా బయట నుంచి వచ్చిన దళారులదే రాజ్యం.

పోస్టాఫీసు దగ్గర ఉన్న కోటవీధి కూడా జాలార్లు నివసించే ప్రాంతమే. అక్కడ చేపల వేటకంటే పోర్టుకి వచ్చేవాళ్ళ దగ్గర సహాయం చేయడం కోసం, కూలీపనులు చేస్తూ ఉంటారు. కోటవీధిలో ముస్లింలు, మత్స్యకారులు, క్రిస్టియన్స్ కలిసి బతికే సంప్రదాయం ఉంది. అందుకే అక్కడ దర్గా, వేంకటేశ్వర స్వామి గుడి, కన్నె మరియమ్మ గుడి మూడూ ఆనుకుని ఉంటాయి. ఇప్పుడు కోటవీధి పోర్టు కాలుష్యం కోరల్లో కొట్టుమిట్టాడుతుంది.

విశాఖపట్నం ఇతర ప్రాంతాల నుంచి వచ్చే జనంతో నిండిపోతోంది. వాళ్ళకు అన్ని రకాల సౌకర్యాలతో పెద్ద పెద్ద బంగ్లాలు, పెద్ద పెద్ద కార్పోరేట్ హాస్పిటల్స్, హోటళ్ళు, రిసార్ట్స్ అన్నీ సౌకర్యాలే. స్థానికులు మాత్రం అసౌకర్యాల మధ్య కొట్టుమిటాడుతున్నారు.

విశాఖలో స్థానికులు తప్ప అందరూ అభివృద్ధి చెందుతున్నారు. ఎక్కడ నుంచో వచ్చిన పెద్ద పెద్ద వాళ్ళు, సినిమావాళ్ళు, సినీ పరిశ్రమ, సినీయాక్టర్లు, రాజకీయ నాయకులు, చిన్నగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన వాళ్ళు కూడా ఇప్పుడు పెద్ద రాజకీయ నాయకులుగా ఎదిగి దోచుకుని తినేటోళ్ళే కాని సముద్రాన్ని ఆనుకుని ఉన్న మత్స్యకారుల కోసం ఆలోచించే వారే లేకుండా పోయారు.

వేట నిషేధ కాలం: ప్రభుత్వం ఏప్రిల్, మేలో వేట నిషేధం విధిస్తుంది. గతంలో 47 రోజులుగా ఉన్న విరామ కాలం ఇప్పుడు 61 రోజులకి మారింది. ఈ కాలంలో బోటు యజమానులు బోట్లు జెట్టీకి కట్టేసి ఇళ్ళకు వెళ్ళిపోతారు. అప్పటికే కొద్దో గొప్పో ఆదాయం ఉన్న బోటు యజమానికి ఫర్వాలేదుగానీ కళాసీలుగా పనిచేసేవాళ్ళకు మాత్రం ఆ రెండు నెలలు గడ్డురోజులే. ఎందుకంటే సుమారు 20 వేల కుటుంబాలు ఇక్కడ మత్స్యపరిశ్రమను నమ్ముకుని బతుకుతున్నాయి. కాని ప్రభుత్వం మాత్రం 700వందల బోట్లులో పనిచేస్తున్న 5,600 మంది మత్స్యకారులని గుర్తించి నెలకు నాలుగు వేలు జీవనభృతిని ప్రకటించింది. ఇది ఒక కుటుంబానికి రెండు నెలలు పాటు ఏ మేరకు సరిపోతుంది. అది కూడా చేతికందే వరకు నమ్మకం లేదు. ఎందుకంటే పరిహారాలు ప్రకటనలకే పరిమితమవడం మనం చూస్తూనే ఉన్నాం. హుదూద్ తుపాను వచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్నా మత్స్యకారుల కూలిపోయిన గుడిసెలకి ఇప్పటికీ నష్టపరిహారం అందలేదు. ఈ నిషేధకాలంలో మహిళలకు చేపల వ్యాపారం ఉండదు. కాని వీళ్ళకి గుర్తింపు లేదు. ఏ జీవనభృతి లేదు. ఎన్నో ఏళ్ళుగా ఒకే యజమాని దగ్గర పనిచేసినా నిషేధకాలంలో వేతనం చెల్లించడు. కొన్ని రాష్ట్రాల్లో వేట నిషేధం ఉన్నపుడు ఆయా ప్రభుత్వాలు మత్స్యకారులకు రెండు నెలలకు సరిపడే రేషన్ ఇస్తాయి. కాని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాత్రం పట్టించుకోదు. ఏటా ఈ విరామకాలంలో మత్స్యకారులు కుటుంబం నడపడానికి అప్పులు, ఫైనాన్స్ మీద ఆధారడతున్నారు. ఇంకొంతమంది వలస వెళుతుంటారు. కొంతమంది తెలిసిన కూలీ పనులతోను, పోయిన వలలు అల్లి కాలం వెళ్ళదీస్తున్నారు. మరికొంతమంది తెప్పలవేటతో వెళ్ళి వచ్చిన దాంతో గడుపుతారు. వేట నిషేధం అనేది ప్రభుత్వం చెప్పే కారణం ఏప్రిల్, మేలో చేపలు గుడ్లు పెడతాయి కాబట్టి వేట చేసే క్రమంలో గుడ్లు నాశనం అయిపోతే తర్వాత చేపలు ఉండవు అనేది కారణం. ఎప్పుడు లేనిది కొన్నాళ్ళ నుంచి ఈ పద్దతి అమలు చేస్తున్నారు. కాని మాకు అన్యాయం జరుగుతుందని మమ్మల్ని పట్టించుకోండని అడిగే ధైర్యం లేదు.

విశాఖపట్నంలో 30ఏళ్ళలో వలసల సంఖ్య బాగా పెరిగింది. వలసలు వచ్చేవారు ఏదో ఒక విధంగా ఎక్కడో ఒక దగ్గర ఇళ్లు నిర్మించుకుని లేకపోతే ప్రభుత్వ పథకాలు ద్వారా అయినా ఇళ్ళు పొందుతున్నారు. కాని మత్స్యకారులు విశాఖపట్నంలో ఉండి కూడా అభివృద్ధి చెందకుండా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుంది.

దీనికి కారణం: మత్స్యకారుల అమాయకత్వం. బయటి ప్రపంచంతో సంబంధం కల్గి ఉండకపోవడం. ఒకవేళ సముద్రాన్ని వదిలి బయటికి వెళితే బతకలేం ఏమో అని భయం. కొత్త వాళ్ళ మధ్య ఇమడలేక వెళ్ళినా ఒంటరి అయిపోతావేమో అనే భయం. అందువలన విశాల విశాఖలో చిన్న చిన్న ఇరుకు గదులలో కనీసం మరుగుదొడ్లు నిర్మించుకోడానికి స్థలం లేని పరిస్థితులలో ఉన్నారు. అయినా అదే వాళ్ళ ప్రపంచం. ఎన్ని రాజకీయ పార్టీలు మారినా ఎంతమంది మంత్రులు మారినా వాళ్ళ బతుకులు ఇప్పటికీ అలాగే ఉండడం ఎవ్వరు చూసినా చాలా ఆశ్చర్యం వేస్తుంది. మత్స్యకారగ్రామాలు స్మార్టసిటీ అభివృద్ధిలో ఏమూలో?. అదే విచారించదగ్గ విషయం.

మత్స్యకారుల జీవితాలు అప్పుడు ఎలా ఉన్నాయో ఇప్పుడూ అలాగే ఉన్నాయి. జీవనవిధానం మారిందేమో కాని పరిస్థితులు మారలేదు. ఇల్లులు పెరగలేదు. మరగుదొడ్ల నిర్మాణాలు లేవు. మత్స్యకారుల్లో సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగిన వాళ్ళు లేరు. ఒకవేళ ఎవరైనా ఎదిగినా వాళ్ళకు ప్రాధాన్యత లేకుండా చేస్తారు. ఎవరికిందో పని చేయాల్సిందే. తప్ప వాళ్లంతట వాళ్ళు ఎదిగే పరిస్థితి లేదు. ఉద్యోగవిషయంలో పెద్దగా చదువులు ఉండవు ఉన్నా ఉపయోగించే పరిస్థితిలేదు. ఎందుకంటే ఆర్థికంగా, బలంగా ఉన్న వేరే కులాన్ని తీసుకుని దీనిలో కలిపేయడం వలన రిజర్వేషన్ ఉన్నా ఉపయోగించుకునే వెసులుబాటు లేదు. ఈ పోటీలో మత్స్యకారుడు ఓడిపోవలసిందే.

ఈ విధంగా మత్స్యకారులకు అన్యాయం జరుగుతూనే ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వాలు మత్స్యకారులను గుర్తించి తగిన విధంగా స్పందించాలి లేకపోతే మత్స్యకారులు వాళ్ళ హక్కుల కోసం వాళ్ళ దగ్గరకు వచ్చే రాజకీయ నాయకులను నిలదీయాలి. ప్రభుత్వాన్ని నిలదీయాలి. సమిష్టిగా పోరాడాలి.

బర్నింగ్ ఇష్యూస్ వల్లే బతికి ఉన్న తెలుగు కథ

పాణి

'బర్నింగ్ ఇష్యూస్' బారిన తెలుగు కథ అనే వ్యాసం 20 జూన్ ఆంధ్రజ్యోతి వివిధలో వచ్చింది. ఇది మెహర్ రాశారు. మన సాహిత్య అధ్యయనంలోని గందరగోళాలన్నీ ఈ వ్యాసంలో ఉన్నాయి. కొన్ని నేరుగా వచ్చాయి. కొన్ని చుట్టూ తిరిగి వచ్చాయి. కాకపోతే ఈ వ్యాసం వాటిలో కొన్నిటికి కొనసాగింపుగా, మరి కొన్నిటికి ఖండనగా ఉంది. అదీ విశేషం. ఈ ట్రెండ్స్ మన సాహిత్య పరిశీలనలో చాలా ఉన్నాయి.

ట్రెండ్ అనే దానికి చాలా గంభీరమైన అర్థం చెప్పుకోవచ్చు ఇవి అలాంటివేమీ కాదు. సాహిత్యానికి సంబంధించిన సామాజిక రాజకీయార్థిక, కళా తాత్విక విషయాలు వీటిలో ఏమీ ఉండవు. ఈ ట్రెండ్స్‌లో ఉన్న కొందరు ఆలోచనాపరులు ఒక్కోసారి అలాంటి పరిభాషతో, ఫ్లేవర్‌తో మాట్లాడుతూ ఉంటారు. అంత వరకే. వాటిలో ప్రభావశీలమైన భావనలుగా కూడా ఉండొచ్చు. పైగా ప్రగతిశీల శిబిరం చుట్టూతా ఇవి పరిభ్రమిస్తూ ఉంటాయి.

ఇవన్నీ సాహిత్య ఆవరణ గురించిన అమాయకపు, అరగొర ఆలోచనల ఫలితం. ఏది సాహిత్యమవుతుంది? ఎలా సాహిత్యమవుతుంది? సాహిత్య సృజన తలం ఏమిటి? అసలు కళతో మనుషులు సంబంధం ఎందుకు పెట్టుకుంటారు? లాంటి ఎన్నో విషయాలు ఈ చర్చలో రాక తప్పదు.

చాలాసార్లు నిర్మాణాత్మక, ప్రతిభావంతమైన చర్చలకంటే, కించిత్ అమాయకత్వంతో కూడిన చర్చల్లోనే ఎక్కువ విషయాలు బైటకి వచ్చేలా ఉంది. కాకపోతే అవి చాలా మౌలిక విషయాలయితే ఎన్నోసార్లు చెప్పుకున్నవే మళ్ళీ మళ్ళీ చెప్పుకోవాల్సి వస్తుంది.

మెహర్ వ్యాసంలోని ఒక ముఖ్యమైన విషయం ఉంది. అదేమంటే- అమరావతి భూసేకరణ, రోహిత్ వేముల, నిర్భయ లాంటి గ్రాండ్ థీమ్స్ తప్ప మాములు మనుషుల్ని జీవిత పరిధిలో తాకే అనుభవాలు తెలుగు కథకు వస్తువు కావడం లేదు అంటారాయన. తాను గ్రాండ్ థీమ్స్ అనుకుంటున్న వాటికి, మాములు మనుషుల జీవిత పరిధిలో తాకే విషయాలనుకుంటున్న వాటికి పోటీ పెట్టడం ఆయన అమాయకత్వానికి నిదర్శనం. గ్రాండ్ థీమ్స్ అనబడేవి సహితం సాధారణ జీవిత పరిధిలోనివే. అనుమానమే లేదు. భూములు కోల్పోవడం, రోహిత్‌లాంటి వాళ్ళ ఆత్మహత్య చేసుకోవడం మనుషుల జీవితాలను తాకేవి కాదా? ఎందుకు కాదు? లేకపోతే సమాజం స్పందించిందని చెప్పడానికి ఆధారం ఏముంది? అదే జరగకపోతే ఆ ఘటనలు పత్రికలకు పతాక శీర్షికలు కాజాలవు. మనుషులతో, జీవితాలతో సంబంధం లేనివి కూడా పత్రికల పతాక శీర్షికలవుతుంటాయి. అది పూర్తిగా వేరే విషయం. అయితే అన్నీ అలాంటివే కావు. 'గ్రాండ్ థీమ్స్' అని అంటున్నవన్నీ పూర్తిగా సామాజిక జీవితానికి సంబంధించినవే.

ఇలాంటి సామాజిక సమస్యలోంచి ఏది, ఎలా సాహిత్య వస్తువు అవుతుంది అనేదే ప్రశ్న. రోహిత్ వేముల అనే విద్యార్థి ఆత్మహత్య ఘటన, దాని వెనుక ఉన్న కారణాలు, తదనంత పరిణామాలు అనే దానిలో సాహిత్య వస్తువును ఎలా చూడాలి? ఎలా ఎంచుకోవాలి? ఏ దృక్పథంతో, ఎలా రాయాలి? ఇవీ వేయాల్సిన ప్రశ్నలు. ఎందుకంటే మౌలికంగా ఆ రచన సాహిత్యం కావాలి కాబట్టి. సాహిత్యమే నెరవేర్చే కర్తవ్యం ఆ రచనతో నెరవేరాలి కాబట్టి.

రోహిత్ వేముల అనే 'వస్తువు' మీద వచ్చిన కథలు నేనూ చదివాను. పెద్దగా సాహిత్యం కాలేదు. ఎందుకంటే ఆ సామాజికాంశంలో ఏది సాహిత్య వస్తువో ఎంచుకోవడంలోనే లోపం ఉన్నది. ఇది మౌలికంగా సాహిత్య దృక్పథానికి సంబంధించిన సమస్య. అక్కడే సమస్య ఉన్నాక ప్రయోగమనే గారడీ చేసి 'కథ' రాశామని అనిపించుకోగలిగారు కాని సాహిత్యం కాలేకపోయింది. శిల్పానికి సంబంధించిన ఈ వ్యవహారం అంతగా కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నదంటే కూడా అది సాహిత్యం కానట్టే లెక్క. శిల్పమే సాహిత్యం కాకపోయినా.. ఒక రచన సాహిత్యం కావడానికి తొలి షరతు శిల్పం.

ఇంకో ఉదాహరణ చెప్పుకోవాలంటే అమరావతి 'వైభవం' గురించి కొన్ని పత్రికలు, ఛానళ్లు చాలా ప్రచారం చేస్తున్నాయి. అదంతా దగా అని ఇంకొన్ని పత్రికలు, ఛానళ్లూ కుప్పలు తెప్పలుగా సమాచారం గుమ్మరిస్తున్నాయి. వాటి నుంచి అమరావతిపై కథ ఎన్నటికీ పుట్టదు. అయినా బలవంతంగా వాటి నుంచి కాల్పనిక భాషను పేర్చి కథ రాశామని చెప్పేవాళ్లు ఉండవచ్చు. కాని దాన్ని సాహిత్యమని చదవడం కష్టం. సాహిత్య వస్తువేదో, ఎందుకది సాహిత్య వస్తువు అవుతున్నదో తేల్చుకోకుండా, కేవలం శిల్ప గారడీలతో మెప్పించాలనుకుంటే అది ఎన్నటికీ ప్రయోగం కాజాలదు. సాహిత్య శిల్పంలో ప్రయోగానికి విశిష్టమైన స్థానం ఉంటుంది. వివిధ సామాజికాంశాల్లోని సాహిత్య వస్తువు ఏదో తేల్చుకోవడానికి అవసరమైన సామాజిక దృక్పథం ఉంటే అక్కడి నుంచి రచయితలు తమ కార్యక్షేత్రమైన సాహిత్య ప్రపంచంలోకి అవసరమైన వస్తువును ఎంచుకోగలుగుతారు. ముందు ఇది తేలాక రచనలో ఎలాంటి ప్రయోగాలైనా చేయవచ్చు. అంటే 'గ్రాండ్ థీమ్' అనబడేదానిలోని సాహిత్య వస్తువును తేల్చుకునే దృక్పథం ఉన్నప్పుడే ప్రయోగం వల్ల గొప్ప వైవిధ్యభరితమైన సాహిత్యం వస్తుంది. అట్లా ఈ తరహా గ్రాండ్ థీమ్స్ అనబడే వాటి మీద గతంలో వచ్చిన ఎన్నో గొప్ప సాహిత్య రచనలను ఉదహరించవచ్చు.

మెహర్ ప్రస్తావించిన రెండో అంశం జీవితానుభం. సాహిత్య

రచనకు, పఠనానికి అనుభవ తలంలో చాలా విశిష్టతలు ఉన్నాయి. తరతరాల జీవితానుభవం అంత పాతది కళ. ఆ అనుభవం ఎప్పటికప్పుడు మారుతూ ఉంటుంది కాబట్టే కళ అంత నవనవోన్వేషంగా ఉంటుంది.

మనిషికి అనుభవం అనేది ఉన్నందు వల్లే, దానితోపాటే సహానుభవం, లేదా సహానుభూతి కూడా ఉన్నాయి. అది ఎంత పాతదో ఇదీ అంత పాతదే. ఈ రెంటిలాగే కళ కూడా అంతే పాతది.

ఆయన కూడా సహానుభూతి గురించిన ఇతరుల వాదన వినిపిస్తూ... వెంటనే వ్యక్తిత్వంలోకి గెంతేశారు. సహానుభూతి, వ్యక్తిత్వం అనే రెంటి గురించి సానుకూలంగా, వాస్తవికంగా ఆలోచిస్తే తను చేసిన ఆరోపణకు సమాధానం దొరికేది. అయితే ఆయన స్థిమితంగా ఆలోచించలేదు. ఇట్లా దేని మీదా స్థిమితంగా ఆలోచించకపోవడం, నిర్దిష్టంగా పరిశీలన చేయకపోవడం, భాష ఉపయోగించడం వచ్చుకాబట్టి ఆదాటున పెద్ద పెద్ద సూత్రీకరణలు చేసుకుంటూ పోవడం కూడా సాహిత్యంలో ఇటీవల ఒక ముఖ్యమైన ట్రెండ్. దీంతో ఒక అసంబద్ధ ప్రశ్న నుంచి మరో అసంబద్ధ ప్రశ్నలోకి వెళ్ళిపోతూ ఉంటారు.

నిజమే, ఆయన చెప్పినట్లు స్వీయానుభవంలో లేని వాటిపై రాస్తే ఖాళీలు ఉండొచ్చు. లోపాలూ ఉండొచ్చు. ఒక్కోసారి విరుద్ధమైన విషయాలు కూడా దొర్లుతాయి. అనుమానమే లేదు. వాటిని ఎలా అధిగమించాలి? దానికి సమాధానం వెతకకుండా ఆ ఖాళీలను దృక్పథాల ఆధారంగా పూడ్చుతారని మరో అమాయక వాదన తెచ్చారు. వాస్తవానికి విడి విడి జీవితానుభవ శకలాలను, వాటి మధ్య ఉండే లోతైన అంతస్సూత్రాన్ని అర్థం చేసుకోడానికి దృక్పథం పని చేస్తుంది. అసలు దృక్పథాన్ని, జీవితానుభవాన్ని వేర్వేరు దీవులుగా భావించడం ఇంకో ట్రెండ్. ఈ దృక్పథాల గొడవ అంతా ఎందుకు? జీవితానుభవాన్ని రాస్తే పోలా? అని చాలా మంది సాహిత్య వ్యాఖ్యాతలు చెబుతూ ఉంటారు. వీళ్లకు దృక్పథమంటే ఏమిటో తెలియదు. జీవితానుభవమంటే ఏమిటో కూడా తెలియదు. తరతరాల జీవితానుభవం నుంచే సిద్ధాంతాలు, దృక్పథాలు ఏర్పడతాయి. కాకపోతే సాధారణ జీవన తలం నుంచి దృక్పథాలు రూపొంది, నిగ్గుదేలే అనేక స్థాయిల సంక్లిష్ట ప్రక్రియ ఉంటుంది.

> **ధనికులు-పేదలు**
>
> విద్యావంతులు, ఉన్నత వర్గాల వాళ్ళు
> పేదల మీద సవారీ చేస్తున్నారు.
> పేదలంటే మనకు చాలా సానుభూతి. వాళ్ళ శ్రేయస్సు
> కోసం ఏమి చెయ్యటానికైనా సిద్ధమే.
> పేదలకు పౌష్టికాహారం కావాలి. వాళ్ళు తమ కాళ్ళ మీద
> తాము నిలబడేటందుకు సహాయం చెయ్యాలి.
> విద్యాబుద్ధులు నేర్పించాలి. మనం వాళ్ళ కోసం ఏమైనా
> చేస్తాం కాని, సవారీ చెయ్యటం మాత్రం మానం.
>
> **- టాల్‌స్టాయ్**

ఒక మాటలో చెప్పాలంటే విజ్ఞాన శాస్త్రాల వలె సామాజిక శాస్త్రాలు, దృక్పథాలు తయారయ్యే తలానికి చెందిన శాస్త్ర సంబంధమైన వ్యవహారం అంది. మామూలుగా కల్పనా సాహిత్యానికే పరిమితమైన రచయితలకు ఈ సంక్లిష్ట ప్రక్రియ కొంచెం దూరమే. అయితే అది జీవితానికి సంబంధించింది కాబట్టి తప్పక ప్రతి ఒక్కరికీ ఉంటుంది. అందువల్ల ఒక రచయితకు ప్రత్యక్ష జీవితానుభవంలో లేని ఇతివృత్తాలను రాసినప్పుడు ఏర్పడే ఖాళీలను పూడ్చడానికి దృక్పథాలను వాడుకుంటారనే అభిప్రాయం వాదనకు నిలబడేది కాదు. జీవనుభవాలను దృక్పథాల ఆధారంగా అర్థం చేసుకుంటూ, వాస్తవ పరిస్థితుల్లో వచ్చే మార్పుల పరిగణనలోకి తీసుకొని మన అనుభవాల మధ్య ఉండే సారాన్ని తెలుసుకుంటూ పోతే రచలనలో ఆయన చెప్పిన ఖాళీలపట్ల అప్రమత్తంగా ఉండొచ్చు. దృక్పథం పాత్ర ఇది. అంతేగాని మన ప్రత్యక్ష అనుభవంలో లేనివి రాస్తున్నప్పుడు, మాట్లాడుతున్నప్పుడు ఏర్పడే ఖాళీలను భర్తీ చేయడం దాని పని కాదు.

అనుభవాన్ని, దృక్పథాన్ని ఇలా అర్థం చేసుకోకపోతే మానవ సహజాతమైన, విశిష్టమైన సహానుభూతి అనే దాన్ని తిరస్కరించి, వేళాకోళం చేసి సరిపెట్టుకున్నట్టవుతుంది. సాహిత్యాన్ని పక్కన పెట్టేద్దాం. సహానుభూతిని కాదనుకుంటే దుఖించే మనిషిని చూసి కళ్లు చెమర్చి ఓదార్చే చేయిని తోసేసినట్టవుతుంది. మరీ ఇంత జనరలైజ్ చేయకపోయినా నిర్దిష్టంగానే జీవితంలోని సహానుభూతి పాత్రను ఎలా విస్మరించగలం? సహానుభూతి గురించి మాట్లాడటమంటేనే తరతరాల అణచివేత, విస్మరణల నుంచి ఇప్పుడిప్పుడే గొంతు పెగల్చుకొని స్వీయానుభవాల గురించి రాస్తున్న క్రమానికి పోటీ తేవడం కానే కాదు. స్వీయానుభవంలోని గాఢత దానికదే సాటి. ఇక్కడ చర్చ ఇంకా ముందుకు తీసికెళ్లినట్లవుతుంది కాని, స్వీయానుభవాన్ని సహితం హేతుబద్ధంగా తరచి చూసుకోడానికి కూడా దృక్పథమనేది అవసరం. నేరుగా జీవితానుభవం నుంచి కలిగే దృష్టి కోణాన్ని గౌరవిస్తూనే, అందులోని వాస్తవికతను శాస్త్రపద్ధతిలో గుర్తించాల్సి ఉంటుంది. అంటే దృక్పథం కావాలి.

వ్యక్తితం గురించి కూడా మెహర్ ఇలాగే రాశారు. హంతకుడు ఆదర్శవాది పాత్రలు వ్యక్తిత్వాంశలోనివని, దళితుడు, పత్తిరైతు సామాజిక ఐడెంటిటీస్ అని ఏదో అర్థం లేని వాదన చేశారు. ఎంత ఓపిగ్గా పట్టించుకున్నా ఇందులో అర్థం చేసుకోవలసిందేవీ లేదు. 'సామాజిక గుర్తింపు' అనే అర్థంలో పత్తి రైతు కూడా అలాంటి 'గుర్తింపు' ఉన్న పాత్ర కాదు. పత్తి రైతు, దళితుడు, వేశ్య ఇలా ఏ 'మనిషి' గురించి అయినా సహానుభూతితో రాయవచ్చు.

ఇక్కడ మెహర్ ఒక మంచి మాట అన్నారు. కేవలం భావోద్వేగాలతో కూడిన సహానుభూతితో తప్ప సమస్యల లోతుకెళ్లి అర్థం చేసుకొని, అవగాహన పొందకుండా రాసేస్తే ఆయన అన్నట్లు సివిక్ గిల్ట్‌ను తృప్తిపరుచుకోడానికి తప్ప ఆ రచనలు ఎందుకూ పనికి రావు.

ఏ కళ అయినా భావోద్వేగ సమాహారమే. అది చదివేవాళ్లకు, వినేవాళ్లకు, చూసే వాళ్లకు కలగాలి. అయితే కళాకారులకు సమస్యల పట్ల స్వీయ భావోద్వేగాలే ఎంత మాత్రం సరిపోవు. అక్కడ ఆయన

అన్నట్లు మనిషి లోతు ప్రస్తావన వస్తుంది. సాహిత్యం లేదా కళ సామాజిక పాత్రల లోతుల్లోంచి వస్తుంది. ఆ పాత్రలు తమను తాము నిర్మించుకునే, పునర్నిర్మించుకునే ఘర్షణ పూరిత ప్రక్రియలోంచి సాహిత్యం వస్తుంది.

ఇటీవల వస్తున్న కథల్లో కేవలం సామాజిక వస్తువును యథాతథంగా తీసుకొని శిల్ప నగిషీలు చెక్కడం తప్ప ఆ సామాజిక వస్తువు గురించిన లోతైన అవగాహన ఉండటం లేదు. ఒక్క మాటలో చెప్పాలంటే మన రచయితలకు సహానుభూతి, ఉద్వేగ పార్శ్వం (అవి అవసరమే) ఉన్నంతగా దానికి సంబంధించిన సామాజిక జ్ఞాన పార్శ్వం ఉండటం లేదు. ఏదో చూచి, విని చలించిపోయి కథలు, కవితలు రాస్తున్నారని అనిపిస్తోంది.

అడవిలో పద్దెనిమిదేళ్ల ఆదివాసీ అమ్మాయిని ఘోరంగా అత్యాచారం చేసి పోలీసులు చంపేశారనే వార్త పత్రికల స్థానిక ఎడిషన్లో సింగిల్ కాలంలో వస్తుంది. అది సహజంగానే ఎవరికీ అంతగా పట్టదు. ఇలాంటి సామాజిక కారణాల వల్లే 'నిర్భయ' ఉదంతం జరుగుతుంది. అనేక ప్రత్యేకతల వల్ల అది పత్రికల పతాక శీర్షిక అవుతుంది. అక్కడా, ఇక్కడా పని చేసిన సామాజిక కారణాలేమిటి? అనే లోతైన అధ్యయనం, పరిశీలనా దృష్టి ఉంటే సహానుభూతిలో గాఢత పెరుగుతుంది. మెహర్ థీరీ ప్రకారం ఆ విషయంపై కథ రాయాలంటే మనమే నిర్భయ అయినా కావాలి, కనీసం అమ్మాయిలం అయినా కావాలనే మాట కుదరదు కాని ఆ ఘాతుకంలోని సామాజిక అనుభవాన్ని సొంతం చేసుకోడానికి మేధో, సృజన తలాలు రెండిట్లో ఇతరులు ప్రయాణించాల్సి ఉంటుంది.

రచయితలకు తాము రాస్తున్న విషయంపట్ల అవగాహన ఉండాలని మెహర్ అంటూనే సాహిత్యం పని సమస్యలు విశదంగా ఎత్తి చూపడమే గాని, పరిష్కారాలు వెతకడం కాదని చెహోవ్ మాటను ఊటంకించారు. రచయితకు ఆ సమస్య పట్ల గాఢమైన అవగాహన ఉంటే పరిష్కారం మాత్రం ఎందుకు చెప్పకూడదు? అప్పుడైనా మనం పరీక్షించాల్సింది అది సాహిత్యమైందా? లేదా? అని. మనకు ఇష్టం ఉన్నా లేకున్నా ధర్మ సంస్థాపన అనే పరిష్కారం చూపుతూనే ప్రాచీన రచనలన్నీ వచ్చాయి. అవి సాహిత్య కృతులయ్యాయి. ప్రతి జానపద పాటలో చివర్లో కూడా ఏదో ఒక మాట ఉంటుంది. అది మన పరిభాష ప్రకారం పరిష్కారం అవునో కాదో గాని సుమారుగా అలాంటిదే ఏదో ఉంటుంది. వాటిని సాహిత్యం కాదంటే ఇంక మానవజాతికి సాహిత్యం, కళలు లేనట్టే.

'పరిష్కారాలు' అనబడేవి చూపే రచనల్లో సాహిత్యం కానిది. కూడా ఉండొచ్చు. దీనికి కారణం రచయితలకు పైన చెప్పుకున్న సామాజిక, సాహిత్య దృక్పథం సక్రమంగా లేకపోవడమే. మౌలికంగానే సాహిత్య ఆవరణ ఏమిటో, దాని పరిభాష ఏమిటో, దానికి ఉండే అర్థాలు ఏమిటో తెలియకపోవడం. ఒక సామాజిక అంశంలోంచి గందరగోళం లేకుండా సాహిత్య వస్తువును ఎన్నుకొని కళా ఆవరణలోకి తీసికెళ్లాక ఇక అక్కడి వ్యవహారమంత సాహిత్య మాధ్యమంలోనే సాగాలి. ఇక్కడ ఇంకో రాంగ్ ట్రెండ్ తలెత్తే ప్రమాదం ఉంది. ఆ ఆవరణకు సమాజంతో సంబంధం ఉండదని, విడిగా ఉంటుందనే పెడవాదం చేయవచ్చు. సాహిత్య ఆవరణలోకి

> నియంత తను దైవభక్తి పరాయణ్ణని
> ప్రజల్ని నమ్మించాలి....
> మత ఛాందసుడని అనిపించుకుంటే మరీ మంచిది.
> ఇంత పవిత్రుడైన ప్రభువు
> ఏ నిర్ణయం తీసుకున్నా ప్రజలు
> నిరసించరు.....
> దేవుడికి ప్రతినిధిగా ఉన్న రాజు మీద
> ఎవరికీ తిరుగుబాటు చేయాలనిపించదు.
>
> **- అరిస్టాటిల్**

ఒక సామాజిక వస్తువును తీసికెళ్లాక అది తప్పనిసరిగా మానవ సంబంధాల, సంస్కృతీ విశేషాల, వ్యక్తిత్వ వికాసాల, విలువల సంఘర్షణల ఉద్వేగభరిత కళ రూపం ధరించాలి. వాటి నుంచే తార్కిక ముగింపు ఉండవచ్చు కూడా. ఇవన్నీ ఒక స్పష్టమైన సామాజిక అర్థాలను పలుకుతూ ఉంటాయి. చలసాని ప్రసాద్ అంటుండేవారు...మాయబజార్ సినిమాలో కృష్ణుడు, ఘటోత్కచుడు చేసిన మాయలు తీసేస్తే మిగతా అంతా ఆనాటి అలనాటి సామాజిక అర్థాలనే పలుకుతుంది అని.

ఒక రచన సాహిత్యం కాకుండా పోయిందన్నా, అందులోకి ముతక పద్ధతిలో పరిష్కారం (సామాజికంగా కరెక్టే అయినా) వచ్చి చేరిందన్నా రచయితకు సాహిత్య ఆవరణలో ఎలా వ్యవహరించాలో తెలియనట్టే. అంతకుమించి ఆ వస్తువుకు సంబంధించిన సామాజిక అవగాహన సరిగా లేనట్టే.

సామాజిక వాస్తవికత అనేది దాని నియమాల రూపంలో ఉంటుంది. ఉదాహరణ కుల కట్టుబాట్లు, తెగ ఆచారాలు, కుటుంబ సంప్రదాయాలు మొదలైనవి. సమాజమనే మొత్తంలో రాజకీయార్థిక వ్యవస్థతో పాటు ఇవి కూడా ఉంటాయి. రాజకీయార్థిక వ్యవస్థకు, పైన చెప్పిన సామాజిక విషయాలకు ఉమ్మడి ప్రాంతం ఉంటుంది. అదే సమయంలో సామాజిక, సాంస్కృతిక విషయాలకు వ్యవస్థతో సంబంధం లేని నాగరికతాపరమైన చరిత్ర ఎంతో ఉంటుంది. లేదా నాగరికతా వికాసాన్ని అడ్డుకుంటున్న చరిత్ర ఉంటుంది. అట్లాగే సమాజంలోని ఏ వ్యవస్థాగత అంశమైన మీడియేషన్ ద్వారా వ్యక్తం అవుతూ ఉంటుంది. మానవ జీవితంలో అది అనేక వ్యవస్థల్లోని మానవ సంబంధాల, విలువల, నియమాల, ధిక్కారాల, నిర్ణాయకతల సంక్లిష్ట ప్రక్రియగా అనుభవంలోకి వస్తుంది. ఈ విషయాలు తెలియకుండా ఒక సామాజిక అంశంలోంచి సాహిత్య ఇతివృత్తం తీసుకుంటే ఆ రచనలో ఇవేవీ ఉండవు. చాలా మెకానికల్‌గా గీతలు గీచి కథ నడిపినట్లవుతుంది. రచనలో చిత్రించిన మానవ సంబంధాల, విలువల సంఘర్షణలను నేరుగా వ్యవస్థ పరిధిలోకి తీసికెళ్లి పరిష్కారం చెప్పిస్తూ ఉంటారు. సామాజికంగా అది కరెక్టే కావచ్చు. అయితే అది తేలికపాటి సాహిత్య వ్యవహారం. రచయితలు తమకు ఇష్టమైన పరిష్కారాన్ని రచనల చివర్లో అతికించినట్లవుతుంది. అందు వల్లే చాలాసార్లు అలాంటి రచనలు సాహిత్యం కాకుండాపోతుంటాయి. విమర్శకులు అలాంటి రచనలు ఎందుకు సాహిత్యం కాకుండా పోయాయో చెప్పకుండా,

తమకు సామాజికంగా.. రాజకీయంగా ఇష్టంలేని ముగింపు ఉన్న కథలను ఆ కారణం వల్లే సాహిత్యం కాదని కొట్టి పడేస్తుంటారు. మొత్తంగానే 'ముగింపు'ను వ్యతిరేకిస్తున్నట్టు ఉంటుందికాని, వాస్తవానికి వాళ్లు మార్క్సిస్టు అవగాహనలో వచ్చిన ముగింపులనే వ్యతిరేకిస్తుంటారు.

ఇట్లా బలవంతంగా వ్యవస్థ పరిధిలోకి మానవ సంబంధాలను నడిపించి, వస్తువుపై వైఖరి చెప్పినా, పరిష్కారం సూచించినా.. మెహర్ లాంటి వాళ్లు దాన్ని 'ఐడియాలజికల్ చదరంగం' అంటారు. వాస్తవానికి కథలో ఈ లోపాలకు ఐడియాలజీ సరిగా లేకపోవడం కారణమని చెప్పాలి. ఐడియాలజీని బాగా అర్థం చేసుకుంటే మంచి కథలు రాయొచ్చని చెప్పాలి. ఆ మాట అనడానికి ఇష్టం ఉండదు. ఐడియాలజీ దగ్గరకి వెళ్తే ప్రధానంగా మార్క్సిస్టు ఐడియాలజీని అంగీకరించినట్టవుతుంది. లేదా ప్రగతిశీల భావజాలాన్ని ఒప్పుకున్నట్టవుతుంది. అందుకని కథ బాగా కుదరకపోవడానికి ఐడియాలజీ కారణమనే వితండవాదం చేస్తారు. ఐడియాలజీ రుచించకపోవడమే ఒక లిటరరీ టేస్ట్. ఇప్పుడు దీనికి తెలుగు సాహిత్యంలో బాగా క్రేజ్ ఉంది. ఫలానా రచయితకు ఏ ఐడియాలజీ లేదనే గుర్తింపు ఉందనుకోండి.. ఇక ఆమెను, లేదా ఆయన్ను ఆరాధనగా చూస్తుంటారు. అందులో బోలెడు కళ కనిపిస్తూ ఉంటుంది. సాహిత్యరంగం మొత్తాన్ని దురాక్రమించాలనే పేరాశ ఈ తరహా వాళ్లకు ఉంటుంది కానీ ఇప్పటికీ ఈ ట్రెండ్ చాలా బలహీనమైనదే. అదే బలంగా ఉండి ఉంటే తెలుగు సాహిత్యలోకం బతికిబట్ట కట్టేదే కాదు. అందుకే మెహర్ దృక్పథాలు, నిబద్ధతల పేరిట ఇంకా దబాయింపు సెక్షన్‌లు అమల్లో ఉన్నాయంటే నమ్మకం కలగకపోవచ్చు కానీ ఉన్నాయని వాపోయారు.

ఇంతకు ఆయన ఈ 'బర్నింగ్ ఇష్యూ' ఎందుకు లేవదీశారో చదువరులకు తెలిసే ఉంటుంది. పైకి సోషల్ మీడియాలో, ఇంటర్నెట్ పత్రికల్లో వస్తున్న కథల గురించే అన్నట్లు ఉందిగాని మార్క్సిస్టు రచయితల మీదే ఈ అక్కసు అంతా. ఎంత కాలం ఇలా బర్నింగ్ ఇష్యూస్ మీద రాస్తారు? భావజాల నిబద్ధులై రాస్తారు? అని చెప్పడమే ఉద్దేశం.

తేడా లేదు

ఇటీవల కాదులెండి. చాలా కాలం క్రితం.

ఒక యువరాజు గారు ఒక యువ బిచ్చగత్తెను పెళ్లి చేసుకున్నాడు. "ఇదేమి చోద్యం! ఇదేమి పొయ్యేకాలం" అంటూ ముక్కున వేలేసుకున్నారు రాజ బంధువులు, సామంతులు. కాని ఆ యువరాజు కించిత్తయినా పశ్చాత్తాపం పడలేదు సరికదా,

"మా ఇద్దరి మధ్య తేడా ఏముంది? ప్రజలు వేసే ముష్టితోనే బతుకుతామిద్దరమూ. కష్టపడి పనిచెయ్యడం మా ఇంటా వంటా లేదు" అంటూ వాస్తవమంగీకరించాడు.

విప్లవ ప్రయోజనం మనిషిని విముక్తుణ్ణి చెయ్యడం అంతేకాని-ఏదో ఒక అయిడియాలజీ బోధించడం కాదు.

- జా జెనె (ఫ్రెంచి నవలా రచయిత, నాటక కర్త)

అయితే ఆయన చెప్పిన తరహా సమస్యలున్న కథలు వస్తున్నమాట వాస్తవం. అవి ఆయన వాదనకు సాకుగా దొరికాయి. ఆ సమస్యలు తప్పక పరిష్కారం కావాల్సినవే. వాస్తవానికి ఇంటర్నెట్ పత్రికల్లోకి కొత్తతరం కథకులు వస్తున్నారు. వాళ్లది ఈ కాలానికి సంబంధించిన వ్యక్తీకరణ. తాజాగా ఉంటున్నది. దీన్ని ఆహ్వానించాలి. చాలా సున్నితమైన, భావుకతతో కూడిన అరుదైన విషయాలపై రాస్తున్నారు. ప్రింట్‌లో కూడా అడపాదడపా ఇలాంటి మంచి కథలు వస్తున్నాయి. అయితే వీళ్లెవరికీ సామాజిక జ్ఞానం లేదని వాళ్ల కథలే చెప్తుంటాయి. అసలు అలాంటివేవీ అబ్బకుండా ఫారం కోళ్లు పుట్టుకొస్తున్న కలం ఇది. రచయితలు మినహాయింపు ఎలా అవుతారు? సమాజం గురించిన సమాచారం మాత్రం గుట్టలకొద్దీ వచ్చి పడుతోంది. ఇప్పటికీ సమాజంలోకి వెళ్లడానికి ఎన్నో దారులు ఉన్నా కొందరికి మాత్రం ఇంటర్నెట్ ఒక్కటే ఏకైక దారి. అక్కడ దొరికే సమాచారమే సామాజిక వాస్తవం, సమాజ సారాంశం. అందువల్ల ఆ దారంట సమాజంలోకి వెళుతున్నామని అనుకుంటూ సమాచార కారడవిలోకి వెళ్లిపోతుంటారు. దేని మీద ఎక్కువ సమాచారం వచ్చిపడితే అదే సత్యం అనుకుంటారు. సమాచారంతో మాత్రమే సహానుభూతి, ఉద్వేగం పొందగలిగే విపరీత కాలం ఇది. ఏ రంగంలోనైనా తరాలు మారే కొద్దీ స్కిల్స్ మారుతూ ఉంటాయి. పెరుగుతూ ఉంటాయి. కొత్తవి అలవడుతూ ఉంటాయి. రచన అనే పనిలో కూడా అంతే. అందుకే ఇలాంటి సాహిత్యంలో 'గొప్ప' స్కిల్ కూడా కనిపిస్తూ ఉంటుంది. కానీ అందులో సాహిత్యమయ్యేది తక్కువే. చాలా మంది యువ రచయితలు కథలు చదివి కథలు రాయడం, సొంత మూడ్స్‌ను కవిత్వం చేయడం అనే వ్యసనంతో బాధపడుతున్నారు.

వీటన్నిటికి పరిష్కారం ఏమిటి? రచయితలు సామాజిక జీవితాన్ని పెంచుకోవాలి. దృక్పథాన్ని సునిశితం చేసుకోవాలి. పైన చెప్పిన తరహా కథల మీద మెహర్‌కు కోపం ఉంటే ఈ మాటలు చెప్పాలి. కాకపోగా దృక్పథం, భావజాలం, నిబద్ధత, ప్రగతి అనే విషయాలను వేళాకోళం చేశారు. ఇదీ అసలు విషయం.

పైన చెప్పినట్లు ఏ సామాజిక, సిద్ధాంత విషయం తెలియకుండా రాసేసే ట్రెండ్‌కు మెహర్ కూడా సన్నిహితమే. మనిషి లోతును అతని వర్గపరమైన స్థానమే నిర్ధారిస్తుందని మార్క్సిస్టు సాహిత్యకారులు అంటారని ఆయన అనడమే దీనికి తిరుగులేని దాఖలా. అదే నిజమైతే ప్రపంచ వ్యాప్తంగాను, తెలుగులోనూ ఇంత అద్భుతమైన వైవిధ్యభరితమైన మార్క్సిస్టు, విప్లవ సాహిత్యం వచ్చేదా?

అలాగే నిర్మాణాత్మక వివేచన నప్పే ప్రక్రియ వ్యాసం అని, దానికి ఇక్కడ ఆదరణ లేదనీ అన్నారు? ఇది నిజమా? పాఠకులు అనబడే మొత్తంలో కథలు, కవిత్వాలకంటే ఎన్నో రెట్లు చదివేది వ్యాసాలే. ఈ మాట నేను పత్రికా పాఠకులనే సాధారణ అర్థంలో అనడం లేదు.

ఆయనే అన్నట్లు రాజుకున్నంత సులభంగా చల్లారిపోయే అగ్గిపుల్లల్లాంటి ఆలోచనలు ఆయన వ్యాసంలో ఇంకా ఉన్నాయి. అయితేనేం మంచి ఆలోచన చేయడానికి ఆయన అగ్గిపుల్లలు గీచారు.

వివేకాన్ని మేల్కొలిపే మహాశ్వేతాదేవి కథలు

బాసిత్

విప్లవం అర్థం చేసుకోవాల్సిన భిన్న కోణాల్ని వాటి లోతుల్లోకి వెళ్లి, వాటి చారిత్రక మూలాల్ని శోధించి గడ్డ కట్టిన హృదయాంతరాలను బద్దలుకొట్టేలా మహాశ్వేతాదేవి తన పాత్రల్ని చిత్రించింది. బెంగాల్‌లోని సంథాల్ సమాజంతో మమేకమై ఆమె ఆ ప్రజలతో సజీవ సంబంధాల్ని నెలకొల్పుకుంది. అందువల్ల ఆమె రచించిన కథలు, నవలల్లోని పాత్రలకు రక్తమాంసాలను అద్దగలిగింది. ఆమె కథలకున్న మరో ప్రత్యేకత కల్పన, వాస్తవం కలగలిసి జమిలిగా ప్రవహించడం. కథలో పురాస్మృతి వర్తమానంలో కలగలసి సాగడం ఇంకో ప్రత్యేకత. ఇంతటి ప్రత్యేకతలున్న తన కథల్లోని పాత్రలతో ఆమె సంబంధంలోకి వెళ్లి 'ఉండవలసినతీరు'ను ప్రతిపాదించే పాత్రలతో తాదాత్మ్యం చెందుతుంది. అందువల్లనే ఆమె ప్రతి కథ 'ఫ్రాంజ్ కాఫ్కా' అనే జర్మన్ రచయిత చెప్పినట్లు "మానవ అంతరంగంలో గడ్డకట్టిన సముద్రాల్ని బద్దలుకొట్టే గొడ్డలి వంటిది."

ఆమె 100 నవలలను 20కి పైగా కథా సంకలనాలను బెంగాలీలో రాసింది. దాదాపు ఆమె అన్ని రచనలు వివిధ భారతీయ భాషల్లోకి, ఆంగ్లంలోకి తర్జుమా అయ్యాయి. ఆమె మొట్ట మొదటి రచన 'పరాయి పాలనను ఎదిరించిన ఝాన్సీ' అనే జీవిత చరిత్రాత్మక నవలను 1956లో ప్రచురించింది.

ఆమె ప్రముఖ రచనల్లో ప్రముఖమైంది 'హజార్ చౌరాసీ కి మా' (ఒక తల్లి) అనే నవల. అట్లాగే రుడాలీ, ఎవరిదీ అడవి? బషాయిటుడు చెప్పుకోదగిన ఇతర నవలలు. 'టెటూమిర్', 'ద ఆర్మీనియన్ చంపా ట్రీ', 'ద బుక్ ఆఫ్ హంటర్' వంటివి ఆంగ్లంలోకి అనువాదమైన మరికొన్ని ఆమె ప్రముఖ నవలలు.

'అగ్ని గర్భ' (1978), 'మూర్తి' (1979), 'నీరటి మేఘ' (1979), 'స్తన్యదాయిని' (1980), 'చొట్టిముండా ఎవంటీర్‌టీర్' (1980), వంటివి చెప్పుకోదగ్గ కథా సంకలనాలు. వీటిలో 'చోళీకె పీఛె', 'ద్రౌపది', 'స్తన్యదాయిని' (పాలతల్లి) అనే మూడు కథలు 'బ్రెస్ట్ స్టోరీస్'గా ప్రత్యేకంగా ఒక సంకలనం వచ్చింది.

ఈ సభలో నేను ప్రస్తావించాలనుకున్న కథలు తొమ్మిది. ఈ తొమ్మిది కథలు మహాశ్వేతాదేవి స్వయంగా ఎంచుకున్న మచ్చుతునకలు. ఈ కథలో ఆదివాసులు, సమాజం చేత చీత్కరింపబడ్డ జాతుల జీవితాల చిత్రణే నిండుగా కనబడుతుంది. ఆమె సాహిత్యమంతా అంచుకు నెట్టబడ్డ వారి జీవన సంక్షోభమే దర్శనమిస్తుంటుంది. అట్లా ఈ తొమ్మిది కథల నిండా కడజాతి వారి, మూలకు నెట్టి వేయబడ్డ జాతుల, కులాల జీవన సంఘర్షణే కనబడుతుంది.

వీటిలో మొదటి కథ వెల్లువ (బాగ్దీ). ఇందులో బ్రాహ్మణుల 'రసోయిపూజ' కోసం 'మనసా చెట్టు' మొక్క తెచ్చి ఇచ్చి ఏదో పెట్టింది, కాసింత తిని వెళ్లే బాగ్దీ (అంటరాని) పిల్లవాడి కథ. 'ఆ పిల్లవాడికి, ఆ ఇంటికి ఏమిటి సంబంధం?' అనేది కథలో అంతర్లీనంగా చిత్రించబడుతుంది. ఆ అంటరాని పిల్లవాడి పేరు 'చీనివాస్'. వాడు ఆ బ్రాహ్మణ కుటుంబం చేత చీత్కరింపబడుతూ కూడా ఆ ఇంటికి వెళ్తూ, వస్తూ ఉంటాడు. ఆ ఇంటి యజమాని 'గౌరాంగ్' ఎందువల్లనో కొన్నేళ్ల క్రితం సన్యాసం పుచ్చుకొన్నాడు. చైతన్యదేవుడిగా రూపాంతరం చెందిన ఆయన వెంట మందీ, మార్బలం ఆయన వచ్చినప్పుడల్లా ఉంటుంది. వరదలొచ్చినప్పుడల్లా ఆయన ఆ ఊరు వస్తుంటాడు. ఆయన వచ్చినప్పుడల్లా ఆయన 'ప్రదర్శించే' దాతృత్వం వల్ల ఆ ఊళ్లో పేదోళ్లకి అన్నం దొరుకుతుంది. అట్లా ఆ ఏడు కూడా ఆయన రావలసి ఉండే కాని ఎందువల్లనో ఆయన రాలేదు. దాంతో ఆయన వస్తే తిండి దొరుకుతుందన్న ఆశతో వచ్చిన 'తక్కువ జాతి' వాళ్లు నిరాశపడ్డారు. "ఇది మరీ బావుంది. సన్యాసిని చూడాలని వచ్చారా, ప్రసాదం కోసం వచ్చారా?" అనే సందేహం ఓ పాత్రకు వస్తుంది. "ఆయన్ని చూడడానికి, తిండి కోసమూనూ' అని ఇంకో పాత్ర జవాబిస్తుంది. కానీ అసలు విషయం తిండి కోసమే. ఒకవైపు బ్రాహ్మణుల బస్తాల నిండుగా అటుకులు, పంచదార, బియ్యం, పప్పులు, ఇంకోవైపు పస్తులు. కడుపునిండా తినాలన్న కోరికతో 'చీనివాస్' ఏడ్చి, ఏడ్చి డీలాపడిపోయాడు. ఈ కథలో ధనవంతులైన పై జాతివాళ్లు, ఏదో ఒక బలీయమైన సందర్భం వస్తే తప్ప, అవీ తమ ఫ్యూడల్ ఆధిపత్యం కోసం తప్ప, దానధర్మాలు చెయ్యరు. వాళ్ల ప్రతిష్ట కోసం మాత్రమే దయాదాక్షిణ్యాలు ప్రదర్శిస్తుంటారు. కథా క్రమంలో వర్తమానంలోకి మహాశ్వేతాదేవి 15వ శతాబ్దం నాటి చైతన్యదేవుడి పురాస్మృతిని నడిపించుకు వస్తుంది. అట్లా వర్తమానంలో గతం తొంగి చూస్తుంది. ఆకలిగొన్న వాడికి అన్నం పెట్టడానికి మించిన న్యాయం ఇంకేది లేదన్నది, ఇక్కడ 'పుణ్యం కోసం', 'ప్రతిష్ట కోసం' ఎట్లా తర్జుమా అయ్యిందో... ప్రజల్లో ఉండే మూఢనమ్మకాలు, వాటి ద్వారా కూడా వెనుకబాటు లక్షణాలను, అనర్థాలను వాళ్ల జీవితాల్లోని వాస్తవిక స్థితిలోంచి వారికి విశదమయ్యేలా చెప్తుంది. పురాతన నమ్మకాల వల్ల పీడించే వర్గానికి చేకూరే బలాన్ని ఆమె పీడిత కులాల జీవితాల్లో మమేకమైన స్థితిలోంచి ఆమె అర్థం చేసుకొని, వాళ్ల ఆత్మ(ఇన్నర్ సెల్ఫ్)లోకి ప్రవేశించి దానిని సమగ్రంగా చిత్రించడంలో ఆమె ప్రతిభ ఉంది.

'వితైనాలు' కథలో బయటకు కనిపించె 'ఔదార్యం'లోని అసలు గుట్టు విప్పుతుంది. సర్వోదయం వల్ల భూస్వాములకు ఒక పెద్ద మేలు జరిగింది. అదేంటంటే బంజరు భూములను

వదిలించుకోవడం. అట్లా సర్వోదయంలో లఛ్‌మన్‌సింగ్ అనే జోతేదార్ నుంచి బంజరుభూమిని భూదానం పొందిన 'దూలన్' అనే పేదరైతు అందుకు కృతజ్ఞతగా అతడు చంపించిన మనుషుల శవాలను ఆ భూమిలోనే పాతిపెట్టి అక్కడే 'మంచె' వేసుకొని 'కాపలా' కాస్తుంటాడు. 'ఒక రహస్య ఒప్పందం'లో భాగంగా ఆ భూమిలో అతడు పంట వేయడు. ఆ భూమిలో కేవలం ముళ్ల కంచె పెరుగుతూ ఉంటుంది. అటువంటి భూమిలో దూలన్ మంచె వేసుకొని ఎందుకు కాపలా కాస్తుంటాడో ఎవరికీ అర్థం కాదు. పండని భూమికి యజమాని అయిన భర్తనుద్దేశించి "మీ నాన్న జమీందారు అయ్యాడురా" అని వ్యంగంగా దూలన్ భార్య శనీచరి, కొడుకుతో అంటుంది.

ఆ భూమిలో జమీందారుని వ్యతిరేకించిన కరణ్, అతని తమ్ముడు బులాక్, మరొక వ్యక్తి అషర్ఫీలను జమీందారు చంపిస్తాడు. తర్వాత దూలన్ చేత పాతర పెట్టిస్తాడు. దూలన్ గుండెల్లో రోజు, రోజుకు 'శవాల బరువు' పెరుగుతూ ఉంటుంది. ఆ వ్యథతో అతడు తట్టుకోలేని స్థితికి చేరతాడు. జమీందారు మీద ఫైల్ అయిన కేసులన్నీ పోలీసుల సహకారంతో కొట్టివేయబడతాయి. ఒకరోజు 'మాయమైపోతున్న మనుషుల మీద' దూలన్ కొడుకు ధతువా పాట పాడ్తాడు. పాట విని దూలన్ వెక్కి వెక్కి ఏడ్చాడు. ఏడుస్తూనే కొడుకును 'పాట' మర్చి పొమ్మంటాడు. లేకుంటే తానూ మాయమైపోగలడని సూచన ప్రాయంగా చెపుతాడు. మాయమైపోతున్న మనుషులు 'ఏమై' పోతున్నారో దూలన్‌కు తెలుసు. వాళ్ళ శవాలను తన చేతులతోనే గోతులు తవ్వి పాతర పెడుతుండడంతో తన కొడుకుకు కూడా అలాంటి స్థితి వస్తుందేమోననే 'ఊహను' తట్టుకోలేక ఏడ్చాడు. ఒక రోజు సర్కారు రేటు ప్రకారం కూలీలిమ్మని నిలదీసినందుకు 'ధతువా' కూడా 'మాయమైపోతాడు'. శవాన్ని ఆ భూమిలోనే ఎక్కడో జమీందారు పాతి పెట్టించాడని దూలన్‌కు తెలుసు. దాంతో పిచ్చివాడిగా మారిపోయిన 'దూలన్' ఏదో అంతర్గత శక్తి ఆవహించినట్లు భూమిలో పంట వేస్తాడు. పంట ఏపుగా పెరుగుతుంది. ధతువాను చంపించిన జమీందారు లఛ్‌మన్‌సింగ్ అత్తగారింటికి వెళ్ళి వస్తాడు. దూలన్‌తో అవసరం ఏర్పడి అతను పని చేస్తున్న భూమి వద్దకి వచ్చి ఆశ్చర్యపోతాడు. "మన ఒప్పందం ఏమిటి? నువ్వు చేస్తున్నదేమిటని?" లఛ్‌మన్‌సింగ్ అదేదో ఘోరమైన నేరం చేస్తున్నట్లు నిలదీస్తాడు. లఛ్‌మన్‌సింగ్, దూలన్‌ను చంపడానికి ప్రయత్నిస్తాడు. చావు భయం కోల్పోయిన దూలన్‌ను చూసి లఛ్‌మన్‌సింగ్ భయపడ్తాడు. ఇంతమంది ప్రాణాలను తీసిన లఛ్‌మన్‌సింగ్‌ను చివరికి దూలన్ చంపేస్తాడు.

కథలోని ప్రత్యేకత ఏంటంటే కరణ్, అషర్ఫీ, మొహర్, బులకీ, మహంవన్, పారస్, దతువాల మాంసం ఎరువుగా మారి పంట ఏపుగా పండుతుంది. వణుకుతున్న గొంతుతో "దతువా, మిమ్మల్నందర్నీ మేము విత్తనాలుగా మార్చేశాం, నాయనా!" అంటూ దూలన్ దుఃఖించడంతో మనకు ఈ విషయం అర్థమవుతుంది. సమకాలీన వాస్తవాల్ని కళ్లకు కట్టి ఎంతటి భీభత్స రసాన్ని ఆమె కథలో ఒలికిస్తుందో చూడండి. 'విత్తనం చనిపోతూ పంటను వాగ్దానం చేస్తుందన్న' శివసాగర్ కవిత్వంలోని ఏంగెల్స్ మౌలిక భావనను సార్థకం చేస్తూ విప్లవ బీజాల 'ఫలం' అందరికీ అందాలనే సదాశయాన్ని మహాశ్వేతాదేవి ఈ కథలో సందేశంగా వినిపిస్తుంది.

'రాంగ్ నంబర్' కథలో కొడుకు చావును జీర్ణించుకోలేని తండ్రి కథ. తను నివసించే కలకత్తా తనకు పరాయి అయిపోయినట్లు అతను భావిస్తాడు. అది తనకు సరైన ఊరు కాదని అతని అభిప్రాయం. కథలో అతని పేరు తీర్థబాబు. తీర్థబాబు 'రాంగ్ సిటీ'లో ఉంటున్నాని అనుకుంటాడు. తన ఇల్లు కూడా తనకు 'రాంగ్ హౌజ్' అయిపోతుంది. తన కొడుకు చనిపోయాడనే వార్త ఆసుపత్రి నుంచి ఫోన్ కాల్ రూపంలో రావడంతో దాన్ని 'రాంగ్ కాల్' అనుకుంటాడు. అందుకే ఆసుపత్రి నుంచి ఫోన్ కాల్ రాగానే 'రాంగ్ నంబర్' అని పెట్టేస్తాడు. తన స్నేహితుడు మనోజ్ అనే మానసిక వైద్యుడు ఇచ్చిన మందు సీసాను అదేదో 'ఒలంపిక్ జ్వాల'లాగ పైకెత్తి పట్టుకొని వేగంగా వస్తూ పురాణాల్లోని 'జనా' అనే స్త్రీ పాత్ర రోదనను తలుచుకుంటాడు. ఆమె కూడా తన లాగే 'రాంగ్ సిటీలో' ఉందని తీర్మానించుకుంటాడు. మళ్లీ ఫోను మోగుతుంది. అక్కడి నుంచి పారిపోయే మార్గం అతను కనుక్కోలేడు. కనుక కలలోకి వెళ్లిపోవాలి. పురా స్త్రీ 'జనా' వెనకాలె తనూ వెళ్లాలి. ఈ కథలో మాయమైపోతున్న కొడుకుల తల్లిదండ్రుల మానసిక స్థితిని మనసు పిండేసెలా మహాశ్వేతాదేవి ఆవిష్కరిస్తుంది.

'బికారి దుసాధ్, ప్రాథమిక హక్కులు' కథలో బికారి దుసాధ్ చేసే పని మేకల్ని తోలుకొని జీవనోపాధిని పొందటం. తరతరాలుగా చేస్తూ వస్తున్న పనిని సైతం చేసుకోనివ్వని ఫ్యూడల్ సమాజస్థితిని ఈ కథలో ఆమె మనసుకు హత్తుకునేలా చెప్తుంది. మేకల్ని తోలుకుంటూ ఏ వూరు వెళ్లినా అతన్ని ఆ ఊరిలోని పోలీసులు, రాజ్యం అతన్ని వెంటాడుతాయి. ఈ క్రమంలోనే రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కుల గురించిన విషయాలు 'సుఖచాంద్' అనే స్కూలు టీచర్ అతనికి వివరిస్తాడు. జాతీ, మతం ఇంకే కారణాల వల్లనూ అసమానత్వం ఉండకూడదని - 'మేక పిల్లల్ని కల్గి ఉండడం నీ ప్రాథమిక హక్కని, భారత రాజ్యాంగం ప్రజలకు హామీపడ్డ ఏడు హక్కుల్లో అది మూడో హక్కని స్కూలు టీచర్, బికారి దుసాధ్‌కు చెప్తాడు. అయితే "ఇది పచ్చి అబద్ధం' అని మహాశ్వేతాదేవి కథలో నిరూపిస్తుంది. 'తురకవాళ్లు తినేదాన్ని నవాగఢ్‌లో వాళ్లెవరైనా అమ్మగలరా?' అని ప్రజల ప్రాథమిక హక్కులకు ఎలా భంగం కలుగుతుందో అవే పాత్రల చేత ఆమె అనిపిస్తుంది. కాస్తా మెరుగైన జీవితం కావాలని పేదవాడైన 'బికారి' ప్రయత్నిస్తే అతని వెంటబడి పోలీసులు, భూమిహార్‌లు అతని మేకల్ని 'ఉత్త పుణ్యానికే' లాక్కుపోతుంటారు. చివరికి 'బికారి' నిజంగానే 'బికారి' అయ్యేలా ఈ వ్యవస్థ అతన్ని దుర్మార్గంగా వెంటాడుతుంది. అతడు మిగిలిన ఒక మేకను అమ్ముకొని భిక్షపు పాత్రను కొనుక్కొని మరీ బిచ్చగాడి వృత్తిని ఎంచుకుంటాడు.

భారత దేశంలో ఇలా రాజ్యాంగ నిర్దేశిత ప్రాథమిక హక్కులు కావాలని పోరాడే కాశ్మీర్, దండకారణ్యంలోకి పోలీసులను, రిజర్వు పోలీసులను, పారా మిలటరీ, సరిహద్దు భద్రతా దళాల్ని, యుద్ధ ట్యాంకుల్ని, యుద్ధ విమానాల్ని పంపిస్తాయి ప్రభుత్వాలు.

'కశ్మీరియత్'ను ధ్వంసం చేయడానికి కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఇవాళ పెల్లెట్ బాంబులను ప్రజల మీదికి విసురుతోంది.

కథలోని 'భికారి' దగ్గర పోగొట్టుకోవటానికి ఇక ఇప్పుడేమీ లేదు. చేతిలోని 'బొచ్చె' తప్ప. జీవించడం అందరికీ ఒక్కలాగ ఎందుకు లేదు? కొందరు ఎప్పుడూ ఎందుకు పోరాడుతూనే ఉంటారు? వాళ్లు పోరాడక తప్పని పరిస్థితి ఎందుకు వచ్చింది? బతకాలంటే పోరాడక తప్పదా? కొందరి జీవితాలు 'నల్లేరు మీద బండిలా' ఎందుకు సాగుతాయి? దోపిడి లేకుండా కొందరి బండి ఎందుకు సాగదు? వంటి ప్రశ్నలు కథ పొడవుతా పాఠకుల్ని తొలుస్తాయి. కథలో జీవన సంఘర్షణ యుద్ధ భీభత్సాన్ని తలపిస్తుంది.

'బేహులా' కథలో తరాలుగా పాతుకుపోయిన నమ్మకాల స్థానంలో నూతన ఆలోచనా ధోరణులను, శాస్త్రీయతను ప్రవేశపెట్టడానికి కథలోకి వసంత్ పాత్ర వస్తుంది. ప్రజల్లోకి ఆ పాత్రధారి ఎలా చొచ్చుకుపోతాడు, ఎంత విశ్వసనీయంగా వాళ్లలో కలిసిపోతాడో తాను ఆశించిన మార్పు ఎలా తేగలుగుతాడో మహాశ్వేతాదేవి తనదైన శైలిలో అల్లిక చేస్తుంది: ఊళ్లో శ్రీపద్‌మాల్ అనే భూతవైద్యుడు పాత పద్ధతుల ద్వారా పాము కాటుకు గురైన వారికి అవసరమైన చికిత్స చేస్తాడు. పాములు ఎక్కువగా తిరుగాడే ఆ ఊళ్లో అలాగనైనా ప్రజలకు అందుబాటులో ఉండే ఓ వైద్యుడు, లేదా ఓ ఆపన్నహస్తం అవసరం ఉంటుంది. ఊళ్లో మోతుబరి 'హేదోనశ్కర్' మంచి ధర పలకనందున తను ఏదో అవసరం కోసం తయారుచేసుకున్న ఇటుకల బట్టీని అమ్మడు. దాంతో పాములకు ఆ ఇటుక బట్టీ ఆలవాలమవుతుంది. పాముకాటు బారినపడే వారి సంఖ్య పెరుగుతూ ఉంటుంది. శ్రీపద్‌మాల్ ఒక్కడి వల్ల, తాను ఆచరించే పద్ధతుల వల్ల వాళ్లందరినీ ప్రాణాపాయం నుంచి తప్పించడం సాధ్యంకాదు. ఆ దశలో పాముల మీద పరిశోధన పేరిట 'వసంత్' ఊర్లోకి వస్తాడు. అతడు శ్రీపద్‌మాల్‌తో స్నేహం చేస్తాడు. అతడు చేస్తున్న దాంట్లో శాస్త్రీయత ఎంత, నమ్మకం ఎంత అనేది అతనికి తెలిసేలా చేస్తాడు. శ్రీపద్‌మాల్ తన పద్ధతుల ద్వారా పాము కాటుకు గురైన వ్యక్తుల్లో విశ్వాస్వాన్ని, ధైర్యాన్ని కలుగజేయడం 'కొంత వరకే' సాధ్యమని, పాముకాటువల్ల కోరలు లోపలికి బాగా దిగితే ఇక తన మంత్రాలు, పద్ధతులు పని చేయవని అప్పుడిక 'సూది మందు' ఇవ్వడమే విరుగుడు అని చెప్తాడు. అందుకోసం ఏ కంపెనీ విరివిరిగా మందుతో ముందుకు రావడం లేదనీ చెప్తాడు. వసంత్‌కు అలా ఎందుకు రావడం లేదో తెలుసు. ఎందుకంటే పాములు 'నాలుగు లక్షల మందిని కరిచినా, చనిపోయే వారి సంఖ్య ఇరవై వేలే' అనేది వారికో లెక్క. ఆ లెక్క ప్రకారం వారికి దక్కే లాభం తక్కువ కనుక ఏ మందుల కంపెనీ ముందుకు పెద్దగా రాదు. దగ్గర్లోని ఆసుపత్రిలో సైతం అవసరమైనంత 'సూది మందు' (ఆంటీవీనం) నిలువ ఉంచరని భౌతిక పరిస్థితులు తెలియజేస్తాయి. వసంత్ చదువుకున్నవాడు. పాములపై పరిశోధన కోసం వచ్చాడు. కనుక స్థానిక హెల్త్ సెంటర్‌లో 'ఆంటీవీనమ్ సీరమ్' తగినంత నిలువ ఉంచడానికి తన పలుకుబడిని ఉపయోగించి చేసిన ప్రయత్నాలు సఫలం కాకపోవడంతో శ్రీపద్‌మాల్‌కు 'ఆంటీవీనమ్ సీరమ్' ఇంజెక్షన్ ఎలా చేయాలో శిక్షణ ఇస్తాడు. శ్రీపద్‌మాల్ తాను నేర్చుకోవడమే కాక తన కొడుకుకు ఆ విద్య అబ్బేలా చూస్తాడు. అయితే కథలో ఊరంతటికీ ఆపద సమయంలో తనకు తోచిన పద్ధతిలో ఆదుకున్న 'శ్రీపద్‌మాల్' తాను కూడా పాము కాటుకే మరణించడం ఊరంతటినీ విషాదంలో ముంచుతుంది. ఆ విషాదంలో ఊరంతా ఒక్క తాటి మీదికి వస్తుంది. ఇలా ఊరంతా ఒక్క తాటికి రావడం వెనుక 'ప్రొటొగానిస్ట్' వసంత్ ఉంటాడన్నది ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. ఊళ్లో ఇంతమంది ప్రాణాలు పోవడానికి కారణమైన పాముల పుట్టిల్లు అయిన ఇటుక బట్టీని ఒక్క పెట్టున భగభగమండే మంటల్లో కాల్చేస్తారు. చనిపోయేముందు శ్రీపద్‌మాల్ ఆలోచనలు నూతన ఆలోచన విధానంలోకి మారుతూ ఉండడం చూచాయగా అవగతం అవుతూ ఉంటాయి. అతని కొడుకు కూడా నూతన విధానాల్లో తర్ఫీదు పొందడం జరిగినందున పాత పద్ధతుల నుండి అతడు విముక్తుడయ్యాడని స్ఫురిస్తుంది. ఇక్కడ కూడా 'విత్తనం చనిపోతూ పంటను వాగ్దానం' చేయడం అనే అమరత్వ విలువ మనసును తాకుతుంది.

'సాయం సంధ్యల తల్లి' కథల్లో అడవుల్లో నివసించే వారి ప్రేమ కథ, కులవృత్తుల్ని వదలడం వల్ల పుట్టి పెరిగిన జాతికన్నా ఓ మెట్టు పైకి ఎదిగినట్లు అనిపించే మానసిక స్థితిని దక్కనివ్వని సమాజ దుష్టత్వం, ఏవో భయాల్నుంచి దూరం అవడానికి ఇంకేదో కవచంగా చుట్టుకొని కాపాడుకోవడం' కనిపిస్తుంది. ఈ కథలో దినమంతా దైవత్వం చుట్టుకొన్న 'జటీ ఠకురానీ" సాయంకాలం కాగానే దైవత్వం విప్పేసి 'సాధన్'కు తల్లిలా మారిపోతుంది. 'ఠకురానీ'గా ఉండగా సంపాదించిన బియ్యం తల్లిగా మారాక కొడుకు సాధన్‌కు వండి పెడుతుంది. ఇక్కడ కొడుకును బతికించుకోవడానికి జటీ ఠకురానీ 'పవిత్రత', 'దైవత్వం' అనే ఆయుధాలను వాడుకొంది. కాని ఇలా బియ్యం అడుక్కోవడం ఎంత అసహ్యకరమో సాధనకు స్వానుభవం ద్వారా అర్థం అవుతుంది. తాను బిచ్చమెత్తి సంపాదించిన బియ్యాన్ని తల్లికి శ్రాద్ధం పేరిట పురోహితుడికి ఇవ్వాల్సి రావడం తట్టుకోలేక పోతాడు. కథలో సాధన్ అమాయకుడిలా అనిపించినప్పటికీ, ఆ అమాయకత్వంతో 'ఆకలి' అనే నగ్నసత్యం పురోహితుడ్ని ఎదురించేలా చేస్తుంది. సాధన్‌కు అమ్మ ఉన్నన్నాళ్లు బియ్యం ఉంటాయి. 'అమ్మ ఇక లేదు' అని తెలిసాక 'అన్నం ఇక లేదనే' అర్థం చేసుకుంటాడు. పురోహితుడికి బియ్యం ఇవ్వడానికి అతను మెళ్లో జోలె తగిలించుకు బిచ్చమెత్తడానికి బైలుదేర్తాడు. కాని ఆ బియ్యమే తనకు తినడానికి కావల్సిందే కనుక 'నోరు ముయ్యి వెధవా' అని బ్రాహ్మణ్ణి, సాధన్ తిడ్తాడు. తిట్టక తప్పని పరిస్థితి. తల్లి జ్ఞాపకం రాగానే సాధన్‌కు ఏడుపు ముంచుకు వస్తుంది. అందుకే తల్లితో మనసులోనే "అమ్మా! ఎలాగో ఒక లాగా నువ్వు స్వర్గానికి వెళ్లిపో. సాధన్ ఇంక అన్నం వండుకుని తింటాడు. తప్పుగా అనుకోవద్దు" అంటాడు.

'మంత్రగత్తె' కథలో శూద్రులైన కాటి కాపర్లు కులవృత్తిని వదిలి వేరే పని చేసుకుంటామంటే ఈ ఫ్యూడల్ వ్యవస్థ అందుకు అనుమతించదు. 'మలిందర్ గంగపుత్ర'ను పెళ్లి చేసుకోవడానికి

ముందు 'చండీ' శ్మశానంలో శవాల్ని పాతిపెట్టడం అనే తండ్రి నుంచి సంక్రమించిన వృత్తిని చేస్తుంది. గవర్నమెంట్ ఉద్యోగితో కలిసి ఎముకలు అమ్ముకునే పనేదో చేస్తూ చేతిలో డబ్బుండేలా చూసుకునేవాడు మలిందర్. అతనితో పెళ్లయ్యాక 'శవాల్ని పాతిపెట్టడం' అనే వంశానుగత వృత్తిని వదులుకుంటానంటే ఈ లోకం ఆమెను 'మంత్రగత్తె' అంటుంది. లోకంతో పాటు భర్త కూడా ఆమెను 'మంత్రగత్తే' అంటాడు. దాంతో ఆమె పిచ్చిది కాక తప్పని పరిస్థితి. కొడుకు భగీరథ్‌ను దగ్గరికి తీసుకోవాలని ఉన్నా, కొడుక్కి ఈ లోకం ఆమెను మంత్రగత్తె అని నూరిపోసినందున, ఆ పిల్లవాడు రావడానికి భయపడ్తాడు. ఇలా వంశానుగతంగా వచ్చే 'వృత్తులు' తమ 'తలరాతని' తరతరాలుగా పురాణాలు నమ్మిస్తాయని "ఈ భూమ్మీది శ్మశానాలన్నీ జరా బోయ సంతతికి' దానం చేయబడ్డాయని, 'శ్మశనాలన్నీ మావే'నని వాళ్లు మురిసిపోయేలా వాళ్ల మెదళ్లు పుచ్చిపోయేలా చేస్తాయని, పురాణ కథలను కేవలం కథలాగా కాకుండా నాటికి ఒక నాటకీయ 'కాంటెంపొరరీ రియాలటీగా మార్చెయ్యగల లేదా పరిణామం చెందించగల శైలిని మహాశ్వేతాదేవి అందిపుచ్చుకున్నారు. ఈ కథలో సంఘం నుండి వెలివేయబడిన స్త్రీ, 'వెలివేయబడడం' అనే యాతనలోంచి 'చండీ'గా ఒక కొత్త వివేకం నిద్రలేచిన పాత్రగా ఆవిష్కరింపబడ్తుంది. అన్యాయాన్ని ఎదుర్కొనే శక్తిని ప్రోది చేసుకుంటుంది. ఒక 'మాజిక్ రియాలటీ' అన్పించేలా 'మంత్రగత్తె' రైలుని ఆపెయ్యడం ద్వారా ఒక సింబాలిక్‌గా తక్కువ జాతి వాళ్లకు గల అసాధారణ శక్తి సామర్థ్యాలను మహాశ్వేతాదేవి మన స్పృహలోకి తెస్తుంది. నైతిక విలువల కోసం మంత్రగత్తె చేసిన పోరాటం తిరిగి ఆమెను తన సమాజంలోకి ప్రవేశించేలా చేస్తుంది. ఆమె కొడుకు కూడా సునిశితంగా ఆలోచించేవాడుగా తయారై ప్రజల ముందు, అధికారుల ముందు సంఘం నుండి వెలివేయబడ్డ మంత్రగత్తె తన తల్లి అనే పరిచయం చేసుకోవడం ద్వారా తన సంస్కారాన్ని, 'తక్కువ జాతి వాళ్లనబడే వాళ్ళ' శక్తి సామర్థ్యాల వల్లనే ఈ సమాజం నడుస్తున్నదనే 'ఎరుకను' సమాజానికి అర్థం అయ్యేలా చేస్తాడు.

'ద్రౌపది' (దోప్డి) కథలో సంథాల్ ఆదివాసులు నక్సల్బరీ పోరాటంలో ఎలా భాగం కాక తప్పనిసరి అయిందో, అలా భాగమయ్యాక, ఆ పోరాటం ఎంతటి రాజ్యహింసను, తీవ్రమైన ప్రతిఘటనా సామర్థ్యాల్ని పెంచుకోక తప్పని స్థితి ఏర్పడిందో కళ్లముందు అత్యంత భీభత్సరసోద్వేగంతో చూపెడతారు. ఆదివాసులు అనివార్యంగా రాజ్యంతో యుద్ధానికి దిగుతారు. అయితే మిగతా కథల్లో మాదిరిగా వైయుక్తిక పోరాటంగా కాక ఈ కథలో సంఘటిత శాస్త్రీయ పోరాటంలోకి వాళ్లు ఎలా వచ్చారో చిత్రిస్తారు. ఇది బయటి శక్తుల, రాజకీయవాదుల ప్రోద్బలం వల్లనో, ఏదో కాసింత చదువుకోవడం ద్వారా వచ్చిన చైతన్యం వల్లనో జరగలేదు. వాళ్ల దైనందిన జీవన పరిస్థితుల వల్లనే ఇటువంటి భౌతిక అనివార్యత ఏర్పడుతుంది.

కథానాయకురాలు ద్రౌపది (దోప్డి) సంథాల్ జాతిలోంచి విప్లవకారిణిగా రూపొందినది. ఆమె పోరాటంలో భాగంగా అరెస్టై కస్టడీలో ఉండగా గ్యాంగ్‌రేప్‌కు గురవుతుంది. రాజ్యం అణిచివేతలో భాగంగానే స్త్రీమీద 'అత్యాచారాన్ని' ప్రయోగిస్తుందనే ఎరుక ఆ పాత్రకు తెలుసు. ఆ ఎరుక వల్ల ఎంత భీభత్సంగా గాయపడి రక్తమోడుతున్న దశలో కూడా స్థైర్యాన్ని కోల్పోదు. ఆమెను ఎంతగా గాయపరిచినా ఆమె అంతగా శక్తి సంతరించుకొని రాజ్యాన్ని భయపెడ్తుంది. ఆమె రక్తమోడుతున్న రొమ్ముల్ని... ఇక ఓ స్త్రీగా ఏమీ దాచుకోనక్కర లేకుండానే... వాటినే ఆయుధాలుగా మలిచి, "ఇఫ్ యు వాంట్ టు డిస్ట్రాయ్ ద ఎనిమీ, బికమ్ వన్..." అంటూ తెగబడి దొంగ యుద్ధం చేసిన రాజ్య ప్రతినిధి సేనాపతిని ఢీకొంటుంది. ఇక్కడ దోప్డి తన తాత ముత్తాతల్ని తలుచుకొని గర్వపడింది. ప్రాణాల మీద ఒట్టుపెట్టుకొని శత్రువుకు ఏమి చెప్పకూడదనుకొనే నిబద్ధతను పాటించింది. అందుకే ద్రౌపది రక్తం కలిసి తెల్లగా వింత శోభతో మెరుస్తున్న ఉమ్మిని సేనాపతి చొక్కా మీద ఊసి, "ఇంద, కవుంటర్ చెయ్యి, కవుంటర్..." అంటూ సవాలు చేస్తుంది. గాయపడ్డ రొమ్ములతోనే సేనాపతిని తోస్తుంది. సేనాపతి మొదటిసారిగా 'చేతిలో ఆయుధం లేని టార్గెట్ ముందు నిలబడడానికి భయపడ్డాడు!' ఇక్కడ కథ ముగించడంలో అణిచివేతకు గురైన ప్రజల ముందు దోపిడి రాజ్యం సిగ్గుతో తలవంచుకునేలా చేసే శిల్పం ఉంది. భారతదేశవ్యాప్తంగా, పోలీస్ స్టేషన్ల ఆధీన ప్రాంతాల్లో, తెలంగాణలోనూ అటువంటి పోరాట గాథల్ని మనం వింటాం.

ద్రౌపది, మహాశ్వేతాదేవి మూడు బ్రెస్ట్ స్టోరీస్‌లలో ఒకటి. 'ఛోళీకె పీఛె,' స్తన్యదాయిని మిగతా రెండు. వాటిని నేను వివరించబోవడం లేదు కాని ఇంకొక్క కథ 'వేట' గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి.

'వేట' కథలో కథానాయకురాలు మేరీ ఓరాంవ్ పాత్రను మహాశ్వేతాదేవి మనకు చూపించిన తీరు అమోఘం. ఆదివాసి మహిళకు, ఇంగ్లీషువానికి పుట్టిన 'అక్రమ' సంతానం మేరీ ఓరాంవ్. తెల్లవానికి, ఆదివాసి స్త్రీకి పుట్టినందువల్ల మేరీలో రెండు జాతుల గుణాలు, ఆచార వ్యవహారాలూ కలగలిసి ఉంటాయి. ఈమెలో ఉన్న కొన్ని ప్రత్యేక లక్షణాలు ఆటవిక జాతి వాళ్లు ఆమె తమకంటే భిన్న తరహా మనిషి అనే అర్థంలో 'తమ జాతి మనిషని' ఒప్పుకోరు. కాని ఆమె వారందరి ప్రేమాభిమానాలు పుష్కలంగా చూరగొన్న వ్యక్తి. అట్లా వాళ్లంతా అనుకోవటం వల్ల కూడా ఆమెకు ప్రత్యేకమైన శక్తి సామర్థ్యాలు, హక్కులు సమకూరుతాయి. తమ జాతికన్నా పై హోదాలో ఓ ప్రత్యేకమైన ఆకర్షణగా నిలిచే స్థితిని ఆమె ఆ విధంగా సృష్టించుకోగలుగుతుంది. ఆటవిక యువకులు ప్రేమించడానికి భయపడిన స్థాయిలో ఆ హోదా అడ్డు తగులుతుంది. ఆ తరహాలోని ప్రత్యేకతల్లో ఆమె జాలిమ్ అనే ముస్లిం యువకుణ్ని ప్రేమిస్తుంది. కాని తహసీల్దార్‌సింగ్ అనే కలప దుంగల లోకు వ్యాపారి ఆమె వెంట పడ్తాడు. అణిచివేతకు గురై, పరాజితులై పీడింపబడే తమ జాతి వాళ్ల ప్రాచీన శక్తి తెలుసుకున్న మేరి తహసీల్దార్‌సింగ్ నుంచి తప్పించుకోవడమే కాక అతడిని ఉపాయంగా వదిలించుకుంటుంది. అందుకు పన్నెండేళ్లకోసారి 'వేటాడే' పండుగను సందర్భంగా ఎంచుకుంటుంది. ఈసారి వేట ఆడవాళ్ల వంతు. అదే ఈసారి వేటకు ప్రత్యేకత. ఈ ప్రత్యేక సందర్భం ఆమెకు కలిసి వస్తుంది. ఏ స్త్రీ అయినా తప్పనిసరి వేటాడి, ఏదైనా జంతువును కొట్టాల్సిందే.

లేఖ

జులై సంచికలో బి.ఎస్. రాములు గారి సాహిత్య వ్యాసం చదివిన రోజే చాలా ఇబ్బందికరంగా ఉన్నదని, వేసి ఉండాల్సింది కాదని రాసాను. అయినా ఆగస్టు సంచికలో పూర్తి అయ్యేదాకా నిరీక్షించక తప్పలేదు. ఇది డాలర్ విలువ 45 రూపాయలు ఉన్నప్పుడు రాసిన వ్యాసం. 10 సంవత్సరాల కింద రాసినట్టుంది. ఎందుకు వేసినట్లు? పొగడ్తలు పోలికలు బతికున్న కవిపైన ఇట్లా గుమ్మరిస్తూ ఉంటే సంపాదక వర్గానికి ఎందుకు అభ్యంతరకరమనిపించలేదు. మీరు అసలు చదివారా. నేను వినమ్రంగా, నిజాయితీగా చెపుతున్నాను. ఆ పొగడ్తలకు తగను. ఆ పోలికలకు తగను. ఒక బతికున్న విరసం సభ్యునిపై విరసం పత్రికలోనే 22 పేజీలు రెండు నెలలు ఈ వ్యాసం వేయడం నాకైతే చాలా అభ్యంతరకరంగా ఉన్నది.

- వివి

అలా కొట్టకపోతే ఆ స్త్రీకి నామోషి. కనుక అన్నింటికన్నా పెద్ద జంతువైన తహసీల్దార్‌సింగ్‌ను ఈసారి మేరి సంకేత స్థలానికి రప్పించి మరీ వేటాడుతుంది. అందుకోసం 'నాట్యం చేస్తూనే. వెనక్కి వెళుతుంది'. అందరూ నాట్యం చేస్తున్న దశలో అదను చూసి మేరి చీకట్లోకి పరుగెత్తుతుంది. 'తహసీల్దార్ సింగ్‌ను వేటాడడం' అనే పని ముగిసాక కాలువలో దిగి స్నానం చేస్తుంది. కాలువలో దిగి స్నానం చేసేటప్పుడు 'మగవాడితో సంభోగించాక కలిగే శారీరక సుఖంలాంటి' తృప్తితో ఆమె ముఖం ఒక వింత శోభతో మెరిసిపోతుంది. తదుపరి మేరి, జాలిమ్‌తో తన భవిష్యత్తును గురించిన కల కంటుంది.

మహాశ్వేతాదేవి కథలన్నింటిలో పురాణాలు, నమ్మకాలు, చేతకానితనాలు ఆదివాసులను ఎట్లా అణిచిపెడ్తాయో ఉంటుంది. లేదా అణిచివేయడం కోసమే అవి రూపొందిన విధానం, అవి వాళ్ల వ్యక్తిత్వాల మీద వేస్తున్న ప్రభావం 'వస్తువులుగా' కనబడతాయి. అదే సమయంలో వాటిని అర్థం చేసుకొనే క్రమంలో ధిక్కరించడం ఆమె కథల సారాంశం. అట్లాగే మధ్య తరగతి వాళ్ల భయాలని 'రాంగ్ నంబర్' కథలో చూస్తాం. మనిషిలో ఉన్న మానవత్వం అడుగంటి కొంత వెసలుబాటు అడిగిన 'చండీ'ని 'మంత్రగత్తె'గా ముద్రవేసిన అమానుషత్వాన్ని మంత్రగత్తె కథలో చూస్తాం. 'ద్రౌపది', 'వేట', 'విత్తనాలు' కథలు ఆదివాసులు, అణచివేతకు గురైన వారు తమ మీద జరుగుతున్న అంతులేని దోపిడీ, పీడన, హత్యాకాండలను ప్రతిఘటించే గొప్ప విశ్వాసాన్ని చిత్రించాయి. ఇవి విప్లవకర సంఘటిత పోరాట మార్గాన్ని చూపెడతాయి. మిగతా కథల్లో కూడా ఇంటువంటి ప్రతిఘటనే ప్రస్ఫుటించినా, అది వ్యక్తిగత పోరాటంగా ఉంటుంది. లేదా సాంస్కృతిక పోరాటంగా కూడా దర్శనమిస్తుంటుంది. ఇవన్నీ ఆదివాసుల వాస్తవిక జీవన పరిస్థితుల్లోంచి వచ్చాయి. అవి ఆదివాసుల జీవితానికి ఉన్న అడ్డంకులన్నింటిని అధిగమించి, సాంఘిక, ఆర్థిక, రాజకీయ పోరాటాలను చేపట్టి దోపిడీ పీడనలను ఎదిరించి భవిష్యత్తులోకి పురోగమిస్తాయి.

ఇంతకీ, మహాశ్వేతాదేవి ప్రత్యేకత ఏమిటంటే, ఆమె సాహితీ ప్రతిభ. ఆమె దృక్పథం వల్ల ఆమె ఆదివాసుల వైపున నిలబడ్డా, సాహిత్య రచనలో ఆమెకు ఉండే ప్రతిభ వల్ల ఆమె ఆదివాసీ మనస్తత్వాన్ని పట్టుకున్నారు. దళితుల జీవితాన్ని, వారి జీవన స్థితి గతుల్లోని మతలబులన్నింటిని గుర్రం జాషువా పట్టుకున్నట్లే మహాశ్వేతాదేవి ఆదివాసీ సమాజ స్థితిగతులను పట్టుకొంది. వాళ్ల జీవితంలో ఉండే మిత్‌ను (మిధ్యా వాస్తవాన్ని), వాళ్లు ఎదుర్కొనబోయే ప్రమాదభరిత స్థితిని, వాళ్ల పోరాటాన్ని, ఆ పోరాటంలో వాళ్ల సాహసాన్ని ఆమె ఒడిసిపట్టుకుంది. ఈ స్పష్టత వల్ల ఆమె రచనా ప్రతిభ ప్రతి కథలో కనిపిస్తుంది.

మొత్తం మీద మహాశ్వేతాదేవి సాహిత్య సారాంశం, అణిచివేతకు గురైన జాతుల, కులాల సాధికారత. ఆమె రచనల ఉద్దేశం, రాజ్యం అణిచివేతలో భాగంగా మహిళలపై సాగించే అమానవీయ శారీరక హింస నుంచి మహిళ విముక్తమై సాధికారత సాధించడం. అంటబడని మనుషులుగా సమాజం చేత ఈసడించబడే మనుషులకు గౌరవనీయ స్థానం దక్కడం. సమాజం మొత్తం సమానత్వ ప్రాతిపదికన పునర్నిర్మాణం కావాల్సిన అవసరం ఉందని ప్రకటించడం ఆమె రచనల సారం. ఇంతటి విస్తృతమైన కాన్వాసు మీద ఆమె సామాజిక, రచనా కార్యాచరణను చేపట్టినందువల్లనే ఆమె ఇంతటి రక్తమాంసయుత సాహితీ సృజన చేయగలిగింది.

ఆదివాసీ ఆలోచనా రీతిలోనే చెప్పుకోవాలంటే చనిపోయారనుకున్న వ్యక్తులెవ్వరూ చనిపోయినట్లు కాదు. వాళ్లు బతికి ఉన్న వాళ్ల ఆలోచనల్లో ప్రతిఫలిస్తారు. అట్లా ఆలోచించినపుడు మహాశ్వేతాదేవి కూడా ఇంక లేదనుకోవడానికి లేదు. ఆమె రచనల్లో మరింత ప్రాసంగికతతో మనకు ప్రతిరోజూ దర్శనమిస్తారు. ఆమె సాహితీ, సామాజిక ఆచరణను ముందుకు తీసుకుపోవడం ద్వారానే ఆమె స్ఫూర్తిని ముందుకు నడిపించగలం.

(25-8-2016న హనుమకొండలో మహాశ్వేతాదేవి సంస్మరణ సభలో చేసిన ప్రసంగం)

విరసం ఆన్‌లైన్ మ్యాగజైన్ **www. virasam. org 15 మే 2016** నుంచి ప్రారంభమయ్యింది.
ప్రతి 15 రోజులకు ఒకసారి కథ, కవిత్వం, వ్యాసాలు, నివేదికలు, పుస్తక పరిచయాలు, సమీక్షలు, ప్రకటనలు, ఇతర సాహిత్య ప్రక్రియలతో అప్‌డేట్ చేస్తూ అందిస్తున్నాం.
మీ రచనలను యూనికోడ్ ఫాంట్‌తో **virasam1970@gmail.com** కు మెయిల్ చేయగలరు.

- ఆన్‌లైన్ మ్యాగజైన్ ఎడిటోరియల్ టీం

సీరియల్

(రోమన్ కేథలిక్కులకు ప్రశ్నలు-జవాబుల పద్ధతిలో మత విషయాలు బోధించే పద్ధతిని CATECHISM అంటారు. 1905లో లూయిస్ కాస్ ప్రై అనబడే అమెరికన్ మార్క్స్ 'పెట్టుబడి'ని ఈ పద్ధతిలో అందరికీ సులభ గ్రాహ్యంగా చెప్పటానికి ప్రయత్నించాడు. CATCHISM OF KARL MARX"S CAPITAL పుస్తకానికి తెలుగు అనువాదం సీరియల్‌గా అందిస్తున్నాం. - సం.)

కార్ల్ మార్క్స్ పెట్టుబడి - సరుకులు-డబ్బు

లూయిస్ కాస్ ప్రై

అనువాదం: ముక్తవరం పార్థసారథి

(1)

రచయిత ముందుమాట:

కార్ల్ మార్క్స్ మహాగ్రంథం 'కాపిటల్' ప్రచురితమై నాలుగు దశాబ్దాలు దాటింది. అయితే, దీని పాఠకులలో ఎక్కువ మంది పండితులే. అందరూ ఇంత ముఖ్యమైన పుస్తకం ఇంత వరకు ఎవరూ రాయలేదన్నారు. ఇందులోని సమాచారం-సామాన్య- అతిసామాన్య పాఠకులకు కూడా చేరవలసిన అవసరం ఉంది.

మరి, ఇంత వరకూ ఈ పుస్తకాన్ని సామాన్య పాఠకులెందుకు చదవటం లేదు. చదవలేక పోతున్నారన్న సందేహం రావటం కూడా సహజమే.

నలభై ఏళ్ళ పాటు కఠోర శ్రమ కోర్చి, సమాచారాన్ని సేకరించి, పొలిటికల్ ఎకానమీ గురించి అప్పటికి లభ్యమైన పుస్తకాలన్నీ క్షుణ్ణంగా అధ్యయనం చేసి- ఒకరో,ఇద్దరో కాదు, అరిస్టాటిల్ నుండి హెర్బర్ట్ స్పెన్సర్ దాకా ఎవర్నీ వదలలేదు- ఇది రాసాడు మార్క్స్. అతి జటిలమైన విషయాలను అర్థం చేసుకోవటానికి, విశ్లేషించటానికి ఆయన ఎంత శ్రమించారో పుస్తకం చదివితే గాని తెలియదు.

ఇవన్నీ శాస్త్ర విషయాలు. మార్క్స్ వీటి గురించి రోజుల తరబడి ఆలోచించాడు. ఇందులోని పేరాగ్రాఫులు ఎంత పొడుగ్గా ఉంటాయంటే శాస్త్రంలో కొంత ప్రవేశం ఉన్న వాళ్ళు మాత్రమే వీటిని అర్థం చేసుకోగలరు.

పైగా ఇది జర్మన్ భాషలో రాయబడింది. ఇంగ్లిషులో అనువాదమైనా, జర్మన్ వాసన దీన్ని పూర్తిగా వదల్లేదు.

ఇంచుమించు చదవగలిగిన వాళ్ళంతా, ఆలోచించ గలిగిన వాళ్ళంతా ఈ పుస్తకాన్ని చదవవలసిని అవసరాన్ని గుర్తించి, దీన్ని 'అతి సామాన్యులకు' కూడా అర్థమయ్యే పద్ధతిలో చెప్పటానికి ప్రయత్నించారు.

"మార్క్స్ గారి ఈ శాస్త్ర గ్రంథం సగటు పాఠకులకు అర్థం కాదు. ఇక కార్మిక వర్గం దీన్ని చదివే అవకాశమే లేదు" అన్న భావనతోనే నా కృషి కొనసాగింది. సగటు వ్యక్తి తొంబై సెకన్లకు మించి హేతుబద్ధంగా ఆలోచించలేడని నాకు తెలుసు. అతడికి హేతుబద్ధత, తార్కికత కన్నా భావోద్వేగాలు ఎక్కువ.

తర్కబద్ధంగా ఆలోచించగలిగిన క్రమశిక్షణ అతడికుండదు. అసలు అతను ఆలోచించటానికి ప్రయత్నిస్తే కదా!

ప్రపంచంలోని అత్యద్భుత మేధావి చెప్పిన శాస్త్ర విషయాలను అందరికీ చేరవెయ్యటం ఎలా అన్నది నా ముందున్న సవాల్!

ఆరేళ్ళపాటు మూల గ్రంథాన్ని అధ్యయనం చేసి, చివరికి సమస్యకు పరిష్కారం కనుగొన్నాననుకొంటున్నాను.

ప్రతి క్షణం పాఠకుణ్ణి ప్రశ్నలతో ముంచెత్తటం ద్వారా, అతడిలో ఆలోచనా శక్తి జాగృతమవుతుంది.

మొత్తం మీద నేనాశించిన ఫలితం సాధించాననే విశ్వాసంతో మానవాళికి దీన్ని అంకితమిస్తున్నాను

పాఠకునితో రచయిత:

ఒక శాస్త్ర గ్రంథం మీ ముందున్నది.

కేవలం మొక్కుబడిగా చదివెయ్యటం కాదు. ప్రతి పదం వెనక ఉన్న అర్థాన్నీ గ్రహించినప్పుడు మాత్రమే ఫలితముంటుంది.

ఇది చదివినంత మాత్రాన మూలగ్రంథం చదవనక్కర్లేదనుకోవద్దు. కాకపోతే సుదీర్ఘ అధ్యయనం తర్వాత అందులోని ముఖ్య విషయాలన్నీ ఇందులో పొందుపర్చాను.

పుస్తకం ముగించే సరికి సరుకు (ప్రిళిళీళీళిఖిరిశిగి) అంటే ఏమిటో మారకం (జానిబీనిబిదీవీలి) లోని మతలబు ఏమిటో మీకు పూర్తిగా అర్థం కావాలి.

విలువ, విలువ యొక్క విస్తృతి, డబ్బు, దాని ఫంక్షన్స్, పెట్టుబడి, ఉత్పత్తి పెరుగుదల కారణాల గురించిన అవగాహన మెరుగుపడి ఈ సాంకేతిక విషయాల గురించి ఆలోచించగలిగిన సామర్థ్యం అలవడాలి.

కార్ల్ మార్క్స్ పెట్టుబడి

సరుకులు-డబ్బు

మొదటి అధ్యాయం : సరుకులు

1. సరుకుకున్న రెండు లక్షణాలు : ఉపయోగపు విలువ (యూజ్ వేల్యూ), విలువ.

పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం అమలులో ఉన్న సమాజాలలోని సంపద, సరుకుల బృహత్ సంచయం లాగ కనిపిస్తుంది. ఇందులోని అతి చిన్నకొలమానం (ఒక) సరుకు.

ఏది కనిపిస్తున్నది? సంపద.

ఏ సంపద? పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం అమలులో ఉన్న

సమాజాలలోని సంపద.

సంపద ఎలా కనిపిస్తున్నది? సరుకుల బృహత్ సంచయం లాగ. సంపద యొక్క అతి చిన్న కొలమానం ఏది? (ఒక్క) సరుకు.

మరి మన పరిశోధన ఎక్కడ ప్రారంభం కావాలి? సరుకు విశ్లేషణతో.

విశ్లేషణ అంటే ఏమిటి? ఒక వస్తువును మౌలిక భాగాలుగా విడగొట్టి ఒక్కొక్క భాగాన్నీ అధ్యయనం చెయ్యటం.

2. సరుకు అంటే ఏమిటి? మన వెలుపల ఉన్న ఒక వస్తువు. ఏదో రకంగా మన కోరికలను తృప్తి పరుస్తుందది. ఆ కోరికలు ఉదాహరణకు ఆకలి కావచ్చు లేదా మానసికమైనవీ కావచ్చు. కోరికల లోని భేదాల గురించి ప్రస్తుతం మనం చర్చించటం లేదు.

3. సరుకులు ఎలా ఉంటాయి? ఉపయోగించగలిగినవన్నీ సరుకులే.

వాటినెలా చూడాలి? రెండు రకాలుగా: ఒకటి క్వాలిటీ (నాణ్యత), మరొకటి క్వాంటిటీ (పరిమాణం).

అవేమిటి? అనేక లక్షణాల సమ్మేళనాలవి. సరుకులెన్నెలా ఉపయోగించవచ్చు? అనేక రకాలుగా. వాటి ఉపయోగాల గురించి ఎలా తెలుస్తుంది. కాలక్రమంలో దానంతటదే తెలిసివస్తుంది. ఒక సరుకును ఈ రోజు ఒక అవసరం కోసమూ, రేపు మరో అవసరం కోసమూ ఉపయోగించటం కద్దు.

దీన్ని బట్టి మనకేం అర్థమైంది? ఒక సమాజంలో వీటి ఉపయోగాన్ని బట్టి, అవి ఏ పరిమాణంలో అవసరముంటాయో నిర్ణయించబడుతుంది. సరుకుల స్వభావాన్ని బట్టి వాటి కొలతల్లో తేడాలుంటాయి. ఉదాహరణకు ద్రావకాలను లీటర్లలో, గాలన్లలో, నేలను అడుగుల్లో, గజాల్లో. ఇది కేవలం ఒక సంప్రదాయం మాత్రమే.

సాంప్రదాయమంటే ఏమిటి? సమాజమంతా అంగీకరించిన విషయం.

4. ఉపయోగపు విలువ (యూజ్ వేల్యూ) అంటే ఏమిటి?

ఒక సరుకు యొక్క ఉపయోగమే ఉపయోగపు విలువ.

ఈ ఉపయోగానికి పరిమితులు ఎలా ఏర్పడతాయి?

ఆ సరుకు యొక్క భౌతిక లక్షణాలను బట్టి.

సరుకుకు అతీతంగా దాని ఉపయోగపు విలువ ఉంటుందా? ఉండదు.

ఇనుము, మొక్కజొన్న, ఖనిజం ఏదైనా సరే, అది ఒక భౌతిక వస్తువుగా ఉన్నంత వరకూ దానికి ఉపయోగపు విలువ ఉంటుంది.

ఈ ఉపయోగపు విలువ శ్రమ మీద ఆధారపడి ఉంటుందా?

లేదు. దాని ఉపయోగపు విలువనే పరిగణనలోకి తీసుకుంటాం. శ్రమ ఆధారంగా ఇది నిర్ణయించబడదు. కొన్ని డజన్ల చేతి గడియారాలు, కొన్ని మీటర్ల గుడ్డ, కొన్ని టన్నుల ఇనుము అంటే వాటి ఉపయోగపు విలువ గురించే మనం మాట్లాడుతున్నామన్న మాట.

'సరుకుల అధ్యయనం' అంటే మనం ఏం తెలుసుకోవాలి?

మార్కెట్లో వాటి కొనుగోలు-అమ్మకాల గురించి. ఒక మంచి వ్యాపారస్తుడు, తన కస్టమర్లకు దాని ఉపయోగం ఎంతుంటుందో తప్పక తెలుసుకోవాలి.

ఉపయోగపు విలువ వాస్తవంగా ఎప్పుడు మారుతుంది?

సరుకును మనం వాడినప్పుడు.

ఉపయోగపు విలువ కాకుండా, సరుకులో ఇంకేమేం ఉంటాయి?

సామాజికంగా దాని రూపం ఏదైనా సరే, సంపదకు మూలం సరుకు.

ఇప్పటి వరకు, సరుకు గురించిన విశ్లేషణలో మనమేం తెలుసుకున్నాం?

ఒకటి: సరుకుంటే మన అవసరాలను తీర్చేది. రెండు: దానికి ఉపయోగపు విలువ ఉంటుంది.

5. ఇక మనం మారకపు విలువ గురించి తెలుసుకోవాలి!

మారవపు విలువ మనకు ఎలా దర్శనమిస్తుంది?

కొంత పరిమాణం గల (వ్యాపార) సంబంధం లాగ, (లావాదేవాల్లో) ఒక విలువ మరొకవిలువగా మారుతుంది. ఈ సంబంధం ఎప్పుడూ ఒకేలా ఉంటుందా? ఉండదు. ఒక సరుకు, మరొక సరుకుగా మారినప్పుడు పరిమాణం కూడా మారుతుంది.

6. ఉదాహరణకు, ఒక టన్ను గోధుమలు, సిల్కు గుడ్డ కోసమో, బంగారం కోసమో మారినపుడు పరిమాణామాలు మారకుండా ఉండవుగదా.

దీన్నిబట్టి మనకేం అర్థమయింది. గోధుమలకు అనేక మారకపు విలువలున్నాయి. అయితే, ధాన్యం కొంత పరిమాణం గల సిల్కుగుడ్డ లేదా బంగారంగా మారిందంటే ఈ మూడు సరుకుల మధ్యా ఉన్న మారకపు విలువ సమానమేనన్నమాట.

సరుకులో ఉపయోగపు విలువ కాకుండా ఇంకా ఏముంది? మారకపు విలువ. నిజానికి మారకపు విలువ అంటే విలువే.

సరుకుల మారకపు విలువల సంబంధాన్ని ఎలా అర్థం చేసుకుంటాం?

7. ఉదాహరణకు రెండు సరుకులు మొక్కజొన్న, ఇనుము తీసుకుందాం.

మారకంలో వీటి పరిమాణం ఎంతయినప్పటికీ, వాటికో నిష్పత్తి ఉంటుంది. అంటే ఒక ఖచ్చితమైన పరిమాణం గల మొక్కజొన్న, మరొక ఖచ్చితమైన ఇనుముగా మారకం జరుగుతుంది.

ఉదా॥ ఒక టన్ను మొక్కజొన్న = 20 కిలోల ఇనుము.

దీన్ని బట్టి మనకేం తెలుస్తుంది. ఖచ్చితమైన పరిమాణాల్లో మారకం జరుగుతుందంటే వీటి మధ్య ఏదో ఒక సంబంధం ఒక నిష్పత్తి ఉందన్నమాటే. రెంటి మధ్యా సామాన్యమైన (కామన్) విషయం ఏదో ఉంది.

వీటిని అస్థిరమైన పరిమాణాల్లో మారకం చేస్తున్నదేమిటి? ఆ మూడవ అంశం- మొక్కజొన్న కాదు. ఇనుమూ కాదు.

8. అయితే ఈ సామన్యమైన మూడవ అంశం సరుకులకు తమ సహజంగా ఉండే లక్షణమా?

ఎంత మాత్రం కాదు. ఒకవేళ అది వాటి రసాయనిక, గణిత సంబంధమైన లేదా మరే అంశంమైనా అయితే అవి వాటి ఉపయోగాన్ని ప్రభావితం చేస్తుంది గదా. అంటే అది ఉపయోగపు విలువగా మారుతుంది.

కాని సరుకుల మారకం అనేది ఉపయోగపు విలువల-మారకం మాత్రమే. అంటే ఒక సరుకు యొక్క ఉపయోగపు విలువ, మరొక సరుకు యొక్క ఉపయోగపు విలువతో సమానం. అందుకే, ఒక మారకం విలువ (ధన) కు లభ్యమయ్యే అన్ని సరుకులతో సమానమే అంటారు. లక్ష రూపాయల విలువ గల ఇనుము, లక్ష రూపాయల విలువ గల బంగారంతో సమానమే.

ఉపయోగపు విలువలుగా సరుకులను ఎలా అర్థం చేసుకోవాలి? వాటి లక్షణాలు భిన్నంగా ఉంటాయి. వాటి పరిమాణం కూడా వేర్వేరుగా ఉంటుంది. అంతే తప్ప ఉపయోగపు విలువతో దీనికే మాత్రం సంబంధం లేదు.

9. మరి సరుకుల్లోంచి ఉపయోగపు విలువ తీసేస్తే మనకేం మిగిలింది?

ఒకే ఒక సామాన్య లక్షణం. అన్ని సరుకులూ శ్రమ వల్ల సృష్టింపబడ్డవే. అన్ని సరుకుల్లోనూ ఉన్నది మూర్తీకరించబడిన శ్రమ. ఆ శ్రమే రూపం మార్చుకొని అనేక సరుకులుగా మారింది.అలాగే ఉపయోగపు విలువల్ని కూడ అమూర్తీకరిస్తే మనకు టేబుల్, ఇల్లు, గుడ్డ వగైరా అన్ని సరుకులలో దాగి ఉన్న ది శ్రమ మాత్రమేనని అర్థమవుతుంది. అంతేకాదు, వడ్రంగి, దర్జీ, మేస్త్రీ మొదలైన వివిధ శ్రమలను అమూర్తీకరించి మనం కేవలం 'శ్రమ' గానే గుర్తిస్తున్నాం. అంటే మూర్తీకరింపబడిన మానవ శ్రమ.

10. సరుకుల విలువకు మూలం మానవ శ్రమ. విలువ అంటే శ్రమ. సరుకుల ఉపయోగం, లేదా ఉపయోగపు విలువకు అతీతంగా ఉంటుంది శ్రమ. మారకం సమయంలోనే సరుకులలో దాగిన విలువ ఏమిటో మనకు తెలిసి వస్తుంది.

11. అయితే, ప్రస్తుతానికి మనం 'విలువ' ఏ రూపం తీసుకుంటున్నది కాక, దాని (విలువ) స్వభావమేమిటో పరిశీలిద్దాం.

12. ఒక వస్తువుకు విలువ ఎందుకుంటుందసలు?

అమూర్తమైన మానవ శ్రమ భౌతిక రూపం సంతరించుకుంది గనక దానికి విలువ వచ్చింది.

ఈ విలువ ఎంతో ఎలా లెక్కగట్టగలం? ఆ వస్తువులో ఉన్న విలువను సృష్టించే అంశాన్ని బట్టి అంటే అందులో ఉన్న 'శ్రమ'ను బట్టి దాని విలువ నిర్ణయించబడుతుంది. శ్రమ లెక్కగట్టటం ఎలా? (శ్రమ) వెచ్చించిన సమయాన్ని బట్టి గంటలు, రోజులు, వారము ఎంతైనా కావచ్చు.

13. కొందరు పని దొంగలుంటారు, బద్దకస్తులుంటారు గంటలో చెయ్యాల్సిన పని నాలుగ్గంటలు చేస్తారు. అలాంటప్పుడు నాలుగ్గంటల శ్రమ ఆ వస్తువులో ఉందని చెప్పగలమా? లేదు. మనం అమూర్తమైన శ్రమ గురించి మాట్లాడుతున్నాం. అంటే ఒక వస్తువు తయారీకయ్యే సగటు శ్రమశక్తిని బట్టి ఈ విషయం నిర్ణయిస్తారు.

సగటు శ్రమశక్తిని ఎలా నిర్ణయిస్తాం? 'విలువ' నిర్ణయించటానికి మూలం ఇదే కదా మరి! ఒక సమాజంలో ఉత్పత్తి అవుతున్న సరుకుల్లో నిక్షిప్తమయి ఉంటుంది. ఆ సమాజంలోని మొత్తం శ్రమశక్తి వ్యక్తులకు సంబంధించినదే అయినా, దీన్ని అమూర్తీకరించి ఎలా అంచనా కడతాం. మరి ఒక్కొక్క వ్యక్తి శ్రమశక్తిని ఎలా అంచనా వేస్తాం? సగటు శ్రమశక్తినే ఒక వ్యక్తి శ్రమశక్తిగా గుర్తిస్తాం. అంటే ఒక వస్తువును తయారు చెయ్యటానికి సామాజికంగా అవసరమైన (సగటు) శ్రమశక్తి.

ఒక వస్తువు తయారీకి సామజికంగా అవసరమైన శ్రమశక్తిని ఎలా అంచనా వేస్తాం? సాధారణ పరిస్థితుల్లో అవసరమైన శ్రమశక్తినే సామాజికంగా అవసరమైన శ్రమశక్తి అంటారు. 'ఉత్పత్తికి అవసరమైన సాధారణ పరిస్థితులు' అంటే ఏమిటి? మొదట శారీరక శ్రమను తగ్గించే యంత్రాలు అందుబాటులో ఉండటం. రెండు: వాటిని నడపటానికి అవసరమైన నేర్పు, శిక్షణ ఉన్న కార్మికులు అందుబాటులో ఉండటం.

దీనికో మంచి ఉదాహరణ: ఇంగ్లండులో మరమగ్గాలు వాడుకలోకి రావటంతో బట్టలు నేయటానికి అవసరమైన శ్రమకాలం సగానికి సగం తగ్గింది.కాని చేనేత కార్మికుల శ్రమకాలం లో మాత్రం మార్పు రాలేదు. అంటే మరమగ్గం అరగంట సేపు పని చేస్తే, వీళ్ళు గంట సేపు పని చెయ్యాలన్న మాట. (సామాజికంగా అవసరమైన శ్రమ అంటే ఇదే)

సరుకు విలువను నిర్ణయించేది సామాజికంగా అవసరమైన శ్రమ కాలం అనే విషయం ఇప్పుడు స్పష్టమైంది.

ఈ సరుకుల సముద్రంలో "ఒక సరుకు" గురించి మనం ఎలా చర్చ కొనసాగించాలి? దాన్ని ఆ తరగతికి చెందిన ఒక 'సగటు' ఉదాహరణగా పరిగణించటం ద్వారా మాత్రమే.

శ్రమకాలం మారనప్పుడు, సరుకుల విలువ కూడా మారదు.

విలువల పరిభాషలో సరుకులంటే ఏమిటి? శ్రమకాలాన్ని తమలో దాచుకున్న వస్తువులవి.

14. సరుకుల విలువ మారకుండా, ఎప్పుడూ ఒక్కలాగే ఉంటుందా? ఉండదు. 'శ్రమ సమయం' మారనంత వరకూ విలువ మారదు. కాని శ్రమ యొక్క ఉత్పాదకత పెరిగినప్పుడు (సరుకుల ఉత్పత్తికి అవసరమైన) శ్రమ సమయంలో కూడా మార్పులు వస్తాయి.

కార్మికుల ఉత్పాదక శక్తి ఎలా నిర్ణయించబడుతుంది? దీనికి అనేక కొలమానాలుంటాయి. మొదటిది: కార్మికుల సగటు నైపుణ్యం రెండు: శాస్త్ర, సాంకేతిక ప్రగతి. అది ఎంత వరకు ఉత్పత్తికి సహాయం చేస్తుందన్న విషయం. మూడవది: ఉత్పత్తికి అవసరమైన సామాజిక నిర్మాణం. నాల్గవది: మీన్స్ ఆఫ్ ప్రొడక్షన్ ఐదవది: భౌతిక పరిస్థితులు.

ఉదాహరణకు నేలను దున్నటానికీ, నాట్లు వెయ్యటానికీ, పంట పండించటానికీ అవసరమైన శ్రమ ఇప్పుడు ఒకటే. అంటే ఇందులో మార్పు రాదు. కాని వానలు పుష్కలంగా పడి, వాతావరణ, శీతోష్ణస్థితులు, ఇతర భౌతిక పరిస్థితులు సహకరిస్తే పంటలు బాగా పండుతాయి. ఈ పరిస్థితులు అనుకూలించకపోతే, అంత శ్రమా వృథా అవుతుంది. ఫలసాయం రాదు. అంటే అనుకూలించినప్పుడు పది టన్నుల ధాన్యం పండిచటానికీ, అనుకూలించనప్పుడు ఒకటన్ను పండించటానికీ వెచ్చించిన శ్రమలో మార్పులేదు.

ఒక ప్రాంతంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడితే, అక్కడి రైతుల శ్రమ బూడిదలో పోసిన పన్నీరవుతుంది. మార్కెట్‌కు ధాన్యం రాదు. డిమాండ్ పెరుగుతుంది. అన్నీ అనుకూలిస్తే డిమాండ్‌కు

మించిన ధాన్యం మార్కెట్‌కు చేరుతుంది.

దీని ఫలితమేమిటి? సప్లై, డిమాండ్ సూత్రాన్ని బట్టే ధరలునిర్ణయించబడతాయి. అనబడే తప్పుడు అభిప్రాయం ఏర్పడుతుంది. అనుకూలించిన సంవత్సరం సప్లై పెరిగింది. ధరలు తగ్గాయి. అనుకూలించని ఏడు ధరలు పెరిగాయి.

'సప్లై, డిమాండ్'లు ధరలను నిర్ణయించకపోతే ఇలా ఎందుకు జరుగుతుంది మరి?

పైన చెప్పుకున్న ఉదాహరణ ప్రకారం పరిస్థితులు అనుకూలించిన సంవత్సరంలో వంద గంటల శ్రమతో పది క్వింటాళ్ళ ధాన్యం పండిందనుకుంటే, అనుకూలించని సంవత్సరంలో రెండు క్వింటాళ్ళే చేతికి వచ్చింది. అంటే, అనుకూలించిన సంవత్సరంలో, ఒక క్వింటాలుకు పది గంటలు శ్రమ అవసరమైతే, అనుకూలించని సంవత్సరంలో యాభై గంటల శ్రమ అవసరమైంది. శ్రమ విలువను బట్టి ధరలు నిర్ణయించబడ్డాయి.

గని కార్మికుల విషయంలో కూడా ఇదే విషయం వర్తిస్తుంది. శ్రమ కాలం ఒకటే అయినా, (ఖనిజం) పుష్కలంగా ఉన్న గనుల్లో ఎక్కువ ఖనిజం వెలికి తీస్తారు. తక్కువగా ఉన్న గనుల్లో తక్కువ తీస్తారు.

భూమి పొరల్లో వజ్రాలుంటాయి గాని అవి అరుదుగా లభిస్తాయి. అందువల్ల ఎంతో శ్రమిస్తే తప్ప ఫలితం కనిపించదు.అయినా, కొన్ని గనుల్లో త్వరగా దొరుకుతాయి. మరికొన్ని గనుల్లో వందలు, వేల గంటలు శ్రమించాల్సి వస్తుంది.

సాంకేతిక అభివృద్ధితో మనం కార్బన్‌ను వజ్రాలుగా మార్చగలిగిన రోజున వజ్రాల ధర దారుణంగా పడిపోదూ! (అప్పుడు ఇవి ఇటుకల కన్నా చవకగా దొరికినా ఆశ్చర్యం లేదు). మొత్తం మీద మనం గ్రహించాల్సిందేమిటంటే, ఉత్పాదక శక్తి ఎక్కువుంటే వస్తువులు తయారు చెయ్యటానికి తక్కువ శ్రమశక్తి అవసరమవుతుంది. ఒక వస్తువులో శ్రమ ఎంత తక్కువుంటే దాని విలువ కూడా అంత తక్కువుంటుంది (శ్రమ పెరిగితే, ధర పెరుగుతుంది)

సరుకుల ధరల్లో తేడా ఎందుకుంటుంది? పరిమాణం పెరిగినప్పుడూ, వాటిలో ఉన్న శ్రమకాలం పెరిగినప్పుడూ ధరల్లో తేడా వస్తుంది.

15. మారకపు విలువ లేని ఉపయోగపు విలువ ఉంటుందా? సరుకు శ్రమ వల్ల ఉత్పత్తి కానప్పుడు. ఉదాహరణకు: గాలి, సేద్యానికి సిద్ధంగా లేని నేల, మైదానాలు వగైరా.

శ్రమ వల్ల ఉత్పత్తి అయినప్పటికీ, సరుకుగా మారని వస్తువులుంటాయా? ఉంటాయి. ఒక వ్యక్తి వస్తువును (శ్రమతో) ఉత్పత్తి చేసి, తనకోసం వాడుకున్నప్పుడు. అప్పుడు దానికి ఉపయోగపు విలువే తప్ప మారకపు విలువ ఉండదు.

సరుకులను తయారు చేయాలంటే ఏం చేయాలి? ఇతర్ల కోసం అంటే సామాజికమైన ఉపయోగపు విలువలను సృష్టించాలి.

వస్తువుకు ఉపయోగపు విలువ లేని విలువ ఉంటుందా? ఉండే అవకాశమే లేదు. ఒక వస్తువు నిరుపయోగమైనదంటే అందులో ఉన్న శ్రమ కూడా వృథా అయిందన్నమాటే. అసలు దాన్ని శ్రమగా గుర్తించవలసిన అవసరం లేదు. విలువ సృష్టించలేనిది శ్రమకాదు.

సరుకులలో నిక్షిప్తమైన శ్రమ యొక్క రెండు పార్శ్వాలు:

16. సరుకు మనకు ఎలా కనిపిస్తుంది? చాలా సంక్షిప్తంగా, ఉపయోగపు విలువ, మారకపు విలువ రెండూ ఉంటాయందులో. అలాగే, శ్రమకు కూడా రెండు పార్శ్వాలుంటాయి. ఎలా? అది ఉపయోగపు విలువగా గుర్తింపబడినప్పుడు దాని ఉపయోగపు విలువను విస్మరిస్తాం.

వస్తువు విలువగా అది అమూర్తీకరింపబడిన శ్రమ. ఉపయోగపు విలువగా దాన్ని ఖచ్చితంగా అంచనా వేయ్యొచ్చు. శ్రమకున్న ఈ లక్షణం యొక్క ప్రాముఖ్యత ఏమిటి? ఇదొక ఇరుసులాంటిది. దీని చుట్టే తిరుగుతుంది పొలిటికల్ ఎకానమీ. శ్రమ కున్న ఈ రెండు పార్శ్వాల స్వభావాన్ని మొదట ఆవిష్కరించిందెవరు?- కార్ల్‌మార్క్స్.

శ్రమ యొక్క ఈ రెండు పార్శ్వాలను గురించి మరింత తెలుసుకుందాం.

17. ఉదాహరణకు రెండు సరుకుల్ని తీసుకుందాం. ఒకటి కోటు. మరొకటి పది గజాల గుడ్డ. కోటు విలువ గుడ్డ విలువ కన్నా రెట్టింపు అనుకొందాం.

18. కోటుయొక్క ఉపయోగపు విలువ ఏమిటి? అది మన అవసరాన్ని తీరుస్తుంది. దానికా లక్షణం ఎలా అబ్బింది? ఒక రకమైన తయారీ ప్రక్రియ ద్వారా. ఆ తయారీ ప్రక్రియ ఎలా నిర్ణయం ఎలా జరుగుతుంది? ఒక లక్ష్యం ఏర్పరచుకొని, దాన్ని సాధించే దిశగా ప్రయత్నించటం వల్ల. సరుకులో ఉన్న శ్రమను ఏమంటాం? ఉపయోగపు శ్రమా? లేక నిర్దిష్టమైన శ్రమా? వాటి ఉపయోగాన్ని బట్టి అది ఏ రకమైన శ్రమో నిర్ణయిస్తాం.

19. కోటుకూ, గుడ్డకూ ఉన్న తేడా ఏమిటి? నాణ్యతా పరంగా రెంటి ఉపయోగపు విలువలు వేర్వేరు. వాటిలో ఉన్న శ్రమ ఎలాంటిది? ఒకటి దర్జీ శ్రమ. మరొకటి నేతగాడి శ్రమ. సరుకులలో ఉన్న శ్రమ నాణ్యతా పరంగా ఎందుకు భిన్నంగా ఉంటుంది? రెండు శ్రమలూ భిన్నం కాకపోతే, రెండు సరుకులూ మారకపు విలువలుగా ఉండవు. కోట్లను కోట్ల కోసం మార్చుకోం కదా!

20. ఉపయోగపు విలువ ఎన్ని రకాలో ఉపయోగకరమైన శ్రమ కూడా అన్ని రకాలు. శ్రమను ఎలా విభజిస్తాం? అవసరమైన మేధో పరిణతిని బట్టి. సామాజికంగా ఉన్న శ్రమ విభజనను బట్టి. పై వాక్యాన్ని మనం మరింత బాగా అర్థం చేసుకొవటానికి ప్రయత్నిద్దాం.

1. పరిశ్రమలు-ఉత్పత్తి-వ్యవసాయం-వాణిజ్యం వగైరా
2. మేధో పరిణతి: యంత్రాలను మేధావులు మాత్రమే తయారు చేయగలరు.
3. వృత్తిపరంగా: యంత్రాల మీద పనిచేసే నిపుణులైన కార్మికులు, కమ్మరి వాళ్ళు, ఇతర లోహ కార్మికులు, వాళ్ళ సహాయకులు వగైరా, వీళ్ళంతా, యంత్రాల్ని నిర్మించే మేధావులకు సహాయం చేసేవాళ్ళే.
4. కార్మికులకు సహాయం చేసే అసిస్టెంట్లు, సరుకుల ఉత్పత్తి విధానంలో శ్రమ విభజన అవసరమా? నిస్సందేహంగా.

(ఇంకా ఉంది.)

విరసం వెబ్‌సైట్ www.virasam.org సంచికల విషయసూచిక!

విప్లవ రచయితల సంఘం విరసం.ఒఆర్‌జి అనే పేరుతో ఒక అంతర్జాల పత్రికను మే 15 నుంచి పక్షపత్రికగా నడుపుతోంది. కథలు, కవిత్వం, పుస్తక సమీక్షలు, వ్యాసాలు వగైరాలతోపాటు దండకారణ్య సమయం, సంభాషణ, సోషలిజమే ప్రత్యామ్నాయం అనే శీర్షికలు కూడా ఉన్నాయి. ఇవిగాక సభలు సమావేశాల వివరాలు, కరపత్రాలు, వీడియోలు, డాక్యుమెంటరీలు, పత్రికా ప్రకటనలు, విప్లవ పాటల వీడియోలు, కొత్త పుస్తకాల పీడీఎఫ్‌లు, ఫొటోలు చూడవచ్చు. పక్ష పత్రికగా పీరియాడికల్ శీర్షికలతోపాటు ఎప్పటికప్పుడు నాన్ పీరియాడికల్‌గా రచనలు, వీడియోలు, సమాచారం అందిస్తున్నాం. అంతర్జాలానికి దగ్గరిగా లేని పాఠకుల కోసం విరసం.ఒఆర్‌జి వివరాలు ఇవ్వాలనుకున్నాం. అందుకని ఇలా వెబ్ మేగజైన్ మొదలైనప్పటి నుంచి అన్ని సంచికల విషయ సూచిక ఇస్తున్నాం. వచ్చే నెల అరుణతార సంచిక నుంచి విరసం.ఒఆర్‌జీ రెండు సంచికల ఇండెక్స్ ఎప్పటికప్పుడు అందిస్తాం.

- అరుణతార సంపాదకవర్గం, విరసం.ఒఆర్‌జి టీం

15 మే, 2016

ఈ సంచికలో...

1.	నిత్యం చిగురించే విప్లవ కవిత్వం	పాణి
2.	వేదాంత స్పాన్సర్ చేసే జైపూర్ సాహిత్యోత్సవ లండన్ సభలను బహిష్కరించండి రచయితలకు బహిరంగ లేఖ	
3.	జంగల్‌నామా చిరునామా	పాణి (సంపాదకీయం)
4.	దారులు	పద్మకుమారి
5.	హెచ్‌సీయూపై వైమానిక దాడులకు వీసి విజ్ఞప్తి	శోషన్ చౌదరి (అనువాదం : బాసిత్)
6.	చరిత్ర – చర్చ	వరవరరావు
7.	మూడవ దశ గ్రీన్‌హంట్‌లో	జగతి
8.	ఉండవలసిన తీరు	పద్మకుమారి
9.	నోటీస్‌కు జవాబుగా చాటింపు	వరవరరావు
10.	ఆందోళనే జీవితమైనపుడూ	క్రాంతి

Related Links :
www.sanhati.com
www.bannedthought.net/india
www.indiaresists.com
www.signalfire.org
www.magazine.sarangbooks.com
www.arugu.in
www.sovietbookintelugu.blogspot.in

© 2016 virasam.org/powered by : http://hyadads.in

1 జూన్, 2016

ఈ సంచికలో...

1.	ప్రొఫెసర్ కంచె ఐలయ్యకు సంఘీభావంగా భావ ప్రకటనా స్వేచ్ఛకై	వరలక్ష్మి (సంపాదకీయం)
2.	భారత ఉపగ్రహ కన్నుల్తో ప్రజలపై యుద్ధం	లలిత్ శుక్లా (అనువాదం: బాసిత్)
3.	మూడవ దశ గ్రీన్‌హంట్‌లో	జగతి
4.	మన నీళ్లు, మన సిద్దేశ్వరం	పాణి
5.	ఉండవలసిన తీరు - 2	పద్మకుమారి
6.	ఊయలతో కంటిపాప	స్వేచ్ఛ
7.	వారిద్దరూ	మహబూబ్
8.	ఖాళీ ఇల్లు... ఖాళీ మనసులు	పలమనేరు బాలాజీ
9.	ఆ వెంటాడే కవిత్వ భాష	అరసవెల్లి కృష్ణ
10.	ముగ్గురు దేశద్రోహులతో సాధ్యమైన ప్రయాణం	వరవరరావు
11.	బోధనా హక్కు కోసం మరో జైలు పోరాటం చేస్తా	ప్రొ. ఎన్. సాయిబాబా

15 జూన్, 2016

ఈ సంచికలో...

1.	నవ్యాంధ్రలో నోరు తెరిస్తే నేరమట!	పి. వరలక్ష్మి
2.	దూతను కాల్చివేసే చోట: బస్తర్ అడవుల్లో జీవన్మరణ సమస్యగా జర్నలిజం	సుబోజిత్ బాగ్చి (అనువాదం: క్రాంతి)
3.	అల్లావుద్దీన్ అద్భుత దీపాన్ని మించిన బీజేపి స్వాత్కర్ష	సరస్వతి రమ
4.	వెంట్రుకవాసిలో...	చుంగ్ చున్ - షాన్ (అనువాదం: షహీదా)
5.	ఒక్కటవుదామా...!	రాంకి
6.	యుద్ధ ప్రకటన	నరేష్కుమార్
7.	నువ్వే నా "హీరో"	విజయ్ సాధు
8.	స్మృతి గీతం	చేరన్ రుద్రమూర్తి (అనువాదం : బాలసుధాకర్ మౌళి)
9.	మానని గాయమూ, తీరని ఆగ్రహమూ వాకపల్లి...	పద్మకుమారి
10.	తెలుగు వారి ముంగిట్లోకి ప్రపంచం	మిసిమి
11.	దండకారణ్య నిర్మాణ చిత్తరువు - 1	కా. ప్రతాప్
12.	దండకారణ్య నిర్మాణ చిత్తరువు - 2	కా. ప్రతాప్

1 జూలై, 2016

ఈ సంచికలో...

1. గురి చూసే పాట గూడ అంజయ్య — పాణి, కాశీం
2. అణిచివేత, అధికార దుర్వినియోగాలు అంతులేని విషాధ కథ ఛత్తీస్‌ఘడ్ — ఆల్ ఇండియా పీపుల్స్ ఫోరం నిజ నిర్ధారణ రిపోర్టు
3. రచయితలలారా మీరెటువైపు? వేదాంతం వైపా? స్వేదజీవుల వైపా? — వరవరరావు
4. కనుపాపల్లో నుండి — పచ్చల కిరణ్ కుమార్
5. అలుగు నేత్రం — మహమూద్
6. వెలుతురు నది — అల్లం రాజయ్య
7. ప్రజలు విప్లవోద్యమం పక్షాన ఉన్నారు — కా. ఇడిమె
8. అన్ని రంగాల్లోని నిపుణులు దండకారణ్యంలోకి రావాలి — కా. ఇడిమె
9. నీతి కథ! - రాజకీయ వ్యంగ కథ — బమ్మిడి జగదీశ్వరరావు

15 జూలై, 2016

ఈ సంచికలో...

1. రచయితలేం చేయగలరు? — వరవరరావు
2. ఏమైందో, ఏమిటో? — పలమనేరు బాలాజీ
3. ఆజాదీ కాశ్మీర్ : చల్లారని ప్రజల ఆకాంక్ష — పాణి
4. నిజమైన వీరులు నేల నుంచి వస్తారు — వరవరరావు
5. శరీరం — చేరాస్ రుద్రమూర్తి
6. చేజారిన జాడల్లోంచి మైదానాల్లోకి — రివేరా
7. చదివిన వారిని 'ఫాల్గుణ' ఆవహిస్తాడు! — మిసిమి
8. 'అభివృద్ధి కోసం ఈసారి కందమాల్‌లో అయిదుగురు దళితుల్ని, ఆదివాసుల్ని వేటాడి చంపారు — బస్తర్ సాలిడారిటీ నెట్‌వర్క్
9. బీజేపి నమూనా - ఆశ్రిత పెట్టుబడిదారి విధానంతో కలిసిన సాఫ్ట్ హిందుత్వ — రానా ఆయూబ్
10. త్యాగాల పరంపర — పద్మకుమారి
11. పేగు దుఃఖం — ఉదయమిత్ర

ఆవిష్కరించిన పుస్తకాలు :

1. గెరిల్లా అమ్మ

ఫొటోలు :

విరసం ఆవిర్భావ సభ
కామ్రేడ్ చలసాని మొదటి సంస్మరణ సభ
సూరపనేని జనార్ధన్ సంస్మరణ సభ
అమరుల బంధుమిత్రుల సంఘం జెండా ఫోటో

రిలేటెడ్ పోస్టులు : (వీడియో)

ప్రజలను ముంచి ప్రాజెక్టులా? - బాసిత్

1 ఆగస్టు, 2016

ఈ సంచికలో...

1. మట్టి కప్పిన ఆమె పార్థివ దేహంపై మహోప ‌మొక్క నాటుదాం — వరవరరావు
2. మేధావుల్లారా, ప్రజాస్వామిక వాదులారా... మా వైపు చూడండి... — ఆదివాసీల విజ్ఞప్తి
3. భూమికి సరే, జ్ఞాపకాలకు నష్టపరిహారం ఇవ్వగలరా? — కాశీం
4. సిరియాలో శాంతి కొలుకొనేనా? — ఎ. నర్సింహారెడ్డి
5. జీవన సత్యాలను ఆవిష్కరించిన దర్శకుడు అబ్బాస్ కియోరస్తాను — మోహన కృష్ణ ఇంద్రగంటి
6. యుద్ధ ప్రకటన - 4 — నరేష్కుమార్ ఎస్
7. నీ గూడు యాడనే సిలకా! — ఉదయమిత్ర
8. యుద్ధభూమి కడుపుకోత - రాహుల్
9. భారత సైన్యాలు కశ్మీరును వీడాలి... — నోమ్ చామ్‌స్కీ
10. కశ్మీరు పిల్లలు ఇండియా గురించి ఏమనుకుంటున్నారు? — www.scoopwhoop.com సౌజన్యంతో
11. తప్పిపోయిన కలల కోసం... — స్వేచ్ఛ

లేటెస్ట్ పోస్టులు :

1. ఎర్రమల్లె లేరినం అంజన్న - ఏరి కుప్ప బోసినం — జన నాట్యమండలి పాట
2. అన్న ఓ కూలన్న ఆలకించేవేమన్నా — జన నాట్యమండలి పాట
3. నీ నెత్తురు బోసి ఎత్తుకున్న ఎర్రజెండా విడవమే మాయన్న అనంతరెడ్డి — జన నాట్యమండలి పాట
4. అంబాటక్కాడే... జంబలుగట్టి — జన నాట్యమండలి పాట
5. అమ్మ నన్ను సాగనంపే... అమరుల తొవ్వలోనే — జన నాట్యమండలి పాట
6. ఆగదు... ఆగదు... ఆగదు... ఈ ఆకలిపోరు ఆగదు... — జన నాట్యమండలి పాట
7. కార్పొరేటు వ్యవసాయం - రైతుల ఆత్మహత్యలు — ఇక్బాల్ (వీడియో)
8. మహాశ్వేతాదేవి స్మరణలో సాహిత్య సభ — పాలమూరు అధ్యయన వేదిక
9. అడవీ తల్లీ నీకు వందనామమ్మ... — అనుదీప్ (అందీప్)

10. స్మారక స్థూపం మీది పేర్ల - 2
దిమ్మిత్రివలొవొయ్, హెచ్ లప్షియా

11. మానాల దీర్ఘకవిత కాశీం

12. స్మారక స్థూపం మీద పేర్లు - కార్ల్ మార్క్స్
దిమ్మిత్రివలొవొయ్, హెచ్ లప్షియా

పత్రికా ప్రకటనలు :

1. Boy Cott (World) Social Forum, a Safety Value for Imperialism
Revolutionary Democratic Front (RDF) 30.07.2016

2. ఆ నిండైన సాహిత్య సామాజిక జీవితం రచయితలందరికీ ఆదర్శం వరలక్ష్మి, కార్యదర్శి, విరసం. 2.8.16

3. కూలీలను కాల్చి చంపి - మావోయిస్టుల ముద్ర వేశారు
గుముడు మహా ఎన్‌కౌంటర్‌పై పౌరహక్కుల సంఘం నిజ నిర్ధారణ, 20.07.2016

4. అరుణతార నిర్వహణకు విరాళాలివ్వండి-
శాశ్వత నిధి ఏర్పాటుకు సహకరించండి
విరసం, 29.06.2016

5. సోనీ సోరి నిరసన దీక్షకు సంఘీభావం ప్రకటించండి!
ప్రజలకు ప్రజాస్వామ్య వాదులకు, రచయితలకు విజ్ఞప్తి
వరవరరావు, 17.06.2016

6. కా. వివేక్ స్మృతిలో... రచనలు ఆహ్వానం
వివేక్ కుటుంబ సభ్యులు, 05.6.16

7. ఛత్తీస్‌ఘడ్ ఆదివాసీ గ్రామాలపై దాడులు చేసి, హత్యలు, అత్యాచారాలు విమెన్ అగైనెస్ట్ వెలెన్స్ అంట్ స్టేట్
జరిపిన భద్రతా దళాలపై చర్యలు తీసుకోవాలి
రిప్రెషన్, 24.05.2016

8. రచయితలపై కుట్రకేసు భావ ప్రకటనా స్వేచ్ఛను కాలరాయటమే రచయితల ఉమ్మడి ప్రకటన, 11-9-16

రిలేటెడ్ పోస్టులు :
మాగూంటి నక్సల్‌బరీపై
పుస్తకాలు : గెరిల్లా అమ్మ - అమరుల బంధుమిత్రుల సంఘం
అమరులు : చెరబండరాజు

15 ఆగస్టు, 2016

ఈ సంచికలో...

1. పునః స్వాతంత్ర్య నినాదం పి. వరలక్ష్మి

2. పొలం పని చేసుకుంటున్నోళ్లను కాల్చి చంపారు
పావురిగూడెం ఎన్‌కౌంటర్‌పై నిజనిర్ధారణ నివేదిక

3. ఎస్.సి. వర్గీకరణ దళిత ఐక్యతకు,
కుల నిర్మూలనకు బలమైన ప్రాతిపదిక వరవరరావు

4. ఆల్ హేపీస్! బమ్మిడి జగదీశ్వరరావు

5. ఈ తీసివేతలు... రాజ్యం హింసామయ నేరప్రవృత్తిలో భాగం కాదా? పాణి

6. నేనొక అరణ్య స్వప్నం గీతాంజలి

7. రెప్పకప్పని నిద్దుర రివేరా

8. లోయ నుండి లేఖ ఉదయమిత్ర

9. గెరిల్లా అమ్మకు... కుందు

10. మనుషులు లేని నేల కోసం రాహుల్

11. రైతు - నీళ్లు పెన్నేరు

12. వాగ్దాటి కాశీపతి వరవరరావు

వీడియోలు :
కార్పొరేటు వ్యవసాయం రైతు ఆత్మహత్యలు కామ్రేడ్ ఇక్బాల్ ఉపన్యాసం

లేటెస్ట్ పోస్టులు :

1. ఎర్రమల్లె లేరినం అంజన్న - ఏరి కుప్ప బోసినం జన నాట్యమండలి పాట

2. అన్న ఓ కూలన్న ఆలకించేవేమన్నా జన నాట్యమండలి పాట

3. నీ నెత్తురు బోసి ఎత్తుకున్న ఎర్రజెండా విడవమే మాయన్న అనంతరెడ్డి జన నాట్యమండలి పాట

4. అంబాటక్కాడే... జాంబలుగట్టి జన నాట్యమండలి పాట

5. అమ్మ నన్ను సాగనంపే... అమరుల తొవ్వలోనే జన నాట్యమండలి పాట

6. ఆగదు... ఆగదు... ఆగదు... ఈ ఆకలిపోరు ఆగదు... జన నాట్యమండలి పాట

7. కార్పొరేటు వ్యవసాయం - రైతుల ఆత్మహత్యలు ఇక్బాల్ (వీడియో)

8. మహాశ్వేతాదేవి స్మరణలో సాహిత్య సభ పాలమూరు అధ్యయన వేదిక

9. అడవీ తల్లీ నీకు వందనామమ్మ... అనుదీప్ (అందీప్)

10. స్మారక స్థూపం మీది పేర్ల - 2
దిమ్మిత్రివలొవొయ్, హెచ్ లప్షియా

11. మానాల దీర్ఘకవిత కాశీం

12. స్మారక స్థూపం మీద పేర్లు - కార్ల్ మార్క్స్
దిమ్మిత్రివలొవొయ్, హెచ్ లప్షియా

అరుణతార సాఫ్ట్ కాపీలను
www. arunatara.com సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.
- సం.

మహాశ్వేతాదేవి రచనల్లో శ్రామికవర్గ దృక్పథం

సంస్మరణ సభ నివేదిక

మహాశ్వేతాదేవి సంస్మరణ సభ తేది 25 ఆగస్టు 2016, గురువారం రోజు హనుమకొండ, సుబేదారి ఆర్ట్స్ & సైన్స్ కళాశాలలో మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 6-30 గంటల వరకు జరిగింది. ఈ సభను 'ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక', 'చెలిమి సాహిత్య సాంస్కృతిక వేదిక', 'విప్లవ రచయితల సంఘం', 'గోదావరి సాహితీ మిత్రులు' సంయుక్తంగా నిర్వహించాయి.

సభలో కాత్యాయిని విద్మహే మాట్లాడుతూ, మహాశ్వేతాదేవి మరణంతో ఒక సాహితీ పెద్ద దిక్కును కోల్పోయమన్నారు. "ఆమె సాహితీ ఆచరణ మనకు నమూనా కావాలి. ఆమెను చదివి, సమాజంలోని వ్యక్తులుగా మనల్ని మనం సరిదిద్దుకోవాలి. ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక లక్ష్యం, మహాశ్వేతాదేవి లక్ష్యం ఒక్కటే. స్త్రీల సాహిత్యాన్ని వంటింటి సాహిత్యంగా తక్కువ చేసి మాట్లాడుతున్నారు. స్త్రీలందరు సామాజిక ఆచరణలోకి రావాలి. 1980ల తర్వాత మహాశ్వేతాదేవి సాహిత్యం తొలిసారిగా వెలుగులోకి వచ్చింది. 1983 రాకాసి కోన చదివాను. కాకతీయ యూనివర్సిటీలో నిర్వహించబడిన ఒక సెమినార్‌కు 1998లో మహాశ్వేతాదేవి వచ్చింది. ఆమె సాహిత్య దృష్టి వర్గ దృష్టి. వర్గ దృష్టి అంటేనే జెండర్, ప్రాంతీయ, ఆదివాసీ, బహుజన, దళిత దృక్పథం ఇమిడి ఉంటాయి. సంపద ఉన్నవాళ్ళు ఆత్మలేని వాళ్ళని, లేనివాళ్ళు ఆత్మ ఉన్న వాళ్లని మహాశ్వేతాదేవి తాత్వికత. జీవితం పట్ల, ఉద్యమం పట్ల స్పష్టత కోసం మహాశ్వేతాదేవిని చదవాలి. బషాయిటుడు మొత్తం రాజకీయ వ్యవస్థ మీద వ్యాఖ్యానం. పురాణాలన్ని ప్రజల్ని పీడించడానికే పుట్టాయి. 'దెయ్యాలున్నాయి' కథలో రేప్ చేయబడిన అమ్మాయి అడవిలో తిరుగుతుంది. అనర్థాలన్నింటికి మూలం దయ్యాలని ఆధిపత్య వర్గాల వారు చెప్తారు. గ్రీన్‌హంట్ కంటే ప్రమాదకరమైన ఎన్.జి.ఓ.లు దండకారణ్యంలోకి ప్రవేశించాయి. వనరుల మీద బహుళ జాతి కంపెనీల పెత్తనం రాబోతుందని, వనరుల మీద తమ హక్కు కోసం ఆదివాసులు పోరాడుతున్న ఈ దశలో రచయితలుగా మనం ఏ వైపు ఉండాలో తేల్చుకోవాలనీ" కాత్యాయినీ విద్మహే అన్నారు.

మహాశ్వేతాదేవి మూడు 'బ్రెస్ట్ స్టోరీస్' విశ్లేషిస్తూ అనిశెట్టి రజిత మాట్లాడారు. " 'ఛోళికె పీఛే' ఏమిటి అనే ప్రశ్న జాతీయ స్థాయి సంచలనాన్ని సృష్టించింది. 'ఛోళికే పీఛే' అంటే సమాజం ఏం ఊహించుకుందో గాని కథలోని 'ఫోటోగ్రాఫర్ పాత్ర' అత్యాచారం అని చెప్పిందని, మహాశ్వేతాదేవి 'ఛోళికే పీఛే' ఉన్నది 'పాలిచ్చె కణజాలం' అని చెప్పారని ఆమె అన్నారు. స్తన్యదాయిని (పాలతల్లి) కథలో కాళింది ఇల్లు గడవడం కోసం పిల్లలకు పాలివ్వడాన్ని వృత్తిగా ఎంచుకుంటుంది. నిత్యం పిల్లలకు పాలివ్వడం కోసం ఆమె ఇరవై మందిని కంటుంది. తన దేహాన్ని పెట్టుబడిగా పెట్టి, ఒక స్త్రీ ఎందరికో పాలిచ్చే తల్లిగా మారితే సమాజం అందుకు కృతజ్ఞత చూపకపోగా ఆమె క్యాన్సర్ బారిన పడి చనిపోతూ ఉంటే ఎవరూ రక్షించరు. ఆమె తనకు వైద్యం చేసే డాక్టర్‌ను, నర్సును వార్డ్‌బాయ్‌ను, తనను కాటికి తీసుకుపోయే మనుషులను తను పాలిచ్చి పెంచిన బిడ్డలుగానే గుర్తిస్తుందని అయితే వారెవరు తనను కాపాడలేకపోయారని కాళింది పాత్ర వాపోతుంది. అట్లాగే ద్రౌపది కథలో కథా నాయకురాలు సంథాల్ తెగలోంచి విప్లవోద్యమంలో రాజ్యహింస ఎదిరించిన పాత్ర" అని అనిశెట్టి రజిత అన్నారు.

చెలిమి సాహితీ, సాంస్కృతిక వేదిక బాధ్యుడు మెట్టు రవీందర్ మాట్లాడుతూ, "ఆధునిక సాహితీ ప్రపంచంలో మహాశ్వేతాదేవి విలక్షణ రచయిత్రి అని, శరత్ చంద్ర చటర్జీ తర్వాత తెలుగు సమాజాన్ని ప్రభావితం చేసిన బెంగాలీ రచయిత్రి మహాశ్వేతాదేవి" అని అన్నారు.

గోదావరి సాహితీ మిత్రులు తరఫున వి. గంగాధర్ మాట్లాడుతూ, "ఆదివాసీలపై 'వేట' సాగుతున్న నేపథ్యంలో మహాశ్వేతా దేవి రచనలు ప్రేరణ ఇస్తాయ"ని అన్నారు.

విప్లవ రచయితల సంఘం కార్యవర్గ సభ్యుడు బాసిత్ మహాశ్వేతాదేవి ఉత్తమ కథల్ని విశ్లేషిస్తూ మహాశ్వేతాదేవి ప్రతికథ 'ఫ్రాంజ్ కాఫ్కా' అనే జర్మన్ రచయిత చెప్పినట్లు "మానవ అంతరంగంలో గడ్డకట్టిన సముద్రాల్ని బద్దలు కొట్టే గొడ్డలి వంటిదని, ఆమె సాహితీ, సామాజిక ఆచరణను ముందుకు తీసుకుపోవడం ద్వారానే ఆమె స్ఫూర్తిని నిలబెట్టగలమ"ని అన్నారు.

నల్లెల్ల రాజయ్య మాట్లాడుతూ, "నక్సల్బరీ తొలిదశలో యువకుని మరణంతో, ఆ యువకుని తల్లి ఆవేదన, గర్భశోకం 'ఒక తల్లి కథ'గా రూపొందిందని, శ్రామిక వర్గ దృక్పథంతో మహాశ్వేతాదేవి సాహితీ సృజన చేశార"ని అన్నారు. కాళోజీ ఫౌండేషన్ తరఫున వి.ఆర్. విద్యార్థి మాట్లాడుతూ, "1998 మహాశ్వేతాదేవి హనుమకొండ వచ్చినపుడు కాళోజీని కలిసారని, ఆమె కొంత మంది లాగా మేడ దిగని రచయిత్రి కాదని, ఆమె పేద ప్రజల జీవితాలతో సంబంధం పెట్టుకొన్న, గొప్ప సామాజిక ఆచరణ ఉన్న రచయిత్ర"ని అన్నారు. గిరిజా మనోహర్ బాబు మాట్లాడుతూ, "తన ఆలోచనలను ఆచరణలో పెట్టి, సమాజాన్ని తట్టి లేపడానికి చేయాల్సిన సాహిత్య కృషిని మహాశ్వేతాదేవి చేశార"ని అన్నారు. విరసం సభ్యుడు శాఖమూరి రవి మాట్లాడుతూ, "మహాశ్వేతాదేవి 'ఒక తల్లి' లాంటి పాత్రలు తెలంగాణ సమాజంలో కూడా ఎందరో ఉన్నార"ని అన్నారు. రీసర్చ్ స్కాలర్ మైపతి సంతోష్ కుమార్ మాట్లాడుతూ, "ఆదివాసులు ఈ దేశవాసులు కారా" అంటూ ప్రశ్నిస్తూ

ప్రస్తుతం మా వద్ద అందుబాటులో ఉన్న విరసం, ఇతర ప్రచురణలు, వాటి ధరలు

కథ, నవల, కవిత్వం, సాహిత్య విమర్శ

1.	కొడవటిగంటి కుటుంబరావు - 7 (నవలలు)	250-00
2.	కొడవటిగంటి కుటుంబరావు - 8 (నవలలు)	250-00
3.	కొడవటిగంటి కుటుంబరావు - 9 (నవలలు, కథలు నాటికలు)	250-00
4.	కొడవటిగంటి కుటుంబరావు - 11 (చరిత్ర వ్యాసాలు)	150-00
5.	కొడవటిగంటి కుటుంబరావు - 12 (రాజకీయ వ్యాసాలు)	400-00
6.	కొడవటిగంటి కుటుంబరావు - 13 (సంస్కృతి వ్యాసాలు)	300-00
7.	కొడవటిగంటి కుటుంబరావు - 14 (సినిమా వ్యాసాలు-1)	300-00
8.	కొడవటిగంటి కుటుంబరావు - 15 (సినిమా వ్యాసాలు-2)	250-00
9.	కొడవటిగంటి కుటుంబరావు - 16 ఎ (సాహిత్య వ్యాసాలు-1)	300-00
10.	కొడవటిగంటి కుటుంబరావు - 16 బి (సాహిత్య వ్యాసాలు-2)	300-00
11.	కొడవటిగంటి కుటుంబరావు - 17 (తాత్విక వ్యాసాలు)	150-00
12.	కొడవటిగంటి కుటుంబరావు - 18 (లేఖలు)	125-00
13.	కె.వి.ఆర్. సాహిత్య వ్యాసాలు (మొదటి భాగం)	300-00
14.	కె.వి.ఆర్. సాహిత్య వ్యాసాలు (రెండవ భాగం)	250-00
15.	కె.వి.ఆర్. సాహిత్య వ్యాసాలు (మూడవ భాగం)	250-00
16.	కె.వి.ఆర్. సామాజిక వ్యాసాలు (నాల్గవ భాగం)	300-00
17.	కె.వి.ఆర్. మహోదయం	200-00
18.	వసంతగీతం (అల్లం రాజయ్య)	250-00
19.	కొమురం భీం (అల్లం రాజయ్య)	150-00
20.	సృష్టికర్తలు (అల్లం రాజయ్య)	150-00
21.	సాహిత్య సమాలోచన (కృష్ణాబాయి)	300-00
22.	భావవిప్లవకారుడు కొకు	80-00
23.	కొకు సమకాలీనత - విశ్లేషణా వ్యాసాలు	50-00
24.	అక్షరతుణీరం (కె.వి.ఆర్. సాహిత్య విమర్శ వ్యాసాలు)	20-00
25.	సుబ్బారావు పాణిగ్రాహి కవిత్వం, పాటలు	25-00
26.	అంతస్సూత్రం (వరవరరావు కవిత్వం)	40-00
27.	బీజభూమి (వరవరరావు కవిత్వం)	100-00
28.	గుమ్మెటమోత (పాణి నవల)	100-00
29.	కలిసి పాడాల్సిన గీతమొక్కటే (పాణి కవిత్వం)	10-00
30.	చలసాని ప్రసాద్ రచనలు	100-00
31.	దండకారణ్య కథలు (2005-2012)	125-00
32.	తెలుగు భాష - కొన్ని సంగతులు (వి.చెంచయ్య)	15-00
33.	సామాజికం (వి. చెంచయ్య)	30-00
34.	సాహిత్యధోరణులు - విప్లవ దృక్పథం	30-00
35.	కథల పంట-3	120-00
36.	కదిలే కథ	80-00
37.	తీత్వాల్ కుక్క మరికొన్ని కథలు (సాదత్ హసన్ మంటో)	60-00
38.	జాజిపూల పరిమళం (షాహిదా కథలు)	150-00
39.	ఒక మాట, ఒక సంభాషణ (షాహిదా కవిత్వం)	75-00
40.	సామాన్యుల సాహసం (నిత్య, మైనా, సుజాత కథలు)	60-00
41.	ఫాల్గుణ (పద్మకుమారి నవలిక)	30-00
42.	లాల్‌బనో గులామీ ఛోడో బోలో వందేమాతరం (ఎన్కె దీర్ఘ కవిత)	25-00
43.	తెహెల్కా అద్దంలో సర్కారు బింబం మరికొంత కవిత్వం (బాసిత్)	100-00
44.	ఆఖరి బిడ్డ (బాసిత్ నాటిక)	10-00
45.	కిటికీ పిట్ట (పి. మోహన్ కవిత్వం)	10-00
46.	మంజీరా మూడ్స్ (మంజీరా కవిత్వం)	25-00
47.	కవితా ఝంకార్ (విరసం కవితా సంకలనం)	75-00
48.	ఎర్రనక్షత్రం (చైనా నవల)	50-00
49.	నెగడు (కథలు) (నల్లూరి రుక్మిణి)	90-00
50.	పరామర్శ (నల్లూరి రుక్మిణి)	80-00
51.	ఒండ్రుమట్టి (నవల)	170-00
52.	Wake of Telangana? - A docu-drama by Basith	10-00
53.	యంత్రాల మధ్య	35-00
54.	అక్షర కిరణం (కె.వి.ఆర్.)	50-00
55.	డావిన్సి (మోహన్)	150-00
56.	మార్క్సిస్టు సాహిత్య విమర్శ (డా. శ్రీనివాస్)	100-00
57.	అగ్నిశిఖ	80-00
58.	కార్మిక వర్గ పుత్రుడు	70-00
59.	బలహీనుడి బలం	25-00
60.	పాలమూరు వలస బతుకు చిత్రాలు - గీతాంజలి	150-00
61.	ఏది నేరం?! (హజారీబాగ్ జైలు గాథలు) - బి. అనూరాధ	75-00
62.	వెలుగు రవ్వల జడి (ఆలూరి భుజంగరావు)	70-00
63.	అరణ్య పర్వం (ఆలూరి భుజంగరావు)	120-00
64.	ప్రజలు అజేయులు (ఆలూరి భుజంగరావు)	25-00
65.	చైనా (ఆలూరి భుజంగరావు)	50-00
66.	గమ్యం దిశగా గమనం (ఆలూరి భుజంగరావు)	30-00
67.	దిక్కు మొక్కు లేని జనం (ఆలూరి భుజంగరావు)	30-00
68.	సాహిత్య వ్యాసాలు (చలసాని ప్రసాద్)	100-00
69.	కలం యోధుడు చెరబండరాజు (వి. చెంచయ్య)	20-00
70.	ఫాలింగ్ (నల్లూరి రిక్మిణి కథ)	20-00
71.	దండకారణ్య కథలు (2013-2015)	70-00
72.	లొంగిన ప్రతిసారీ (కిరణ్ కవిత్వం)	50-00

మహాశ్వేతాదేవి ఆదివాసీ ప్రజల పోరాటాలను సాహిత్యీకరించినందుకు ఆమెకు నివాళి అర్పించాలన్నారు. విరసం వరంగల్ యూనిట్ కన్వీనర్ వీరబ్రహ్మాచారి మాట్లాడుతూ, "పోరాడేవారుంటేనే, దానిని సాహిత్యీకరించే వారుంటారని, మహాశ్వేతాదేవి 'ఒక తల్లి కథ' నవలలో పోరాడే యువకుని అమరత్వం నేపథ్యంలో ఒక తల్లి పడిన వేదనను చిత్రించారు"ని అన్నారు. అభ్యుదయ రచయితల సంఘం బాధ్యుడు వీరాచారి మహాశ్వేతాదేవి రచనలు సామాజిక ఆచరణలోంచి వచ్చినవని, ఆమె రచన, ఆచరణ మనకు ఆదర్శం కావాల"ని అన్నారు. "మహాశ్వేతాదేవికి 'నోబెల్ ప్రైజ్' ఇవ్వాలని సిఫారసు చేస్తూ ఆమె జీవించి ఉన్నప్పుడు కాకతీయ యూనివర్సిటీ డ్రాఫ్ట్ చేసి నోబెల్ కమిటీకి రాసిన లేఖను ప్రొ.జి. దామోదర్ చదివి వినిపించారు. కె. రామలక్ష్మి వందన సమర్పణ చేశారు.

సభలో లోచన్, ఎం. గంగాధర్, వడ్డెబోయిన శ్రీనివాస్, ఎన్. వెంకటేశ్వర్లు, వంగాల సంపత్‌రెడ్డి, పి. చందు, ఎ. శ్రీనివాస్, ఘంటా రామారెడ్డి, బిల్లా మహేందర్, కందాళ శోభారాణి, స్వర్ణలత, ప్రజాసంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

73.	చిగురించే పాదం (మేడక యుగంధరరావు కవిత్వం)	40-00
74.	అమర శ్రుతి (వరంగల్ యూనిట్ కవిత్వం)	25-00
75.	మందిపాట ఒరవడిలో (సిటీయూనిట్ కవిత్వం)	40-00
76.	కాశీం కవిత్వం	140-00
77.	తెలంగాణ సాహిత్య వ్యాసాలు (కాశీం)	140-00
78.	కవిత్వంతో మూలాఖత్ (ఎన్.వేణుగోపాల్)	120-00
79.	వెలివాడె తొలిపొద్దై	70-00
80.	విప్లవ స్వాప్నికుడు కా. రవూఫ్	50-00
81.	దండకారణ్య కథలు (2013-2015)	70-00
82.	నల్లమల (పి.చంద్)	225-00
83.	అబూజ్‌మడ్ (పాణి)	50-00
84.	మేమున్నాం (పాలమూరు అధ్యయన వేదిక)	60-00
85.	నదీ బాల్యం (రివేరా)	30-00
86.	ఏప్రిల్ పండు (రివేరా)	30-00
87.	పిల్లనగ్రోవి తుఫాన్ (డి. ఉదయభాను)	20-00
88.	ఒక ఆకుపచ్చని కల (కెనరి)	40-00
89.	లక్ష్మింపేట (విరసం)	25-00
90.	వివేచన (వి. చెంచయ్య)	50-00
91.	సుబ్బారావు పాణిగ్రాహి (విరసం)	25-00
92.	కలిసి పాడాల్సి గీతం ఒక్కటే (పినాకపాణి)	10-00
93.	అవ్వజెప్పిన తొవ్వ (శాఖమూరి రవి)	10-00
94.	పోస్టుమార్టం రిపోర్టు (వడ్డెబోయిన శ్రీనివాస్)	10-00
95.	విప్లవ సాహిత్య విమర్శ (విరసం)	25-00
96.	ఎదురగ్గి (నవల) కనుంపల్లి రాజారాం	100-00
97.	చలసాని ప్రసాద్ సాహిత్య సర్వస్వం-1	270-00
98.	ముడిమనిషి (అరుణతార కథలు 1)	30-00
99.	చేపలు (అరుణతార కథలు 2)	30-00
100.	కథ అడ్డం తిరిగింది (అరుణతార కథలు 3)	30-00
101.	కో...బలి (అరుణతార కథలు 4)	30-00
102.	అడవిలోని వెన్నెల (అరుణతార కథలు 5)	30-00
103.	నెలవు (అరుణతార కథలు 6)	30-00
104.	ఒక వీరుడు మరణిస్తే (అరుణతార కథలు 7)	30-00
105.	బదిలీ (అరుణతార కథలు 8)	30-00
106.	అరణ్య పర్వం (అరుణతార కథలు 9)	30-00
107.	పద్మ (అరుణతార కథలు 10)	30-00
108.	విప్లవంలో మాతృత్వం (అరుణతార కథలు 11)	30-00
109.	కొండపందికొక్కు (అరుణతార కథలు 12)	30-00
110.	ఓడిపోయిన కథలు (అరుణతార కథలు 13)	30-00
111.	దాడి (అరుణతార కథలు 14)	30-00
112.	తుఫాను (అరుణతార కథలు 15)	30-00
113.	కొండవాగు (అరుణతార కథలు 16)	30-00

సంస్కృతి, చరిత్ర, రాజకీయార్థిక, సైద్ధాంతిక రచనలు

1.	సామ్రాజ్యవాద సంస్కృతి (జేమ్స్ పెట్రాస్ వ్యాసాలు)	125-00
2.	మావో రచనలు - 1	220-00
3.	మావో రచనలు - 2	220-00
4.	రివిజనిజం (మావో)	75-00
5.	మార్క్సిజం, లెనినిజం, మావోయిజం	170-00
6.	మార్క్సిస్టు తత్వశాస్త్రం	80-00
7.	చారుమజుందార్ 8 డాక్యుమెంట్లు	50-00
8.	మంద్రస్థాయి యుద్ధం	100-00
9.	విద్యార్థి యువజనోద్యమాలు (లెనిన్)	30-00
10.	రాజకీయ కృషి - మన కృషి అంతటికీ జీవనాడి (చైనా విప్లవోద్యమన పత్రిక హొంకీ వ్యాసాలు)	35-00
11.	నక్సల్బరీ వెలుగులో (భారతదేశ నక్సలైట్ ఉద్యమ చరిత్ర)	180-00
12.	జగిత్యాల జంగల్‌మహల్ (1)	75-00
13.	జగిత్యాల జంగల్‌మహల్ (2)	100-00
14.	స్టోలిపిన్ అభివృద్ధి నిరోధక కాలంలో	15-00
15.	అంతర్జాతీయ విప్లవోద్యమాల్లోని ఆటుపోట్లు	60-00
16.	భారతదేశంలో ఉత్పత్తి విధానం - ఉత్పత్తి సంబంధాలు	20-00
17.	ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయోత్పత్తి సంబంధాలు	30-00
18.	నేటి రాయలసీమ	100-00
19.	గతాన్ని సమీక్షించుకుందాం	50-00
20.	చూటే ఏరిన రచనలు	125-00
21.	మావో సే టుంగ్	80-00
22.	గెరిల్లా యుద్ధం	60-00
23.	చైనా ప్రజా విముక్తి సైన్యం	40-00
24.	భూమి సంస్కృతి నాగరికత	15-00
25.	స్త్రీవాద ఉద్యమం (అనురాధ గాంధీ)	25-00
26.	కొత్త చూపు (ఆర్.ఎస్. రావు)	120-00
27.	అభివృద్ధిని ఇలా చూద్దాం (ముదునూరి భారతి)	80-00
28.	In Search of Method (Mudunuri Bharati)	200-00
29.	On Education (Mudunuri Bharati)	180-00
30.	Crisis and Development in Marxian Frame Work (Mudunuri Bharati)	80-00
31.	Individual, Sub-Groups, Groups and Freedom (Mudunuri Bharati)	75-00
32.	Methodology of Social Enquiry (Mudunuri Bharati)	150-00
33	Fifty Years of Andhra Pradesh 1956-2006	300-00
34.	జనతన సర్కార్ కావాలి మేక్ ఇన్ ఇండియా కాదు	15-00
35.	విద్యార్థి ఉద్యమాల్లో విప్లవ దిద్దుబాటు	30-00
36.	జాతుల సమస్య రిజర్వేషన్లు కార్మిక వర్గ దృక్పథం	25-00
37.	తత్వశాస్త్రం మాయాజాలం కాదు	20-00
38.	వైరుధ్యాలు	20-00
39.	చైనా తాత్విక రంగాన మూడు ప్రధాన పోరాటాలు 1949-64	20-00
40.	జనతన రాజ్యం (పాణి)	300-00
41.	మార్క్సిస్టు మహోపాధ్యాయుల జీవన రేఖలు	20-00
42.	దండకారణ్య సాంస్కృతికోద్యమ చరిత్ర (పునర్ముద్రణ)	100-00
43.	సీమ గొంతుక వినండి (అరుణ్ వ్యాసాలు)	70-00
44.	ఈలం విముక్తి పోరులో మహిళలు	50-00
45.	సామ్రాజ్యవాద దోపిడి మండలాలు (రత్నమాల)	50-00
46.	డిటెన్యూ డైరీ (కె.వి.ఆర్.)	170-00
47.	సమగ్ర తెలంగాణ (సంపాదకులు - ఎన్. వేణుగోపాల్)	295-00
48.	విప్లవ పథంలో వరంగల్ విద్యార్థి ఉద్యమం (విరసం)	40-00
49.	వామపక్ష కమ్యూనిజం-ఒక బాలారిష్టం (ఎన్.వి.ఎస్. నాగభూషణ్)	30-00
50.	ఐక్య సంఘటన (దిక్సూచి)	35-00

51. బాలగోపాల్ తాత్విక గందరగోళం (సమీర్) 50-00

వర్తమాన సమాజం, ప్రజా ఉద్యమాలు

1. ముజఫర్‌నగర్ మరో మానని గాయం 20-00
2. ఆకాస ఉద్యమ అమరులు 10-00
3. దండకారణ్యంలో గ్రీన్‌హంట్ 60-00
4. ఉద్యమ ఆకాశంలో సగం 15-00
5. తూర్పు మధ్య భారతంలో విస్థాపన-ప్రజా ప్రతిఘటన 20-00
6. జనతన జైత్రయాత్ర 20-00
7. ఫిలిప్పినో ఉద్యమం 15-00
8. ఖైదీల సైరన్ 60-00
9. విముక్తిబాటలో నారాయణపట్నా 50-00
10. అంతర్యుద్ధంలో ఆదివాసులు 30-00
11. నిత్య జీవితంలో సోషలిజం (భూసారం శివన్న) 100-00
12. ఆకుల భూమయ్య రచనలు 40-00
13. అమలు కానీ హామీల చరిత్ర (శశికళ) 100-00
14. ది ఫ్లేమ్స్ ఆఫ్ నారాయణ పట్నా 60-00
15. దాక్షిణ్య వాదం నుంచి దండకా[illegible] టాకా (రత్నమాల) 200-00
16. నూతన సంభాషణ (రత్నమాల) 80-00
17. జర్నలిజం ప్రొఫెషన్ (రత్నమాల) 50-00
18. సాహిత్య ధోరణులు విప్లవ ధోరణులు 30-00
19. ప్రాణహిత (అల్లం నారాయణ) 150-00
20. గ్రీన్‌హంట్ ఉత్పాదాలు (విరసం) 25-00
21. ఆకాసంలో సగం పొ. సగం మహిళ విముక్తి (విరసం) 35-00
22. లాంగ్ మార్చ్ (తెలంగాణ జర్నలిస్టులు) 100-00
23. పచ్చని బతుకులపై నిప్పులు కురుస్తున్న రాజ్యం (బిడి దమయంతి)15-00
24. కృష్ణానది నీళ్ళు (ఎం. రాఘవచారి) 20-00
25. మండుతున్న గాయాలు (బిడి దమయంతి) 40-00
26. సముద్రంలో సంభాషణ (పి. వరలక్ష్మి) 20-00

స్మృతి సాహిత్యం

1. ఖాన్‌దాదా (ఎం.టి.ఖాన్ స్మృతి) 10-00
2. ఆదర్శజీవులు అమరులు 30-00
3. గంటి ప్రసాదం రచనలు 25-00
4. సూర్యుడు మరణించడు 60-00
5. చిరునవ్వు సితార 80-00
6. గెరిల్లా డైరీ 10-00
7. మన్యం వెలుగులు 15-00
8. అక్షర కిరణం 20-00
9. అడవి పుత్రుడు మంగన్న 10-00
10. గజ్జెల సరోజ 15-00
11. మహిత 10-00
12. కోటి జ్ఞాపకాలు 50-00
13. అమరుల యాదిలో 50-00
14. అమరుల జీవిత చరిత్ర 30-00
15. వేగుచుక్కల వెలుతురులో 10-00
16. లంకపల్లి అమరులకు విప్లవ జోహార్లు 10-00
17. శారద స్మృతి శకలాలు 30-00
18. దండకారణ్యంలో చలసాని ప్రసాద్ 10-00
19. సాహసయోధురాలు (గజ్జెల సరోజ రచనలు) 40-00
20. అమరుడు కామ్రేడ్ సంజయ్ 10-00
21. రైజింగ్ సన్ (సూర్యం స్మృతి) 20-00
22. అజ్ఞాత విప్లవ యోధుడు కొండన్న (దిక్సూచి) 50-00
23. పువ్వర్తి అమరులు (దిక్సూచి) 20-00
24. చిరునవ్వు సితార (విరసం) 70-00
25. కా॥ సహస గెరిల్లా యోధుడు మాసా (దిక్సూచి) 50-00
26. కె. దాసారావు కనకచారి (దిక్సూచి) 10-00
27. మృత్యుంజయులు మొద్దుగుట్ట అమరులు 20-00
28. బొట్టెం అమరుల జీవిత చరిత్ర (అమరుల బంధుమిత్రుల సంఘం) 40-00
29. గెరిల్లా అమ్మ (అమరుల బంధుమిత్రుల సంఘం) 20-00
30. కన్నబిడ్డల కలల యాగి (అమరుల బంధుమిత్రుల సంఘం) 20-00
31. దండకారణ్య విప్లవ మహిళ కా॥ హేమ్లాలచ్చి (దిక్సూచి) 10-00
32. ప్రజాయుద్ధ వీరుడు కా. నగేష్ (దిక్సూచి) 10-00

డివిడిలు

1. అరుణతార సాహిత్య సాంస్కృతిక మాసపత్రిక (1977-2013) 125-00

మా ప్రచురణలు లభించే పుస్తక కేంద్రాలు :

***నవోదయ బుక్ హౌస్,** ఆర్యసమాజ్ ఎదురుగా, కాచిగూడ చౌరస్తా, హైదరాబాద్‌లోనూ లభిస్తాయి. ఫోన్ : 040-24652387*

***నవ తెలంగాణ,** 1-1-187/1/2, చిక్కడపల్లి, హైదరాబాదు-500020. ఫోన్ : 040-27608107, 9490099373*

***అనేక బుక్ స్టాల్,** 30-5-26/1, కోకా చలపతిరావు స్ట్రీట్, ఏలూరు రోడ్, విజయవాడ-520002. ఫోన్ : 8977493465*

మరిన్ని వివరాలకు సంప్రదించండి : డి.వి. రామకృష్ణారావు, అరుణతార ఎడిటర్,

ఫోన్ : 99891 89250 (ఉదయం 9 లోపు సాయంత్రం 8 తరువాత మాత్రమే)

ఈమెయిల్ : arunatara1977@gmail.com

పుస్తకాల ధరకు సరిపడా డబ్బులతో పాటు, పోస్టింగ్ ఖర్చులను జతచేసి

ఎం.ఓ. లేక డిడి ద్వారా పంపి పుస్తకాలను పొందవచ్చు.

ఆన్‌లైన్‌లో డి.వి.రామకృష్ణారావు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, లాలాగూడ బ్రాంచ్, హైదరాబాద్,

ఎకౌంట్ నెం. 10243583773, ఐఎఫ్ఎస్‌సి కోడ్ : ఎస్.బి.ఐ.ఎన్.0007112కి చెల్లించి పుస్తకాలను పొందవచ్చు.

-: స్వీకారం :-



జీవించు... నేర్చుకో... అందించు!
ఆధునిక తెలుగు సాహిత్యంలో మొట్టమొదటి స్వతంత్ర కొటేషన్స్
తుమ్మేటి రఘోత్తమరెడ్డి
ప్రచురణ : ఎమెస్కో బుక్స్
వెల : రు. 250/-
పేజీలు : 488

రెడ్ సెల్యూట్
(గేయ సంపుటి)
యాదాటి కాశీపతి
ప్రచురణ : యలవర్తి రాజేంద్రప్రసాద్ కాశీపతి తొలితరం మిత్రులు
పేజీలు : 40

వానొస్తద?
కవిత్వం
నారాయణ స్వామి
ప్రచురణ : ఝరీ పొయిట్రీ సర్కిల్
వెల : రు. 150/-
పేజీలు : 186

సంఘం మలిచిన మనిషి
(అజంజాహి మిల్లు కార్మికుడు కె.బి.మంగయ్య జీవనరేఖలు)
డా. కె.బి. చంద్రభాను
ప్రచురణ : మంగయ్య మెమోరియల్ ట్రస్ట్
వెల : రు. 50/-
పేజీలు : 82



సామ్రాజ్యవాద పెనుభూతం
(కా॥ గడ్డం కోటారెడ్డి స్మారకోపన్యాసాల సంపుటి)
ప్రచురణ : గడ్డం కోటారెడ్డి స్మారక కమిటీ, కావలి
వెల : రు. 10/-
పేజీలు : 28



దళితుల్నెవ్వరూ చంపలేదా?!
(దళితుల వధమేధం పట్ల కోర్టు తీర్పులపై విమర్శ)
మీనా కందసామి
ప్రచురణ : మాతృక ప్రచురణలు
వెల : రు. 50/-
పేజీలు : 80

దున్నేవాడిదే భూమి
జల్-జంగిల్-జమీన్ పై సర్వాధికారాలు ఆదివాసులకే
పోడు భూముల ఆక్రమణను ఆపాలి
ప్రచురణ : తెలంగాణ ప్రజా ఫ్రంట్
వెల : రు. 5/-
పేజీలు : 27



గంధంచెట్టు
తెలంగాణ కవిత్వం
అమ్మంగి వేణుగోపాల్
ప్రచురణ : జయమిత్ర సాహిత్య సాంస్కృతిక వేదిక
వెల : రు. 20/-
పేజీలు : 70



తోటంత పువ్వు
కవిత్వం
అమ్మంగి వేణుగోపాల్
ప్రచురణ : జయమిత్ర సాహిత్య సాంస్కృతిక వేదిక
వెల : రు. 20/-
పేజీలు : 68



భరోసా
వచన కవితా సంపుటి
అమ్మంగి వేణుగోపాల్
ప్రచురణ : జయమిత్ర సాహిత్య సాంస్కృతిక వేదిక
వెల : రు. 15/-
పేజీలు : 69



పచ్చబొట్టు పటంచెరు
అమ్మంగి వేణుగోపాల్
ప్రచురణ : జయమిత్ర సాహిత్య సాంస్కృతిక వేదిక
వెల : రు. 20/-
పేజీలు : 79



మిణుగురు
కవిత్వం
అమ్మంగి వేణుగోపాల్
ప్రచురణ : జయమిత్ర సాహిత్య సాంస్కృతిక వేదిక
వెల : రు. 25/-
పేజీలు : 80

అరుణతార నిర్వహణకు విరాళాలివ్వండి

శాశ్వత నిధి ఏర్పాటుకు సహకరించండి

విరాళాలు ఆన్‌లైన్‌లో పంపడానికి వివరాలు :

డి.వి. రామక్రిష్ణారావు, అకౌంట్ నెం. 10243583773, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్.బి.ఐ.) ఐ.ఎఫ్.ఎస్.సి. కోడ్ నెం. ఎస్.బి.ఐ.ఎన్.0007112, లాలాగుడ, సికింద్రాబాద్.

ఎం.ఓ.లు, డ్రాఫ్టులు, చెక్‌లు డి.వి. రామక్రిష్ణారావు పేరిట ఎం.ఐ.జి. - 14, ఎ.పి.ఐ.ఐ.సి. కాలనీ, కార్బైడ్ కంపెనీ ఎదురుగా, మౌలాలి, హైదరాబాద్ - 500 040 చిరునామాకు పంపగలరు.

KLVA101M 191

ARUNATARA RNI Regn.No.21152/72 Published on 19/8/2016 September 2016 Vol. : 44 Issue : 8
Hyderabad
A Literary and Cultural Telugu Monthly Journal of Viplava Rachayitala Sangham (VIRASAM - Revolutionary Writers' Association)

అరుణతార నిర్వహణకు విరాళాలివ్వండి
శాశ్వత నిధి ఏర్పాటుకు సహకరించండి

విప్లవ రచయితల సంఘం అధికార పత్రిక అరుణతార 1977 నవంబర్ నుంచి మాస పత్రికగా వస్తోంది. సాహిత్య సాంస్కృతిక సంస్థగా విరసం విప్లవ, విప్లవ సాహిత్యోద్యమాల్లో నిర్వచించుకున్న తన రాజకీయ, సాహిత్య, మేధో పాత్రకు వాహికగా తెలుగు సమాజంపై ప్రభావం వేస్తున్నది. గత మూడు తరాలుగా ఎందరో రచయితల, బుద్ధిజీవుల ఆలోచనా వికాసానికి వేదికగా ఉన్నది. సాహిత్య పత్రిక అయినప్పటికీ సామాజిక, రాజకీయార్థిక, సిద్ధాంత విశ్లేషణలకు, చర్చలకు, అన్వేషణకు సృజనశీలమైన మాధ్యమంగా కొనసాగుతున్నది. నక్సల్బరీ శిశువుగా విరసం తాను ఎంచుకున్న విప్లవోద్యమ ప్రచార కర్తవ్యంలో అరుణతార పాత్ర గణనీయం. 1970లలో ఉత్తర తెలంగాణలో విప్లవోద్యమ పునర్నిర్మాణ దశ నుంచి ఇవాళ దేశవ్యాప్తంగా సాగుతున్న విప్లవ, ప్రజా పోరాట సంచనాలను అరుణతార తన శక్తినంతా వెచ్చించి అక్షరబద్ధం చేస్తున్నది. మరీ ముఖ్యంగా చత్తీస్‌ఘడ్‌లో సల్వాజుడుం దుర్మార్గాలు మొదలైనప్పటి నుంచి ఇవ్వాల్టి ఆపరేషన్ గ్రీన్‌హంట్ మూడో దశ, సాల్వాజుడుం రెండో దశ దాకా దండకారణ్య ప్రజా యు[illegible] ప్రత్యామ్నాయ రాజకీయ విధానాన్నీ, అక్కడ సాహిత్య, సాంస్కృక వికాసాన్నీ తెలుగు పాఠకులకు పరిచ[illegible]ది. దండకారణ్య విప్లవోద్యమానికి సంఘీభావ హస్తాన్ని అందిస్తున్నది. ఈ పనిలో ఇతర ప్రజాస్వామిక ప[illegible] పాత్ర కూడా ఉన్నప్పటికీ అరుణతార దాన్నే ఒక ప్రధాన కర్తవ్యంగా స్వీకరించింది. ఇటీవల పెరిగిపోయిన హిందూ ఫాసిస్టు ప్రమా[illegible] వ్యతిరేకంగా లౌకిక, ప్రజాస్వామిక కంఠస్వరాన్ని బలంగా వినిపిస్తున్నది. వేర్వేరు సామాజిక ఉద్యమాల ఆకాంక్షలను ఎత్తిపడుతూ వాటి న్యాయబద్ధతను విశ్లేషిస్తున్నది.

ప్రజాఉద్యమాల్లోని కార్యకర్తల సృజనాత్మక వ్యక్తీకరణలకు అరుణతార అవకాశం ఇవ్వడం వల్ల వాళ్లలోంచి ఎందరో ప్రతిభావంతులైన ఆలోచనాపరులు, రచయితలు తయారువుతున్నారు. అరుణతార ఈ పని ఆది నుంచి చేస్తున్నది. అందువల్ల ఒక పక్క లబ్ధప్రతిష్టుల రచనలతోపాటు ఎప్పటికప్పుడు కొత్త గొంతులు అరుణతారలో వినిపిస్తుంటాయి.

అయితే మొదటి నుంచీ అరుణతార అనేక ఆర్థిక, నిర్వహణ సమస్యలను ఎదుర్కొంటున్నది. ఒక్కోసారి ఈ ఇబ్బందులు కాస్త తక్కువగా ఉన్నా, ఇటీవల తీవ్రమైన సంక్షోభాల మధ్య ఎప్పటికప్పుడు అభిమానుల, మిత్రుల అండదండలతో నడుస్తున్నది. గతంలో ఒకసారి అరుణతారకు విరాళాలు వద్దు.. చందాలు కట్టండనే ఆదర్శాన్ని కూడా అమలు చేసింది. అయితే నానాటికి పెరుగుతున్న ప్రెస్ ఛార్జిలు, నిర్వహణ ఖర్చులు మోయలేని భారమయ్యాయి. దీంతో రెండు నెల్లకో సంచిక వచ్చిన సందర్భాలూ ఉన్నాయి. అయితే పేజీలు పెంచి పాఠకులకు మరిన్ని రచనలు అందిస్తూ వచ్చాం.

ఈ అన్ని అనుభవాల దృష్ట్యా అరుణతారకు శాశ్వత నిధి తయారు చేయకుండా ఇక పత్రికను నాలుగు కాలాల పాటు నడపడం అయ్యేపని కాదని తేలింది. ఇంత కాలం అభిమానుల సహకారంతోనే నడుస్తూ వచ్చిన అరుణతార ఈసారి శాశ్వత నిధి కోసం మీ ముందుకు వచ్చింది. ఇవాళ ఉన్న విప్లవోద్యమ ప్రత్యేక పరిస్థితుల్లో అరుణతార అవసరం ఎంత ఉన్నదో పాఠకులకు తెలుసు. తెలుగు నేల మీద, దేశంలోని ఇతర ప్రాంతాల్లో, విదేశాల్లో ఉన్న అసంఖ్యాక విప్లవాభిమానులు తలా ఒక చేయి వేస్తే శాశ్వత నిధి సమకూరడం కష్టమేమీ కాదని మా నమ్మకం. దాంతోనే మీ ముందుకు వచ్చాం. విప్లవోద్యమ రాజకీయ, సాంస్కృతిక వేదిక అరుణతారకు మీవంతు విరాళాలు ఇవ్వాలని, ఇప్పించాలని కోరుకుంటూ...

డి.వి. రామక్రిష్ణారావు, అరుణతార సంపాదకుడు
పి. వరలక్ష్మి, విరసం కార్యదర్శి
వరవరరావు, టి. కృష్ణాబాయి, సిఎస్ఆర్ ప్రసాద్, [illegible]రావు, వి. చెంచయ్య,
అల్లం రాజయ్య, [illegible]మాల, సి. కాశీం, పాణి

విరాళాలు ఆన్‌లైన్‌లో పంపడానికి వివరాలు :
డి.వి. రామక్రిష్ణారావు, అకౌంట్ నెం. **10243583773**, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్.బి.ఐ.)
ఐ.ఎఫ్.ఎస్.సి. కోడ్ నెం. ఎస్.బి.ఐ.ఎన్.**0007112**, లాలాగుడ, సికింద్రాబాద్.
ఎం.ఓ.లు, డ్రాఫ్ట్‌లు, చెక్‌లు డి.వి. రామక్రిష్ణారావు పేరిట ఎం.ఐ.జి. - **14**, ఎ.పి.ఐ.ఐ.సి. కాలనీ,
కార్బైడ్ కంపెనీ ఎదురుగా, మౌలాలి, హైదరాబాద్ - **500 040** చిరునామాకు పంపగలరు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY DUVVURI VENKATA RAMAKRISHNA RAO, PRINTED AT CHARITA IMPRESSIONS, DOOR NO: 1-9-1126/B, AZAMABAD, HYDERABAD – 500020, TELANGANA STATE, PUBLISHED AT 12-15-963, MANIKESWARNAGAR, OSMANIA UNIVERSITY CAMPUS, TARANAKA, HYDERABAD – 500007, TELANGANA STATE. EDITOR: DUVVURI VENKATA RAMAKRISHNA RAO.

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVA101M191
పుస్తకం పేరు	అరుణతార
తారీఖు	08 February 2025
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	69
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	NO
లేని పేజీలు	NO
తయారు చేసినది	naema
పేజీలు విడదీసినది	Bhanu
స్కాన్ చేసినది	sharmila
పరీక్ష చేసినది	HASEEMA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good